ఈనాడు

విజయవాడ 11-2-2026 బుధవారం సిటీ సంపుటి 52 . సంచిక 182

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 14 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



విశాఖ మెట్రో.. ముందడుగు

విజయవాడ ప్రాజెక్టుకూ త్వరలో అనుమతి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో విశాఖపట్నం, విజయవాడల్లో మెట్రో రైలు ప్రాజెక్టులకు కదలిక వచ్చింది. విశాఖపట్నం సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)కు సంబంధించి ముందడుగు పడింది. కొన్ని మార్పుచేర్పుల తర్వాత దీనిపై కేంద్రం నుంచి త్వరలో మరింత స్పష్టత రానుంది. విజయవాడ మెట్రోకు కొన్ని సవరణలను పరిశీలిస్తోంది. దానికీ త్వరలోనే ఆమోదం వెలువడనుందని తెలుస్తోంది. రెండు నగరాల్లోనూ రెండు దశల్లో మెట్రో ప్రాజెక్టుల కోసం (మిగతా 3లో)

పోలవరానికి సహకరించండి

రెండో దశకు రూ.32 వేల కోట్లు కేటాయించండి

- గోదావరి జల వివాదాలపై ట్రైబ్యునల్
- రాజధాని అమరావతికి చట్టబద్ధత
- రాష్ట్రానికి ప్రత్యేక సాయం, ప్రోత్సాహక నిధులు
- బెంగళూరు- చెన్నై హైస్పీడ్ రైల్ కారిడార్‌కు తిరుపతితో అనుసంధానం
- కేంద్రానికి సీఎం చంద్రబాబు వినతులు
- దిల్లీలో ఏడుగురు కేంద్రమంత్రులతో భేటీ



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు శ్రీవారి ప్రతిమను అందిస్తున్న చంద్రబాబు. చిత్రంలో ఉదయ్ శ్రీనివాస్, శ్రీకృష్ణదేవరాయలు, రామ్మోహన్‌నాయుడు, చంద్రశేఖర్, పయ్యావుల



కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాతో ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, దిల్లీ: పోలవరం ప్రాజెక్టు తొలి దశ పనులు పూర్తికావస్తున్న నేపథ్యంలో రెండో దశకు అవసరమైన భూసేకరణ, పునరావాసం, రక్షణ గోడల నిర్మాణం వంటి పనులు చేపట్టాల్సి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు.. కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు తెలిపారు. ఇందుకోసం అదనంగా రూ.32 వేల కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. 'పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి స్టాప్ వర్క్ ఆర్డర్ కారణంగా ప్రాజెక్టు అమలులో అవరోధాలు ఏర్పడుతున్నాయి. ఈ ఉత్తర్వును ఏటా పొడిగించడానికి బదులు శాశ్వతంగా ఎత్తివేయాలి. పోలవరం కుడి, ఎడమ ప్రధాన కాలువల సామర్థ్యం పెంపు వల్ల పెరిగిన వ్యయాన్ని రీయింబర్స్ చేయాలి. ఆంధ్రప్రదేశ్‌లోని కరవు పీడిత ప్రాంతాల అవసరాలు తీర్చే (మిగతా 3లో)

శ్రీకాళహస్తి, కాణిపాకం, ద్వారకా తిరుమలకూ

కల్తీ నెయ్యి

2022-24లో సరఫరా చేసిన సుమతి ట్రేడర్స్, వినాయక ఏజెన్సీస్


- అదంతా వైష్ణవి డెయిరీ నుంచి తెచ్చిన రసాయన మిశ్రమమే?
- వీటి నాణ్యత పరీక్షలు వైష్ణవి డెయిరీ ల్యాబ్‌లోనే
- అభియోగపత్రంలో సిట్ పేర్కొనడంతో వెలుగులోకి



ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ హయాంలో తితిదేకి రసాయనాలతో కూడిన కల్తీ నెయ్యిని సరఫరా చేసిన ముఠా.. దేవాదాయ శాఖ ఆధీనంలోని ప్రధాన ఆలయాలైన శ్రీకాళహస్తి, కాణిపాకం, ద్వారకా తిరుమలకూ అదే నెయ్యిని అందించినట్లు తేలింది. భోలే బాబా, వైష్ణవి తదితర డెయిరీ సంస్థలు నెయ్యి పేరిట రసాయనిక మిశ్రమాన్ని తితిదేకి సరఫరా చేసినట్లు బయటపడ్డ సంగతి తెలిసిందే. అదే మిశ్రమాన్ని వినాయక ఏజెన్సీస్, సుమతి ట్రేడర్స్ పలు ఆలయాలకు అందించినట్లు అభియోగపత్రంలో సిట్ స్పష్టంగా పేర్కొంది. ఇందులో సుమతి ట్రేడర్స్ 2023-24లో కాణిపాకం, శ్రీకాళహస్తి ఆలయాలకు నెయ్యి సరఫరా టెండరు దక్కించుకొని భారీగా అందజేసింది. (మిగతా 2లో)

ఇవన్నీ చూసినా బుకాయిస్తారా సుబ్బారెడ్డీ?

చిన్నప్పన్నతో మీ బంధానికి ఇంత కంటే రుజువులేం కావాలి?



2024 వరకూ చిన్నప్పన్న మీతోనే ఉన్నారనేందుకు ఈ ఫొటోలే సాక్ష్యం

ఏపీభవన్ లైజన్ అధికారైతే మరి నీడలా మీ వెంటే ఉన్నారెందుకు?

వివరాలు 2లో

అప్పట్లో తితిదే పాలకమండలి ఛైర్మన్‌గా ఉన్న వైవీ సుబ్బారెడ్డిని విశాఖపట్నంలో జరిగిన ఓ కార్యక్రమంలో వైకాపా నాయకులు అభినందిస్తున్న చిత్రమిది. ఈ చిత్రంలో యలమంచిలి అప్పటి ఎమ్మెల్యే కన్నబాబురాజు పక్కన, సుబ్బారెడ్డి వెనక ఉన్నది ఎవరో తెలుసా? తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా కేసులో కీలక నిందితుడు కదురు చిన్నప్పన్నే!

నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

- 14న రాష్ట్ర బడ్జెట్

11లో



స్పీకర్‌పై అవిశ్వాసం

ఆయన తొలగింపునకు 118 మంది ఎంపీల నోటీసు

ఓం బిర్లా పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆరోపణ

- చర్చ పూర్తయ్యేవరకు విధులకు దూరంగా సభాపతి
- నిబంధనల మేరకు చర్య తీసుకోవాలని అధికారులకు ఆదేశం

దిల్లీ: లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తొలగింపునకు తీర్మానం ప్రవేశపెట్టాలంటూ కాంగ్రెస్ నేతృత్వంలో 118 మంది విపక్ష ఎంపీలు మంగళవారం లోక్‌సభ సెక్రటరీ జనరల్ ఉత్పల్ కుమార్ సింగ్‌కు నోటీసు సమర్పించారు. సభను నిర్వహించడంలో బిర్లా తీవ్ర పక్షపాత వైఖరితో వ్యవహరిస్తున్నారని, రాజ్యాంగబద్ధ కార్యాలయాన్ని దుర్వినియోగం చేస్తున్నారని వారు ఆరోపించారు. కాంగ్రెస్ సభ్యులపై ఆయన కొన్ని తప్పుడు ఆరోపణలు చేశారని కూడా దానిలో పేర్కొన్నారు. రాజ్యాంగంలోని 94(సి) అధికరణం కింద లోక్‌సభలో కాంగ్రెస్‌పక్ష ఉపనేత గౌరవ్ గొగొయ్, చీఫ్ విప్ కె.సురేశ్, విప్ మహమ్మద్ జావెద్ తదితరులు నోటీసును అందజేశారు. కాంగ్రెస్, డీఎంకే, సమాజ్‌వాదీ, వామపక్షాలు, ఆర్జేడీ, శివసేన-యూబీటీ, ఎన్సీపీ-ఎస్పీ తదితర పార్టీల సభ్యులు దీనిపై సంతకాలు చేశారు. లోక్‌సభ విపక్షనేత రాహుల్‌గాంధీ మాత్రం సంతకం చేయలేదు. తృణమూల్ తరఫున ఎవరి ప్రాతినిధ్యమూ లేదు. నిబంధనల ప్రకారం ఈ అంశంపై చర్చ పూర్తయ్యేవరకు సభకు రాకూడదని ఓం బిర్లా నిర్ణయించుకున్నారు.

1. నరవణె రచించిన పుస్తకంపై మాట్లాడేందుకు రాహుల్‌గాంధీకి అవకాశం ఇవ్వకపోవడం 2. మాజీ ప్రధానులపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేసిన భాజపా ఎంపీ నిశికాంత్ దుబెపై చర్యలు తీసుకోకపోవడం 3. ఎనిమిది మంది (మిగతా 3లో)

సిట్ సెగ.. బాలాజీ జారుడు

- కల్తీనెయ్యి బాగోతంలో ఉచ్చు బిగియగానే.. సెలవు బాట
- అనూహ్యంగా 20 రోజుల సుదీర్ఘ విరామం
- టెండర్ల సడలింపులో కీలక పాత్రధారిగా సిట్ నిర్ధారణ


బాలాజీ

ఈనాడు డిజిటల్, తిరుపతి; తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ ప్రసాదానికి కల్తీ నెయ్యి సరఫరా చేసిన వ్యవహారంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఉచ్చు బిగుస్తుండటంతో, తితిదే ముఖ్య గణాంక, ఆర్థిక విభాగం అధిపతి (ఎఫ్ఏ అండ్ సీఏవో) ఒ. బాలాజీ అనూహ్యంగా సెలవుపై వెళ్లారు. వైకాపా హయాంలో నెయ్యి కొనుగోలు కమిటీలో కీలక సభ్యుడిగా ఉన్న ఈయన.. నిబంధనలను సడలించి, నాణ్యత లేని నెయ్యి సరఫరాకు పరోక్షంగా కారణమయ్యారని సిట్ ప్రాథమికంగా నిర్ధారించింది. ఈ క్రమంలో ఆయనపై కఠినచర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి లేఖ రాసింది. ఈ నేపథ్యంలో.. బాలాజీ తీసుకున్న సుదీర్ఘ సెలవు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

అనారోగ్యం సాకో.. తప్పించుకునే ఎత్తుగడో?

గతంలో ఎన్నడూలేని విధంగా బాలాజీ 20 రోజుల పాటు దీర్ఘకాలిక సెలవు కావాలంటూ దరఖాస్తు చేసుకున్నారు. తనకు అనారోగ్య సమస్యలున్నాయని, అందుకే సెలవు కావాలని సోమవారం ఆయన కోరగా.. కొత్త ఈవో ముద్దాడ రవిచంద్ర మౌఖికంగా వెంటనే ఆమోదం తెలిపారు. విచారణ కీలకదశకు చేరుకున్న సమయంలో, తన మెడకు సిట్ ఉచ్చు బిగుస్తుందని తెలిసే ఆయన సెలవు పేరుతో పక్కకు తప్పుకొన్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికితోడు ప్రస్తుతం ఆయన స్థానంలో ఇన్‌ఛార్జి బాధ్యతలు ఎవరికీ అప్పగించలేదు.

అంతా ఆయన కనుసన్నల్లోనే..

తితిదేలో ప్రతి పైసా ఖర్చు బాలాజీ అనుమతి లేనిదే జరగదు. ఏళ్ల తరబడి ఆర్థిక విభాగంలో పాతుకుపోయిన ఆయన, కేంద్ర సర్వీసు అధికారులనే కాదని చక్రం తిప్పారు. 2020 ఫిబ్రవరి 14న టెండర్ నిబంధనల సడలింపునకు సిఫార్సు చేసి, కల్తీ నెయ్యి సరఫరా చేసే సంస్థలకు దారి సుగమం చేశారు. అంతకుముందు కఠినంగా ఉన్న నిబంధనలను సడలిస్తూ.. నోట్‌ఫైళ్లు సిద్ధం చేయడంలో బాలాజీదే కీలకపాత్ర అని సిట్ గుర్తించింది. టెండర్లు, ఉద్యోగుల జీతాలు, డిపాజిట్లు, బడ్జెట్ ఇలా ప్రతి అంశం ఆయన గుప్పిట్లోనే ఉండేది. శ్రీవారి ప్రసాదం పవిత్రతను దెబ్బతీసిన ఈ వ్యవహారంలో ప్రధాన పాత్రధారిగా ఉన్న బాలాజీపై ప్రభుత్వం నేటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విస్మయానికి గురిచేస్తోంది.

కల్తీ నెయ్యితో వేంకటేశ్వరుడికి ప్రసాదాలు ఘోర అపచారం

- దోషుల్ని కఠినంగా శిక్షించాలి
- ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబులకు పీఠాధిపతి యతిరాజ జీయర్‌స్వామి లేఖలు

ఈనాడు, అమరావతి: కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వరస్వామికి నివేదించే ప్రసాదాలను కల్తీ నెయ్యితో తయారు చేయడం ఘోర అపచారమని, దోషుల్ని కఠినంగా శిక్షించాలని కర్ణాటకలోని మేల్కోటేలో ఉన్న ప్రఖ్యాత యదుగిరి యతిరాజమఠం పీఠాధిపతి యతిరాజ జీయర్‌స్వామి డిమాండ్ చేశారు. తిరుమల లడ్డూ సహా ఇతర ప్రసాదాల తయారీకి కల్తీ నెయ్యి వినియోగించడం అత్యంత దురదృష్టకరం అని పేర్కొన్నారు. సనాతన ధర్మాన్ని ఆచరించే హిందువులుగా తమకు ఆ ఘటన ఎంతో ఆవేదన కలిగించిందన్నారు. దీనిపై ప్రధాని నరేంద్ర మోదీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబులకు ఆయన లేఖలు రాశారు. అలాంటి ఘోర అపచారాలు పునరావృతం కాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. 'మనం భగవంతుడికి నివేదించేవి అన్ని విధాలా శుద్ధమైనవై ఉండాలి. ప్రసాదాల్లో వినియోగించే దినుసులు, తయారీ విధానంలో నిబంధనలు తప్పక పాటించాలి. శుద్ధి చేయడం నెయ్యి ప్రధాన గుణమని శాస్త్రాలు చెబుతున్నాయి. అందుకే యజ్ఞాలు, యాగాల్లో పరిశుభ్రమైన నెయ్యిని వినియోగిస్తారు. అలాంటి నెయ్యినే కల్తీ చేసి వినియోగించడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు' అని ఆయన పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వరస్వామికి నివేదించే ప్రసాదాల పవిత్రతకు ఎలాంటి భంగం వాటిల్లకుండా చూడాల్సిందిగా కోరారు.

ఇవన్నీ చూసినా బుకాయిస్తారా సుబ్బారెడ్డీ?

- చిన్నప్పన్నతో మీ బంధానికి ఇంత కంటే రుజువులేం కావాలి?
- 2024 వరకూ చిన్నప్పన్న మీతోనే ఉన్నారనేందుకు ఈ ఫొటోలే సాక్ష్యం


2023 డిసెంబరు 15: అప్పట్లో వైకాపా ప్రాంతీయ సమన్వయకర్త బాధ్యతల్లో ఉన్న వైవీ సుబ్బారెడ్డికి విశాఖ విమానాశ్రయంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికిన చిత్రమిది. ఈ చిత్రంలో సుబ్బారెడ్డి వెనకున్నది చిన్నప్పన్నే


2024 ఫిబ్రవరి 11: విజయవాడ కనకదుర్గమ్మను వైవీ సుబ్బారెడ్డి సతీసమేతంగా దర్శించుకున్నప్పటి చిత్రమిది. ఈ ఫొటోలో సుబ్బారెడ్డి సతీమణి స్వర్ణలత పక్కన తెల్ల చొక్కా వ్యక్తి వెనక ఉన్నదీ చిన్నప్పన్నే!

2024 ఫిబ్రవరి 21: వైవీ సుబ్బారెడ్డి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నిక కావటంతో.. ఆయన సతీమణి స్వర్ణలత, కుటుంబసభ్యులు కలిసి విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకుని అనంతరం వేదపండితుల ఆశీర్వచనాలు పొందారు. ఈ చిత్రంలో స్వర్ణలత వెనక నిలుచుని దండం పెట్టుకుంటున్నదీ కదురు చిన్నప్పన్నే



2024 మే 20: అప్పట్లో వైకాపా ప్రాంతీయ సమన్వయకర్త బాధ్యతల్లో ఉన్న వైవీ సుబ్బారెడ్డిని పలువురు వైకాపా నాయకులు, కార్యకర్తలు మదురవాడలో కలిసిన ఫొటో ఇది. ఈ చిత్రంలో సుబ్బారెడ్డికి ఎదురుగా ఉన్నది చిన్నప్పన్నే.. పోలింగ్ ముగిసిన వారం రోజుల తర్వాత, కౌంటింగ్‌కు కొన్నాళ్ల ముందు జరిగిన భేటీ ఇది.



ఈనాడు, అమరావతి: తితిదే పాలకమండలి మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా కేసులో నిందితుడైన కదురు చిన్నప్పన్న మధ్య గాఢానుబంధానికి ఈ చిత్రాలు తిరుగులేని రుజువులు. 2014 నుంచి 2018 వరకే చిన్నప్పన్న తన దగ్గర పీఏగా పనిచేశారని, ఆ తర్వాత ఏపీ భవన్‌లో లైజన్ అధికారిగా, ఇతర ఎంపీల దగ్గర పనిచేశారని, అతనితో తనకెలాంటి సంబంధమూ లేదని సుబ్బారెడ్డి పదే పదే చెబుతున్నారు. ఏపీ భవన్‌లో లైజన్ అధికారికి 2023, 2024ల్లో కూడా సుబ్బారెడ్డి వెంట నీడలా ఉండాల్సిన అవసరం ఏంటి? సుబ్బారెడ్డి కుటుంబసభ్యులు ఎక్కడికి వెళితే అక్కడికి వారితో వెళ్తున్నారంటే అర్థమేంటి? చిన్నప్పన్న సుబ్బారెడ్డికి పీఏ మాత్రమే కాదు.. వారిమధ్య అంతకుమించిన బంధమేదో ఉందనే కదా! చిన్నప్పన్న వారింట్లో ఓ మనిషిగా చలామణి అయ్యారనే కదా!

లంచాలు డిమాండ్ చేసింది... స్వీకరించింది అప్పుడే

తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా చేసిన భోలేబాబా డెయిరీ డైరెక్టర్ పొమిల్ జైన్‌ను 2022 మే 15న చిన్నప్పన్న దిల్లీకి పిలిపించి కిలోకు రూ.25 చొప్పున లంచం అడగ్గా... అందుకు అతను నిరాకరించినట్లు సిట్ దర్యాప్తులో గుర్తించింది. పది రోజుల తర్వాత అంటే 2022 మే 25న పొమిల్‌జైన్... వైవీ సుబ్బారెడ్డిని కలిసి 'మీ పీఏ చిన్నప్పన్న లంచం అడుగుతున్నారు' అని ఫిర్యాదుచేశారు. దీన్నిబట్టి ఈ లంచాలు అడిగినప్పుడు చిన్నప్పన్న సుబ్బారెడ్డి దగ్గరే ఉన్నట్లు స్పష్టమవుతోంది.

- ప్రీమియర్ అగ్రిఫుడ్స్ ఎండీ జగ్‌మోహన్ గుప్తాకు 2022 మే నెలలో చిన్నప్పన్న కాల్ చేసి.. దిల్లీ నార్త్ ఎవెన్యూలోని ఎంపీ నివాస్‌కు పిలిపించారు. తితిదేకి నెయ్యి సరఫరా చేసే కాంట్రాక్టు కావాలంటే తమకు కిలోకు రూ.7 చొప్పున లంచమివ్వాలని డిమాండ్ చేయగా జగ్‌మోహన్ గుప్తా అందుకు అంగీకరించారు. ఆ తర్వాతే ప్రీమియర్ అగ్రిఫుడ్స్‌కు తితిదే నెయ్యి సరఫరా కాంట్రాక్టు లభించింది. 2022 మే నుంచి 2023 డిసెంబరు వరకూ జగ్‌మోహన్ గుప్తా నుంచి హవాలా మార్గాల్లో చిన్నప్పన్నకు రూ.50 లక్షల లంచం సొమ్ము అందినట్లు సిట్ దర్యాప్తులో తేలింది. ఈ మధ్యకాలంలో చిన్నప్పన్న, జగ్‌మోహన్ గుప్తా మధ్య అనేక సాధారణ కాల్స్, వాట్సప్ కాల్స్ నడిచినట్లు వెల్లడైంది. లంచాలు డిమాండు చేసినప్పుడు.. వాటిని వసూలు చేసినప్పుడు సుబ్బారెడ్డి వద్దే చిన్నప్పన్న ఉన్నారనేది తేటతెల్లమవుతోంది.

ఫొటోలు అబద్ధం చెప్పవుకదా!

- ఈ చిత్రాలన్నీ చూశాక కూడా.. చిన్నప్పన్నకు, మీకు సంబంధం లేదని బుకాయిస్తారా సుబ్బారెడ్డీ?
- ఇన్ని రుజువులు కళ్లముందు కనిపిస్తున్నా కూడా.. 2018 తర్వాత చిన్నప్పన్న మీ దగ్గర పని చేయలేదని చెబుతారా?
- మీ సేవలకు వినియోగించుకుని, ఎక్కడెక్కడ, ఎప్పుడెప్పుడు ఎలా పావుగా వాడాలో వాడేసుకుని.. కల్తీనెయ్యి కేసులో చిన్నప్పన్న పాత్ర, ప్రమేయం బయటపడేసరికి తప్పంతా అతనిపైకి నెట్టేసి మీకు సంబంధం లేదంటూ తప్పించుకుంటారా? అతనితో ఏ సంబంధమూ లేకుండానే 2019 తర్వాత 2024 వరకూ మీవెంట నీడలా తిప్పించుకున్నారా? మీ కుటుంబసభ్యులకు తోడుగా పంపించారా?
- మీరు విజయవాడలో ఉంటే విజయవాడలో, విశాఖలో ఉంటే విశాఖలో.. ఇలా మీరెక్కడుంటే అక్కడ చిన్నప్పన్న మీతో ఉన్నాడంటే.. ఏ సంబంధమూ లేకుండానే ఉన్నారా సుబ్బారెడ్డీ?
- మీరు అబద్ధం చెప్పొచ్చు సుబ్బారెడ్డీ.... కానీ చిత్రాలు నిజమే చెబుతాయి కదా!

నెయ్యి కల్తీపై ముందే చెప్పిన తితిదే ల్యాబ్

- సీఎఫ్‌టీఆర్ఐ కంటే రెండున్నర నెలల ముందే నిర్ధారణ
- భోలేబాబా నుంచి వచ్చిన ఐదు ట్యాంకర్లలోని నమూనాలు పరీక్షించి కల్తీ గుర్తింపు
- 2022 మే, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో పరీక్షల నిర్వహణ
- కల్తీ నిగ్గు తేలినా భోలేబాబాపై చర్యలే లేవు
- పైగా అదనంగా సరఫరా ఆర్డర్లు కట్టబెట్టారు



ఈనాడు- అమరావతి, తిరుపతి, న్యూస్‌టుడే, తిరుపతి (నేరవిభాగం): తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీ కోసం భోలేబాబా డెయిరీ, ప్రీమియర్ అగ్రిఫుడ్స్, వైష్ణవి డెయిరీలు సరఫరా చేస్తున్నది కల్తీ నెయ్యేనని మైసూరులోని సీఎఫ్‌టీఆర్ఐ (సెంట్రల్ ఫుడ్ టెక్నలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్) నిర్ధారించడానికి కొన్ని నెలల ముందు, తర్వాత కూడా అది కల్తీ నెయ్యేనని తితిదే ల్యాబ్‌లో నిర్వహించిన పరీక్షల్లో తేలింది. 2022 ఆగస్టు 3న సీఎఫ్‌టీఆర్ఐ నుంచి నివేదిక అందగా అదే ఏడాది మే, ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో పలుమార్లు తితిదే ల్యాబ్‌లో చేపట్టిన పరీక్షల్లో ఈ కల్తీ గుట్టు రట్టైంది. నెయ్యి స్వచ్ఛత తేల్చటానికి, అందులో వెజిటబుల్ ఆయిల్స్, జంతుకొవ్వులు వంటివేవైనా కలిసి కల్తీ జరిగిందా అనేది గుర్తించటానికి నిర్వహించే బ్యుటిరో రిఫ్రాక్టో మీటర్ రీడింగ్ (బీఆర్ఆర్) పరీక్షల్లో, నెయ్యి నాణ్యత గుర్తించటానికి, అది చెడిపోయిందా? లేదా? అనేది తెలుసుకోవడానికి చేపట్టే ఫ్రీ ఫ్యాటీ యాసిడ్ (ఎఫ్ఎఫ్ఏ) పరీక్షల్లోనూ కల్తీ బయటపడింది. ఈ ఫలితాలు వచ్చినప్పుడల్లా నోటీసులిచ్చారే తప్ప పదే పదే కల్తీ నెయ్యి పంపిస్తున్న భోలేబాబా డెయిరీపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. సరఫరా నిలిపివేయలేదు. పైగా అదనంగా సరఫరా ఆర్డర్లు కట్టబెట్టారు. ఇవన్నీ సిట్ దర్యాప్తులో తేలాయి. అంటే నాటి పాలకమండలి పెద్దలు, తితిదే అధికారులు.. అక్రమాలు, కల్తీ గురించే తెలిసే భోలేబాబాకు కొమ్ముకాశారనేది స్పష్టమవుతోంది.

- అంటే మూడు నెలల వ్యవధిలో రెండుసార్లు బీఆర్ఆర్ పరీక్ష చేయిస్తే రెండుసార్లూ కల్తీ వెల్లడైంది.
- సెప్టెంబరులో ఐదు రోజుల వ్యవధిలో మూడుసార్లు మూడు ట్యాంకర్ల నమూనాలు తీసుకుని ఎఫ్ఎఫ్ఏ పరీక్ష చేయగా మూడుసార్లూ పాడైనది, నాసిరకమైన నెయ్యే వచ్చిందని వెల్లడైంది.
- ఈ 5 ట్యాంకర్లలో కలిపి 89,560 కిలోల కల్తీ నెయ్యి భోలేబాబా నుంచి తితిదేకు వచ్చింది.

భోలేబాబా లంచమివ్వటానికి నిరాకరించిన తర్వాతే పరీక్షలు

- 2022 మే 15న తితిదే అప్పటి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పీఏ చిన్నప్పన్న భోలేబాబా డెయిరీ డైరెక్టర్ పొమిల్ జైన్‌ను దిల్లీకి పిలిపించి కిలోకు రూ.25 చొప్పున లంచమివ్వాలని డిమాండ్ చేశారు. పొమిల్ జైన్ అందుకు నిరాకరించారు. ఆ మర్నాడే (మే 16న) భోలేబాబా డెయిరీపై చిన్నప్పన్న ఇచ్చిన ఫిర్యాదును సుబ్బారెడ్డి నాటి తితిదే ప్రొక్యూర్‌మెంట్ జీఎం సుబ్రహ్మణ్యానికిచ్చి విచారణకు ఆదేశించారు.
- రెండు రోజులకే (మే 18న) భోలేబాబా డెయిరీ నుంచి వచ్చిన 'పీబీ07ఏఎస్ 8855' నంబరు ట్యాంకరు నుంచి నమూనాలు తీసి బీఆర్ఆర్ పరీక్ష కోసం పంపించగా.. అందులో కల్తీ ఉన్నట్లు తేలింది.
- మే 20న వైవీ సుబ్బారెడ్డి సుబ్రహ్మణ్యాన్ని పిలిపించి నెయ్యి నమూనాలను మైసూరులోని సీఎఫ్‌టీఆర్ఐకు పంపించి నాణ్యత పరీక్షలు చేయించాలని ఆదేశించారు. ఆ వెంటనే భోలేబాబా, ప్రీమియర్ అగ్రిఫుడ్స్, వైష్ణవి డెయిరీల నుంచి వచ్చిన నమూనాలు పరీక్షలకు పంపించారు. వాటిలో కల్తీ ఉన్నట్లు ఆగస్టు 3న వచ్చిన ఫలితాల్లో తేలింది.
- సీఎఫ్‌టీఆర్ఐ నివేదిక అందిన తర్వాత 2022 సెప్టెంబరులో తితిదే ల్యాబ్‌లో వరుసగా మూడుసార్లు చేసిన ఎఫ్ఎఫ్ఏ పరీక్షల్లోనూ నెయ్యి నాసిరకమైనదేనని వెల్లడైంది.
- తితిదే ల్యాబ్‌లో అంతర్గతంగా నిర్వహించిన పరీక్షల్లో, ప్రతిష్ఠాత్మక సీఎఫ్‌టీఆర్ఐ ల్యాబ్‌లో నిర్వహించిన పరీక్షల్లోనూ నెయ్యిలో కల్తీ జరిగినట్లు వెల్లడైనప్పటికీ చర్యలు కరవయ్యాయి.
- సీఎఫ్‌టీఆర్ఐకు నెయ్యి నమూనాలు పంపి నాణ్యత పరీక్షలు చేయించాలని సుబ్బారెడ్డి ఆదేశించిన 5 రోజుల వ్యవధిలోనే అంటే 2022 మే 25న కమీషన్ ఏజెంట్ పీపీ శ్రీనివాసన్, మరొకరితో పాటు భోలేబాబా డైరెక్టర్ పొమిల్ జైన్ వెళ్లి వైవీ సుబ్బారెడ్డిని కలిశారు. పీఏ చిన్నప్పన్న కిలోకు రూ.25 చొప్పున లంచం అడుగుతున్నారని వివరించారు. ఏడాది లోపు తమ ప్లాంటులో తనిఖీలు చేయొద్దని విన్నవించారు.

బీఆర్ఆర్ పరీక్షల్లో కల్తీ.. ఎఫ్ఏఏ పరీక్షల్లో నెయ్యి నాణ్యత గుట్టు రట్టు

పరీక్ష తేదీ	ట్యాంకర్ నంబర్	పరీక్ష	ఏం తేలింది
18.5.2022	పీబీ07ఏఎస్ 8855	బీఆర్ఆర్	కల్తీ నెయ్యి
18.8.2022	ఆర్‌జే11జీసీ 0975	బీఆర్ఆర్	కల్తీ నెయ్యి
26.9.2022	పీబీ03ఏవై 9737	ఎఫ్ఎఫ్ఏ	పాతది, పాడైంది, నాసిరకమైన నెయ్యి
28.9.2022	యూపీ15డీటీ 9837	ఎఫ్ఎఫ్ఏ	పాతది, పాడైంది, నాసిరకమైన నెయ్యి
30.9.2022	పీబీ03ఏడబ్ల్యూ 8537	ఎఫ్ఎఫ్ఏ	పాతది, పాడైంది, నాసిరకమైన నెయ్యి

కల్తీ నిగ్గు తేలాక కూడా 1.07 లక్షల కిలోలకు ఆర్డర్లు

టెండరు నిబంధనల ప్రకారం కల్తీ నెయ్యి సరఫరా చేసినట్లు తేలితే సంబంధిత సంస్థలపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేసి, విచారించాలి. ఆ సంస్థల నుంచి సరఫరా నిలిపివేయాలి. ఈఎండీ, సెక్యూరిటీ డిపాజిట్లు జప్తు చేయాలి. ఆ సంస్థలను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలి. అయితే అధికారులు భోలేబాబాకు నోటీసులిచ్చి సరిపెట్టేశారు. 2022 మే నెలలోనే నెయ్యి కల్తీపై నివేదికలందినప్పటికీ భోలేబాబా డెయిరీకి కిలో రూ.329 చొప్పున 1.07 లక్షల కిలోల నెయ్యి సరఫరాకు 2022 ఆగస్టు 29న ఆర్డరు ఇచ్చారు. దాని ప్రకారం 2022 అక్టోబరు 28 వరకూ భోలేబాబా డెయిరీ తిరుమలకు నెయ్యి సరఫరా చేసింది. ప్రీమియర్ అగ్రిఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, వైష్ణవి డెయిరీలు 2024 వరకూ సరఫరాదారులుగా కొనసాగాయి.

ఏంటీ పరీక్షలు?

1. బ్యుటిరో రిఫ్రాక్టో మీటర్ రీడింగ్ (బీఆర్ఆర్) పరీక్ష: నెయ్యి నమూనా వక్రీభవన సూచికను కొలవటం ద్వారా దాని నాణ్యతను నిర్ధారిస్తారు. ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్రమాణాల ప్రకారం బీఆర్ఆర్ రీడింగ్ 40-43 మధ్య ఉంటే అది స్వచ్ఛమైన ఆవు నెయ్యని అర్థం. 45 కంటే ఎక్కువ ఉంటే అందులో వెజిటబుల్ ఆయిల్స్, వనస్పతి, పామాయిల్ వంటివి కలిశాయని అర్థం. బీఆర్ఆర్ రీడింగ్ 40 కంటే తక్కువ అంటే 39, 38 ఇలా ఉంటే అందులో జంతు కొవ్వులు లేదా నాసిరకమైన ముడిపదార్థాలు కలిసినట్లు అర్థం.
2. ఫ్రీ ఫ్యాటీ యాసిడ్ (ఎఫ్ఎఫ్ఏ) పరీక్ష: నెయ్యి తాజాదనం, నాణ్యత కొలిచే పరీక్ష. నాణ్యమైన నెయ్యిలో ఎఫ్ఎఫ్ఏ విలువ తక్కువగా ఉంటుంది. ఎఫ్ఎఫ్ఏ ఎక్కువ ఉంటే నెయ్యి త్వరగా చెడిపోతుంది. వాసన మారుతుంది. చేదెక్కుతుంది. దీన్నిబట్టి అది కల్తీదని అర్థం చేసుకోవచ్చు.

శ్రీకాళహస్తి, కాణిపాకం, ద్వారకా తిరుమలకూ కల్తీ నెయ్యి

(మొదటి పేజీ తరువాయి)

వినాయక ఏజెన్సీస్ 2022-24 మధ్య ద్వారకా తిరుమల ఆలయానికి నెయ్యి సమకూర్చింది. ఈ మూడు ప్రధాన ఆలయాల్లోనూ అప్పట్లో కల్తీ నెయ్యితోనే లడ్డూ, ఇతర ప్రసాదాలు తయారుచేసి భక్తులకు అందజేసినట్లు తెలుస్తోంది.

ఏటా లక్షన్నర కిలోల వరకు

- శ్రీకాళహస్తి, కాణిపాకం, ద్వారకా తిరుమల ఆలయాల్లో ప్రసాదాల తయారీకి ఏడాదికి సగటున లక్ష నుంచి లక్షన్నర కిలోల నెయ్యి వినియోగిస్తారు.
- 2023-24లో నెయ్యి సరఫరా కోసం శ్రీకాళహస్తి, కాణిపాకం ఆలయాల ఈవోలు టెండర్లు పిలవగా, సుమతి ట్రేడర్స్ దక్కించుకుంది.
- శ్రీకాళహస్తి ఆలయానికి కిలో రూ.573 ధరతో.. వైష్ణవి, భోలేబాబా ఆర్గానిక్, తిరుమల, విజయ, నందిని, సంగం బ్రాండ్లలో ఏదైనా సరఫరా చేస్తామని పేర్కొంది. కొంతమాత్రమే తిరుమల డెయిరీ నెయ్యిని అందించగా, అత్యధికంగా వైష్ణవి డెయిరీకి చెందిన నెయ్యినే సుమతి ట్రేడర్స్ పంపించింది.
- కాణిపాకం వరసిద్ధి వినాయక ఆలయానికి సైతం నెయ్యి సరఫరా టెండరు దక్కించుకున్న సుమతి ట్రేడర్స్.. కిలో రూ.555 ధరతో వైష్ణవి, తిరుమల, విజయ, నందిని డెయిరీల బ్రాండ్‌లలో ఏదైనా నెయ్యి సరఫరా చేస్తామని పేర్కొంది. అయితే దాదాపు ఏడాదంతా వైష్ణవి డెయిరీ నెయ్యినే సరఫరా చేసింది.
- 2022లో ద్వారకా తిరుమల ఆలయానికి నెయ్యి సరఫరా టెండరును తిరుపతికి చెందిన వినాయక ఏజెన్సీస్ దక్కించుకుంది. కిలో రూ.532 ధరతో వైష్ణవి బ్రాండ్ నెయ్యిని సరఫరా చేస్తామని పేర్కొని, అదే అందజేసింది.

ఫిర్యాదులపై చర్యలేవి?

శ్రీకాళహస్తి ఆలయానికి వైష్ణవి డెయిరీ అందించిన నెయ్యి వాసన లేకుండా నాసిరకంగా ఉందని, వేసవిలోనూ గడ్డకడుతోందని అప్పట్లో ఆలయ అధికారులకు పోటు సిబ్బంది ఫిర్యాదు చేశారు. బాయిలర్ల ద్వారా కరిగించి వాడాల్సి వస్తోందని చెప్పినా, అధికారులు పట్టించుకోలేదు. కాణిపాకం ఆలయంలోనూ ఇదే అనుభవం ఎదురైంది.

దొంగ చేతికే తాళాలు

ఆయా సంస్థలు పంపించిన నెయ్యి నాణ్యతను ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన ల్యాబ్‌లు లేదా పేరున్న కోఆపరేటివ్ డెయిరీల ల్యాబ్‌లలో పరీక్షించి, ఆ నివేదికలనే పరిగణనలోకి తీసుకోవాలి. కానీ శ్రీకాళహస్తి, కాణిపాకం ఆలయాలకు కల్తీ నెయ్యి సరఫరా చేసిన సుమతి ట్రేడర్స్ సంస్థ.. వైష్ణవి డెయిరీ స్పెషాలిటీస్ ప్రైవేట్ లిమిటెడ్ (తిరుపతి) ల్యాబ్‌లో పరీక్షించిన నివేదికలు సమర్పించింది. అంటే సుమతి ట్రేడర్స్.. వైష్ణవి డెయిరీ నుంచి నెయ్యిని సేకరించి, అదే డెయిరీకి చెందిన ల్యాబ్ రిపోర్ట్‌లను ఇచ్చింది. వాటినే అధికారులు పరిగణనలోకి తీసుకున్నారు. నాణ్యత పరీక్షల్లో డొల్లతనానికి ఇదే పెద్ద ఉదాహరణ.

సమగ్ర విచారణ అవసరం

రాష్ట్రంలో పలు ప్రధాన ఆలయాలకు నాణ్యతలేని, కల్తీ నెయ్యి సరఫరా అయినట్లు సిట్ పేర్కొన్నందున దేవాదాయశాఖ లోతుగా విచారణ జరిపితే మరిన్ని వాస్తవాలు వెలుగుచూసే ఆస్కారముంది. ఏయే ఆలయాలకు, ఏయే సంస్థలు ఎంత నెయ్యి అందించాయి? వాటి నాణ్యతపై ఫిర్యాదులొచ్చాయా? వాటిపై చర్యలు తీసుకున్నారా? కల్తీ నెయ్యి సరఫరా వెనుక ఎవరి ప్రమేయమైనా ఉందా? అధికారులు తెలిసి, తీసుకున్నారా?' వంటి అంశాలపై సమగ్ర విచారణ జరపాలన్న డిమాండ్ వస్తోంది. కోఆపరేటివ్ డెయిరీ నెయ్యినే తీసుకోవాలన్న నిబంధనను సడలించి.. ఇతర డెయిరీలు, డీలర్లు, రిటైల్ వ్యాపారులకు అవకాశం ఇవ్వడం వెనుక దాగిన మంత్రాంగాన్ని తేల్చాల్సిన అవసరం ఉంది.

2022లో నిబంధనలు మార్చేసి..

రాష్ట్రంలో ప్రధాన ఆలయాలైన శ్రీశైలం, శ్రీకాళహస్తి, కాణిపాకం, విజయవాడ దుర్గగుడి, ద్వారకా తిరుమల, అన్నవరం, సింహాచలం దేవస్థానాలకు కలిపి ఏడాదికి 11.61 లక్షల కిలోల నెయ్యి వినియోగిస్తారు. ఇవికాక ఇతర ముఖ్య ఆలయాలకు 2.13 లక్షలు, చిన్న ఆలయాలకు 88,085 కిలోల నెయ్యి కొనుగోలు చేస్తారు.

- ప్రధాన ఆలయాలకు అవసరమైన నెయ్యి, పాలను టెండర్లు లేకుండా నేరుగా సహకార డెయిరీల నుంచి కొనాలని 2019 మేలో దేవాదాయ కమిషనర్ ఆదేశించారు. 2022 ఏప్రిల్ 25న అప్పటి కమిషనర్ ఈ నిబంధనలు మార్చారు. అన్ని ఆలయాల్లోనూ ఆవు నెయ్యి, ఇతర పాల ఉత్పత్తుల కోసం అన్ని డెయిరీలు, డీలర్లు, రిటైల్ సరఫరాదారులకు అవకాశమివ్వాలని ఆదేశించారు. అప్పటి నుంచే వినాయక ఏజెన్సీస్, సుమతి ట్రేడర్స్ వంటి సంస్థల కల్తీ దందా మొదలైంది.
- నెయ్యి నాణ్యతపై ఫిర్యాదులు రావడంతో నాణ్యత పరీక్షలు తప్పనిసరి చేస్తూ 2023 మార్చిలో దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాలిచ్చారు. ప్రభుత్వ ల్యాబ్స్‌లో లేదా ప్రసిద్ధి చెందిన ల్యాబ్‌లో పరీక్షలు చేయించి, ఆ సర్టిఫికెట్‌ను సమర్పించాలని నిబంధన విధించారు. 'ప్రసిద్ధి చెందిన ల్యాబ్' అన్న నిబంధనను సుమతి ట్రేడర్స్ అనుకూలంగా మార్చుకుంది. శ్రీకాళహస్తి, కాణిపాకం ఆలయాలకు వైష్ణవి డెయిరీ నెయ్యిని సరఫరాచేసి, అదే సంస్థకు చెందిన ల్యాబ్ నుంచే నాణ్యత ధ్రువీకరణ పత్రం తీసుకొచ్చి, ఇచ్చింది.

గ్రహం అనుగ్రహం

11-2-2026 బుధవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; శిశిర రుతువు, మాఘ మాసం, బహుళ పక్షం
నవమి: ఉ. 9-36 తదుపరి దశమి
అనూరాధ: ఉ. 10-51 తదుపరి జ్యేష్ఠ
వర్జ్యం: సా. 5-03 నుంచి 6-49 వరకు
అమృత ఘడియలు: తె. 3-42 నుంచి 5-28 వరకు
దుర్ముహూర్తం: ఉ. 11-51 నుంచి 12-37 వరకు
రాహుకాలం: మ. 12-00 నుంచి 1-30 వరకు
సూర్యోదయం: ఉ.6.34; సూర్యాస్తమయం: సా.5.55

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
విజయనగరం	15.0	30.0
అనంతపురం	16.0	34.5
నిజామాబాద్	16.4	32.5
హైదరాబాద్	16.5	31.8
తిరుపతి	17.6	31.2
శ్రీకాకుళం	18.0	30.0
కడప	18.0	32.0
ఖమ్మం	18.6	31.8
విశాఖపట్నం	19.0	28.8
గుంటూరు	19.0	32.0
తాడేపల్లిగూడెం	19.0	32.0
రాజమహేంద్రవరం	19.0	33.5
కర్నూలు	19.2	34.1
విజయవాడ	20.0	30.6
నరసాపురం	20.0	31.2
ఒంగోలు	21.5	30.3
నెల్లూరు	22.2	31.2

ఏపీకి సాగులో సాయానికి ప్రత్యేక బృందం

- కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ వెల్లడి
- సీఎం చంద్రబాబుతో భేటీ



కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో భేటీ అయిన సీఎం చంద్రబాబు

ఈనాడు, దిల్లీ: వ్యవసాయరంగ పరంగా ఆంధ్రప్రదేశ్ చేస్తున్న ప్రయత్నాలకు కేంద్ర ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయ, సహకారాలు అందించడానికి ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ తెలిపారు. ఆయన మంగళవారం సాయంత్రం ఇక్కడి కృషిభవన్‌లోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడితో భేటీ అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఈ విషయం వెల్లడించారు. 'దేశ వ్యవసాయ రంగంలో ఆంధ్రప్రదేశ్ వాటా దాదాపు 10 శాతానికి చేరినందుకు విజనరీ, డైనమిక్ లీడర్ చంద్రబాబునాయుడికి అభినందనలు తెలుపుతున్నా. ఆయన దార్శనిక నాయకత్వం కారణంగా ఆంధ్రప్రదేశ్ హార్టికల్చర్ హబ్‌గా మారుతోంది. జీడిపప్పు, కోకో, కాఫీ, కొబ్బరి విస్తృతంగా సాగవుతున్నాయి. కొత్త బడ్జెట్‌లో ప్రకటించిన కొత్త పథకాలను అందుకోవడానికి ఆంధ్రప్రదేశ్ వేగంగా పనిచేస్తోంది. వ్యవసాయ రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను ఆత్మనిర్భర్‌గా మార్చడానికి చంద్రబాబు నేతృత్వంలో జరుగుతున్న ప్రయత్నాలు పూర్తిగా సఫలమవుతాయి. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల సహాయ, సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉంది. ఏపీ వ్యవసాయ మార్గసూచిని మరింత మెరుగుపరచడానికి మేం ఏం సాయం చేయగలమన్నదానిపై అధ్యయనం చేయడానికి కేంద్రం తరఫున ఒక బృందాన్ని ఏర్పాటు చేశాం. పథకాలు, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన పరంగా మేం కలిసి పనిచేస్తాం. ఆ దిశగా ఈరోజు విస్తృత చర్చలు జరిగాయి. మత్స్య, పాడిపరిశ్రమ, పామాయిల్, ప్రకృతి వ్యవసాయ విభాగాల్లో ఆంధ్రప్రదేశ్ అద్భుతంగా పనిచేస్తోంది. వారితో కలిసి మరింత వేగంగా పనిచేయడానికి ప్రయత్నిస్తాం' అని చెప్పారు.

వ్యవసాయంలో లీడర్‌గా అవతరించనున్నాం: చంద్రబాబునాయుడు

ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ దేశ వ్యవసాయ రంగంలో ఆంధ్రప్రదేశ్ లీడర్‌గా అవతరించబోతోందని ప్రకటించారు. 'ఈ ఆర్థిక సంవత్సరంలో మేం జీడీపీకి 9.9% వాటా అందిస్తున్నాం. రాష్ట్రంలో పంటల వైవిధ్యాన్ని పాటిస్తున్నాం. ఉద్యాన పంటలు, మత్స్య ఉత్పత్తులు, కొబ్బరి, ధాన్యం, కాఫీ, కోకోతోపాటు ఇతర వాణిజ్యపంటల వైపు పెద్దఎత్తున మళ్లుతున్నాం. పామాయిల్ ఉత్పత్తిలోనూ బలంగా ఉన్నాం. వీటన్నింటినీ తదుపరి దశకు తీసుకెళ్లడంపై కేంద్ర వ్యవసాయ మంత్రి మార్గదర్శనం కోరాను. ఇందుకు సంబంధించి ఒక కార్యాచరణ తయారుచేయడంతోపాటు, వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడించే అంశాన్ని పరిశీలించాలని ఆయన తన శాఖ అధికారులను ఆదేశించారు. సూక్ష్మసేద్యంలో మేం దేశంలో దాదాపు నంబర్ 1గా ఉన్నాం. రాష్ట్రంలో రైతులు 20 లక్షల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. దీన్ని 50 లక్షల ఎకరాలకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం' అని చెప్పారు. కొత్త బడ్జెట్‌లో రాష్ట్రానికి రావాల్సిన ప్రాజెక్టులు, నిధులపై కేంద్ర మంత్రులతో చర్చించామన్నారు. కొన్ని ప్రాజెక్టులపై ఇప్పటికే కేంద్రానికి డీపీఆర్‌లు అందిస్తున్నట్లు చెప్పారు. 'విశాఖపట్నం మెట్రో రైలుపై కసరత్తు చేస్తున్నాం. చిన్న చిన్న సమస్యలు క్లియర్ చేసి, దాన్ని ముందుకు తీసుకెళ్లాలని కేంద్రాన్ని కోరాం' అన్నారు.

వ్యవసాయ మంత్రిని కోరిన అంశాలు

- ప్రకృతి వ్యవసాయ విస్తరణ కోసం పీఎం ప్రణామ్ పథకం కింద నిధులు విడుదల చేయాలి.
- రసాయన ఎరువుల వాడకం 2.28% మేర తగ్గించినందున 2024-25 సంవత్సరానికి రూ.216 కోట్ల ప్రోత్సాహకాలు ఇవ్వాలి.
- కొబ్బరి సాగుకు రూ.200 కోట్ల సాయం చేయాలి. కొబ్బరి రైతులకు మేలు చేయడంతోపాటు, సుమారు 15 వేల మందికి ఉపాధి కల్పించేలా రాష్ట్రంలో ప్రాసెసింగ్ పార్కు ఏర్పాటు చేయాలి. కర్ణాటక తరహాలో ఆధునిక పచ్చి కొబ్బరికాయల మార్కెట్లు నెలకొల్పాలి. నర్సరీల విస్తరణకు సహకారం అందించాలి.
- పర్ డ్రాప్ మోర్ క్రాప్ పథకం కింద పెండింగ్‌లో ఉన్న రూ.695 కోట్లు వెంటనే విడుదల చేయాలి.
- మార్కెట్ జోక్యం పథకం కింద 2025-26లో తోతాపురి మామిడికి రైతులకు కేంద్ర వాటాతో కలిపి రూ.200 కోట్లు చెల్లించాం. అందులో కేంద్రం వాటా రూ.100 కోట్లు రాష్ట్రానికి ఇవ్వాలి.
- కొల్లేరు ప్రాంతంలో 50 ఎకరాల్లో మఖానా సాగుకు అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లోనూ మఖానా అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేసి, రైతులను ప్రోత్సహించాలి.

విశాఖ మెట్రో.. ముందడుగు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రప్రభుత్వం మొత్తం రూ.42,362 కోట్లతో ప్రాజెక్టు నివేదికలు తయారుచేసింది. వీటిలో మొదటిదశ పనులకు రెండుచోట్లా కలిపి రూ.22,507 కోట్లు అవసరమని అధికారులు అంచనాలు వేశారు. విశాఖ ప్రాజెక్టుకు రూ.11,498 కోట్లు, విజయవాడ ప్రాజెక్టుకు రూ.11,009 కోట్లు ప్రతిపాదించారు.

ఈక్విటీ షేర్‌లో సగానికి కేంద్రం ఓకే

- మెట్రో రైలు కొత్త పాలసీ-2017 ప్రకారం విశాఖ ప్రాజెక్టుకు మొత్తం ఈక్విటీ షేర్ 40%లో కేంద్రం 20% నిధులు సమకూర్చేందుకు అంగీకరించింది. మిగతా 20% నిధులు రాష్ట్రప్రభుత్వం పెట్టుకోవాలి. తొలిదశలో రూ.11,498 కోట్లతో చేపట్టనున్న ప్రాజెక్టు అంచనా వ్యయంలో 40% ఈక్విటీ షేర్‌గా నిర్ణయించారు. మిగతా 60% నిధులు ఏడీబీ, ఏఐఐబీ, ప్రపంచబ్యాంకుల నుంచి సాఫ్ట్‌లోన్‌గా సేకరిస్తారు. ఇందుకు కేంద్రం హామీ ఇస్తుంది. రాష్ట్రప్రభుత్వం 30 ఏళ్లలో రుణం తిరిగి చెల్లించాలి.
- విశాఖలో తొలిదశలో మూడు కారిడార్లు ప్రతిపాదించారు. స్టీల్ ప్లాంట్ నుంచి కొమ్మాది కూడలి వరకు, రెండోది గురుద్వారా నుంచి పాత పోస్టాఫీసు, మూడోది తాటిచెట్లపాలెం నుంచి చినవాల్తేరు వరకు కలిపి మొత్తం 46.23 కిలోమీటర్లలో కారిడార్లు ఏర్పాటు చేయనున్నారు.
- రెండోదశలో కొమ్మాది నుంచి భోగాపురం విమానాశ్రయం వరకు 30.67 కిలోమీటర్లలో మరో కారిడార్ ప్రతిపాదించారు. ఇందుకోసం రూ.5,734 కోట్లు అవసరమని ప్రతిపాదించారు. విమానాశ్రయం ప్రారంభానికి సిద్ధమవుతున్నందున తొలిదశలోనే కొమ్మాది-భోగాపురం మధ్య కారిడార్‌కు కేంద్రం ఆమోదం కోసం యత్నిస్తున్నారు. ఈ ప్రతిపాదన కేంద్రం నుంచి కూడా వచ్చినట్లు తెలుస్తోంది.

విజయవాడలో దుర్గగుడి వరకు కారిడార్ల విస్తరణ

- విజయవాడ మెట్రో ప్రాజెక్టుకు రెండు ప్రధాన ఎలివేటెడ్ కారిడార్లను దుర్గగుడి వరకు విస్తరించే విషయాన్ని కేంద్రం పరిశీలిస్తోంది. ఇందుకు అధికారులు ప్రాథమికంగా అధ్యయనం చేసి కేంద్రానికి నివేదిక పంపారు. పీఎన్‌బీఎస్ నుంచి గన్నవరం, పెనమలూరు వరకు వేర్వేరుగా రెండు కారిడార్లు మొదట ప్రతిపాదించారు. దుర్గగుడి వరకు వాటిని విస్తరించి బస్టాండ్ మీదుగా వెళ్లేలా మార్పులు చేస్తే బాగుంటుందన్న కేంద్ర నిపుణుల సూచనలపై అధికారులు ఇటీవల పరిశీలించారు. దుర్గగుడి ముందు రోడ్డులో తగినంత ఖాళీ స్థలం లేదని, ప్రైవేటు స్థలాల సేకరణ చాలా వ్యయంతో కూడుకున్నదన్న విషయాన్ని కేంద్రానికి నివేదించారని తెలుస్తోంది.
- రెండోదశలో బస్టాండ్ నుంచి రాజధాని అమరావతి వరకు కారిడార్ ప్రతిపాదించారు. ఇందుకోసం రూ.14,121 కోట్లు అవసరమని అంచనా వేశారు. రాజధాని పనులు శరవేగంగా జరుగుతున్నందున.. ఈ కారిడార్ కూడా తొలిదశలోనే చేపట్టేందుకు అనుమతించే విషయాన్ని పరిశీలించాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరబోతోంది.

తెరుచుకోనున్న విశాఖ మెట్రో టెండర్లు: విశాఖ మెట్రో ప్రాజెక్టుకు కేంద్రం పచ్చజెండా ఊపడంతో పనులకు పిలిచిన టెండర్లు తెరిచేందుకు మార్గం సుగమమైంది. రెండు నగరాల్లోనూ పనులకు టెండర్లు పిలిచినా డీపీఆర్‌లు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నందున అధికారులు ఇప్పటివరకు టెండర్లు తెరవలేదు.

పోలవరానికి సహకరించండి





కేంద్ర మంత్రులు మనోహర్‌లాల్ ఖట్టర్, అశ్వినీ వైష్ణవ్‌లకు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న సీఎం చంద్రబాబు



కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు వేంకటేశ్వరస్వామి ప్రతిమ అందిస్తున్న సీఎం



కేంద్ర మంత్రి కుమారస్వామికి జ్ఞాపిక అందజేస్తున్న సీఎం

(మొదటి పేజీ తరువాయి)

పోలవరం- నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టుకు జాతీయ నదుల అనుసంధాన విధానంలో భాగంగా అనుమతులు మంజూరు చేయాలి. దీనికి ఆర్థిక సాయం అందించాలి. ఆంధ్రప్రదేశ్- ఒడిశా మధ్య వంశధార నీటి వివాదాన్ని పరిష్కరిస్తూ వంశధార ట్రైబ్యునల్ ఇచ్చిన తీర్పును గెజిట్‌లో ప్రచురించి, ఆ నదిపై నిర్మించ తలపెట్టిన నేరడి బ్యారేజ్ నిర్మాణానికి మార్గం సుగమం చేయాలి. గోదావరి జలాల పంపకంపై ఏపీ- తెలంగాణ మధ్య వివాద పరిష్కారానికి గోదావరి నీటి వివాదాల ట్రైబ్యునల్‌ను వెంటనే ఏర్పాటు చేయాలి. ఎగువ కృష్ణాపై ఆలమట్టి డ్యామ్ ఎత్తు పెంపునకు కర్ణాటక ప్రభుత్వం చేపట్టిన చర్యలను అడ్డుకోవాలి' అని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ఈ నెల 1న ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు వర్తించే పథకాలు, ప్రాజెక్టులు, నిధులు, ఆర్థిక సాయం గురించి చర్చించేందుకు చంద్రబాబు దిల్లీకి వచ్చారు. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏడుగురు కేంద్ర మంత్రులతో విడివిడిగా భేటీ అయ్యారు.

అమరావతికి చట్టబద్ధతతో అభివృద్ధికి ఊతం

హోం మంత్రి అమిత్‌షాతో సమావేశమైన చంద్రబాబు పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించే అంశంపై చర్చించారు. దానివల్ల పెట్టుబడిదారుల్లో విశ్వాసం పెరిగి అమరావతి, చుట్టుపక్కల ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందడానికి వీలవుతుందని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక, రాజకీయ పరిస్థితులు, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలను అమిత్‌షాకు వివరించారు.

రెవెన్యూ లోటు గ్రాంటుకు ప్రత్యామ్నాయం చూపండి


ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీలో ఆర్థిక వనరులపై సీఎం ప్రధానంగా చర్చించారు. 16వ ఆర్థిక సంఘం రెవెన్యూ లోటు గ్రాంట్ల విధానాన్ని రద్దు చేయడంతో ఏపీ తీవ్రంగా నష్టపోతోందని, ఆ లోటును భర్తీ చేసేందుకు కేంద్రం ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ఆర్థిక సాయమందించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ సంస్కరణలు అమలు చేసినందుకు రాష్ట్రానికి రావాల్సిన ప్రోత్సాహకాలను వెంటనే విడుదల చేయాలని విన్నవించారు. మూలధన వ్యయం కోసం కేంద్రం వడ్డీ లేని రుణాల కింద అందిస్తున్న ప్రత్యేక సాయాన్ని పెంచాలని కోరారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలు వివిధ కేంద్ర శాఖల్లో పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే తెప్పించుకొని 2025-26 ఆర్థిక సంవత్సరం చివరి విడత నిధులు వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. పూర్వోదయ పథకం మార్గదర్శకాలను త్వరగా ఖరారు చేసి, దాని కింద రాష్ట్రానికి నిధులు ఇవ్వాలని కోరారు.

ఆర్సెలార్ మిత్తల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు సహకరించండి

భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని కలిసిన చంద్రబాబు వైజాగ్ స్టీల్ ప్లాంట్ తాజా పరిస్థితిని వివరించారు. కేంద్రం ఇచ్చిన చేయూతతో జనవరిలో ఆ సంస్థ లాభాలు నమోదు చేసిందన్నారు. ఆర్సెలార్ మిత్తల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వపరంగా చేయూతనివ్వాలని కోరారు.

స్వచ్ఛభారత్ కింద ఏపీకి నిధులివ్వండి

ఆంధ్రప్రదేశ్‌ను బహిరంగంగా వ్యర్థాల గుట్టలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నందున అందుకు అవసరమైన ఆర్థిక సాయాన్ని స్వచ్ఛభారత్ మిషన్ కింద అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు విజ్ఞప్తి చేశారు. వ్యర్థాల నిర్వహణ, స్వచ్ఛభారత్ మిషన్ 2.0 కింద రూ.276 కోట్లతో డంపింగ్ యార్డులు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. దీనికి కేంద్ర వాటాగా రూ.105 కోట్లు మంజూరు చేయాలని కోరారు.



పార్లమెంట్ వద్ద రాష్ట్రానికి చెందిన కూటమి ఎంపీలతో ముఖ్యమంత్రి చంద్రబాబు



సీఎం చంద్రబాబును సన్మానించిన కేంద్ర మంత్రి కుమారస్వామి. చిత్రంలో శ్రీనివాసవర్మ

ఏప్రిల్ 1 నుంచి దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు

మంగళవారం సాయంత్రం 1-జన్‌పథ్‌లోని తన నివాసానికి వచ్చిన రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలోని రైల్వే ప్రాజెక్టుల గురించి చర్చించారు. బడ్జెట్‌లో ఏపీ మీదుగా మూడు హైస్పీడ్ రైల్ కారిడార్లను ప్రకటించినందుకు ధన్యవాదాలు తెలిపారు. బెంగళూరు- చెన్నై హైస్పీడ్ రైల్ కారిడార్‌ను తిరుపతితో కలపాలని విజ్ఞప్తి చేశారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యేలా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు.

- భవిష్యత్ అవసరాల దృష్ట్యా విశాఖలో డబుల్ డెక్కర్ మెట్రో రైల్ ఏర్పాటు ప్రతిపాదనను పరిశీలించాలి.
- అరటి ఎగుమతులకు వీలుగా తాడిపత్రి నుంచి ముంబయి జేఎన్‌పీటీ పోర్టుకు 50 శాతం రాయితీపై ఖాళీ కంటెయినర్లు కేటాయించాలి.
- విజయవాడ, విశాఖ, తిరుపతి, అమరావతిలలో గ్రీన్ ఫీల్డ్ మెగా కోచింగ్ టెర్మినళ్లు ఏర్పాటు చేయాలి.
- ఉత్తర- దక్షిణ భారతాలను కలిపేలా ఇటార్సీ- విజయవాడ మధ్య ప్రత్యేక సరకు రవాణా కారిడార్ ఏర్పాటుకు సహకారం అందించాలి.
- ఏపీలోని పోర్టులను అనుసంధానిస్తూ విజయవాడ మీదుగా ఖరగ్‌పుర్- చెన్నై మధ్య ఈస్ట్ కోస్ట్ ఫ్రైట్ కారిడార్ ఏర్పాటు చేయాలి.
- రాయలసీమ సహా గిరిజన ప్రాంతాలను అనుసంధానించేలా కొత్త రైల్వే మార్గాల ప్రతిపాదనల్ని ఆమోదించాలి.
- విశాఖ- విజయవాడ మధ్య హైస్పీడ్, విజయవాడ- కర్నూలు మధ్య సెమీ హైస్పీడ్, తిరుపతి- చిత్తూరు మధ్య హైస్పీడ్ లింక్ కారిడార్ మంజూరు చేయాలి.
- హైదరాబాద్-శ్రీశైలం-మార్కాపురం కొత్త రైల్వే లైన్ ద్వారా శ్రీశైలానికి కనెక్టివిటీని పెంచాలి.
- తిరుపతి మీదుగా విజయవాడ- బెంగళూరు మధ్య వందేభారత్ సర్వీసు నడపాలి.

'కుక్ స్ట్రైట్'ను ఈదిన తల్లి, కుమారుడు



స్టీఫెన్ కుమార్, క్వీనీ విక్టోరియా

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా ఉండవల్లిలోని ఆక్వాడెవిల్స్ సంక్షేమ సంఘం గౌరవ సభ్యురాలు హైదరాబాద్‌కు చెందిన గంధం క్వీనీ విక్టోరియా (45), ఆమె కుమారుడు స్టీఫెన్‌కుమార్ (22) ఈ నెల 9న న్యూజిలాండ్‌లోని 'కుక్ స్ట్రైట్' ఛానెల్‌ని విజయవంతంగా ఈదారని ఆక్వాడెవిల్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు లింగిపల్లి రామకృష్ణ, కార్యదర్శి యార్లగడ్డ రమేష్‌కుమార్ తెలిపారు. స్విమ్ పైలట్ ఎర్స్కిన్ గ్రాంట్ ఆర్చర్డ్ సూచనలతో, క్రూ సభ్యుడు ఆరన్ బ్లాక్‌మోర్, క్రిస్టిన్ పర్యవేక్షణలో దక్షిణ న్యూజిలాండ్ నుంచి ఉత్తర న్యూజిలాండ్ వరకు గల 27.4 కి.మీ. కుక్ స్ట్రైట్ జలసంధిని 8 గంటల 47 నిమిషాల్లో పూర్తిచేశారని పేర్కొన్నారు. 'స్టాండింగ్ ఎగైనెస్ట్ డ్రగ్ అబ్యూజ్' అనే సామాజిక సందేశంతో ఈ కార్యక్రమాన్ని తల్లీకుమారులు చేపట్టారని వివరించారు. గతంలో వారిద్దరూ ఇంగ్లిష్ ఛానల్ (ఫ్రాన్స్), కాటలినా ఛానల్ (అమెరికా)ను కూడా ఈదారని గుర్తుచేశారు.

ఈ సంపదలు అవసరం



ప్రతి వ్యక్తికి ఐదు రకాల సంపదలు అవసరం. అవి.. 1. ఆర్థిక సంపద (డబ్బు) 2. సామాజిక సంపద (పరువుప్రతిష్ఠలు) 3. సమయ సంపద (స్వేచ్ఛ) 4. శారీరక సంపద (ఆరోగ్యం) 5. ఆధ్యాత్మిక సంపద (ప్రశాంతమైన మనసు). వీటిలో కనీసం నాలుగింటినైనా కలిగి ఉండాలి.

– వాలా అఫ్సర్, కాలమిస్టు

ఉన్నత విద్యా కమిషన్ ఏర్పాటుపై అధ్యయనానికి

జాయింట్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా పురందేశ్వరి

ఈనాడు, దిల్లీ: వికసిత భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు అధ్యయన పార్లమెంటు జాయింట్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా పురందేశ్వరి నియమితులయ్యారు. ఉన్నత విద్యారంగం నియంత్రణకు యూజీసీ, ఏఐసీటీఈ, ఎన్‌సీటీఈల స్థానంలో కొత్తగా ఉన్నత విద్యా కమిషన్ ఏర్పాటు చేయాలని కేంద్రం భావిస్తోంది. ఇందుకు కేంద్ర విద్యాశాఖ డిసెంబర్‌లో పార్లమెంటులో ప్రవేశపెట్టిన వికసిత భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు అధ్యయనం కోసం ఉభయ సభల సభ్యులతో జాయింట్ కమిటీ ఏర్పాటు చేస్తూ లోక్‌సభ సచివాలయం మంగళవారం బులిటెన్ విడుదల చేసింది. ఈ కమిటీకి రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరిని ఛైర్‌పర్సన్‌గా నియమిస్తున్నట్లు అందులో పేర్కొంది. రాజ్యసభ నుంచి 10 మంది, లోక్‌సభ నుంచి 21 మంది సభ్యులతో ఈ కమిటీ ఏర్పాటైంది. ఇందులో విశాఖ ఎంపీ శ్రీభరత్ (తెదేపా), తెలంగాణలోని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ (కాంగ్రెస్) సభ్యులుగా నియమితులయ్యారు.

కల్తీ నెయ్యి కేసులో ఈడీ దర్యాప్తు ముమ్మరం

- అపూర్వ చావ్డా నుంచి రూ.19.86 కోట్లు చివరిగా ఎవరికి చేరాయనే కోణంలో దర్యాప్తు

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా చేసిన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తు ముమ్మరం చేసింది. పామాయిల్, పామ్‌కెర్నెల్ ఆయిల్‌లో పలు రసాయనాలు కలిపి తయారుచేసిన మిశ్రమాన్నే నెయ్యి పేరిట తితిదేకు సరఫరా చేసి రూ.235 కోట్లు కొల్లగొట్టిన వ్యవహారంలో హవాలా ద్వారా భారీ మొత్తాల్లో చెల్లింపులు జరిగినట్లు సీబీఐ నేతృత్వంలోని సిట్ దర్యాప్తులో తేలడంతో... మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్టు (ఈసీఐఆర్) నమోదుచేసి ఈడీ రంగంలోకి దిగింది. సిట్ అధికారుల నుంచి 36 మంది నిందితుల వివరాలు, రిమాండ్ రిపోర్టులు తీసుకున్న ఈడీ అధికారులు.. వాటిని విశ్లేషించి నిందితులందరికీ నోటీసులివ్వాలని నిర్ణయించారు.

- భోలేబాబా డెయిరీ డైరెక్టర్లు పొమిల్ జైన్, విపిన్ జైన్‌లు.. విజయవాడలోని భరత్‌భాయ్ ఠాకుర్, చెన్నైలోని మదరం దేవాసి, హైదరాబాద్‌లోని అర్జున్ గోస్వామి, గుజరాత్‌లోని లాల్‌భాయ్ పటేల్, దిల్లీలోని ఆశిష్ అగర్వాల్, రాధేశ్యామ్ ఓఝా, రిషబ్ జైన్, గ్వాలియర్‌లోని గోపాల్ వాధ్వా అనే హవాలా ఏజెంట్ల ద్వారా అక్రమ కార్యకలాపాలు నిర్వహించినట్లు ఇప్పటికే సిట్ దర్యాప్తులో తేలింది. హవాలా ఏజెంట్లు భరత్‌భాయ్ ఠాకుర్, మదరం దేవాసిలు తిరుపతిలోని వైష్ణవి డెయిరీ సీఈవో అపూర్వ వినయ్‌కాంత్ చావ్డా నివాసానికి పలుమార్లు వెళ్లి రూ.19.86 కోట్లు చెల్లించినట్లు వెల్లడైంది. అపూర్వ చావ్డా నుంచి ఆ నిధులు ఎక్కడికి వెళ్లాయి? అంతిమంగా ఎవరికి చేరాయనే కోణంలో ఈడీ దర్యాప్తు చేస్తోంది.
- నెయ్యి సరఫరా టెండరు లభించేలా చేసినందుకు నాటి పాలకమండలి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పీఏ కె.చిన్నప్పన్నకు ప్రీమియర్ అగ్రిఫుడ్స్ ఎండీ జగ్‌మోహన్ గుప్తా హవాలా మార్గాల్లో రూ.50 లక్షలు చెల్లించినట్లు సిట్ దర్యాప్తులో తేలింది. వారి మధ్య ఇంకా లావాదేవీలు కొనసాగాయా అనేదానిపై ఈడీ దృష్టిపెట్టింది.

స్పీకర్‌పై అవిశ్వాసం

(మొదటి పేజీ తరువాయి)

ఎంపీలను సస్పెన్షన్‌లో ఉంచడం.. ఈ మూడింటికి నిరసనగా స్పీకరుపై అవిశ్వాసాన్ని ప్రవేశపెట్టాలని విపక్షం తీర్మానించింది. కొందరు కాంగ్రెస్ ఎంపీలు ప్రధానమంత్రి సీటు వద్దకు వెళ్లి అవాంఛనీయ ఘటనలకు పాల్పడవచ్చన్న పక్కా సమాచారంతో సభకు రావద్దని ప్రధానికి తానే సూచించినట్లు స్పీకర్ ఇటీవల చెప్పడం కూడా ప్రతిపక్షాలకు ఆగ్రహం కలిగించింది.

మాట్లాడే అవకాశమే ఇవ్వడం లేదు: గొగొయ్

మీడియాతో గౌరవ్ గొగొయ్ మాట్లాడుతూ.. సభలో ప్రతిపక్ష సభ్యులకు మాట్లాడే అవకాశమే ఇవ్వడం లేదని, ప్రజా సమస్యలు లేవనెత్తే హక్కును పదేపదే నిరాకరిస్తున్నారని ఆరోపించారు. స్పీకర్‌పై వ్యక్తిగత గౌరవం ఉన్నా అసాధారణ పరిస్థితుల్లోనే అవిశ్వాస తీర్మానం తీసుకురావాల్సి వచ్చిందని కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్ ఎక్స్‌లో పేర్కొన్నారు. చాలా సందర్భాల్లో రాహుల్‌గాంధీ మాట్లాడేందుకు అనుమతి ఇవ్వడం లేదని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. న్యాయసమ్మతమైన ప్రజా సంబంధిత అంశాలు లేవనెత్తనీయకుండా స్పీకర్ తమను అడ్డుకుంటున్నారని విమర్శిస్తున్నాయి. విపక్ష నేతలు ముందుగా రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే కార్యాలయంలో సమావేశమై నోటీసుపై తుది నిర్ణయం తీసుకున్నారు. తొలుత ఇచ్చిన నోటీసును మధ్యాహ్నం వెనక్కి తీసుకుని, తేదీని సరిచేసి మరొకటి ఇచ్చారు. నోటీసును పరిశీలించి నిబంధనల మేరకు తగిన చర్యలు చేపట్టాలని సెక్రటరీ జనరల్‌ను స్పీకర్ ఆదేశించారు. విరామం తర్వాత జరిగే రెండో విడత సమావేశాల్లో మార్చి 9న ఇది సభ పరిశీలనకు రానుందని సమాచారం. తీర్మానం చర్చకు వస్తే స్పీకర్ తన వాదన వినిపించేందుకు అవకాశం లభిస్తుంది. ముందుగా స్పీకర్‌కు లేఖరాసి అభ్యంతరాలను తెలియజేయాలని, 2-3 రోజుల్లో స్పందన రాకపోతే అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టవచ్చని తృణమూల్ కాంగ్రెస్ అభిప్రాయం.

బడ్జెట్‌పై మొదలైన చర్చ

లోక్‌సభలో మంగళవారం విపక్ష నిరసనలు కొనసాగాయి. సభాపతి స్థానాన్ని విపక్ష సభ్యులు చుట్టుముట్టి ఆందోళన వ్యక్తంచేశారు. మధ్యాహ్నం తర్వాత బడ్జెట్‌పై చర్చను ప్రారంభించగలిగారు. రాత్రి 8 గంటల వరకు పలువురు సభ్యులు మాట్లాడారు. భాజపాయేతర పార్టీల ఏలుబడిలో ఉన్న రాష్ట్రాలకు కేంద్రం నిధులు ఇవ్వడం లేదని తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, శివసేన (యూబీటీ) సభ్యులు ఆరోపించారు. పేదల్ని దోచుకుని కుబేరులకు రాయితీలు ఇస్తున్నారని విమర్శించారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం మధ్యాహ్నం మాట్లాడే అవకాశం ఉంది. చర్చను విపక్ష నేత రాహుల్‌గాంధీ ప్రారంభించాలని పలువురు విపక్షనేతలు కోరుకున్నా తాను అలాచేస్తే అధికారపక్షం 'కల్పిత అవాంతరాలతో' కీలకచర్చను పక్కదారి పట్టిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. బుధవారం ఆయన మాట్లాడే అవకాశం ఉంది.

రాహుల్‌ను, కాంగ్రెస్‌ను అభిశంసించాలి: భాజపా

స్పీకర్‌ను కాకుండా రాహుల్‌ను, కాంగ్రెస్‌ను అభిశంసించాల్సి ఉందని భాజపా పేర్కొంది. తమ 'అంతరాత్మ అభిశంసనకు' గురైనవారు రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్న అందరినీ అభిశంసించాలంటున్నారని పార్టీ జాతీయ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర విలేకరుల సమావేశంలో చెప్పారు. అమెరికా బిలియనీర్ జార్జి సోరోస్ ఒత్తిడి మేరకు రాజ్యాంగ సంస్థలపై కాంగ్రెస్- మిత్రపక్షాలు దాడులకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. ప్రధానికి సభలోనే హాని తలపెట్టేందుకు రాహుల్ ప్రోద్బలంతో ఘెరావ్ పేరిట ప్రయత్నాలు జరిగాయని చెప్పారు.

స్పీకర్‌ను కొనియాడుతూ భాజపా మహిళా ఎంపీల లేఖ!

మరోవైపు.. ఈ నెల 4న సభలో దుందుడుకుగా ప్రవర్తించిన ఎంపీలపై సాధ్యమైనంత కఠిన చర్యలు చేపట్టాలని భాజపా మహిళా ఎంపీలు లోక్‌సభ స్పీకర్‌ను కోరారు. తీవ్రమైన, అవాంఛిత పరిణామాలకు దారితీసి, ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి అధ్యాయంగా మిగిలే పరిణామాలు తలెత్తవచ్చనే ఆందోళన కలుగుతోందని చెప్పారు. ఈ మేరకు ఒక లేఖ రాశారు. సభ హుందాతనాన్ని కాపాడటంలో స్పీకర్ అసాధారణంగా వ్యవహరించారని కొనియాడారు. పార్టీలకు అతీతంగా నిష్పాక్షికంగా ఆయన అన్ని పార్టీలవారికీ అవకాశం కల్పిస్తున్నారని చెప్పారు.

ఈనాడు

రుణ వసతుల విస్తరణే మార్గం

పరిమాణంలో చిన్నవైనా భారత ఆర్థిక వ్యవస్థకు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్‌ఎంఈ) పరిశ్రమలు పెద్ద దన్నుగా నిలుస్తున్నాయి. దేశీయ తయారీ రంగంలో 35శాతం వాటా వాటిదే. దాదాపు 48శాతం ఎగుమతులకు ఎంఎస్‌ఎంఈలే ఆధారం. సాగురంగం తరవాత అత్యధిక సంఖ్యలో ప్రజానీకానికి అవే ఉపాధి కల్పిస్తున్నాయి. ఆసేతు హిమాచలం 7.47 కోట్ల ఎంఎస్‌ఎంఈలు సుమారు 33కోట్ల మందికి జీవనాధారాలుగా నిలుస్తున్నాయి. సరఫరా గొలుసులను బలపరుస్తూ ప్రాంతీయ సమ్మిళిత ప్రగతికీ తోడ్పడుతున్న ఎంఎస్‌ఎంఈల అభివృద్ధికి కేంద్రం ముద్ర యోజన, పీఎం ఉద్యోగ కల్పన కార్యక్రమం, క్రెడిట్ గ్యారంటీ స్కీమ్ వంటివెన్నో తెచ్చింది. చిన్న సంస్థలను ఛాంపియన్లుగా తీర్చిదిద్దేందుకు ఇటీవలి బడ్జెట్‌లోనూ ప్రత్యేక వ్యూహాలను ప్రతిపాదించింది. ప్రధానంగా వాటి వృద్ధికి ఊతమిచ్చేందుకు రూ.10వేల కోట్ల నిధిని ఏర్పరచింది. ఏ సంస్థ అయినా ఆటంకాలు లేకుండా కార్యకలాపాలు సాగించాలంటే తగినంత మూలధనం తప్పనిసరి. దానికి లోటు లేకుండా చూసేందుకు ఎంఎస్‌ఎంఈలకు పూచీకత్తు లేకుండా మంజూరు చేసే రుణ పరిమితిని ఆర్‌బీఐ తాజాగా రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచింది. ఇది హర్షణీయమే అయినప్పటికీ, ఎంఎస్‌ఎంఈలు బలోపేతం కావాలంటే వాటిని పట్టిపీడిస్తున్న మరికొన్ని సమస్యలనూ పరిష్కరించాలి!

దేశంలోని మొత్తం పరిశ్రమల్లో తొంభై శాతానికి పైగా ఎంఎస్‌ఎంఈలే. వాటిలో సగానికి పైగా గ్రామీణ ప్రాంతాల్లోనే పనిచేస్తున్నాయి. దాదాపు 20 శాతం సంస్థలు మహిళల సారథ్యంలో నడుస్తూ వారి సాధికారతకు బాటలు వేస్తున్నాయి. కానీ, తగిన పరపతి కొరవడి వేగంగా విస్తరించలేకపోతున్నాయి. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం 2020-24 మధ్య సూక్ష్మ, చిరు సంస్థలకు ప్రభుత్వ బ్యాంకుల నుంచి రుణవసతి 14శాతం నుంచి 20శాతానికి, మధ్య స్థాయి సంస్థలకు 4శాతం నుంచి 9శాతానికి పెరిగింది. కానీ, అదే సమయంలో దేశీయంగా 19శాతం ఎంఎస్‌ఎంఈలకే వ్యవస్థాగత మార్గంలో అప్పులు పుడుతున్నాయి. వాస్తవ అవసరాలతో పోలిస్తే ఆయా సంస్థలు రూ.30 లక్షల కోట్ల మేర రుణ వసతి కొరతను ఎదుర్కొంటున్నాయి. అప్పు కోసం బోలెడన్ని పత్రాలు సమర్పించాల్సి వస్తుండటం, ఒకవేళ అంతా బాగున్నా రుణాల మంజూరులో ఎడతెగని జాప్యం, అధిక వడ్డీరేట్లు వంటివన్నీ ఎంఎస్‌ఎంఈలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. వాటి ఎదుగుదలను అడ్డుకుంటున్నాయి!

చుక్కలనంటుతున్న ఉత్పత్తి వ్యయాలను భరిస్తూ సరకులు తయారు చేస్తున్నా, కొనుగోలుదారుల నుంచి ఎంఎస్‌ఎంఈలకు సకాలంలో చెల్లింపులు మృగ్యమవుతున్నాయి. ఇటీవలి ఆర్థిక సర్వే ప్రకారం రూ.8లక్షల కోట్ల వరకు బకాయిలు అలా పేరుకుపోయాయి. ఆధునిక సాంకేతికతలు, కొత్త మార్కెట్లను ఒడిసిపట్టడంలో వెనకబాటుతనం, మౌలిక సదుపాయాలూ నిపుణ సిబ్బంది లేమి సైతం చిరు సంస్థల ప్రగతి వెలుగులను మసకబారుస్తున్నాయి. వ్యవసాయంలో సంక్షోభ పరిస్థితులతో నగరాలకు వలసలు పెరుగుతున్నాయి. అక్కడ మౌలిక సదుపాయాలు లోపించి జనజీవితాలు నరకమయం అవుతున్నాయి. ఈ దుర్భర స్థితిని నివారించి, యువతకు స్థానికంగా ఉపాధి కల్పించాలంటే- పెద్ద కంపెనీలకు దీటుగా ఎంఎస్‌ఎంఈలకు ప్రభుత్వాలు అండదండలు అందించాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన సాంకేతికతలను అందిపుచ్చుకుంటూ ఆ సంస్థలు నిలదొక్కుకునేందుకు తగిన సహాయం చేయాలి. ఈ-కామర్స్ ద్వారా ఎగుమతులకు కొత్త ద్వారాలు తెరవాలి. ఈ మేరకు త్వరితగతిన చర్యలు చేపడితే భారత్‌లో తయారీ జోరందుకుని దేశ ఆర్థిక ప్రస్థానం మరింత వేగవంతమవుతుంది!




మన సామర్థ్యం ఏంటో తెలియాలంటే మనకు మనమే పరీక్ష పెట్టుకోవాలి. పరిమితులను ఎంతవరకు ఛేదించగలమో, ఎంత వైవిధ్యంగా ఆలోచించగలమో చూడాలి. అప్పుడే మనమేంటో మనకు తెలుస్తుంది.

– దీపక్ ఓబ్రాయ్, వ్యాపారవేత్త

అమూల్య వరం

మనిషి ముఖం నుంచి 'అగ్ని' వాగ్రూపంలో వెలువడుతోందని ఐతరేయోపనిషత్తు పేర్కొంటోంది. మాట అగ్ని అంతటి పవిత్రమైనదీ ప్రమాదకరమైనదీ కూడా. అందుకే, కాలుజారితే కూడదీసుకోగలం కానీ, నోరుజారితే వెనక్కి తీసుకోలేమంటారు పెద్దలు!

బాలవాక్కు, బ్రహ్మవాక్కు, రుషివాక్కు, వేదవాక్కు అని రూపాంతరాలున్నాయి. నిష్కపటమైన, మనోహరమైన, ముద్దులొలికే సత్యాన్ని పలికేది బాలవాక్కు. బ్రహ్మజ్ఞానుల నోట వెలువడే శుభప్రదమైనదీ శ్రేయస్కరమైనది బ్రహ్మవాక్కు. సర్వసంగ పరిత్యాగులైనవారు పరులహితం, అభ్యున్నతి కోరుతూ చేసే ప్రవచనాలను రుషి వాక్కులంటారు. సర్వకాల సర్వావస్థల్లోనూ మానవాళికి దశ, దిశ నిర్దేశించేవి వేదవాక్కులు. బ్రహ్మ, రుషి, వేదవాక్కులు అందరికీ అనుసరణీయాలు. అవి సకలజనావళికీ ఆమోదకరమైనవి. సర్వతోముఖాభివృద్ధికి దోహదపడేవి.



అంతర్యామి

మాట ఎలా ఉండాలో, వాగ్రూపం ఏవిధంగా ఉంటుందో, ఎటువంటి వాక్కు ఆహ్లాదకరమైనదో స్మృతులు చెబుతున్నాయి. సముచిత నియమాలు పాటిస్తే సత్ఫలితాలను సాధించగలం. మాట ఎప్పుడూ మృదువుగా, మంగళప్రదంగా, మనోహరంగా, మర్యాద పూర్వకంగా ఉండాలి.

'నా కోరిక ఏదైనా అది సత్యమే అయిఉండి, ఆ సత్యవచనమే నన్ను అన్నివేళలా సంపూర్ణంగా సంరక్షించుగాక' అని రుగ్వేద మంత్ర సారాంశం. ఏ జాతి వారైతే సత్యభావనతో ఉంటారో, ఉత్సాహవంతులై సత్సాంగత్యం, పురుషార్థాల వల్ల సత్య విజ్ఞానాలను సంపాదించుకుంటారో, వారు సుఖశాంతులతో వర్ధిల్లుతారని 'యజుర్వేదం' చెబుతోంది. 'సత్యమే పలుకుతాను, అసత్యం పలకను. సత్యం ఆధారంగానే ఈ భూమి ఉన్నది' అని అధర్వణ వేదమంత్రాలు ఘోషిస్తున్నాయి. సత్య వాక్పరిపాలనకు కట్టుబడిన బలి చక్రవర్తి, హరిశ్చంద్రుడు చరితార్థులయ్యారు. మానవజాతికి స్ఫూర్తిప్రదాతలుగా నిలిచారు. మహాభక్తుడైన ప్రహ్లాదుడు ఎన్నడూ అసత్యమాడలేదంటూ అతడి వ్యక్తిత్వాన్ని 'మహాభాగవతం'లో కీర్తించాడు పోతన.

తమ వాక్కులను పవిత్రంగా ఉంచుకునే ప్రయత్నంలో, కొందరు సాధకులు నిత్యం భగవన్నామస్మరణ చేస్తుంటారు. ముకుందమాలలో కులశేఖరు ఆళ్వారు, భాగవతంలో పోతన, శివానందలహరిలో శంకరాచార్యులు 'వాక్' ప్రశస్తిని వివరించారు. పవిత్రమైన వాక్ నిర్మాణం కోసం తాపత్రయపడ్డారు. 'ఓ స్వామీ! నా వాక్కులతో నిన్నే ప్రార్థిస్తున్నాను. నా మనసు నీ పాదపద్మాలపైనే లగ్నమగుగాక! నా మాటలు నిన్నే స్తుతించుగాక' అంటూ వారు తన్మయమైన వాక్కులను ఎలా ఉచ్చరించాలో తెలిపిన సన్నివేశాలు కోకొల్లలు. భగవద్గీతా వాక్యం ప్రకారం, జ్ఞానం అన్నింటికంటే పవిత్రమైనది. జ్ఞానంతో సుసంపన్నమైన వాక్కు అంతకంటే పవిత్రమైనది. దానివల్ల మిత్రత్వం ఏర్పడుతుంది. సర్వమానవ సౌభ్రాతృత్వం సిద్ధిస్తుంది. సంస్కారవంతమైన పలుకులు అలవడాలంటే మంచి సాంగత్యం, దానితోపాటు చక్కటి అభ్యాసం కావాలి. సద్గురువుల చెంత చేరినప్పుడు జడులుగా ఉన్నవారు సైతం చివరికి లోకకల్యాణ భావనలు అలవరచుకుని జ్ఞానవంతులై ప్రకాశిస్తారు. వారి నోట ఎన్నడూ అమంగళ వచనాలు, పరుష వాక్యాలు రావు. వాగ్భూషణమే వారికి అలంకారమవుతుంది. వాక్కును మించిన ఆభరణం మరేదీ లేదు.

– కర్లపాలెం హనుమంతరావు



ప్రమాణాలు పాటిస్తేనే లాభం!

మిత్రులు, ప్రత్యర్థులనే తేడా లేకుండా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అందరి మీదా సుంకాల కొరడాను ఝళిపించడం భారత్, ఐరోపా సమాఖ్య(ఈయూ)లను దగ్గర చేసింది. ఇరుపక్షాల నడుమ రెండు దశాబ్దాలుగా నలుగుతున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ)పై సంతకాలు పూర్తయ్యాయి. అయితే, ఈ ఒప్పందం వల్ల భారత్, ఈయూలకు ఎలాంటి ప్రయోజనాలు ఒనగూడతాయి? మన సేద్య రంగంపై ఎలాంటి ప్రభావం ఉండబోతుంది?

భారత్, ఐరోపా సమాఖ్యలు కలిసి సుమారు 200 కోట్ల జనాభా, ప్రపంచ జీడీపీలో 25శాతం వాటాతో సువిశాల విపణిగా నిలుస్తున్నాయి. ఇప్పుడు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ)తో రెండు పక్షాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, సరఫరాలు మరింత ఊపందుకుంటాయి. 99శాతం భారతీయ ఎగుమతులు, 97శాతం ఈయూ ఎగుమతులపై సుంకాలు తగ్గుతాయి. 2024-25లో ఇండియా-ఈయూ మధ్య సరుకుల వాణిజ్యం విలువ 13,650 కోట్ల డాలర్లు(రూ.11.9లక్షల కోట్లు). అందులో భారత్ నుంచి ఈయూకు ఎగుమతైన వాటి విలువ 7,590 కోట్ల డాలర్లు. నిజానికి భారత్, ఈయూల మార్కెట్ పరిమాణం 24లక్షల కోట్ల డాలర్లని అంచనా. దీన్నిబట్టి చూస్తే, ద్వైపాక్షిక వాణిజ్యం మరింత వృద్ధి చెందడానికి అవకాశముందన్న మాట. ఇప్పుడు ఎఫ్‌టీఏ ఈ అంశాన్నే ప్రధానంగా కేంద్రీకరిస్తోంది. ఉభయ పక్షాల మేధా హక్కుల రక్షణకూ ఎఫ్‌టీఏలో ఏర్పాట్లు ఉన్నాయి. భారతీయ సంప్రదాయ విజ్ఞాన డిజిటల్ గ్రంథాలయాన్ని ఈయూ గుర్తించి సాంకేతిక సహకారం అందిస్తుంది.

ఈయూకు ఇవీ ప్రయోజనాలు


తాజా ఒప్పందంతో అనేక ఈయూ వ్యవసాయ ఉత్పత్తులపైనా, ప్రాసెస్ చేసిన ఆహార ఎగుమతుల మీద భారత్ సుంకాలు తగ్గించడమో, తొలగించడమో చేస్తుంది. ఈయూ దేశాలు పంపే ఆలివ్, ఇతర వంట నూనెల మీద ప్రస్తుతం విధిస్తున్న 45శాతం సుంకాలను ఎత్తివేస్తుంది. పండ్ల రసాలు, ఆల్కహాల్ లేని బీర్లపై విధిస్తున్న 55శాతం సుంకాలను తొలగిస్తుంది. ఈయూ నుంచి వచ్చే గొర్రె, మేక మాంసాల మీద విధిస్తున్న 33శాతం పన్ను సైతం రద్దవుతుంది. రొట్టె, పాస్తా, చాక్లెట్లు, బిస్కట్లపై గతంలో 50శాతం వరకు సుంకాలు విధించేవారు. ఇప్పుడు వాటిని ఎత్తివేస్తారు. ఇక ఐరోపా దేశాల నుంచి ఎగుమతయ్యే మద్యాల మీద సుంకాలను దశలవారీగా తగ్గిస్తారు. ప్రీమియం వైన్ రకాల మీద సుంకాలు 150 నుంచి 20శాతానికి, మధ్య శ్రేణి వైన్ల మీద 30శాతానికి తగ్గుతాయి. బ్రాందీ, విస్కీ, వోడ్కాల వంటి మద్యాలపై సుంకాలు 150శాతం నుంచి 40శాతానికి దిగివస్తాయి. ఫలితంగా భారత్‌కు ఈయూ దేశాల నుంచి శుద్ధి చేసిన ఆహారాలు, మద్యాల ఎగుమతులు పెరుగుతాయి. వాటివల్ల ఈయూలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. అదే సమయంలో భారత్ ఎగుమతి చేసే పంచదార, బక్‌వీట్, ఇథనాల్, బియ్యం, గోధుమలు, గొడ్డు మాంసం, పాల పొడులు, అరటి, తేనెలకు ఈయూ ఎలాంటి రాయితీలూ ఇవ్వదు. భారతీయ వ్యవసాయ, ప్రాసెస్డ్ ఆహారోత్పత్తులకు పారిశుద్ధ్య ప్రమాణాలను వర్తింపజేస్తుంది.



ఈయూలోని ఉన్నతాదాయ వర్గాల కోసం భారత్ ఎగుమతి చేసే కాఫీ, తేయాకు, మసాలా దినుసులు, ద్రాక్ష, ఘెర్కిన్స్, ఉల్లి పొడి, కొన్ని రకాల ప్రాసెస్డ్ ఆహారానికి ప్రాధాన్యం లభిస్తుంది. భారత్ తన ఆహార ధాన్యాలు, పాడి ఉత్పత్తులు, సోయా, కోళ్ల పరిశ్రమలకు ఈయూ ఎగుమతుల నుంచి ముప్పు లేకుండా చూసుకోవడం హర్షణీయం. ఈయూ ఎగుమతులపై సుంకాల్లో సగాన్ని తక్షణమే తొలగిస్తుంది. మిగిలినవి 5-10 ఏళ్లలో క్రమంగా తొలగిపోతాయి. కొన్ని రకాల పండ్లపై పాక్షికంగా సుంకాలు తగ్గించడం, కోటా ప్రకారం అనుమతులివ్వడం చేస్తుంది. మరోవైపు, ఈయూ హైటెక్ ఉత్పత్తులు భారత్‌కు మరింతగా అందుబాటులోకి వస్తాయి. దీనివల్ల వివిధ దేశాల నుంచి హైటెక్ వస్తువులను దిగుమతి చేసుకునే వెసులుబాటు ఇండియాకు లభిస్తుంది. తద్వారా పారిశ్రామిక, హరిత ఇంధన రంగాలకు సంబంధించిన అంతర్జాతీయ సరఫరా గొలుసుల్లో భారత్ భాగస్వామి కాగలుగుతుంది. విభిన్న అంశాల్లో వీలైనంత వరకూ ఉభయులకూ ప్రయోజనకరంగా ఉండేలా ఎఫ్‌టీఏలో జాగ్రత్తలు తీసుకోవడాన్ని ఇక్కడ గమనించాలి.

రైతులపై అపార ప్రభావం

ఈయూ వ్యవసాయ ఎగుమతులకు భారత్ రాయితీలివ్వడం ఇదే మొదటిసారి. అయితే, అక్కడ అధిక ఉత్పత్తి అయ్యే వ్యవసాయ ఉత్పత్తులు భారత్‌లోకి సుంకాలు లేకుండా రావడానికి ఎఫ్‌టీఏ అనుమతిస్తోందనే ఆక్షేపణలు వ్యక్తమవుతున్నాయి. ఇది మన వ్యవసాయ సరకుల ధరలు పడిపోవడానికి దారితీయవచ్చంటున్నారు. వైన్, బీరు, ఆలివ్ నూనె వంటి అధికవిలువ ఉత్పత్తులను ఇండియాకు పెద్దయెత్తున ఎగుమతి చేయడం ద్వారా ఐరోపా రైతులు అధికాదాయం పొందగలుగుతారు. కానీ, తమ ఎగుమతుల ద్వారా భారతీయ రైతులు కూడా అదే స్థాయిలో లబ్ధి పొందుతారా? అంటే అనుమానమే. తెగుళ్ల బెడద లేని పంట ఉత్పత్తి, ఎగుమతులకు సంబంధించిన ఫైటో శానిటరీ ప్రమాణాలను ఐరోపాలో కచ్చితంగా పాటిస్తారు. మన రైతాంగం ఇంకా ఆ పద్ధతి లేదు. అలాంటి ప్రమాణాలు లేని భారతీయ ఎగుమతులను ఐరోపా అడ్డుకుంటుంది. మన పంటల్లో హానికర రసాయనాలు, పురుగు మందుల అవశేషాలు ఎక్కువగా ఉన్నాయని ఈయూ దేశాలు వాటిని తిరస్కరిస్తున్నాయి. కాబట్టి, ఈయూ ఆహారోత్పత్తులు మన దేశంలోకి నిరాటంకంగా ప్రవేశించగలుగుతాయి కానీ, మన ఉత్పత్తులు అక్కడ వెళ్లడం కష్టమవుతుంది. ఫైటో శానిటరీ ప్రమాణాలను మన రైతులు పాటించడానికి చాలా సమయం పడుతుంది. అంతవరకు మన ఎగుమతులపై ప్రతికూల ప్రభావం తప్పకపోవచ్చు. ఈయూ ప్రభుత్వాలిస్తున్న భారీ సబ్సిడీల వల్ల ఆ దేశాల నుంచి చవకగా వ్యవసాయోత్పత్తులు ఇండియాలోకి వచ్చిపడతాయి. వ్యవసాయ సరకులకు సంబంధించి ఈయూతో కుదుర్చుకున్న నిబంధనల వంటివే తమతో వర్తింపజేయాలని అమెరికా పట్టుబట్టక మానదు. ఇలా అటు అమెరికా, ఇటు ఐరోపా నుంచి ఎదురయ్యే పోటీని మన సాగురంగం ఎంతవరకు తట్టుకుంటుందో చూడాలి!



ఇంద్రశేఖర్ సింగ్
వ్యవసాయ విధానాల విశ్లేషకులు, నేషనల్ సీడ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా మాజీ డైరెక్టర్

పరుగు పందెంలో పోటీ పడుతుంటాం. హఠాత్తుగా కాలికి ఏదో తగులుతుంది. కింద పడతాం. ఆ పడటంతోనే విజయం మీద ఆశలు కోల్పోతాం. ఏం పర్వాలేదు, లేచి పరుగెడదాం... పడ్డచోటే గెలుపు జెండా ఎగరేసి తలెత్తుకుని నిలబడవచ్చేమో అని ఆలోచించేవారు ఎంతమంది?

ఒక లక్ష్యం వైపు అడుగులు వేస్తుంటే వృత్తిగతంగా లేదా వ్యక్తిగతంగా ఏదో ఒక పెద్ద సమస్య ఎదురై వెనక్కి లాగొచ్చు. అక్కడే ఆగిపోయి దాని గురించే ఆలోచిస్తుంటే అది మరింత నిరాశలోకి నెడుతుంది. కానీ, లక్ష్యంపైనే దృష్టిపెట్టి అనుకున్నది సాధిస్తే.. అంతకుముందున్న సమస్య చిన్నదైపోతుంది. భారత మేటి మహిళా క్రికెటర్ స్మృతి మంధాన సరిగ్గా ఇదే చేశారిప్పుడు. వ్యక్తిగత జీవితంలో ఒక సంక్షోభ స్థితిని ఎదుర్కొన్నప్పటికీ మనసంతా ఆటపైనే లగ్నం చేసిన ఆమె- మహిళల ఐపీఎల్ ట్రోఫీని సగర్వంగా ముద్దాడారు.

పడితే పరుగెందుకు ఆగాలి?



మహిళల క్రికెట్‌కు దేశంలో పెద్దగా ఆదరణ లేని రోజుల్లో భారత జట్టులోకి వచ్చారు స్మృతి. అదరగొట్టే ఆటతీరుతో ప్రపంచ మేటి బ్యాటర్లలో ఒకరిగా ఎదిగారు. కెరీర్‌లో ఎన్నడూ నిలకడ కోల్పోలేదు. వయసు పెరుగుతున్నా తన ఆట ఇంకా మెరుగవుతోందే తప్ప తగ్గట్లేదు. ఆమెతో పాటు భారత క్రికెట్ కూడా గత దశాబ్ద కాలంలో గొప్ప పురోగతి సాధించింది. నిరుడు వన్డే ప్రపంచకప్ గెలవడంతో భారత మహిళల క్రికెట్ ముఖచిత్రమే మారిపోయింది. ప్రపంచకప్ సాధించిన ఆనందంలో కొన్నేళ్లుగా ప్రేమలో ఉన్న పలాష్ ముచ్చల్‌తో పెళ్లికి సిద్ధమయ్యారు స్మృతి. కానీ, ముహూర్తానికి ముందు రోజు అనూహ్య పరిణామాలతో శుభకార్యం ఆగిపోయింది. నలుగురూ నానా మాటలన్నారు. వేటి మీదా స్మృతి స్పందించలేదు. ఎప్పటి నుంచో ప్రేమిస్తున్న మనిషిని మనువాడబోతున్న శుభతరుణంలో కొన్ని గంటల ముందు ఇలా జరగడం స్మృతిని, తన కుటుంబాన్ని ఎంత వేదనకు గురిచేసి ఉంటుంది!? కానీ, ఆమె కుంగిపోలేదు. ఆ ప్రభావాన్ని ఆట మీద పడనీయలేదు. తన బాధను పోగొట్టే ఔషధం ఆటేనని భావించారు. మళ్లీ సాధన మొదలుపెట్టి ఐపీఎల్‌కు సిద్ధమయ్యారు. ఫలితం... ఆమె సారథ్యంలోని ఆర్సీబీ టోర్నీ చరిత్రలోనే ఏ జట్టుకూ సాధ్యం కాని ఆధిపత్యాన్ని చాటింది. ఫైనల్లో రికార్డు స్థాయిలో 200 పైచిలుకు లక్ష్యాన్ని ఛేదించి విజేతగా నిలిచింది. ఆ మ్యాచ్‌లో జట్టును ముందుండి నడిపించింది స్మృతినే. టోర్నీలో అత్యధిక పరుగులు సాధించిన బ్యాటర్ కూడా తనే. కెప్టెన్‌గానూ ఆమె బలమైన ముద్రే వేశారు. ఐపీఎల్ ఆరంభమయ్యే ముందు వరకు పెళ్లి ఆగిపోయిన అమ్మాయిగా స్మృతిపై సామాజిక మాధ్యమాల్లో జాలిపడేవారందరూ. కానీ ఇప్పుడు దాని గురించి ఎవరూ మాట్లాడటం లేదు. అందరి దృష్టీ తన చేతిలోని కప్పు మీదే! ఛాంపియన్ ప్లేయర్ అంటూ ఆమెను కొనియాడుతున్నారు. కింద పడ్డా పరుగు ఆపకూడదు, జీవితంలో ఏం జరిగినా ముందుకు సాగిపోవాల్సిందే అనడానికి స్మృతి కంటే గొప్ప ఉదాహరణ ఇంకెవరుంటారు?

– చంద్రశేఖర్‌రెడ్డి తిమ్మాపురం

వృద్ధి అంతంతే!

ఆదాయాల లేమితో రైతాంగం కునారిల్లుతోంది. సర్కారీ వర్గాలు మాత్రం 2015-25 మధ్యకాలంలో సాగు, దాని అనుబంధ రంగాలు సగటున 4.45శాతం వృద్ధిరేటును నమోదు చేశాయని, గడచిన కొన్ని దశాబ్దాలలో ఇదే మెరుగైన గ్రోత్‌రేట్ అని చెబుతున్నాయి. కానీ, అందులో వ్యవసాయం ఒక్కదాని వాటా తక్కువే. పాడి, మత్స్య రంగాలు వరసగా 7.1, 8.8శాతాల చొప్పున వృద్ధిరేటును కనబరుస్తుంటే- సాగులో ప్రగతి 3.5శాతానికే పరిమితమవుతోంది. గడచిన కొన్నేళ్లలో వ్యవసాయ, దాని అనుబంధ రంగాల్లో వృద్ధిరేటు...

(శాతాల్లో)



2017–18	6.6
2018–19	2.1
2019–20	6.2
2020–21	4.0
2021–22	4.6
2022–23	6.3
2023–24	2.7
2024–25	4.6

(ఆధారం: ఆర్థిక సర్వే 2025-26)

ఆధునిక రంగాల్లోనూ అసమానతలే!

శాస్త్ర, సాంకేతిక, ఇంజినీరింగ్, గణిత రంగాల్లో లింగపరమైన అసమానత్వం అభివృద్ధి చెందిన దేశాల్లోనూ స్థిరంగా కొనసాగుతున్నట్లు 'యునెస్కో' గుర్తించింది. ఈ అంతరం వల్ల మహిళల మేధాశక్తిని ప్రపంచం పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోతోంది. ఉన్నత విద్యలో మహిళలు అద్భుతమైన పురోగతి సాధిస్తున్నప్పటికీ- సైన్స్, టెక్నాలజీ రంగాల్లో వారి ప్రాతినిధ్యం చాలా తక్కువగానే ఉంటోంది. పైగా అధిక వేతనాలతో కూడిన ఉద్యోగాలను వారు అందుకోలేకపోతున్నారు. నేడు ఏఐ కార్యకలాపాల్లో మహిళలు 22 శాతమే ఉండగా, క్వాంటమ్ కంప్యూటింగ్‌లో మరీ తక్కువగా రెండు శాతానికే పరిమితమయ్యారు. స్టెమ్ పరిశోధనల్లోనూ వారి ప్రాతినిధ్యం 31శాతానికే పరిమితమని ఐరాస వెల్లడించింది. ఈ విభాగాల్లో వేళ్లూనుకున్న లింగ అసమానత్వం మహిళా సాధికారతకూ, దేశార్థికానికీ, యావత్ ప్రపంచ పురోగతికీ విఘాతకరం. ఈ సంగతిని గుర్తించిన పలు దేశాలు స్టెమ్ విభాగాల్లో బాలికలూ మహిళలకు అవకాశాలను మెరుగుపరిచేలా విధివిధానాలను రూపొందిస్తున్నాయి.

విజయాల్లో కీలకం...

గణితం, ఇంజినీరింగ్‌లు 'పురుషుల ఫీల్డ్' అనే అపోహ చాలాకాలంగా ఉంది. కానీ, దీన్ని చాలామంది భారతీయ మహిళలు పటాపంచలు చేశారు. చంద్రుడి దక్షిణ ధ్రువంపై పరిశోధన కోసం చేపట్టిన 'చంద్రయాన్-3' ప్రాజెక్టుకు నాయకత్వం వహించిన వారిలో తెలుగు మహిళ కల్పన కాళహస్తి ఉండటం విశేషం. వంద మందికి పైగా మహిళా శాస్త్రవేత్తలు ఈ ప్రాజెక్టులో పాల్గొన్నారు. డీఆర్‌డీవో, దాని అనుబంధ సంస్థల్లో స్త్రీల వాటా 16-18 శాతమే అయినప్పటికీ, ఆయా సంస్థలు సాధిస్తున్న విజయాల్లో వారు కీలకపాత్ర పోషిస్తున్నారు. మిస్సైల్ ఉమెన్ ఆఫ్ ఇండియాగా పేరుగాంచిన టెస్సీ థామస్, రాకెట్ ఉమెన్‌గా పేరొందిన రీతు కరిదాల్ వంటివారు ఈ తరం ఆడపిల్లలకు స్ఫూర్తిప్రదాతలు. ఎన్నో అడ్డంకులు ఉన్నా, భారతీయ ఐటీ రంగంలో మహిళల ప్రాతినిధ్యం 35శాతాన్ని మించడం మరో విశేషం. అయితే, దేశీయ యూనివర్సిటీల్లోని స్టెమ్ ఫ్యాకల్టీలో స్త్రీలు కేవలం 13.5శాతమే. ఐఐటీలు వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో మహిళా బోధకులు కనీసం ఏడు శాతమైనా లేరు!



సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్(స్టెమ్) విభాగాల్లో విద్య, ఉద్యోగాల్లో లింగపరమైన అసమానతలు నేటికీ కొనసాగుతూనే ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా 46శాతం మంది మహిళలు ఉన్నత విద్యను అభ్యసిస్తుంటే, వారిలో 35శాతం మందే స్టెమ్ విభాగాల్లో కెరీర్‌ను కొనసాగిస్తున్నారు. ఈ అసమానతలను రూపుమాపాలన్న ఉద్దేశంతో ఐరాస ఏటా ఫిబ్రవరి 11న 'సైన్స్ రంగంలో మహిళలు, బాలికల అంతర్జాతీయ దినోత్సవం' నిర్వహిస్తోంది. ఏఐ, స్టెమ్, సామాజిక శాస్త్రాలను ఆర్థిక రంగంతో సమ్మిళితం చేస్తూ 'ఆమె' భవిష్యత్తును నిర్మించాలన్నది ఈ ఏడాది నినాదం.

లింగ సమానత్వాన్ని ఏ దేశమూ ఇంతవరకు సాధించలేదని 'గ్లోబల్ జెండర్ గ్యాప్ రిపోర్ట్-2025' విశ్లేషించింది. భారతదేశమైతే ప్రపంచ స్త్రీ-పురుష అంతరాల సూచీలో 131వ స్థానంలో ఉన్నట్లు పేర్కొంది. ఈ పరిస్థితుల్లో స్టెమ్ రంగాల్లో లింగ అసమానతను రూపుమాపడానికీ, మహిళల్లో విద్య-ఉపాధి మధ్య అంతరాన్ని తగ్గించడానికీ కేంద్రం పలు కార్యక్రమాలు అమలు చేస్తోంది. తొమ్మిదో తరగతి నుంచి 12వ తరగతి బాలికల కోసం 'విజ్ఞాన్ జ్యోతి' పథకాన్ని రూపొందించింది. 'అటల్ టింకరింగ్ ల్యాబ్స్' ద్వారా బడుల్లో ఆధునిక సైన్స్ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. సాంకేతిక విద్యను అభ్యసించే బాలికల కోసం ప్రగతి స్కాలర్‌షిప్ పథకాన్ని ఏఐసీటీఈ ప్రారంభించింది. స్టెమ్ విభాగాల్లో మహిళలకు డాక్టరేట్, పోస్ట్ డాక్టరేట్, సీనియర్ సైంటిస్ట్ స్థాయి వరకు ఆర్థిక సాయం అందించడానికి 'వైజ్ అండ్ కిరణ్' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు.

అధిగమించాల్సిన సవాళ్లెన్నో...

భారతీయ విద్యార్థినుల్లో సుమారు 43శాతం మంది స్టెమ్ కోర్సుల్లో గ్రాడ్యుయేషన్ పూర్తిచేస్తున్నా, 14-22 శాతం మందే ఉద్యోగాల్లో చేరుతున్నారు. ఈ విభాగాల్లో కొలువులు సాధించడం వారికి కష్టమవుతోంది. వివాహం ఆలస్యమైతే సంతాన సాఫల్యత తగ్గిపోతుందన్న అపోహతో చాలామంది తల్లిదండ్రులు చదువు పూర్తికాగానే అమ్మాయిలకు పెళ్లి చేసేస్తున్నారు. స్టెమ్ ఉద్యోగాలు చేయాలంటే పరిశ్రమలు, పరిశోధనా సంస్థలు, బహుళజాతి సంస్థలు ఉండే చోటుకే వెళ్లాల్సి ఉంటుంది. అది మహిళలకు ఇబ్బందికరంగా మారుతోంది. కొలువుల్లో చేరిన వారిలోనూ చాలామంది పని ప్రదేశాల్లో అభద్రతాభావం, లైంగిక వేధింపుల కారణంగా ఉద్యోగాలను వీడుతున్నారు. కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూనే స్టెమ్ రంగాల్లో ఒత్తిడిని తట్టుకుని ఉద్యోగాల్లో కొనసాగడం మహిళలకు సవాలుగా మారింది. వీటన్నింటికీ అడ్డుకట్ట వేయాల్సిన సమయమిది. స్టెమ్ చదువులు, ఉద్యోగాల పట్ల అమ్మాయిల్లో నెలకొన్న భయాందోళనలను తొలగించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలనీ; అందుకోసం భారీగా నిధులు కేటాయించాలని ప్రపంచ దేశాలకు ఐరాస పిలుపిచ్చింది. భారత్ వంటి దేశాలు అందుకు కట్టుబాటు చాటడం అత్యావశ్యకం.



భరత్ వేదాంతం
సాంకేతిక రంగ నిపుణులు



తెలివైన సారథి!

అమేయపురం మహారాజు కోసం కొత్త రథసారథిని వెదుకుతున్నారు. దాని కోసం రాజ్యమంతా చాటింపు వేయించారు. వచ్చిన వాళ్లలో కొన్ని పరీక్షల తరవాత ఆదిత్యుడు, రఘునాథుడు, శివనాగులు చివరి దశకు చేరుకున్నారు. వాళ్లను పిలిచి.. 'మీరు మూడు రోజుల తరవాత రండి. ఎవరు రథం బాగా నడుపుతారో చూసి వాళ్లను పనిలోకి తీసుకుంటాం' అని చెప్పాడు మంత్రి సుచేలుడు.

చెప్పినట్లుగా మూడురోజుల తరవాత కోటకు వచ్చారా ముగ్గురు. అప్పటికే మంత్రి కొన్ని రథాలు, గుర్రాలను సిద్ధంగా ఉంచాడు. 'ఇక్కడ ఉన్న వాటిల్లో మీకు కావాల్సిన గుర్రాలు, రథాలను ఎంపిక చేసుకోండి. పది మైళ్ల దూరంలో ఉన్న జెండాను ఎవరైతే ముందుగా తీసుకొస్తారో వారే విజేత' అని చెప్పాడు. ఆదిత్యుని తండ్రి గుర్రాల వ్యాపారి కావడంతో మంచి గుర్రాలను ఎంచుకున్నాడు. కానీ రథం ఎలా ఉందన్నది పట్టించుకోలేదు. రఘునాథుడి తండ్రి రథాలు తయారుచేసేవాడు. దాంతో అతను మంచి రథాన్ని ఎంపిక చేసుకుని, గుర్రాల సంగతి వదిలేశాడు. సైనికుడి కొడుకైన శివనాగులు మాత్రం తనకున్న అనుభవానికి తోడు మంత్రి ఇచ్చిన మూడు రోజుల గడువులో మేలు జాతి గుర్రాల లక్షణాలు, రథానికి ఏయే భాగాలు కీలకమో తెలుసుకున్నాడు. అవన్నీ దృష్టిలో పెట్టుకుని రథాన్నీ గుర్రాలను ఎంచుకున్నాడు. ముగ్గురూ ప్రయాణం ప్రారంభించారు. కాస్త దూరం వెళ్లగానే ఆదిత్యుని రథ చక్రం ఊడిపోయింది.. రఘునాథుడి గుర్రాల కాళ్లకు ఉండే నాడాలు సరిగ్గా లేక అవి వేగంగా పరిగెత్తలేకపోయాయి. ఇక శివనాగులే జెండాను తీసుకొచ్చి విజయం సాధించాడు. అప్పుడు మంత్రి.. 'మనం ఏ పని చేస్తున్నా దానికి సంబంధించిన విషయాలు లోతుగా తెలుసుకోవాలి. అప్పుడే మనం గెలవగలుగుతాం' అని చెప్పాడు.

– ఎం. త్రిమూర్తులు

హాయ్! బుజ్జీ!!



అక్షరాల చెట్టు

ఈ అక్షరాలతో అర్థవంతమైన పదం తయారు చేయండి.

జవాబు: PARLIAMENT





కరుణామయి.. మేరీమాత

గుణదల మేరీమాత ఉత్సవాలు రెండో రోజు మంగళవారం వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా.. దివ్య పూజాబలి సమర్పణకు వస్తున్న గురువులు. ధూపం వేస్తున్న విశాఖపట్నం అగ్ర పీఠాధిపతి బిషప్ ఉడుముల బాల. - గుణదల, న్యూస్‌టుడే

బాసట మరుపు.. బాధల మలుపు



ఈ చిత్రం చూడండి... భవానీపురం స్వాతి థియేటర్ కూడలిలో సాయంత్రం వేళ ఇలా స్తంభాలతో మూసేశారు. కనకదుర్గ పైవంతెన పొడవు 2.6 కి.మీ. రాజీవ్‌గాంధీ పార్కు దగ్గర మొదలైన ఈవంతెన ఎక్కితే 3 కి.మీ. దాటాక కుమ్మరిపాలెం దగ్గర దిగుతారు. కానీ అక్కడ యూటర్న్‌కు తావులేకుండా స్తంభాలతో మూసేశారు. కాస్త ముందుకెళ్తే స్వాతిథియేటర్ నాలుగురోడ్ల కూడలి ఉన్నా.. అక్కడా స్తంభాలతో దారి మూసేశారు. మరికొంతదూరం సాగి చెరువుసెంటర్‌లో మలుపు తిరిగి రావాలి. అంటే.. 6 కి.మీ. వరకు మలుపు తిరిగే వీల్లేకుండా స్తంభాలతో అడ్డుగోడలు కట్టేశారు. జాతీయ రహదారిపైనా ఇంతలా కట్టిన లేదని.. పెట్రోలు, సమయం వృథా, వాహన కాలుష్యం పెరుగుతుందని ప్రజలు వాపోతున్నారు. ఈనాడు - అమరావతి

విద్యుత్తు వినియోగంపై.. నిఘా

అందుబాటులో స్మార్ట్ మీటర్ యాప్

వెంకట్‌కు ఫిబ్రవరి కరెంట్ బిల్లు వచ్చింది. గత నెల కంటే రూ.200 ఎక్కువగా రావడంతో మీటరులో తేడా అంటూ గగ్గోలు పెట్టారు. రాత్రి వేళ ఏసీ వాడడంతో బిల్లు ఎక్కువగా వచ్చిందని అధికారులు వచ్చి లెక్కలతో సహా చూపించడంతో ఇక నుంచి విద్యుత్తు వినియోగాన్ని నియంత్రించుకోవాలని నిర్ణయించుకున్నారు.
మరి మనం కూడా విద్యుత్తు వినియోగాన్ని నియంత్రించుకోవాలంటే స్మార్ట్ మీటర్ యాప్ 'సెంట్రల్ పవర్ స్మార్ట్ మీటర్' అందుబాటులో ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే మన విద్యుత్తు వినియోగాన్ని ఎప్పటికప్పుడు చూసుకోవచ్చని సూచిస్తున్నారు. ఇక సౌర విద్యుత్తు వినియోగదారులు అయితే రోజూ ఎంత సౌర విద్యుత్తు ఉత్పత్తి అయ్యింది? ఎంత వాడుకున్నారు? ఎంత మిగులు విద్యుత్తును సంస్థకు ఇచ్చామో కూడా తెలుసుకోవచ్చు.



క్యూఆర్ కోడ్‌లు..
ఆండ్రాయిడ్, ఐఫోన్ వినియోగదారులకు రెండు వేర్వేరుగా క్యూఆర్ కోడ్లు ఇచ్చారు. దీనిని స్కాన్ చేస్తే 'సెంట్రల్ పవర్ స్మార్ట్ మీటర్' యాప్ డౌన్‌లోడ్ అవుతుంది. స్మార్ట్ మీటరు ఉన్న వినియోగదారులే ఈ సౌకర్యాన్ని పొందవచ్చు. ముందుగా మీ విద్యుత్తు సర్వీసు నంబరు నమోదు చేసి దానికి పాస్‌వర్డ్ క్రియేట్ చేసుకుని లాగిన్ అవ్వాలి. ఆ తరువాత మీ రోజువారీ వినియోగం యాప్‌లోనే కనిపిస్తూ ఉంటుంది.
– సూర్యారావుపేట, న్యూస్‌టుడే

అనుమానాలు ఉన్నాయా..?
స్మార్ట్ మీటరుపై ప్రజల్లో అపోహలు ఉన్నాయి. వీటిని నివృత్తి చేసేందుకు అధికారులు వినియోగదారులకు అవగాహనా కార్యక్రమాలు చేపట్టారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ దిగువ ఉపకేంద్రాల పరిధిలో అధికారులు అందుబాటులో ఉంటారు.

ఫిబ్రవరి	ఎన్టీఆర్ జిల్లా	కృష్ణా
తేదీ 11	మొగల్రాజపురం	---
12– 16	భవానీపురం	---
17– 19	పటమట	డి1 గుడివాడ
20– 23	రింగ్‌రోడ్డు	డి1 బందరు

ఉపయోగాలెన్నో..: ఈ యాప్ ద్వారా అనేక రకాల సేవలు పొందవచ్చు. గంట గంటకూ నమోదయ్యే మీ వినియోగాన్ని చూసుకోవచ్చు. విద్యుత్తు పొదుపునకు సూచనలు తెలుసుకోవచ్చు. ఏవైనా ఫిర్యాదులు ఉంటే చేయవచ్చు. బిల్లులు కూడా చెల్లించే వెసులుబాటు కూడా ఉంది.

కరకట్టలేరా.. అరికట్టలేరా..?

గుంతలతో గతి తప్పుతున్న వాహనాలు
మూడు సంవత్సరాల్లో 24 మంది బలి..

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం - న్యూస్‌టుడే, తోట్లవల్లూరు

విజయవాడ- అవనిగడ్డ కరకట్ట దారిపై ప్రయాణం నిత్య నరకంగా మారింది. అడుగడుగునా భారీ గుంతలు.. తరచూ ప్రమాదాలతో హడలిపోతోంది. ఏళ్లుగా అధ్వానంగా ఉన్నా అధికారులు.. పాలకులు కంటపడట్లేదు. విజయవాడ నుంచి దివిసీమకు దగ్గర దారి కావడంతో చుట్టూ తిరిగిరాలేక ఈ అధ్వాన రోడ్డులోనే ప్రయాణిస్తున్నారు. నిత్యం వందల ఆటోలు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు, కార్లు.. 20 నిమిషాలకో ఆర్టీసీ బస్సు తిరుగుతున్నాయి. తరచూ బస్సులు అదుపు తప్పుతున్నాయి. నిత్య ప్రమాదాల తీవ్రతతో.. కాళ్లు, చేతులు విరగడం.. మంచానికే పరిమితమై.. కుటుంబాలకు భారం అవుతున్నారు. కీలక మార్గాన్ని వైకాపా గాలికొదిలేసింది. కూటమి ప్రభుత్వమైనా పట్టించుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మూడేళ్లుగా..

ప్రమాదాలు..	46
మృతులు..	24
క్షతగాత్రులు..	53

మానని గాయం...
అవనిగడ్డలో దుస్తుల వ్యాపారి కె. రమేశ్ 2024లో ఇంటర్ చదువుతున్న తన కుమార్తెను విజయవాడలో దింపి తిరిగి వస్తున్నారు.. రాముడుపాలెం-కె.కొత్తపాలెం మధ్య గుంతలకు కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. రమేశ్ అక్కడికక్కడే మృతి చెందగా.. పెద్దదిక్కును కోల్పోయిన కుటుంబానికి దుఃఖమే మిగిలింది.
రొయ్యూరు వద్ద రెండు ట్రాక్టర్లు ఢీకొని రైలింగ్‌పై ఏసీల వ్యాపారి వెంకటేశ్వర్లు ప్రాణాలు విడిచారు.
తోట్లవల్లూరు వద్ద రెండు కార్లు ఢీకొని ఓ కారులో మంటలు చెలరేగి విశాఖ న్యాయవాది కన్నుమూశారు.



టిప్పర్.. టెర్రర్..
చోడవరం, రొయ్యూరు, తోట్లవల్లూరు, అప్పారావుపేట, శ్రీకాకుళం తదితరచోట్ల ఇసుక రేవులున్నాయి. వీటి ఎదురుగా గ్రామాల వంతెనలపై నుంచి రోడ్డు దాటేందుకే ఇసుక టిప్పర్లకు అనుమతి. ఇసుక దందా వెనుక ప్రజాప్రతినిధులు ఉండటంతో రాత్రీ పగలు వందల టిప్పర్లు పరిమితికి మించి లోడ్‌తో తిరుగుతున్నాయి. వీటి ధాటికి 8-10 అడుగుల వెడల్పు.. మోకాల్లోతు గుంతలు పడ్డాయి. మరింత కుంగి.. ఎక్కడికక్కడ ధ్వంసం అవుతున్నా అధికారులు నోరెత్తట్లేదు.



పెనమలూరు: పెదపులిపాక వద్ద అడుగడుగునా గుంతలతో ప్రయాణం నిత్య నరకమే...



గుంతలకు అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు

దివ్యాంగుడినయ్యా..



మాది చల్లపల్లి. నేను ద్విచక్ర వాహన మెకానిక్. మూడేళ్ల కిందట కరకట్ట రోడ్డులో బైక్‌పై వెళ్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో కుడికాలు విరిగింది. నాకు భార్య, ఇద్దరు కుమార్తెలు. ఇంటికి ఆధారమైన నేనే ఏళ్లుగా వారికి భారంగా మారా. ఇప్పుడిప్పుడే కోలుకుంటూ కృత్రిమ కాలు సాయంతో నా వృత్తి చేసుకుంటున్నా. – మహమ్మద్ గౌస్ బాషా

భారీ పగుళ్లతో కలవరం..
రివర్ కన్జర్వెన్సీ (ఆర్సీ) చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేస్తేనే ఇసుక టిప్పర్ల బెడద తగ్గుతుంది. కరకట్ట మరింత బలహీనపడితే విజయవాడ నుంచి మచిలీపట్నం మీదుగా అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక తదితర మండలాలకు 120 కి.మీ. తిరిగి రావాల్సిందే. ఇప్పటికే కరకట్ట చాలా చోట్ల భారీ పగుళ్లతో కుంగింది.

ఆసాంతం గండాలే
విజయవాడ నుంచి పులిగడ్డ వరకు 60 కి.మీ. యనమలకుదురు, పెదపులిపాక, చోడవరం, మద్దూరు, రొయ్యూరు, వల్లూరుపాలెం, భద్రిరాజుపాలెం, చాగంటిపాడు, కళ్లంవారిపాలెం, దేవరపల్లి, గుర్విందపల్లి, ఐలూరు, అప్పారావుపేట, లంకపల్లి, శ్రీకాకుళం, వెలువోలు, నడకుదురు, కొత్తపాలెం తదితర గ్రామాల్లో దారి విపరీతంగా ధ్వంసమైంది.

నిధుల కోసం మరోసారి ప్రభుత్వానికి నివేదిస్తాం..
కరకట్ట పటిష్ఠానికి, కొత్త లేయర్ నిర్మాణానికి రూ.139 కోట్ల అంచనాల ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాం. మరోసారి సమస్య తెలియజేస్తాం. - ఆర్.రవికిరణ్, నీటిపారుదలశాఖ ఈఈ

సుస్థిర వృద్ధి.. సంకల్ప సిద్ధి!

★ మార్చి31 నాటికి లక్ష్యసాధనకు చక్కటి కసరత్తు
★ రూ.4,17,412 తలసరి ఆదాయం వైపు పరుగు..

ఈనాడు, అమరావతి

ఎన్టీఆర్ జిల్లా.. విజన్-2047 దిశగా వడివడిగా అడుగులు వేస్తోంది. మార్చి-31తో ఆర్థిక ఏడాది ముగియనున్న వేళ.. వ్యవసాయం, పరిశ్రమలు, సేవారంగాల్లో ఈ ఏడాది లక్ష్యాలు చేరుకునేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. జీడీడీపీ... తలసరి ఆదాయం విషయంలో మంచి ఫలితాలు సాధిస్తున్న నేపథ్యంలో భవిష్యత్తులో మరింత వృద్ధి సాధించే దిశగా అడుగులు వేస్తున్నారు.

లక్ష్యం దిశగా పయనం..
✪ 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ. 1,12,057 కోట్ల జీడీడీపీ(గ్రాస్ డిస్ట్రిక్ట్ డొమస్టిక్ ప్రొడక్ట్) లక్ష్యంగా పెట్టుకున్నారు. 2024-25లో రూ. 93,132 కోట్లు నుంచి 2026 ఫిబ్రవరికి రూ. 1,05,173 కోట్లు జీడీడీపీ సాధించారు. ✪ 2024-25లో జిల్లా తలసరి ఆదాయం రూ. 3,47,623 మాత్రమే ఉండగా మంచి ఫలితాలు సాధిస్తున్నారు. 2025-26కి రూ. 4,17,412 తలసరి ఆదాయం సాధన లక్ష్యం కాగా ఇప్పటికే రూ. 3,91,390కి చేరుకున్నారు. ✪ ఇప్పటి వరకు జీవీఏ (గ్రాస్ వాల్యూ ఎడిషన్) వ్యవసాయ రంగంలో రూ. 11,473 కోట్లు, పరిశ్రమల్లో రూ. 20,190 కోట్లు, సేవారంగంలో 65,291 కోట్లకు చేరుకుంది.

కార్యాచరణ ఇలా... ✪ వ్యవసాయంలో వృద్ధి రేటు ఆశించిన మేర లేకపోవడంతో కలెక్టర్ సేంద్రియ సాగు ప్రోత్సహించేందుకు ప్రణాళికలు రచించారు. రైతు సాధికార సంస్థ ద్వారా సేంద్రియ వ్యవసాయంపై ఆసక్తి ఉన్న రైతులకు శిక్షణ ఇస్తూ అధిక రాబడి పొందేలా చేయాలనేదే లక్ష్యం. జిల్లాలో సేంద్రియ సాగు చేసే రైతుల సంఖ్యను 20 వేల వరకు పెంచారు. ✪ పారిశ్రామిక పార్కుల ఏర్పాటు వేగవంతం ద్వారా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తున్నారు. రైజ్ పేరుతో మహిళా పారిశ్రామికవేత్తలను తీర్చిదిద్దడానికి గుంటుపల్లి దగ్గర ప్రత్యేక శిక్షణ కేంద్రం ఏర్పాటు కొలిక్కి వస్తోంది. ✪ జిల్లాలో పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధి.. ఆంధ్రా ట్యాక్సీతో పర్యాటకాన్ని మరింత చేరువ చేయడంతో సేవల రంగాన్ని పురోగతి దిశలో నడిపిస్తున్నారు. గతేడాదితో పోలిస్తే సేవారంగం ద్వారా సమకూరే ఆదాయం రూ.8 వేల కోట్లు పెరిగింది. రానున్న కాలంలో మరింత పెంచాలనేదే ప్రణాళిక.

జీవీఏ పథం... (రూ.కోట్లలో)

రంగం	2024–25 సాధన	2025–26 లక్ష్యం
వ్యవసాయం	10,895	12,632
పరిశ్రమలు	17,728	21,113
సేవా రంగం	58,629	69,220
జీడీవీఏ	87,252	1,02,965

అవగాహనతోనే ఆర్థిక మోసాల నుంచి రక్షణ

ఎన్టీఆర్ కలెక్టరేట్: ఆర్థిక మోసాల నుంచి రక్షణ పొందేందుకు ప్రతి ఒక్కరికీ ఆర్థిక అక్షరాస్యత అవసరమని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. బ్యాంకింగ్ సేవలు, బీమా, పింఛను, డిజిటల్ ఆర్థిక భద్రతపై అవగాహన కలగడానికి, సరైన ఆర్థిక నిర్ణయాలను తీసుకోవడానికి అది కీలక పాత్ర పోషిస్తుందన్నారు. సురక్షిత బ్యాంకింగ్ విధానాలు, డిజిటల్ లావాదేవీలు, పొదుపు అలవాట్లపై ప్రజలు మరింత చైతన్యం కావాలన్నారు. ఆర్‌బీఐ-ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలకు ఈనెల 9వ తేదీ సోమవారం శ్రీకారం చుట్టారు. వారోత్సవాలు ఈనెల 13వ తేదీతో ముగుస్తాయి. ఈక్రమంలో ప్రచార పత్రాలను కలెక్టరేట్‌లో మంగళవారం ఆవిష్కరించారు. ఎల్‌డీఎం కె.ప్రియాంక, డీపీసీ జీఎం మధు, ఎస్‌బీఐ, కెనరా బ్యాంకుల సమన్వయకర్తలు జగదీష్, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

ఆఖరి పద్దూ.. బడాయే..!

రూ.1,968.13 కోట్లతో ప్రవేశపెట్టిన పాలకవర్గం

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే

విజయవాడ నగర పాలక సంస్థ 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం లభించింది. మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధ్యక్షతన మంగళవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో రూ.1968.13 కోట్ల ప్రస్తుత బడ్జెట్, 2025-2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రూ. 1309.52 కోట్ల బడ్జెట్‌ను మేయర్ సభ ముందు ఉంచారు. అధికార, విపక్ష సభ్యుల అభ్యంతరాలు, ఆరోపణలు, సవరణల మధ్య బడ్జెట్‌కు ఆమోదం తెలిపారు.
✪ మేయర్ భాగ్యలక్ష్మి 16 పేజీల బడ్జెట్‌ని సభలో చదివి వినిపించారు. గత, ప్రస్తుత ఆర్థిక సంవత్సరాల్లో ప్రజలకు మేలు చేసేలా బడ్జెట్ ప్రవేశపెట్టినట్లు ఆమె తెలిపారు. గత ఐదేళ్లలో నగరాభివృద్ధికి నిధుల కేటాయింపు, చేపట్టిన పనుల గురించి వివరించారు. నగరాభివృద్ధికి పెద్దపీట వేశామని తెలిపారు.

ఉన్నవి లేనట్లు... లేనివి ఉన్నట్లు..
బడ్జెట్‌పై తెదేపా ఫ్లోర్‌లీడర్ నెలిబండ్ల బాలస్వామి, కార్పొరేటర్లు ముమ్మనేని ప్రసాద్, ఉమ్మడి వెంకటేశ్వరరావు తదితర సభ్యులు స్పందించారు. మేయర్ ప్రసంగం తియ్యగా, మాటలు కోటలు దాటేలా ఉందని విమర్శించారు. ఉన్నవి లేనట్లు... లేనివి ఉన్నట్లు బడ్జెట్‌లో చూపించారని అన్నారు. విజయవాడ అంతా అభివృద్ధి చెందిందని, మరో పదేళ్లు ఎలాంటి పనులు చేపట్టాల్సిన అవసరం లేదన్నట్టు, అన్నీ తామే చేసేశామన్నట్లు చెప్పారని విమర్శించారు. బడ్జెట్ ప్రసంగం తప్పులతడకగా సాగిందని పేర్కొన్నారు. నగరంలో 18 డివిజన్లు కొండ ప్రాంతంలో ఉన్నాయని, 2.50 లక్షల మంది నివాసం ఉంటున్నారని, ఆయా ప్రాంతాల అభివృద్ధికి రూ. 5 కోట్లు మాత్రమే కేటాయించడం తగదని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నగరం అభివృద్ధి చెందిందని, వసతులు కల్పించామని తెలిపారు.

కార్పొరేషన్ బడ్జెట్ (2026-27) రూ. కోట్లలో

రాక		పోక	
		రెవెన్యూ ఖర్చు	794.98
రెవెన్యూ ఆదాయం	923.53	క్యాపిటల్ వ్యయం	767.09
క్యాపిటల్ రాబడి	971.04	రుణాల తిరిగి చెల్లింపు	8.02
డిపాజిట్లు, అడ్వాన్సులు	73.56	డిపాజిట్లు, అడ్వాన్సులు	73.56
మొత్తం	1,968.13	మొత్తం	1,643.65



కౌన్సిల్‌లో మాట్లాడుతున్న మేయర్ భాగ్యలక్ష్మి

ఆదాయాలు.. రూ. కోట్లలో

పన్నుల నుంచి	327.09
అసైన్డ్ రెవిన్యూ	81.90
పట్టణ ప్రణాళిక, ఇతర	48.05
లైసెన్సు ఫీజులు, పరిపాలన ఛార్జీలు	7.14
అమ్మకం, అద్దెలు	0.95
మార్కెట్, రెమ్యూనరేటివ్ ఎంటర్‌ప్రైజెస్	45.30
నీటి సరఫరా, భూగర్భ డ్రెయినేజీ	76.83
ఇతర ఆదాయాలు	336.29
మొత్తం	923.55

ఖర్చులు...

జీతాలు	265.38
నిర్వహణ	298.02
రిపేర్లు	186.11
అడ్మినిస్ట్రేటివ్ ఛార్జీలు	39.71
ఇతర ఖర్చులు	5.76
మొత్తం	794.98

అంతా అంకెల గారడీ
దారితెన్ను లేని బడ్జెట్ ప్రవేశపెట్టారని సీపీఎం సభ్యుడు బోయి సత్యబాబు ఆరోపించారు. నగరానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రూ.వందల కోట్ల నిధులు రావాల్సి ఉన్నప్పటికీ పాలకులు పట్టించుకోవడం లేదని అన్నారు. బడ్జెట్ అంతా అంకెల గారడిగా ఉందని విమర్శించారు. ఈ బడ్జెట్ నగరాన్ని దివాళా తీయిస్తుందని పేర్కొన్నారు. గుత్తేదారులకు రూ.250 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ఒప్పంద కార్మికులకు జీతాలు చెల్లించలేని పరిస్థితి ఉందని అన్నారు.

ఐదేళ్లలో అభివృద్ధి చేశాం
పాలక పక్షమైన వైకాపా సభ్యులు వెంకట సత్యనారాయణ, బండి పుణ్యశీల మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా గత ఐదేళ్లలో విజయవాడ నగరం అభివృద్ధి సాధించిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహకారం లేదని తెలిపారు. బుడమేరు అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి నిధులు ఇప్పటివరకు రాలేదని, నగర పాలక సంస్థ సాధారణ నిధులు రూ. 7.50 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు.

దినేష్... దొరికాడు!

☛ గ్యాస్ ఏజెన్సీలో తుపాకీతో హల్‌చల్
☛ నగదుతో పరారైన ప్రధాన నిందితుడు

ఈనాడు, అమరావతి

గ్యాస్ ఏజెన్సీకి వెళ్లి.. తుపాకీతో బెదిరించి... నగదు అపహరించుకెళ్లిన కేసులో ఒక నిందితుడు దొరికాడు. ఈ కేసులో దినేష్ ప్రధాన నిందితుడు. మరో ఇద్దరు నిందితులు భజరంగి, ధీరజ్‌ల ఆచూకీ ఇంకా దొరకలేదు. నేరం చేసిన తర్వాత వీరంతా రైలులో తమ రాష్ట్రమైన రాజస్థాన్ పారిపోయారు. విజయవాడ నుంచి అక్కడికి వెళ్లిన ప్రత్యేక బృందం నిందితుడిని అరెస్టు చేసింది. బుధవారం స్థానిక కోర్టులో హాజరుపరిచి అనంతరం ట్రాన్సిట్ వారెంట్‌పై విజయవాడకు తేనున్నారు.

ద్విచక్ర వాహనంపై ఖమ్మానికి...
తమను పనిలోంచి తొలగించారనే కోపంతో గ్యాస్ డెలివరీ బాయ్స్ దినేష్, భజరంగిలు స్నేహితుడు ధీరజ్‌ను తీసుకుని గత వారం రమ్యకృష్ణ ఏజెన్సీకి వెళ్లారు. అక్కడ తుపాకీతో బెదిరించి కౌంటర్‌లోని ఉద్యోగినుల నుంచి రూ. 1.50 లక్షలు, రెండు ఫోన్లను ఎత్తుకెళ్లారు. వీరు ద్విచక్ర వాహనంపై పరారయ్యారు. ఇది వీరు అద్దెకుండే ఇంటి కింద వ్యక్తిదని తేలింది. నిందితులు అదే బైక్‌పై ఖమ్మం వరకు వెళ్లారు. అక్కడ వాహనాన్ని ఆపి రైలులో హైదరాబాద్ వెళ్లారు. అక్కడ మరో రైలును పట్టుకుని రాజస్థాన్ చేరుకున్నారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో సంభాషణలు...
నేరం చేశాక నిందితులు ఫోన్లను స్విచాఫ్ చేసుకున్నారు. తర్వాత మొబైళ్ల నుంచి సిమ్‌లను తొలగించారు. ఎవరి గ్రామాలకు వారు వెళ్లిపోయారు. ఫోన్లలో కాకుండా ఇన్‌స్టాగ్రామ్‌లో వీరు నిత్యం టచ్‌లో ఉండేవారు. బికనీర్ జిల్లా ధానోక్‌కు చెందిన దినేష్ తన స్వస్థలానికి వెళ్లిపోయాడు. భజరంగి జోధ్‌పూర్ వెళ్లాడు. వీరితో ఇటీవల వరకు కలిసి పనిచేసిన రాజస్థాన్‌కు చెందిన వీరి స్నేహితుల సాయంతో ప్రత్యేక బృందం అక్కడకు వెళ్లింది. పోలీసుల జాడను పసిగట్టి మిగిలిన ఇద్దరు పరారయ్యారు. దినేష్ గ్రామానికి వెళ్లిన పోలీసులకు ఇంట్లో దొరికిపోయాడు. నిందితుడి నుంచి తుపాకీ కూడా స్వాధీనం చేసుకోగా... అది బొమ్మ తుపాకీగా తేలింది.



పోలీసులకు చిక్కిన దినేష్

కాలువలకు 2,892 క్యూసెక్కుల నీరు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: విజయవాడ నగరంలోని ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా డెల్టా పరిధిలోని పంట కాలువలకు మంగళవారం 2,892 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు 2,304, కృష్ణా తూర్పు(కేఈ) ప్రధాన కాలువకు 502, గుంటూరు ఛానల్‌కు 86 క్యూసెక్కులను విడుదల చేశారు. కేఈ ప్రధాన కాలువ నుంచి కేఈబీకి 302, బందరు కాలువకు 200 క్యూసెక్కులు ఇస్తున్నారు.

అరాచకమైనా.. వెలగని!

☛ వీధి దీపాల కోటాలో.. విద్యుత్తు వాడకం
☛ పల్లెనిధులతో కొడాలి వెంచర్‌కు వెలుగు

ఈనాడు, అమరావతి– ఈనాడు డిజిటల్, మచిలీపట్నం – న్యూస్‌టుడే, గుడివాడ

అధికారాన్ని అడ్డంపెట్టుని వైకాపా నేత కొడాలి నాని అడ్డగోలుగా విద్యుత్తు చౌర్యానికి పాల్పడ్డారు. వైకాపా హయాంలో.. గుడివాడ మండలం లింగవరంలో తన కొడాలి కన్వెన్షన్‌కు పక్కనే వేసిన వెంచర్‌లోని ప్లాట్లకు గ్రామపంచాయతీ పేరుతో వీధిదీపాలను వేసుకున్నారు. వీధిదీపాల కోటాలోనే.. ఏళ్లపాటు విద్యుత్తు అప్పనంగా వాడుకున్నారు. అనుమతుల్లేకుండా.. ట్రాన్స్‌ఫార్మర్లనూ పెట్టించుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరు నెలలకే వెలుగు చూడగా.. విద్యుత్తు అధికారులొచ్చి అక్రమం నిజమేనని తేల్చినా.. ఏ చర్యలూ లేకపోవడం దారుణం.

వైకాపా అధికారంలో ఉండగా నాటి ముఖ్యమంత్రి జగన్ లింగవరంలో 2021లో పర్యటించారు. అప్పుడే.. కె. కన్వెన్షన్‌ను ఆనుకుని ఉన్న తన వెంచర్‌లో... అధికారులను బెదిరించి మరీ పంచాయతీ నిధులతో వీధిదీపాలు వేయించారు. ఈ ప్రైవేటు వెంచర్‌కు నాటి పంచాయతీ కార్యదర్శి పి.జనార్దనరావు పేరుతో కనెక్షన్ తీసుకున్నారు. 2021 నవంబరు 11న సర్వీసు నంబరుతో (6111 1150 01109) వీధిదీపాలు తన ఆధీనంలోని వెంచర్‌లో అక్రమంగా వేయించుకున్నారు. రూ.లక్షల బిల్లుల భారాన్ని లింగవరం పంచాయతీపై మోపారు.



పంచాయతీ నిధులతో ప్రైవేటు వెంచర్‌లో వేసిన విద్యుత్తు స్తంభాలు ఇవే..

విచ్చలవిడి వాడకం..
వైకాపా హయాంలో వైఎస్సార్ ఛారిటబుల్ ట్రస్టు పేరుతో గుడివాడలో కె.కన్వెన్షన్ వద్ద ఉన్న ఈ ప్రైవేటు వెంచర్‌లో సంక్రాంతి జూదాలు భారీగా జరిగాయి. రాత్రీపగలు భారీ తెరలు పెట్టారు. క్యాసినో, కోడిపందేలు విచ్చలవిడిగా జరిగాయి. అప్పట్లోనే జగన్ ఎండ్ల బండి పోటీలను ప్రారంభించడానికి వస్తున్నారని.. రైతుల ట్రాన్స్‌ఫార్మర్లను అక్రమంగా కె.కన్వెన్షన్ వెంచర్‌లో పెట్టించారు. విద్యుత్తు స్తంభాలను పైసా చెల్లించకుండా పంచాయతీ పేరుతో వేయించుకున్నారు. లక్షల యూనిట్ల విద్యుత్తు చౌర్యం చేశారు.

నివేదికలు ఏమయ్యాయో..?
కొడాలి నాని అక్రమాలపై ఫిర్యాదులు అందటంతో 2025 ఏప్రిల్ 30న యాంటీ పవర్ థెఫ్ట్ స్క్వాడ్(ఏపీటీఎస్) ఆధ్వర్యంలో కె.కన్వెన్షన్, సబ్‌స్టేషన్‌లో తనిఖీలు చేశారు. రికార్డులు పరిశీలించి అక్రమాలు నిజమేనని తేల్చారు. ఎక్కడెక్కడ అక్రమాలు జరిగాయో తేల్చడానికి గత ప్రభుత్వంలో ఇక్కడ పనిచేసిన అధికారులనూ విచారించాలన్నారు. అక్రమాలకు పాల్పడిందెవరో.. విద్యుత్తు సామగ్రి మాయం చేసిన తీరు.. విద్యుత్తు చౌర్యానికి పాల్పడిన వైనంపై ఉన్నతాధికారులకు నివేదించారు. నెలలు గడిచినా.. విచారణ పేరుతో కాలయాపనే తప్ప చర్యల్లేవు.

పిల్లల విక్రయ కేసులో నిందితుడిగా బాబు

ఈనాడు - అమరావతి: పిల్లల విక్రయాల కేసులో కొత్తగా మరొకరిని పోలీసులు నిందితుడిగా చేర్చనున్నారు. పిల్లల్ని తీసుకొచ్చి కవితకు అప్పగించడంలో గుజరాత్‌కు చెందిన బాబు కీలక పాత్ర పోషించినట్లు తేలింది. ఇప్పటి వరకు ఈ కేసులో ఇతని పేరు లేదు. దీనిపై పోలీసులకు కొంత సమాచారం ఉంది. తాజాగా ముంబయికి చెందిన నిందితురాలు కవిత ఇంటరాగేషన్‌లో వెల్లడించింది. ఈ నేపథ్యంలో భవానీపురం, రెండో పట్టణ స్టేషన్‌లో నమోదైన కేసుల్లో బాబు పేరును చేర్చనున్నారు.

రాజస్థాన్ గిరిజన కుటుంబాల పిల్లలే లక్ష్యం: అనిల్, సతీష్‌లు పిల్లల్ని తీసుకొచ్చి ముంబయిలో కవితకు ఇచ్చేవారు. ఆమె వారిని విజయవాడలో ఉన్న బలగం సరోజినికి విక్రయాల కోసం పంపేది. గతంలో అనిల్.. కవితకు చెందిన ఇంట్లో ఉండేవాడు. అక్కడికి అతని బంధువైన బాబు వస్తుండేవాడు. అలా కవితతో పరిచయమైంది. అనిల్, బాబు.. గుజరాత్‌లో జొతాసన్ గ్రామస్థులు. ఇది గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల సరిహద్దున ఉంది. అక్కడికి రాజస్థాన్‌కు చెందిన పలు గిరిజన కుటుంబాలు పనుల నిమిత్తం వస్తుంటాయి. వీరు పిల్లలను పోషించలేక రూ.30 వేలకు అమ్మేవారు. వీరి నుంచి పిల్లల్ని కొని కవితకు ఇచ్చేవారు. బంధువుల్లో పోషించే స్థోమత లేని పిల్లల్ని బాబు తీసుకుని కవితకు చేర్చేవాడు.

ఆ ఇద్దరు దొరికితే..: ఈ కేసులో ఇంకా ఇద్దరు నిందితులు దొరకాల్సి ఉంది. ముంబయి ముఠాలో పిల్లల రవాణాకు కొరియర్‌గా వ్యవహరించిన నూరి అరెస్టు కావాల్సి ఉంది. ఆమె థానే సమీపంలో ఉంటున్నట్లు తేలింది. అక్రమ రవాణాలో కవితకు సహాయం చేసినట్లు దర్యాప్తులో తేలింది. ఒకసారి ముంబయి నుంచి పిల్లల్ని విజయవాడ తీసుకొచ్చి సరోజినికి అప్పగించింది. పోలీసులు ప్రధానంగా దిల్లీ ముఠాలో కీలక నిందితురాలైన ప్రియాంక అరెస్టుపై దృష్టి పెట్టారు. త్వరలో ప్రత్యేక బృందాన్ని పంపనున్నారు. గత నెలలో దిల్లీ, యూపీ వెళ్లిన ప్రత్యేక బృందం నుంచి కొద్దిలో తప్పించుకుంది. అప్పటి నుంచి ఆమె కదలికలపై నిరంతర నిఘా పెడుతున్నారు. కిరణ్‌శర్మకు సహాయం కోసం విజయవాడ వచ్చి భర్తి పోలీసులకు పట్టుబడింది. ఈమెను కస్టడీకి కోరుతూ మహిళా స్టేషన్ పోలీసులు వారెంట్ దాఖలు చేశారు. త్వరలో అదుపులోకి తీసుకుని విచారించే వీలుంది.

నింగి నుంచి పసిగట్టి.. నేరస్థుల పనిపట్టి..

42 డ్రోన్లతో నిరంతర నిఘా

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే



ట్రిపుల్ రైడింగ్ చేస్తున్నారా..?
ఎవరూ చూడడం లేదని సీసీ కెమెరాలు లేని ప్రాంతాల్లో వన్‌వేలో వేగంగా దూసుకుపోతున్నారా..?

సీసీ కెమెరాలు లేవని.. పోలీసులు రాలేరని ఇసుక తిన్నెల్లో జూదం ఆడుతున్నారా..?
అయితే కష్టాలు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ట్రాఫిక్‌పై నిఘా ఉంచేందుకు ఆధునిక సాంకేతికత వినియోగిస్తున్నారు. డ్రోన్ కెమెరాలతో నిఘా పెడుతున్నారు. దాదాపు 3 కి.మీ పరిధిలో ఆకాశం నుంచి నిఘా వేస్తూ అసాంఘిక శక్తుల ఆట కట్టిస్తున్నారు.



డ్రోన్‌ను గమనించి పారిపోతున్నారిలా..

ఎన్టీఆర్ కమిషనరేట్‌లో శాంతిభద్రతల పోలీస్ స్టేషన్లకు 28 డ్రోన్లు, 7 ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లకు 14 డ్రోన్లు కేటాయించారు. వీటిని కమాండ్ కంట్రోల్ సెంటరుకు అనుసంధానం చేశారు. నిరంతరం ఈ కెమెరాల ద్వారా నిఘా ఉంచుతూ తక్షణ చర్యలు తీసుకుంటున్నారు.

గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌ల ఆటకట్టు

కృష్ణా నది గర్భంలోని ఇసుక తిన్నెల్లో జూదమాడుతుంటారు. రైల్వేయార్డుల పరిసరాల్లో గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లు సంచరిస్తుంటాయి. వీరిని కట్టడి చేసేందుకు డ్రోన్ల ద్వారా నిఘా పెడుతున్నారు. స్కూళ్లు, కళాశాల పరిసరాల్లో ఈవ్‌టీజింగ్‌కు పాల్పడే వారిని గుర్తించి చర్యలు తీసుకుంటున్నారు. ఇక ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా అస్త్రం యాప్ ద్వారా ట్రాఫిక్ నిలిచిపోయిన ప్రాంతాలను గుర్తించి తక్షణం అక్కడకు డ్రోన్ పంపించి ట్రాఫిక్ జామ్‌కు కారణాలు అన్వేషిస్తున్నారు. తద్వారా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నారు. ధర్నాలు, రాస్తారోకోలపై నిఘా వీఐపీ బందోబస్తులో ప్రత్యక్ష ప్రసారాన్ని కమాండ్ కంట్రోల్ కేంద్రానికి అనుసంధానం చేసి పర్యవేక్షిస్తున్నారు. సురక్షితమైన ప్రయాణమే లక్ష్యంగా డ్రోన్ సాంకేతికత వినియోగిస్తున్నట్లు ట్రాఫిక్ డీసీపీ షిరీన్‌బేగం వెల్లడించారు.

తెలుగు భాషను దశదిశలా చాటిన ఘనుడు శ్రీకృష్ణదేవరాయలు

ఘంటసాల, న్యూస్‌టుడే: తెలుగు భాషను దశదిశలా చాటిన ఘనుడు శ్రీకృష్ణదేవరాయలు అని రాష్ట్ర హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, రాష్ట్ర ప్రభుత్వ హైపవర్ కమిటీ ఛైర్మన్ జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు అన్నారు. మంగళవారం రాత్రి కృష్ణా జిల్లా శ్రీకాకుళంలో శ్రీకాకుళేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఏపీ భాషా సాంస్కృతిక శాఖ, ఏపీ దేవాదాయ, ధర్మాదాయ శాఖ సహకారంతో దివి ఐతిహాసిక మండలి ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయలు మహోత్సవాలను జస్టిస్ దుర్గాప్రసాదరావు, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఏపీ భాషా సాంస్కృతిక శాఖ సీఈవో రేగుళ్ల మల్లికార్జునరావు, తదితర ప్రముఖులతో కలిసి ప్రారంభించారు. మొదట అతిథులకు రుత్వికులు భాస్కరాచార్యుల బృందంతో కలిసి పూర్ణకుంభంతో స్వాగతం పలికి సత్కరించారు. ఆలయంలో వారు ప్రత్యేక పూజలు జరిపారు. జస్టిస్ దుర్గాప్రసాదరావు మాట్లాడుతూ రాయలు వారు ఆంధ్రమహావిష్ణువును దర్శించి బస చేసినపుడు స్వామివారు కలలో కన్పించి మహా కావ్యాన్ని రాయమని ఆదేశించగా ఆముక్తమాల్యద రచనను ప్రాంగణంలో ప్రారంభించడం గొప్ప విశేషమన్నారు. ఆముక్తమాల్యద ప్రబంధం పంచ మహా కావ్యాలలో ఒకటిగా ఖ్యాతి పొందడం తెలుగు ప్రజలకు గొప్ప వరమన్నారు. ఎమ్మెల్యే మండలి మాట్లాడుతూ తెలుగుజాతి చరిత్ర శ్రీకాకుళం నుంచే ప్రారంభం అయ్యిందని, మొదట ఆంధ్ర రాజులు ఇక్కడి నుంచే పాలన సాగించారని పేర్కొన్నారు. 1518 ఫిబ్రవరి 11న శ్రీకృష్ణదేవరాయలు శ్రీకాకుళం విచ్చేసిన సందర్భాన్ని పురస్కరించుకొని 2007 నుంచి రాయలు వారి మహోత్సవాలను శ్రీకాకుళంలో జరుపుతున్నట్లు పేర్కొన్నారు. జస్టిస్ దుర్గాప్రసాదరావు, ప్రముఖ కవి దివంగత వేటూరి సుందరరామమూర్తి సతీమణి సీతామహాలక్ష్మమ్మ, డాక్టర్ స్మితా మాధవ్ తదితర ప్రముఖులను ఘనంగా సత్కరించారు. తొలుత 'శ్రీకాకుళం శ్రీమహావిష్ణువు' గ్రంథాన్ని జస్టిస్ దుర్గాప్రసాదరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ నియోజకవర్గ ప్రత్యేక అధికారి పి.సాయిబాబు, అభ్యుదయ తెలుగు అవధాని పాలపర్తి శ్యామలానందప్రసాద్, ఆలయ ఏసీ దాసరి శ్రీరామవరప్రసాద్, ఈవో చెన్నకేశవరావు, సీనియర్ పాత్రికేయులు మాశర్మ, కూటమి నాయకులు తుమ్మల చౌదరిబాబు, గొర్రెపాటి వెంకటరామకృష్ణ, తాడికొండ వెంకటేశ్వరరావు(చిన్నా), తోట కనకదుర్గ, కొల్లూరి వెంకటేశ్వరరావు, రవిప్రసాద్, కృష్ణమూర్తి, తహసీల్దార్ విజయప్రసాద్, ఎంపీడీవో సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



'శ్రీకాకుళం శ్రీమహావిష్ణువు' గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ దుర్గాప్రసాదరావు, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తదితరులు

భక్తుల కోర్కెలు తీర్చే తల్లి... మేరీమాత

గుణదల ఉత్సవాలకు పోటెత్తిన విశ్వాసులు

గుణదల, న్యూస్‌టుడే: విజయవాడ గుణదల మేరీమాత ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మంగళవారం రెండో రోజు ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా నెల్లూరు కథోలిక పీఠం సహవారస పీఠాధిపతి బిషప్ పిల్లి ఆంథోనిదాస్ హాజరై విశ్వాసులకు సందేశం ఇచ్చారు. మేరీమాత తన కుమారుడైన ప్రభువుకు సంపూర్ణమైన శిష్యురాలిగా జీవించారని, మనం కూడా ప్రభువులో పరిపూర్ణంగా జీవించాలని సూచించారు. భక్తుల కోర్కెలు తీర్చే తల్లిగా మేరీమాత నీరాజనాలు అందుకుంటోందని పేర్కొన్నారు. అనంతరం విజయవాడ కథోలిక పీఠం బిషప్ తెలగతోటి రాజారావు, బిషప్ పిల్లి ఆంథోనిదాస్, మోన్సిన్యోర్ మువ్వల ప్రసాద్, పుణ్య క్షేత్రం రెక్టర్ యేలేటి విలియం జయరాజు, డయోసిస్‌కు చెందిన 110 మందికిపైగా గురువులు సమిష్టి దివ్యపూజాబలి సమర్పించారు. రెండో రోజు గుణదల కొండ మార్గాలన్నీ జన సంద్రంగా మారాయి. భారీ సంఖ్యలో విశ్వాసులు వేడుకలకు హాజరయ్యారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



కిక్కిరిసిన గుణదల రోడ్డు



సమిష్టి దివ్యపూజాబలి సమర్పిస్తున్న బిషప్‌లు పిల్లి ఆంథోనిదాస్, తెలగతోటి రాజారావు



కొండపైన శిలువను దర్శించుకుంటున్న విశ్వాసులు

రేపు సిద్ధార్థ వైద్య కళాశాలలో స్టెమ్ సెల్ దాతల నమోదు

విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే: సిద్ధార్థ వైద్య కళాశాల అలూమ్ని, ధాత్రి సంస్థ సహకారంతో ఈ నెల 12వ తేదీ గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్టెమ్ సెల్ దాతల నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపల్ ఏడుకొండలరావు, సిద్ధార్థ పూర్వ విద్యార్థుల సంఘం (అలూమ్ని) ప్రతినిధి డా. అమ్మన్న, ధాత్రి ఫౌండేషన్ ప్రతినిధి డా. శివ తెలిపారు. మంగళవారం కళాశాలలోని ప్రిన్సిపల్ ఛాంబర్‌లో కార్యక్రమ గోడ పత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... స్టెమ్ సెల్ దానం ప్రాధాన్యంపై అవగాహన కల్పిస్తామని, 18-50 సంవత్సరాల వయసు గలవారు ఎవరైనా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. రక్త క్యాన్సర్, తలసీమియా, అప్లాస్టిక్ ఎనీమియా వంటి ప్రాణాంతక రక్త సంబంధిత వ్యాధులతో ఇబ్బంది పడుతున్న రోగులకు స్టెమ్ సెల్ మార్పిడి నిర్ధారిత ప్రాణ రక్షణ చికిత్స అని తెలిపారు. స్టెమ్ సెల్ దాతల నమోదు ప్రక్రియ సులభతరం, సురక్షితమైందని చెప్పారు. సమ్మతి పత్రం భర్తీ చేయడం, స్వాబ్ నమూనా తీసుకోవడం మాత్రమే ఉంటుందని తెలిపారు. ధాత్రి సంస్థ ప్రతినిధి సాయివిజయ తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న వైద్యులు అమ్మన్న, ఏడుకొండలరావు సాయివిజయ, శివ

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

జి.కొండూరు, న్యూస్‌టుడే: డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మైలవరం ఏసీపీ వై ప్రసాదరావు సూచించారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డ్రగ్స్‌పై దండయాత్ర సైకిల్ ర్యాలీ మంగళవారం మండలంలోని చెవుటూరుకు చేరుకున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా చదువుపై శ్రద్ధ వహించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు. సైకిల్ ర్యాలీ చెవుటూరు చేరుకునేసరికి విద్యార్థులు, గ్రామస్థులు ఘనస్వాగతం పలికి వెంకటాపురం, కుంటముక్కల గ్రామాల మీదుగా సాగింది. కార్యక్రమంలో మైలవరం సీఐ దాడి చంద్రశేఖర్, జి.కొండూరు ఎస్సై కె సతీష్‌కుమార్, తెదేపా జిల్లా కార్యదర్శి పజ్జూరు రవికుమార్, తెదేపా మండల అధ్యక్ష, కార్యదర్శులు వేములకొండ వెంకటేశ్వరరావు, లంకా నాగేశ్వరరావు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఉయ్యూరు వెంకటనరసింహారావు, వైస్ ఎంపీపీ పుప్పాల సుబ్బారావు, తెదేపా గ్రామ పార్టీ అధ్యక్షుడు పామర్తి వెంకటేశ్వరరావు, డీసీ ఛైర్మన్ ఉమ్మడి వెంకటస్వామి, ప్రత్తిపాటి ఆదాం, రామిశెట్టి స్వామి తదితరులు పాల్గొన్నారు.



చెవుటూరులో సాగిన సైకిల్ ర్యాలీ

కేరళలో భాజపా విజయం అద్భుత ఘట్టం

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: కేరళ రాజధాని తిరువనంతపురంలో భాజపా తొలిసారి మున్సిపల్ కార్పొరేషన్‌ను దక్కించుకోవడం ఒక అద్భుత ఘట్టమని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. ప్రధాని మోదీని కలిసేందుకు కేరళ ఎక్స్‌ప్రెస్‌లో దిల్లీ వెళ్తున్న కార్పొరేటర్లకు మంగళవారం విజయవాడ రైల్వేస్టేషన్‌లో భాజపా నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ.. గత 70 ఏళ్లలో కేరళ వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.. మార్క్సిస్టుల హింసాకాండలో సుమారు 76 మంది భాజపా కార్యకర్తలు ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. తిరువనంతపురం మేయర్‌గా ఎన్నికైన రాజేష్‌పై గతంలో రెండు సార్లు హత్యాయత్నాలు జరిగాయని, డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన ఆశ మూడు సార్లు కార్పొరేటర్‌గా గెలుపొందిన మహిళ అని, కూడా ఆమెపై కూడా దాడి చేశారన్నారు. విజయం సాధించిన 56 మంది కార్పొరేటర్లను ప్రధాని మోదీ స్వయంగా ఆహ్వానించారని తెలిపారు. శబరిమల పవిత్రతను కాపాడంలో కేరళ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. అనంతరం కార్పొరేటర్లను సత్కరించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా భాజపా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, ప్రోటోకాల్ ఇన్‌ఛార్జి పాతూరి నాగభూషణం, మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ బాషా, బొర్రా నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, పక్కన తిరువనంతపురం మేయర్ రాజేష్, డిప్యూటీ మేయర్ ఆశ, కార్పొరేటర్లు, నాగభూషణం తదితరులు

నాలుగు నూతన ఇసుక రేవులకు ఏజెన్సీలు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో నాలుగు నూతన ఇసుక రేవులను గుర్తించారు. వీటిలో మాన్యువల్ పద్ధతిలో ఇసుక తవ్వకాల నిమిత్తం ఇ-టెండర్ ప్రక్రియ ద్వారా ఏజెన్సీలను ఎంపిక చేయడానికి నిర్ణయించినట్లు కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశాన్ని నగరంలోని కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగ్గయ్యపేట మండలం మల్కాపురం, చందర్లపాడు మండలం ఏటూరు, ముప్పాళ్ల, ఘనిశెట్టిపాలెం రేవులను ఏజెన్సీలకు ఎంపిక చేసేవారు. సెమీ మెకనైజ్డ్ పద్ధతిలో చందర్లపాడు మండలం పొక్కునూరు-4 రేవులో ఇసుక తవ్వకానికి ఇ-టెండర్ ద్వారా ఏజెన్సీ ఎంపిక చేయడానికి నిర్ణయించినట్టు వివరించారు.

పట్టా భూముల్లో ఇసుక వెలికితీతకు అనుమతులు

పట్టా భూముల్లో ఇసుక వెలికి తీయడానికి.. పట్టాదారులు జ్వాలా ప్రసాద్(మల్కాపురం, జగ్గయ్యపేట మండలం), గంటా లక్ష్మణ్ (దాములూరు, ఇబ్రహీంపట్నం మండలం)లకు అనుమతులు మంజూరు చేసినట్టు వెల్లడించారు. జిల్లాలో ఇసుకకు కొరత లేదన్నారు. అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కమిటీ మెంబర్ కన్వీనరు శ్రీనివాసకుమార్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

ప్రజల జీవన ప్రమాణాల పెంపే లక్ష్యం

కనకదుర్గ ఆలయ బృహత్ ప్రణాళిక కొలిక్కి తెస్తాం

విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి వెల్లడి

ఈనాడు - అమరావతి: విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో ప్రజల జీవన ప్రమాణాలను పెంచడమే లక్ష్యంగా నిర్దేశించుకుని.. ముందుకు సాగుతున్నట్లు ఎమ్మెల్యే సుజనా చౌదరి అన్నారు. కేంద్ర, రాష్ట్ర నిధులతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన నియోజకవర్గ ర్యాంకింగ్‌లో విజయవాడ పశ్చిమ అగ్రస్థానంలో ఉండడం ఆనందంగా ఉందన్నారు. ఇందులో ప్రజల సహకారం ఎంతో ఉందన్నారు. ఇప్పటి వరకు 25 శాతం చేశానని, ఇంకా చేయాల్సింది చాలా ఉందన్నారు. మంగళవారం.. కార్యాలయంలోని తన నివాసంలో సుజనా చౌదరి విలేకరులతో మాట్లాడారు. 'నో చంద.. నో దండ' నినాదంతో తాను ముందుకు వెళ్తున్నానని చెప్పారు.

ప్రజలకు వైద్యం అందించడంపై ప్రధానంగా దృష్టి సారించానని, గిరిజలకు ప్రగతి కేంద్రాల ఏర్పాటు, పాఠశాలల్లో స్వచ్ఛంద సంస్థల తోడ్పాటుతో మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. ప్రజల చెంతకే వైద్య సేవలు అందించేందుకు మొబైల్ ఆరోగ్య వ్యాన్‌లను ప్రారంభించామన్నారు. పశ్చిమ నియోజకవర్గంలోని మినీ ఫారెస్ట్ ఎకోపార్కు, ప్రజల సహకారంతో అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే వివరించారు.

కనకదుర్గ ఆలయ బృహత్ ప్రణాళిక ఖరారుకు వివిధ శాఖల పరంగా ఉన్న సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. త్వరలో ఎంపీ కేశినేని చిన్ని, దేవాదాయ శాఖ కమిషనర్‌తో చర్చలు జరపనున్నామన్నారు. శాఖల మధ్య ఇబ్బందులను పరిష్కరించి.. సమూనాలను కొలిక్కి తీసుకువస్తామని సుజనా స్పష్టం చేశారు.

'చంద్రబాబుపై అంబటి వ్యాఖ్యలు సిగ్గుచేటు'

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబుపై వైకాపా నాయకుడు అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటని మాజీ కేంద్ర మంత్రి చింతా మోహన్ అన్నారు. మంగళవారం గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాంబాబును గత 15 ఏళ్లుగా గమనిస్తున్నానని మీడియా సమావేశాల్లో చాలా చక్కగా మాట్లాడతారని కానీ ఆరోజు చంద్రబాబుపై చేసిన వ్యాఖ్యలు దారుణంగా ఉన్నాయని జగన్ దీనిపై స్పందించకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని చెప్పారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా గౌరవప్రదమైన స్థానంలో ఉన్నారని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌గా వ్యవహరించాలని అందర్నీ కలుపుకొని పోవాలని అలాకాకుండా ప్రతిపక్షాలను డౌన్ చేయడం సరికాదన్నారు. రూ.700 కోట్లకు సంబంధించి మద్యం కుంభకోణం నిందితుడు రాజ్ కెసిరెడ్డిని ఉద్దేశించి సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు బాధాకరమని, అవి ఏపీకి చాలా మచ్చ అని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ ఫైనాన్స్ కార్పొరేషన్లు తిరిగి ప్రారంభించడంతో పాటు ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు బడ్జెట్‌లో రూ.వేయి కోట్లు కేటాయించాలని కోరారు. సమావేశంలో దళిత నాయకులు అన్నవరపు కిషోర్, కత్తి అరుణ్‌కుమార్, మాధవ్, శ్రీకాంత్, సందీప్, వెంకటేష్, బాబీ, దాసు, ప్రసాద్, సమీఉల్లా తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో ఒక్కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 213 చికెన్ స్కిన్‌లెస్ - 243.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & బ్రీడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 137, 146, 157 చికెన్ విత్ స్కిన్ - 260 చికెన్ స్కిన్‌లెస్ - 270.

సంతృప్తికరంగా గుంటూరు.. వెనుకబాటులో ఎన్టీఆర్, కృష్ణా

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: 'గుంటూరు జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారులు, ఉద్యోగులు ఎఫ్ఆర్ఎస్ హాజరు 100 శాతం వేస్తున్నారు. రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఐవీఆర్ఎస్ సర్వేలోనూ ముందంజలో ఉంది. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల అధికారులు, ఉద్యోగుల పనితీరు తీసికట్టుగా ఉంది. జిల్లా, సబ్ డివిజన్ల అధికారులు వసతి గృహాలను నామమాత్రంగా తనిఖీలు చేస్తున్నారు. ఇలాగే ఉంటే మీ అందరిపై చర్యలు తప్పవు'.. అని ఉన్నతాధికారులు హెచ్చరించారు. గుంటూరులోని ఏపీ ఎన్జీజీవోల సంఘం కల్యాణ మండపంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల, ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, పశ్చిమ గోదావరి, ప్రకాశం, మార్కాపురం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలకు చెందిన బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారులు, సహాయ బీసీ సంక్షేమాధికారులు, వసతి గృహాల అధికారులు, మహాత్మ జ్యోతిబా పులే గురుకులాల ప్రిన్సిపల్స్‌తో ప్రాంతీయ సమీక్ష సమావేశం మంగళవారం జరిగింది. జిల్లాల వారీగా హెచ్‌డబ్ల్యూవోల పనితీరును రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత, ఆ శాఖ రాష్ట్ర ఎక్స్-అఫీషియో ముఖ్య కార్యదర్శి సత్యనారాయణ, సంచాలకులు మల్లికార్జున సమీక్షించారు.

●● ఎన్టీఆర్ జిల్లాకు చెందిన వసతి గృహాల పనితీరు తీసికట్టుగా ఉందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ●● విజయవాడలోని బాలికల వసతి గృహంలో ఆర్వో ప్లాంట్ లేకున్నా వారం రోజులకు నీటిని మార్పిస్తున్నామని హెచ్‌డబ్ల్యూవో రజిని చెప్పడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ●● సమీక్షకు గైర్హాజరైన మైలవరం వసతి గృహం హెచ్‌డబ్ల్యూవో రమాదేవిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మీ వైఖరి మారకుంటే ఎన్టీఆర్ జిల్లా బీసీ సంక్షేమాధికారి, ఏబీసీడబ్ల్యూవోలు, హెచ్‌డబ్ల్యూవోలు అందరినీ వేర్వేరు జిల్లాలకు బదిలీ చేస్తామని హెచ్చరించారు. ●● మచిలీపట్నం ఏబీసీడబ్ల్యూవో, పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జి డీబీసీడబ్ల్యూవోలు వసతి గృహాలను తక్కువగా తనిఖీ చేయడంపై ప్రశ్నించగా.. తనిఖీ చేశామని.. ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదనడంతో మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉద్యోగులు ఎఫ్ఆర్ఎస్‌లో 26 శాతం మంది మాత్రమే హాజరు వేయడంపై మంత్రి నిలదీశారు. ●● 2024-25 పదో తరగతి వార్షిక పరీక్షల్లో బాపట్ల జిల్లా 100 శాతం ఉత్తీర్ణత సాధించినందుకు ఆ జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారిని అభినందించారు. ఎన్టీఆర్ జిల్లా అధికారి పనితీరుపై మంత్రి, ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జి బీసీ సంక్షేమాధికారి అదనపు బాధ్యతలతో పూర్తి స్థాయిలో దృష్టి సారించలేకపోతున్నట్లు చెప్పడంతో కలెక్టర్‌కు లేఖ రాసి అదనపు విధులు తప్పిస్తామని ముఖ్య కార్యదర్శి సత్యనారాయణ ప్రకటించారు.



సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా అధికారులు

నీళ్ల కోసం.. రోడ్డెక్కిన రైతన్న

జగ్గయ్యపేట గ్రామీణం, బోనకల్లు, న్యూస్‌టుడే: 'చేతికి అందివస్తున్న మొక్కజొన్న నిలువునా ఎండిపోయే పరిస్థితి ఉంది.. వెంటనే నీళ్లు ఇచ్చి పంటను కాపాడాలని' కోరుతూ ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండల రైతులు మంగళవారం ఆంధ్రా-తెలంగాణ సరిహద్దులో వైరా-జగ్గయ్యపేట ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రోడ్డుపై బైఠాయించారు. బోనకల్లు బ్రాంచి కాలువ కింద వత్సవాయి, వీరులపాడు, నందిగామ మండలాలకు చెందిన భూములున్నాయి. ఈ కాలువ సామర్థ్యం 1350 క్యూసెక్కులు కాగా.. కేవలం 900 క్యూసెక్కుల నీటినే విడుదల చేయడంతో బోనకల్లు మండలం దాటి నీళ్లు వెళ్లడం లేదు. వత్సవాయికి కేవలం 30 క్యూసెక్కులు మించి రావడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బీబీసీకి పూర్తి స్థాయిలో నీటిని విడుదల చేసి దాములూరు మేజర్‌కు 350 క్యూసెక్కులు ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. ఆందోళన విరమింపజేసేందుకు ఎన్టీఆర్ జిల్లా ఎన్నెస్పీ డీఈ, ఏఈలు రైతుల వద్దకు వచ్చి నచ్చజెప్పినా శాంతించలేదు. ఖమ్మం సీఈవోతో మాట్లాడి నీటిని విడుదల చేయిస్తానని ఎన్టీఆర్ జిల్లా ఎన్నెస్పీ ఎస్ఈ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమింపజేశారు.



రాస్తారోకో చేస్తున్న వత్సవాయి మండల కర్షకులు

విద్యాభివృద్ధికి సహకారం అభినందనీయం

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: ఎంతో మంది పేద, మధ్య తరగతి విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించడంతో పాటు ప్రతిభావంతులకు ఉపకార వేతనాలు అందించి విద్యాభివృద్ధికి సహకరించడం అభినందనీయమని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. సిద్ధార్థ ఫౌండేషన్ 27వ వార్షిక ఉపకార వేతనాల పంపిణీ మంగళవారం రాత్రి సిద్ధార్థ ఆడిటోరియంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సిద్ధార్థ ఫౌండేషన్ అధ్యక్షుడు మలినేని రాజయ్య, కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు మాట్లాడుతూ.. 2025-26 విద్యా సంవత్సరానికి గాను సిద్ధార్థ విద్యార్థులతో పాటు వివిధ ప్రాంతాల్లో చదువుతున్న 750 మంది విద్యార్థులకు రూ.63 లక్షలు ఉపకార వేతనంగా ఇచ్చినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు 19 వేల మంది విద్యార్థులకు రూ.8 కోట్లు అందించామని గుర్తు చేశారు. ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు వెల్లంకి నాగభూషణరావు, సంయుక్త కార్యదర్శి నిమ్మగడ్డ లలితాప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.



విద్యార్థికి చెక్కు అందజేస్తున్న అధ్యక్షుడు రాజయ్య, వేదికపై కార్యదర్శి లక్ష్మణరావు

నందిగామ

•నందిగామ •జగ్గయ్యపేట

దోమలు.. దుర్వాసనతో ఇబ్బందులు

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని కొత్త వెంకటేశ్వరస్వామి దేవాలయం రోడ్డులో ఉన్న శ్రీలక్ష్మీబాలా నిలయం వద్ద డ్రెయినేజీ పూడిక సరిగా తీయకపోవడంతో మురుగు నిల్వ ఉండి స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. మురుగు నిల్వ కారణంగా దోమలు విపరీతంగా పెరిగి స్థానికులు దోమకాటుకు గురవుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి డ్రెయినేజీ పూడిక తీయించాలని స్థానికులు కోరుతున్నారు.



డ్రెయినేజీలో నిల్వ ఉన్న మురుగు

రేపు డయల్ యువర్ మున్సిపల్ కమిషనర్

ఈనాడు మీతోడు

జగ్గయ్యపేట పట్టణంలో పారిశుద్ధ్యం, తాగునీరు, రహదారులు, చెత్త తరలింపు, వీధి దీపాలు, ఇంటి పన్నుల విషయంలో ఏమైనా సమస్యలు ఎదురవుతున్నాయా? అయితే వీటి పరిష్కారానికి 'ఈనాడు' ఆధ్వర్యంలో ఈ నెల 12న నిర్వహించే 'ఫోన్ ఇన్' కార్యక్రమంలో కమిషనర్ డీటీ వెంకటకృష్ణారావు పాల్గొంటారు. మీ ప్రాంత సమస్యలను ఫోన్‌లో ఆయన దృష్టికి తీసుకెళ్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తారు. - న్యూస్‌టుడే, జగ్గయ్యపేట గ్రామీణం



వెంకటకృష్ణారావు

98499 05823 | గురువారం (12-02-2026) | సమయం: ఉదయం 10.30 నుంచి 11.30 వరకు

మొక్కల తొలగింపు

కంచికచర్ల, న్యూస్‌టుడే: కంచికచర్ల వద్ద జాతీయ రహదారిపై నిర్మించిన బైపాస్ గోడపై మర్రి, రావి మొక్కలు పెరుగుతుండడంతో ఈ నెల 9న 'వేళ్లూనుతున్న నిర్లక్ష్యం' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురించిన వార్తకు అధికారులు స్పందించి తొలగించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నందిగామ: స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గోపాల్ కోరారు. మంగళవారం వైద్యశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ నాగేశ్వరరావు, సూపరింటెండెంట్ సత్యనారాయణకు సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు వినతిపత్రం అందజేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఎండకు ఎండి.. వానకు తడిసి..

పుణ్యక్షేత్రంలో బస్ స్టేషన్ లేక నరకయాతన

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ పుణ్య క్షేత్రాల్లో ఒకటిగా పెనుగంచిప్రోలు విరాజిల్లుతోంది. దీనికి తగ్గట్టుగానే వేలాది మంది భక్తులు తిరుపతమ్మ దర్శనానికి తరలి వస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్నప్పటికీ ఆర్టీసీ బస్ స్టేషన్ నోచుకోలేదు. జగ్గయ్యపేట ఆర్టీసీ డిపో పెనుగంచిప్రోలు ఆలయానికి వచ్చే భక్తులు, ఇతర ప్రయాణికుల వల్లనే పెద్ద మొత్తంలో ఆదాయం పొందుతుంది. ఈ విషయం ఆర్టీసీ ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులకు తెలిసినా బస్ స్టేషన్ నిర్మాణంపై దృష్టి సారించట్లేదని, ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పెనుగంచిప్రోలు నుంచి విజయవాడ, మధిర, జగ్గయ్యపేట, ఖమ్మం, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు ఆర్టీసీ బస్సుల రాకపోకలు సాగిస్తుంటాయి. బస్సుల కోసం ప్రయాణికులు రోడ్డుపైనే గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక సీఎం స్త్రీశక్తి పథకం ప్రవేశపెట్టడం ద్వారా 90 శాతంకు పైగా మహిళలు ప్రయాణిస్తున్నారు. కానీ వారికి షెల్టర్ అంటూ లేకపోవడం శోచనీయం. స్థానిక పోలీస్ స్టేషన్, సత్రం సెంటర్, చెరువు కట్ట, హైస్కూల్, పాత సినిమా హాలు సెంటర్ల వద్ద రోడ్లపైనే నిలిచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. నాలుగు రోడ్ల కూడలిగా ప్రధాన సెంటరుగా.. పోలీస్ స్టేషన్ సెంటర్‌లో పెద్ద సంఖ్యలో దుకాణాల ముందు, రోడ్లపై ప్రయాణికులు వేచి ఉంటున్నారు. కనీసం కూర్చోవడానికి అవకాశం లేక నిలబడుతున్నారు. ఈ పరిస్థితుల్లో వృద్ధులు, మహిళలు, పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. బస్సులన్నీ నేరుగా ఆలయం వద్దకు వెళ్లి వెనక్కి వస్తుంటాయి. ప్రత్యేకంగా బస్ స్టాండ్ లేకపోవడం వల్ల ఇబ్బందికరంగా ఉంటోందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పోలీస్ స్టేషన్ సెంటర్‌లో ప్రయాణికుల నిరీక్షణ

ఇక ఉత్సవాల సమయంలో ఆలయం వద్దకు వెళ్లడానికి వీలు లేకుండా పోయింది. దీంతో ఆలయం వరకు నడిచి వెళ్లాల్సి ఉంటుంది. రెండు దశాబ్దాల క్రితం బస్ స్టేషన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. అప్పట్లో స్థల విషయంలో ఇబ్బందులు రావడంతో నిధులు వెనక్కి వెళ్లాయి. తర్వాత ఎవ్వరూ పట్టించుకోలేదు.

మరుగుదొడ్లు లేక అవస్థలు పడుతున్నాం..

ముఖ్యంగా మహిళలు, పిల్లలు శౌచాలయం అందుబాటులో లేకపోవడం వల్ల అవస్థలు పడుతున్నారు. ఇంటి నుంచి బయటకు వస్తే మళ్లీ గమ్యస్థానాలకు వెళ్లే వరకు నానా అవస్థలుపడుతున్నాం. ముఖ్యంగా పోలీసు స్టేషన్ సెంటర్‌లో మరుగుదొడ్లు లేకపోవడం వల్ల తీవ్ర అసౌకర్యంగా ఉంది. ఈ సమస్యపై అధికారులు స్పందించాలి.

- శివరాంబొట్ల కొండలు శర్మ, పెనుగంచిప్రోలు స్థానికుడు

తప్పిన ప్రమాదం

పెద్దాపురం(వీరులపాడు), న్యూస్‌టుడే: మండలంలోని పెద్దాపురంలో మంగళవారం అగ్ని ప్రమాదం సంభవించింది. అగ్నిమాపక అధికారి శివారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. పెద్దాపురంలో జయంతి గ్రామానికి వెళ్లే రహదారిలో రోడ్డు పక్కన స్థానికుడు హనుమంతరావుకు చెందిన దుంగలకు నిప్పు అంటుకోవడంతో ప్రమాదం జరిగింది. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. శకటం సమయానికి సంఘటన స్థలానికి చేరుకోవడంతో ప్రమాదం తప్పిందని అగ్నిమాపక అధికారి తెలిపారు.

సహజ రంగుల అద్దకంపై శిక్షణ

నందిగామ గ్రామీణం: గ్రామీణ మహిళలకు జీవనోపాధి కల్పించాలనే లక్ష్యంతో విజయవాడ జిల్లా వనరుల కేంద్రం(డీఆర్‌సీ), గరికపాడు కేవీకే సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు స్వయం ఉపాధి కింద చేతివృత్తులపై శిక్షణ ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు వస్త్రాలపై సహజరంగుల అద్దకం (టైఅండ్‌డై), పుట్టగొడుగుల పెంపకంపై స్వల్పకాలిక శిక్షణ ఇచ్చారు. కేవీకే గృహవిజ్ఞాన శాస్త్రవేత్త ఆర్. ప్రభావతి వీరికి తర్ఫీదునిచ్చారు.

సేంద్రియ సాగులో రాష్ట్రం ప్రథమ స్థానం

చందర్లపాడు, న్యూస్‌టుడే: సేంద్రియ సాగులో దేశంలోనే రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉందని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. ముప్పాళ్ల రైతు పోలకం నాగేశ్వరరావు సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్న జామ, టమాటా, సొర పంటలు, సోమశేఖర్‌కు చెందిన కొబ్బరి తోటను కలెక్టర్ మంగళవారం సందర్శించారు. చీడపీడల నివారణకు రైతు తయారు చేసుకున్న జీవామృతాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముప్పాళ్ల, పున్నవల్లిలో ఏర్పాటు చేసిన రైతు ఉత్పత్తిదారుల సంఘాల కార్యకలాపాలపై ఆరా తీశారు. ప్రకృతి వ్యవసాయం వల్ల భూసారం పెరుగుతుందని, రోగాల బారి నుంచి కాపాడుకోవచ్చునని చెప్పారు. అన్నదాతలు యూరియా వాడకం తగ్గించాలని సూచించారు. ఆర్డీవో బాలకృష్ణ, తహసీల్దారు వాసిరెడ్డి రామకోటేశ్వరరావు, సహకార సంఘ అధ్యక్షుడు నల్లాని రవికుమార్, మండల వ్యవసాయాధికారి గింజుపల్లి రమేష్, ఉత్పత్తిదారుల సంస్థల నిర్వాహకులు రావూరి రమేష్, వాసిరెడ్డి వంశీ తదితరులు పాల్గొన్నారు.



జీవామృతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

భూముల రికార్డులు పరిశీలన

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: భూముల రీసర్వే పనులు పారదర్శకంగా నిర్వహించాలని తహసీల్దారు నూతక్కి సురేష్ బాబు గ్రామ సర్వేయర్లను ఆదేశించారు. మంగళవారం కొండూరులో కొనసాగుతున్న రీసర్వే, భూముల రికార్డులను పరిశీలించారు. గ్రామంలో 1,430 ఎకరాల భూములుండగా 1150 ఎకరాల్లో రీసర్వే పూర్తయిందని తెలిపారు. భూముల విస్తీర్ణాలు, సరిహద్దు వివాదాలను పారదర్శకంగా, జవాబుదారీతనంగా నిర్వహించాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దారు శ్రీరాములు, వీఆర్వో అంజయ్య, గ్రామ సర్వేయర్లు గాంధీ, మీన తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దారు సురేష్‌బాబు

భూముల రీసర్వేలో తేడాలపై ధ్వజం

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: గ్రామాల్లో భూముల రీసర్వే ప్రారంభమైనప్పటి నుంచి కొలతల్లో అవకతవకలు వల్ల ఇబ్బందులు వస్తున్నాయని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ మార్కపూడి గాంధీ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, సుబ్బాయిగూడెం ఎంపీటీసీ సభ్యుడు వెల్ది ప్రభాకర్, సర్పంచి పాపినేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రీ సర్వేలో సిబ్బంది తప్పిదాల వల్ల ఐదు, పది సెంట్లకు భూమి కొలతలు తక్కువగా వస్తున్నాయని ధ్వజమెత్తారు. సబ్ డివిజన్ అయిన భూముల్లోనూ ఇదే పరిస్థితి ఉందని చెప్పారు. దీనిపై రెవెన్యూ అధికారులు సరైన సమాధానం చెప్పట్లేదన్నారు. డిప్యూటీ తహసీల్దారు నాగుల్‌మీరా మాట్లాడుతూ రైతులకు నోటీసులు ఇచ్చి వారి అభ్యంతరాలు తీసుకున్న తర్వాతే సర్వే ఓకే చేస్తున్నామని చెప్పారు. ఏదైన తేడాలు వస్తే పరిష్కరిస్తామన్నారు. గత ప్రభుత్వం హయాం నుంచి తమకు గౌరవ వేతనాలు అందటం లేదని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యురాలు ఊట్ల నాగమణి, ఎంపీడీవో శ్రీనుకు వినతిపత్రం అందజేశారు. గౌరవవేతనాలు ఇవ్వాలని సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసుకునే అవకాశం సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులకు ఇవ్వాలని, జీఎస్టీ ఎత్తివేయాలని కోరుతూ తీర్మానించారు. పంచాయతీరాజ్ ఏఈ సుందరరామయ్య మాట్లాడుతూ ముచ్చింతాల నుంచి తాళ్లూరు, లింగగూడెం నుంచి గౌరవరం వరకు పంచాయతీరాజ్ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని చెప్పారు. ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో మండలాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. వ్యవసాయశాఖ అధికారి రామసుబ్బారెడ్డి, పశువైద్యాధికారి అనీల్, సర్పంచులు దేవి, సుధాకర్, వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎంపీపీ గాంధీ, జడ్పీటీసీ సభ్యురాలు నాగమణికి వినతిపత్రం ఇస్తున్న ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు

సమకూరిన షెడ్డు



పాఠశాల నుంచి ఇతర గ్రామాలకు వెళ్లే విద్యార్థులు ఎండలో రోడ్డుపై వేచి ఉండకుండా రేకుల షెడ్డును దాత సహకారంతో పాఠశాల ముందు ఏర్పాటు చేస్తున్నారు. అల్లూరు జడ్పీ పాఠశాల ప్లస్, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న చట్టన్నవరం, చౌటపల్లి, పెద్దాపురం, గూడెం మాధవరం గ్రామాల విద్యార్థులు ఇంటికి వెళ్లేటప్పుడు ఆటో, బస్సు కోసం ఎండలో నిల్చొని అవస్థలు పడుతున్నారు. కర్ల మరియమ్మ తన కొడుకు కర్ల నాని జ్ఞాపకార్థం రూ.లక్ష నిధులతో షెల్టర్ నిర్మాణం చేపట్టారు. ఆమె దాతృత్వం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- న్యూస్‌టుడే, అల్లూరు(వీరులపాడు)

గొయ్యుంది.. చూసి వెళ్లండి...

పెద్దాపురం నుంచి తిమ్మాపురం వెళ్లే రహదారిలో ఏర్పడిన గుంత ప్రమాదకరంగా ఉంది. దారిలో తూములు మధ్య దూరం పెరగడంతో గొయ్యి ఏర్పడింది. రాత్రి వేళ సాగాలంటే ఇబ్బంది తప్పడం లేదు. అధికారులు స్పందించి మరమ్మతులు చేసి గొయ్యి పూడ్చాలని గ్రామస్థులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, తిమ్మాపురం(వీరులపాడు)**



ప్రమాద చిహ్నం ఏర్పాటు చేసిన స్థానికులు

కోదండ రామాలయంలో విశేష పూజలు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలులోని జమ్మిచెట్టు కోదండ రామాలయంలో ఆంజనేయ స్వామి, సుబ్రహ్మణ్యం స్వామికి మంగళవారం ఆలయ పూజారి పరాంకుశం బాలకృష్ణమాచార్యులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. స్వామివార్లను భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



సుబ్రహ్మణ్య స్వామికి పూజలు చేస్తున్న మహిళలు

ఉద్యాన పంటల్లో సమస్యలపై అవగాహన

జగ్గయ్యపేట గ్రామీణం: బూదవాడ గ్రామంలో ఉద్యాన పంటల్లో నెలకొన్న సమస్యలపై మంగళవారం ఉద్యానశాఖ అవగాహన కార్యక్రమం నిర్వహించింది. కేవీకే ఉద్యాన విభాగ శాస్త్రవేత్త డా. కె. లక్ష్మీకళ పాల్గొని పంటను పరిశీలించారు. మిరప పంటలో ట్రైకోడెర్మా విరిడి ఉపయోగం, జీవన ఎరువుల వాడకం, జిగురు అట్టల ఆవశ్యకతను వివరించారు. ఉద్యానశాఖ అధికారి నీలిమ పాల్గొన్నారు.



మిరప పంటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారులు

గుంతల పూడ్చివేత

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ఈనెల 6న 'దారులు బాగుపడేదెప్పుడో' శీర్షికతో ఈనాడు లో ప్రచురితమైన కథనానికి ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించారు. జగ్గయ్యపేట నుంచి జాతీయ రహదారికి వెళ్లే మార్గంలో ఉన్న గుంతలను సంస్థ డీఈ పరుశురాముడు దగ్గర ఉండి పూడ్పించారు. వాహనదారులు సంతోషం వ్యక్తం చేశారు.



గుంతలు పూడుస్తున్న సిబ్బంది

రూ.80 లక్షలతో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రతి వార్డులో మౌలిక సదుపాయాలు కల్పనే లక్ష్యంగా ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర 29, 30, 31 వార్డుల్లో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 29వ వార్డులో డ్రెయినేజీ సమస్యలు, 30వ వార్డులో ఎర్రకాలువ కట్టపై ఉన్న కల్వర్టుల ఎత్తు పెంచాలని, 31వ వార్డులో అంతర్గత రోడ్డు పనులు తక్షణమే ప్రారంభించాలని స్థానికులు కోరారు. ఈ సమస్యలు పరిష్కరించడానికి రూ. 80లక్షల అంచనా వ్యయంతో త్వరలో పనులు చేపట్టబోతున్నట్లు ఎమ్మెల్యే తెలియజేశారు. వార్డు కౌన్సిలర్లు, నాయకులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

తిరునాళ్ల ఏర్పాట్ల పరిశీలన


నందిగామ గ్రామీణం: దాములూరు శివారు కూడలి సంగమేశ్వరస్వామి దేవాలయం వద్ద మహాశివరాత్రి తిరునాళ్ల ఏర్పాట్లను తహసీల్దారు నూతక్కి సురేష్‌బాబు మంగళవారం పరిశీలించారు. ఎగ్జిబిషన్‌లో జెయింట్‌వీల్‌కు పోలీసు, అగ్నిమాపకశాఖల అనుమతులు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. దుకాణాల ఏర్పాటుకు వేలం నిర్వహిస్తామని కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచి రామారావు తెలిపారు. ఈవో ఎన్.నరసింహమూర్తి, డీటీ శ్రీరాములు, వీఆర్వో ముకుంద తదితరులు పాల్గొన్నారు.



వివరాలు ఆరా తీస్తున్న తహసీల్దారు

డిజిటల్ అసిస్టెంట్ మృతికి పలువురి నివాళి

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: వత్సవాయి మండలం భీమవరం గ్రామానికి చెందిన గువ్వల అశోక్(33) గుండెపోటుతో మృతి చెందారు. వత్సవాయి పోలీసులు తెలిపిన సమాచారం మేరకు అశోక్ జయంతిపురం గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. రోజుమాదిరిగా వాకింగ్‌కు వెళ్లిన సమయంలో గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. భార్య గర్భవతి కాగా, ఏడాది వయసు పాప ఉన్నారు. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. అశోక్ మృతదేహాన్ని తెదేపా సమన్వయ కమిటీ సభ్యుడు శ్రీరాం చిన్నబాబు, ఎంపీడీఓ జి.నితిన్ సందర్శించి ఘనం నివాళులు అర్పించారు. భీమవరంలోని అశోక్ ఇంటివద్ద ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జి తన్నీరు నాగేశ్వరరావు పాల్గొని నివాళులు అర్పించారు.



గువ్వల అశోక్ (పాతచిత్రం)

రోడ్డు ప్రమాదంలో తల్లీకుమార్తెలకు తీవ్రగాయాలు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై పెనుగంచిప్రోలు మండలం కొణకంచి అడ్డరోడ్డు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లితోపాటు ఆరేళ్ల కుమార్తెకు తీవ్రగాయాలయ్యాయి. తెలంగాణా రాష్ట్రం యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం, కొండగడప గ్రామానికి చెందిన వరికుప్పల వెంకటేష్ అమరావతిలో కంప్రెసర్ ట్రాక్టరు పనులు చేస్తున్నారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు మంగళవారం ఉదయం అమరావతి నుంచి స్వగ్రామానికి పల్సర్ బైక్‌పై భార్య రజిత, కుమార్తె అమృతవర్షిణితో కలిసి బయలుదేరారు. కొణకంచి అడ్డరోడ్డు వద్ద ఎదురుగా వచ్చిన మోటారు సైకిల్ వీరి బండిని ఢీకొంది. దీంతో తల్లి, కుమార్తె రోడ్డుపై పడ్డారు. అదే సమయంలో వెనకనుంచి వచ్చిన ట్రాక్టర్ వీరి పైగా వెళ్లడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 అంబులెన్స్‌లో విజయవాడకు తరలించారు. రజిత చెయ్యి నుజ్జునుజ్జవ్వగా, అమృతవర్షిణి కాలు విరిగింది. రోజువారీ పనులు చేసుకునే కుటుంబం పరిస్థితి ఒక్కసారిగా తలకిందులు కావటంతో వెంకటేష కన్నీరుమున్నీరయ్యారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

17, 18 తేదీల్లో రాష్ట్రస్థాయి ఎడ్ల పూటీ లాగుడు పోటీలు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని దాములూరు శివారు కూడలి సంగమేశ్వరస్వామి దేవాలయ ఆవరణలో మహాశివరాత్రి తిరునాళ్లను పురస్కరించుకుని ఈ నెల 17, 18 తేదీల్లో తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల పూటీ లాగుడు పోటీలు నిర్వహిస్తున్నామని ఆలయ ఛైర్మన్ గింజుపల్లి శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. విజేతలకు దాతల సౌజన్యంతో నగదు ప్రోత్సాహకాలు ఉంటాయని అన్నారు. ఎంపీ కేశినేని శివనాథ్ పోటీలు ప్రారంభిస్తారని, బహుమతుల పంపిణీకి జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య, కేడీసీసీబీ ఛైర్మన్ నెట్టెం రఘురాం తదితరులు హాజరవుతున్నారని చెప్పారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు


కంచికచర్ల, న్యూస్‌టుడే: కంచికచర్ల విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలోని 2 టౌన్ ఫీడర్ లైనుకు బుధవారం మరమ్మతులు నిర్వహిస్తున్నందున మండల పరిషత్ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్, నవభారత్ కాలనీ, పశువుల ఆసుపత్రి మార్గం, జుజ్జూరు రోడ్డు, వసంత, ఇందిరా, మోడల్ కాలనీలు, హనుమాన్ పేట, తీగల బజార్, ప్రణీత కాలనీ, పొన్నవరం తదితర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్తు శాఖ ఏఈ దిబ్బయ్య తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అన్నప్రసాదం వితరణ

నందిగామ గ్రామీణం న్యూస్‌టుడే : నందిగామ శివారు అనాసాగరం భక్తాంజనేయస్వామి దేవాలయంలో భక్తులకు మంగళవారం అన్నప్రసాదం వితరణ చేశారు. గత 33 మాసాలుగా ప్రతి నెలా రెండో మంగళవారం దాతల సౌజన్యంతో భక్తులకు అన్నదానం చేస్తున్నామని నిర్వాహకుడు గుండాల బాలాజీ తెలిపారు.

తక్కువ పెట్టుబడితో పుట్టగొడుగుల పెంపకం

పల్లగిరి (నందిగామ గ్రామీణం): పల్లగిరిలో జిల్లా వనరుల కేంద్రం(డీఆర్‌సీ), రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకంలో భాగంగా మహిళలకు పుట్టగొడుగుల పెంపకంపై నిర్వహించిన రెండు రోజుల శిక్షణ, అవగాహన తరగతులు మంగళవారం ముగిశాయి. డీఆర్‌సీ(విజయవాడ) డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ డి.వెంకటేశ్వర్లు, గరికపాడు కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త, శిక్షణ కో ఆర్డినేటర్ డాక్టర్ ఆర్.ప్రభావతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. శిక్షణ పొందిన మహిళలకు ధ్రువపత్రాలు అందజేశారు. డాక్టర్ ప్రభావతి మాట్లాడుతూ మహిళలు, రైతులు తక్కువ పెట్టుబడితో పుట్టగొడుగులు సాగు చేసి అధిక ఆదాయం పొందాలని కోరారు. వీటి సాగు కోసం బెడ్ తయారీ, గది ఉష్ణోగ్రత నిర్వహణ, తేమ శాతం, వరి గడ్డిని శుద్ధిచేయడం, విత్తనాల లభ్యతపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ధ్రువపత్రాలు అందిస్తున్న డీడీఏ వెంకటేశ్వర్లు, శాస్త్రవేత్త ప్రభావతి



దుర్గైకి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే పూండి కలైవనన్

తండ్రి నిజాయతీ.. కుమారుణ్ని కాపాడింది!

చెన్నై(అర్బన్‌నగర్), న్యూస్‌టుడే: కుమారుడి శస్త్ర చికిత్సకు డబ్బులు పెద్ద మొత్తంలో అవసరమవున్నా రోడ్డుపై దొరికిన బంగారు ఆభరణాలను పోలీసులకు అప్పగించిన ఓ పారిశుద్ధ్య కార్మికుడి వ్యక్తిత్వానికి బహుమానం లభించింది. ఇటీవల తమిళనాడు రాజధాని చెన్నైకు చెందిన ఓ వ్యక్తి తన కుమార్తె వివాహం కోసం కూడబెట్టిన 20 సవర్ల బంగారు నగలను వారి కుటుంబీకులు తిరువారూర్ తీసుకెళ్తున్నప్పుడు పోగొట్టుకున్నారు. ఆ ప్రాంతానికి చెందిన మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుడు దుర్గైకి ఆ ఆభరణాలు దొరకగా వాటిని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. అయితే దుర్గై కుమారుడైన 34 ఏళ్ల సాహెబ్ మూడేళ్ల క్రితం ప్రమాదంలో గాయపడటంతో వెన్నెముక దెబ్బతింది. అప్పటి నుంచి మంచానికే పరిమితమయ్యాడు. చికిత్స కోసం పలు బ్యాంకుల్లో రుణాలు తీసుకుని ఖర్చు పెట్టినా పూర్తిగా కోలుకోలేదు. శస్త్రచికిత్సకు రూ.4 లక్షలు అవసరమవుతుందని వైద్యులు చెప్పడంతో సాయం చేయాలని దుర్గై ఇది వరకే ప్రభుత్వానికి విన్నవించారు. ఈ పరిస్థితుల మధ్య తనకు బంగారు ఆభరణాలు దొరికినా నిజాయతీగా పోలీసులకు ఇచ్చేసిన దుర్గై వ్యక్తిత్వానికి స్థానిక ఎమ్మెల్యే పూండి కలైవనన్ ముగ్ధులయ్యారు. మంగళవారం తిరువారూర్ కలెక్టరేట్‌లో దుర్గైను సన్మానించి, కుమారుడి వైద్య ఖర్చుల కోసం తన సొంత నగదు రూ.4 లక్షల చెక్కును అందించారు. ఆ సాయం కావాలన్న తనను సంప్రదించొచ్చని సూచించారు.



ఏ సాకులు ఇక పనిచేయవు

జీవితంలో ఉన్నతస్థితికి చేరుకునేందుకు అవరోధాలు అధిగమించాల్సిన అంశాలు..
✦ మీ లక్ష్యాన్ని సాధించేందుకు అడ్డుపడే సాకులు ఇక పనిచేయవని నిర్ణయం తీసుకోండి.
✦ సురక్షితమని భావించే పరిధి మీ భవిష్యత్తుకు అడ్డంకి అని తెలుసుకోండి.
✦ మీ కలల సాధనకు పడే శ్రమ, ఎదురైన ఇబ్బందులు విలువైనవిగా గుర్తించండి.
✦ మీ గమ్యం దిశగా సాగేందుకు అవసరమైన సాధన సంపత్తి మీ వద్ద ఉందని గ్రహించి ముందడుగు వేయండి.
– అనుష్క సోహం బఖ్వాల్, ఆంత్రప్రెన్యూర్

స్థానిక ఓటర్ల జాబితా తయారీకి ప్రత్యేక సాఫ్ట్‌వేర్

• రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఈసీ నీలం సాహ్ని

ఈనాడు, అమరావతి: స్థానిక సంస్థల ఎన్నికలకు జిల్లా, మున్సిపాలిటీ, మండల స్థాయిలో ఓటర్ల జాబితాలను సులువుగా తయారు చేసేలా ఎలక్టోరల్ రోల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఈఆర్ఎంఎస్) పేరిట ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గాల ఓటర్ల జాబితాల్లో నుంచి మున్సిపాలిటీలు, పంచాయతీల వారీగా జాబితాల తయారీకి ఈ సాఫ్ట్‌వేర్‌ను వినియోగిస్తున్నట్లు వివరించారు. ఇదే విషయాన్ని రాజకీయ పార్టీలకు తెలియజేశామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ఓటర్ల జాబితా తయారీపై ఈ నెల 8న నోటిఫికేషన్లు ఇచ్చిన ఎస్ఈసీ నీలం సాహ్ని.. ఇదే విషయమై మంగళవారం విజయవాడలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈఆర్ఎంఎస్ సాఫ్ట్‌వేర్ వినియోగం, ఉపయోగాలను వివరించారు. తెదేపా, వైకాపా, జనసేన, భాజపా, కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ సహా 13 పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు. పంచాయతీ ఎన్నికల్లో ఏ గ్రామ ప్రజలు ఆ గ్రామంలోనే ఓటు వేసేలా ఏర్పాట్లు చేయాలని పార్టీల ప్రతినిధులు ఎస్ఈసీని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలు సకాలంలో నిర్వహించాలని, నామినేషన్లు ఆన్‌లైన్‌లో వేసుకునే అవకాశం ఇవ్వాలని కోరారు. వారి విజ్ఞప్తులపై ఆమె సానుకూలంగా స్పందించారు. సమావేశంలో రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.




రాజకీయ పార్టీల నేతల సమావేశంలో భాగంగా నాయకులతో మాట్లాడుతున్న ఎస్ఈసీ నీలం సాహ్ని

ఓటర్ల డేటా భద్రం

ఎస్ఈసీ నీలం సాహ్ని విలేకరులతో మాట్లాడుతూ.. 'దేశంలో పలు రాష్ట్రాలు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఓటర్ల జాబితా తయారీ కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించుకున్నాయి. తెలంగాణలోనూ ఇటీవల నిర్వహించిన పంచాయతీ ఎన్నికల్లో దీన్ని అమలు చేశారు. ఈ విధానంతో జాబితాల తయారీ, ముద్రణ కోసం ఓటర్ల డేటాను ప్రైవేట్ వ్యక్తులు, సంస్థలకు ఇవ్వాల్సిన అవసరం ఉండదు. కలెక్టర్ల ఆధ్వర్యంలోనే అధికారులు జాబితాలు సిద్ధం చేయొచ్చు. కేంద్ర ఎన్నికల సంఘం సహకారంతో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓటర్ల జాబితాలు సేకరించాం. సర్వర్ నుంచి జిల్లా, మండల, మున్సిపల్ అధికారులు లాగిన్ చేసి డేటా పొందుతారు. వాటి నుంచి పంచాయతీ, మున్సిపాలిటీ, కార్పొరేషన్లలోని వార్డులు, డివిజన్ల వారీగా ఓటర్ల జాబితాలు సిద్ధం చేయొచ్చు' అని వివరించారు.





తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడికి డీడీలు అందిస్తున్న దాత గుత్తా శ్రీహర్షసాయి చౌదరి కుటుంబం ★ తితిదే ఛైర్మన్‌కు డీడీని ఇస్తున్న దాత మదన్‌మోహన్‌రావు, తితిదే బోర్డు సభ్యుడు నన్నపనేని సదాశివరావు తదితరులు

తితిదే ట్రస్టులకు రూ.1.30 కోట్ల విరాళాలు

తిరుమల, న్యూస్‌టుడే: తితిదే శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు హైదరాబాద్‌కు చెందిన గుత్తా శ్రీహర్షసాయి చౌదరి మంగళవారం రూ.కోటి విరాళం అందించారు. కుటుంబ సభ్యులతో తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడిని ఆయన క్యాంప్ కార్యాలయంలో కలిసిన దాత విరాళానికి సంబంధించిన డీడీలను ఇచ్చారు. ఈ సందర్భంగా దాతను ఛైర్మన్ అభినందించారు. ★ తితిదే శ్రీ వేంకటేశ్వర ట్రస్టులకు హైదరాబాద్‌కు చెందిన స్మార్ట్ సాఫ్ట్‌వేర్ అండ్ మోహన్ ఇండస్ట్రీస్ ఎండీ యలమంచిలి మదన్‌మోహన్‌రావు రూ.30 లక్షల విరాళం అందించారు. ఆలయంలోని రంగనాయకుల మండపంలో బీఆర్ నాయుడికి దాత విరాళం డీడీ అందజేశారు. తితిదే బోర్డు సభ్యులు నన్నపనేని సదాశివరావు పాల్గొన్నారు.

స్వామి నా మొర ఆలకించారు: బండ్ల గణేష్

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని నమ్ముకుని నష్టపోయిన వారు లేరని, ఆయన్ను నిజాయతీగా కొలుచుకోవడంతో తన మొర ఆలకించారని సినీ నిర్మాత, నటుడు బండ్ల గణేష్ పేర్కొన్నారు. ఆయన చేపట్టిన సంకల్ప యాత్ర మంగళవారం తిరుమలకు చేరుకుంది. తిరుపతి నుంచి కాలినడకన అలిపిరి నడక మార్గంలో ఆయన తిరుమలకు చేరుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణలోని షాద్‌నగర్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి సంకల్పయాత్ర ప్రారంభించి 537 కిలోమీటర్లు 23 రోజులపాటు నిరంతరాయంగా నడిచి శ్రీవారి సన్నిధికి చేరుకున్నట్లు తెలిపారు. "ఆంధ్రప్రదేశ్‌కు నారా చంద్రబాబునాయుడు సీఎం కావాలన్న నా మొరను ఆలకించిన స్వామికి కృతజ్ఞతలు. నా జన్మలో ఇది గొప్ప ఘట్టం. ఈ జన్మంతా శ్రీవారికి సేవలు చేస్తా" అని అన్నారు. బుధవారం వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న తర్వాత సీఎం చంద్రబాబును కలుస్తానన్నారు. ఉదయగిరి ఎమ్మెల్యే సురేష్ కాకర్ల, తానా మాజీ అధ్యక్షుడు సతీష్ వేమన తిరుమలలో బండ్ల గణేష్‌కు స్వాగతం పలికారు. మరోవైపు, తిరుమలకు చేరుకున్న అనంతరం బండ్ల గణేష్ తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు.



తిరుమలకు కాలినడకన చేరుకుని అలిపిరి మెట్టు వద్ద కొబ్బరికాయ కొడుతున్న సినీ నిర్మాత బండ్ల గణేష్

వాదనలు విన్నాకే రక్షణ కల్పించే విషయంలో నిర్ణయం

- సినీ నటుడు మోహన్‌బాబుకు స్పష్టంచేసిన హైకోర్టు
- విద్యార్థి నాయకుల కిడ్నాప్ కేసులో తదుపరి విచారణ 12కు వాయిదా

ఈనాడు, అమరావతి: విద్యార్థి నాయకుడు /ఫిర్యాదిదారు వాదనలు విన్న తర్వాతే సినీ నటుడు, మోహన్‌బాబు యూనివర్సిటీ(ఎంబీయూ) ఛాన్స్‌లర్ మోహన్‌బాబుకు అరెస్ట్ నుంచి రక్షణ కల్పించే విషయంలో నిర్ణయం తీసుకుంటామని హైకోర్టు స్పష్టంచేసింది. ఈ దశలో మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని పేర్కొంది. విద్యార్థి నాయకుల కిడ్నాప్ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను తమ ముందు ఉంచాలని పోలీసులను ఆదేశించింది. తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు.

ఎంబీయూ ప్రతిష్ఠను దెబ్బతీయాలని..

విద్యార్థి నాయకుల కిడ్నాప్ వ్యవహారంపై అందిన ఫిర్యాదు ఆధారంగా తిరుపతి జిల్లా తిరుచానూరు పోలీసులు ఈ నెల 3న పలువురిపై కేసు నమోదు చేశారు. తనపై నమోదు చేసిన కేసును కొట్టేయాలని సినీ నటుడు మోహన్‌బాబు(ఏ-2) హైకోర్టులో పిటిషన్ వేశారు. ఆయన తరఫున న్యాయవాది ఎస్.శ్రీనివాసమూర్తి వాదనలు వినిపిస్తూ.. కిడ్నాప్ ఘటనతో పిటిషనర్‌కు సంబంధం లేదన్నారు. ఘటన సమయంలో ఆయన అక్కడ లేరన్నారు. ఘటన తర్వాత హైదరాబాద్ నుంచి తిరుపతికి ప్రయాణించారని, అందుకు ఆధారాలుగా బోర్డింగ్ పాస్ వివరాలు కోర్టు ముందు ఉంచారు. ఎంబీయూ ప్రతిష్ఠను దెబ్బతీయాలని కొందరు కుట్ర పన్నుతున్నారన్నారు. కిడ్నాప్ వెనక ఎవరున్నారనే విషయాన్ని తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నామన్నారు. మోహన్‌బాబుకు నోటీసు ఇచ్చి వివరణ తీసుకునేలా పోలీసులను ఆదేశించాలని కోరారు.

పిటిషనర్ పాత్రపై ఆధారాలున్నాయి

★ నోటీసు ఇచ్చి వివరణ తీసుకోవచ్చుకదా? అని న్యాయమూర్తి అడిగిన ప్రశ్నకు సహాయ పీపీ సందీప్ బదులిస్తూ.. "విద్యార్థి సంఘ నేతల కిడ్నాప్ విషయంలో పిటిషనర్ పాత్రపై ఆధారాలున్నాయి. నేర ఘటన సమయంలో వర్సిటీ పీఆర్వో సతీష్(మొదటి నిందితుడు), మోహన్‌బాబుల మధ్య ఫోన్ సంభాషణలు జరిగాయి. కాల్ డేటా, మెసేజ్‌లను విశ్లేషించాల్సి ఉంది. ఎంబీయూలో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారనే కారణంతో కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి, వినతి ఇచ్చేందుకు వెళుతున్న విద్యార్థి నాయకులను కిడ్నాప్ చేశారు. వారిపై దాడి చేయడంతో నోరు, ముక్కు నుంచి రక్తం వచ్చి గాయాలు అయ్యాయి. పోలీసులు తక్షణం స్పందించి బాధితులను విడిపించారు" అని తెలిపారు. దర్యాప్తు అధికారి ముందు హాజరవ్వాలని నోటీసులిస్తే మంచు విష్ణు(ఏ-9)హాజరు కాలేదని, దర్యాప్తునకు సహకరించలేదని తెలిపారు. దర్యాప్తు ప్రాథమిక దశలో ఉందని, అరెస్ట్ నుంచి రక్షణ కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులివ్వొద్దని కోరారు. ★ ఎస్వీఎస్ ఉద్యమకారుడు, ఫిర్యాదిదారు రెడ్డికుమార్ తరఫున న్యాయవాది నల్లారి మాధవరావు వాదనలు వినిపిస్తూ.. ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే భవిష్యత్తులో అన్యాయంపై మాట్లాడటానికి ఎవరూ ముందుకు రారన్నారు. అక్రమాలను ప్రశ్నిస్తున్న వారి గొంతు నొక్కాలనే ఉద్దేశంతో కిడ్నాప్‌నకు పాల్పడ్డారన్నారు. బాధిత విద్యార్థి నేతల తరఫున వకాలత్ దాఖలు చేశామని పూర్తిస్థాయి వాదనలు వినిపించేందుకు సమయం కావాలని కోరారు. దీంతో విచారణ వాయిదా పడింది.

ప్రధానోపాధ్యాయుడి ప్రాణం తీసిన కేబుల్ వైర్

మెడకు చుట్టుకోవడంతో కిందపడి దుర్మరణం

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనంపై పాఠశాలకు వెళ్తున్న ప్రధానోపాధ్యాయుడికి కేబుల్ వైర్ మెడకు చుట్టుకోవడంతో కిందపడి దుర్మరణం చెందారు. ఈ దుర్ఘటన బాపట్ల జిల్లా చీరాల మండలం గవినివారి పాలెంలో చోటుచేసుకుంది. పర్చూరు మండలం చెరుకూరుకు చెందిన అంగిరేకుల శ్రీనివాసరావు(58) గవినివారిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఈయన బాపట్లలో నివాసం ఉంటూ విధులకు వెళ్తుంటారు. మంగళవారం ఉదయం బైక్‌పై బడికి బయలుదేరారు. గవినివారిపాలెం వెలుపల ప్రధాన రహదారిపై ఇరువైపులా ఉన్న స్తంభాలకు కట్టిన కేబుల్ తీగ అడ్డంగా కిందికి జారి ఉంది. ఇది గమనించని శ్రీనివాసరావు ముందుకు వెళ్లారు. ఆ సమయంలో స్థానికులు అక్కడ తీగ ఉందని గట్టిగా కేకలు వేసినా ఫలితం లేకపోయింది. అప్పటికే వైరు ఆయన మెడకు చుట్టుకోవడంతో ఒక్కసారిగా అదుపుతప్పి కిందకు జారిపోయారు. కొంత దూరం ముందుకు వెళ్లి పొలాల్లో పడ్డారు. తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. డీఈవో డి.శ్రీనివాస్, పలువురు ఉపాధ్యాయులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. శ్రీనివాసరావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ ఘటనపై విద్యాశాఖ మంత్రి లోకేశ్ సంతాపం వ్యక్తం చేశారు. ఇది తనను కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.



శ్రీనివాసరావు

రంజాన్ మాసంలో ముస్లిం ఉద్యోగులకు గంట సడలింపు

ఈనాడు, అమరావతి: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు, ఒప్పంద, పొరుగు సేవల సిబ్బంది, స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల సిబ్బంది, తదితర ముస్లిం ఉద్యోగులు సాయంత్రం పనివేళల ముగింపు కంటే ఒక గంట ముందుగానే ప్రార్థనల నిమిత్తం బయటకు వెళ్లేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ నెల 18 నుంచి మార్చి 19 వరకు ఈ వెసులుబాటు వర్తించనుంది. ఈ మేరకు అన్ని ప్రభుత్వ శాఖల విభాగాధిపతులు, కలెక్టర్లకు ఆదేశాలిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు ఇవ్వడం పట్ల మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్‌అజీజ్ హర్షం వ్యక్తంచేశారు. సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆరింటిపై పట్టు.. కొలువు సాధించేట్టు

న్యూస్‌టుడే, కానూరు, యనమలకుదురు, తాడిగడప

ఉద్యోగ భద్రత, కొంత ఒత్తిడికి దూరంగా ఉండవచ్చనే ఆలోచనలతో ప్రస్తుతం యువతీయువకుల చూపు ప్రభుత్వ కొలువులపై పడింది. దీంతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలలో ఉద్యోగాల భర్తీకి ప్రకటనలు కొత్త సంవత్సరంలో విడుదల కానున్నాయి. ఏ ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్నా ప్రస్తుత తరుణంలో ఆరు సబ్జెక్టులైన అర్థమెటిక్, రీజనింగ్, ఇంగ్లిష్, కంప్యూటర్స్, జనరల్ అవేర్‌నెస్, కరెంట్ అఫైర్స్ లలో పట్టు సాధిస్తే ఉద్యోగం పొందవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏఏ అంశాలు నేర్చుకోవాలో తెలుసుకుందాం.



అర్థమెటిక్స్‌లో రాణించాలి : కొమ్మూరి శ్రీధర్, శ్రీధర్స్ సీసీఈ కోచింగ్ సెంటర్
అర్థమెటిక్స్‌లో పట్టు సాధించాలంటే 8, 9, 10 తరగతుల్లోని వ్యాపారగణితం, సమస్యలను సాధన చేయాలి. క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌లో ఎక్కువ ప్రశ్నలు అడుగుతారు. వీటితో పాటు న్యూమరికల్ ఎబిలిటీ, అర్థమెటిక్, డేటా అనాలసిస్‌లపై ప్రశ్నలు ఉంటాయి. న్యూమరికల్ ఎబిలిటీలో పట్టు సాధనకు కూడికలు, తీసివేతలు, గుణించడం, భాగించడం, వర్గమూలాలు, భిన్నాలు, లెక్కల సాధన చేయాల్సి ఉంటుంది. **రీజనింగ్..** ఇంజినీరింగ్ విద్యార్థులకు ప్రాంగణ ఎంపికల నుంచి బ్యాంకింగ్‌లో సాఫ్ట్‌వేర్ కొలువుల వరకు దోహదపడుతుంది. ఇందుకు పదాలపై పట్టు సాధించాలి. వర్గాలు, వర్గమూలాలు, ఘనాల సూత్రాలు నేర్చుకోవాలి. రీజనింగ్‌లో ప్రశ్నలు కాన్సెప్ట్‌తో పాటు జనరల్ టాపిక్స్ పరీక్షించేవిగా ఉంటాయి.



ఆంగ్లం ప్రగతికి మార్గం : కొడాలి రామశేషాద్రిరావు, విద్యావేత్త
ఆంగ్లంలో నైపుణ్య సాధనకు ముందు వ్యాకరణంపై పట్టు అవసరం.. పదాలు, భాషాభాగాలపై, వొకాబులరీపై కసరత్తు చేయాలి. సినోనియమ్స్ నిమిత్తం పదాల అర్థాలు తెలుసుకోవాలి. వాటి వ్యతిరేక పదాలను సాధన చేయాలి. తెలుగు నుంచి ఆంగ్లంలోకి వాక్యాలను అనువదించాలి. ఇచ్చిన పాసేజ్ చదివి సమాధానాలు రాసే ప్రక్రియను సాధన చేయాలి. వీటితో పాటు ఆంగ్ల పత్రికలు చదివి, అర్థాలు తెలియని వాటిని తెలుసుకోవాలి.



కంప్యూటర్స్ పరిజ్ఞానం తప్పనిసరి: బీఎస్ఎన్ దుర్గాప్రసాదు, పోటీపరీక్షల నిపుణులు
ప్రస్తుతం అన్ని రకాల ఉద్యోగాలకు కంప్యూటర్స్ పరిజ్ఞానం పరీక్షించే ప్రశ్నలు అడుగుతున్నారు. కంప్యూటర్‌లో ప్రాథమిక పరిజ్ఞానం ఉండాలి. బేసిక్ డేటా ఇన్ఫర్మేషన్‌పై పట్టు ఉండాలి. అవుట్‌పుట్, ఇన్‌పుట్, డిజైన్లతో పాటు పరిజ్ఞానం అవసరం. **ఇలాగే జనరల్ అవేర్‌నెస్, జనరల్ నాలెడ్జిపై..** పట్టు సాధించాలంటే... జాతీయ, అంతర్జాతీయ రాజకీయ, ఆర్థిక, క్రీడలు, సమకాలీన అంశాలను, చదవాలి. వార్తా పత్రికలను క్రమం తప్పకుండా చదవాలి..

6 సబ్జెక్టులు 99 కొలువులు : గ్రూపు బీ, సీ, విభాగాల ఉద్యోగాలు, స్టాఫ్ సెలక్షన్ కమిటీ ఉద్యోగాలు, సీబీఐ, సెంట్రల్ బ్యూరో ఆఫ్ నార్కోటిక్, ఆదాయపన్ను శాఖ, అబ్కారీ, గణాంక అధికారి, కస్టమ్స్, ఎల్ఐసీ, బ్యాంకింగ్ ఉద్యోగాలు, కేంద్రీయ విద్యాలయం, ఆర్ఆర్‌బీ, ఆర్టీసీ, బీమా సంస్థలు, ఆహార రంగ సంస్థలు, ప్రైవేటు బ్యాంకులు, ఇలా మరిన్ని శాఖల్లో కలిపి 99 ఉద్యోగాలకు ఈ 6 సబ్జెక్టులు కీలకం.

'33 ఏళ్ల సర్వీసు నిబంధనపై ఆందోళన అవసరం లేదు'

గాంధీనగర్(విజయవాడ), న్యూస్‌టుడే: 33 ఏళ్ల సర్వీస్ చేసిన వాళ్లు తప్పనిసరిగా రిటైర్ అవ్వాలని ప్రభుత్వం చెబుతున్న నిబంధన కొత్తది కాదని, గత నాలుగు దశాబ్దాలుగా ఆ నిబంధన ఉందని ప్రభుత్వ ఉద్యోగులు ఆందోళన చెందాల్సిన పనిలేదని ఏపీ ఐకాస ఛైర్మన్ ఎ.విద్యాసాగర్ స్పష్టం చేశారు. మంగళవారం విజయవాడ గాంధీనగర్‌లోని ఎన్జీజీవో హోంలో ఏపీ జేఏసీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో విద్యాసాగర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏ సవరణ చేయాలనుకున్నా ముందు ఉద్యోగ సంఘాల నాయకులతో చర్చించిన తర్వాత వారి అంగీకారంతోనే నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వానికి తెలియజేయడం జరిగిందన్నారు. 20వ తేదీ లోపు సంఘాల అభ్యంతరాలను సర్కారు దృష్టికి తీసుకెళతామన్నారు. గత ఏడాది నవంబరులో ఆరు డిమాండ్లపై హామీ ఇవ్వడం జరిగిందని వీటిలో ఐదింటికి ఇప్పటికే ఉత్తర్వులు వెలువడడం జరిగిందన్నారు. ఈ నెల 12వ తేదీన వివిధ కార్మిక సంఘాలు ఇచ్చిన సమ్మె పిలుపునకు సంఘీభావంగా రాష్ట్రంలోని జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల వద్ద భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శనలు చేపడతామని విద్యాసాగర్ తెలిపారు. ఏపీ యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ ప్రతినిధి, ఐకాస సెక్రటరీ జనరల్ కేఎస్ఎస్ ప్రసాద్, ఐకాస నాయకులు డీవీ రమణ, ఎం.రఘునాథరెడ్డి, జి.హృదయరాజు, బి.సాంబశివరావు, వై.శ్రీనివాసరావు, ఎన్.చంద్రశేఖర్ బండి శ్రీనివాసరావు, పీవీ సాయికుమార్ పి.మధుకరబాబు, బి.జానకి, ఎస్.విద్య, సీఎం దాసు తదితరులు పాల్గొన్నారు.



వేదికపై సంఘీభావం తెలుపుతున్న ఏపీ జేఏసీ ఛైర్మన్ విద్యాసాగర్, జేఏసీ నాయకులు రమణ, మంజుల, రఘునాథ్‌రెడ్డి, ప్రసాద్, హృదయరాజు, కృష్ణయ్య, వెంకటేశ్వర్లు తదితరులు

రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపుపై హర్షం

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: ఏపీ ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం రూ.1,198 కోట్లు విడుదల చేయడం విద్యార్థులపై ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని కేడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ నెట్టెం రఘురాం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టి, మంత్రి నారా లోకేశ్ కృషితో విద్యార్థుల సమస్యలను వేగంగా పరిష్కరించే దిశగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్రాభివృద్ధికి బలమైన పునాది వేస్తుందన్నారు. విద్యకు అడ్డంకులు ఉండకూడదనే సంకల్పంతో తీసుకున్న ఈ చర్యను హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నట్లు తెలిపారు. నారా లోకేశ్ మాటల్లో కాకుండా కార్యాచరణలో చూపిస్తున్న నాయకత్వం యువతలో నమ్మకం పెంచుతుందని నెట్టెం రఘురాం పేర్కొన్నారు.

ఏపీలో కలాం ఫౌండేషన్ సేవలు

గాంధీనగర్, న్యూస్‌టుడే: న్యూదిల్లీ కలాం ఫౌండేషన్ వైజ్ఞానిక సేవలను ఏపీలో ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర కన్వీనర్ డి.శ్రీను తెలిపారు. డెమోక్రటిక్ పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘంతో అధికారిక ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. మంగళవారం గాంధీనగర్‌లోని డెమోక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన ఆవిర్భావ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ఈ ఒప్పందం వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు జాతీయ స్థాయిలో వైజ్ఞానిక కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశాలు ఉన్నాయని, విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో పని చేస్తామని చెప్పారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ కేజీబీవీ కార్యదర్శి డి.దేవానందరెడ్డి మాట్లాడుతూ న్యూదిల్లీ కలాం ఫౌండేషన్ సౌజన్యంతో ఈ సేవలను ఏపీలో ప్రారంభించడం అభినందనీయమన్నారు. రాష్ట్ర కన్వీనర్‌గా నియమిస్తూ ఇచ్చిన ఒప్పంద పత్రాన్ని అధ్యక్షుడు డి.శ్రీనుకు దేవానందరెడ్డి అందజేశారు. కృష్ణా, గుంటూరు జిల్లాల్లో వివిధ వైజ్ఞానిక ప్రదర్శనల్లో రాణించిన 68 మంది విద్యార్థులకు కలాం ఫౌండేషన్ అవార్డులతో సత్కరించారు. పీఆర్‌టీయూ నాయకులు జీవీఎస్ పెరుమాళ్ల, సున్న రాంబాబు, జ్ఞానేశ్వరరావు, పి.నాగరాజు, కోట సుందరరావు, ఇ.వెంకటరెడ్డి, కుమార్ రాజా తదితరులు పాల్గొన్నారు.



శ్రీనుకు ఒప్పంద పత్రం అందజేస్తున్న దేవానందరెడ్డి

తగ్గుతున్న మిర్చి ధర

గంపలగూడెం, న్యూస్‌టుడే

మిర్చి ధరలు మళ్లీ పతనమవుతున్నాయి. రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఇతర పంటల మాదిరి ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించకపోవడంతో వ్యాపారులదే ఇష్టారాజ్యమైంది. ఇటీవల ఖమ్మం మార్కెట్‌లో రైతులు పెద్దఎత్తున ఆందోళన కూడా చేశారు. ఈ ఏడాది జనవరి మొదటి పక్షంలో తేజా రకం మిర్చి క్వింటాకు రూ.13వేలు- రూ.14వేలు ఉండగా, రెండో పక్షంలో రూ.20 వేలకు చేరింది. అన్నదాతల ఆనందం ఒకట్రెండు రోజులకే పరిమితమైంది. సోమవారం క్వింటా రూ.19,300 ఉండగా మంగళవారం రూ.18,500కు పడిపోయింది. తేజ రకం మిర్చికి ఆశించిన ధర లభించడం లేదని కర్షకులు వాపోతున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో తిరువూరు, మైలవరం, నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లోని 16 మండలాల్లో 22,400 ఎకరాల్లో మిరప సాగవగా, ఇందులో తేజ రకమే ఎక్కువ. ఎకరాకు రూ.2 లక్షల వరకు పెట్టుబడి అవుతోంది. ఈ ఏడాది తెగుళ్లు, పురుగుల కారణంగా సగటు దిగుబడి 15 క్వింటాళ్ల వరకు ఉంటుందని అంచనా. ఆదిలోనే కొన్ని చేలల్లో మిరప మొక్కలను దిగుబడి లేక పీకేశారు. ఎర్ర బంగారానికి విదేశీ ఎగుమతులు ఉంటేనే ధరలు పెరుగుతాయని వ్యాపారులు చెబుతున్నారు. జనవరిలో చైనాకు ఎగుమతుల కారణంగా ధర రూ.14వేలు నుంచి రూ.20వేలకు చేరిందని, ప్రస్తుతం ఎగుమతులు ఆగిపోవడంతో ధర తగ్గుతోందంటున్నారు. చైనాకు ఎగుమతులు ఊపందుకుంటేనే మళ్లీ ధర పెరిగే అవకాశం ఉందంటున్నారు.



గంపలగూడెం మండలం చల్లంగుండ్లవారిపాలెం వద్ద మిరప కల్లం

గంజాయి పట్టివేత

అశ్వాపురం, న్యూస్‌టుడే: అశ్వాపురం మార్గంలో ద్విచక్రవాహనంపై తరలిస్తున్న ఏడు కిలోల గంజాయిని ఖమ్మం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం మొండికుంట వద్ద పట్టుకున్నారు. ఖమ్మం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై శ్రీహరిరావు, సిబ్బంది మొండికుంట వద్ద అశ్వాపురం మార్గంలో వాహనాల తనిఖీ చేపట్టారు. అనుమానాస్పదంగా వస్తున్న ఓ ద్విచక్రవాహనాన్ని ఆపి తనిఖీ చేయగా ఏడు కిలోల ఎండు గంజాయి లభ్యమైంది. సూర్యాపేట జిల్లా తెల్లబెల్లికి చెందిన బడేటి వెంకటేశ్, ఎన్టీఆర్ జిల్లా వెంగనాయకునిపాలేనికి చెందిన మోరుబోయిన గోపయ్య ఒడిశా రాష్ట్రంలోని మల్కాన్‌గిరి నుంచి హైదరాబాద్‌కు ఈ మార్గంలో తరలిస్తున్నారు. దీని విలువ రూ.4.60 లక్షలు ఉంటుంది. గంజాయితో పాటు ఇద్దరు నిందితులు, ద్విచక్రవాహనాన్ని, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని మణుగూరు ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు. హెడ్ కానిస్టేబుల్ ఎంఏ కరీం, కానిస్టేబుళ్లు సుధీర్, వెంకట్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ధర వరలు

వంకాయలు-20/24, టమాటా-13, బెండ-30, పచ్చిమిర్చి-36, కాకర-38, బీర-30/32, క్యాలీఫ్లవర్-15/20, క్యాబేజి-14, క్యారెట్-26, దొండ-42, బంగాళదుంప-21, ఉల్లిపాయలు-22, గోరుచిక్కుళ్లు-32, దోస-20/30, సొర-12/14, పొట్ల-30, అరటికాయ-7/6, చామదుంప-22, అల్లం-72, మునగ-10/8, ఆకుకూరలు(కట్ట)-2.50, కంద-38, బీట్ రూట్-24, కీరదోస-44, బీన్స్-60/55, క్యాప్సికమ్-65, చింతకాయలు-65, నిమ్మ (డజను)-30/24, కొత్తిమీర-5/10, పుదీనా-5/15, ముల్లంగి-8, పచ్చిమామిడి-20/22(నిన్నటివి). నగరంలోని రైతుబజార్లలో ఈధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి. - **న్యూస్‌టుడే, విజయవాడ రైతుబజారు**

శ్రీశైలం మల్లన్నకు పట్టు వస్త్రాల సమర్పణ

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని శ్రీశైలం మల్లన్నకు దుర్గగుడి తరపున పాలకమండలి ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ కుటుంబ సభ్యులతో కలిసి పట్టు వస్త్రాలు మంగళవారం సమర్పించారు. శ్రీశైలం దేవస్థానం అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈనెల 15న మహాశివరాత్రి నేపథ్యంలో శ్రీశైలం మల్లన్నకు భక్తుల సమక్షంలో కల్యాణం నిర్వహించనున్నారు. ఈసందర్భంగా దుర్గగుడి తరపున పట్టు వస్త్రాలను సమర్పించినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు.



పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న దుర్గగుడి ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్

అంగన్‌వాడీల వేతనాలు పెంచాలి

గాంధీనగర్, న్యూస్‌టుడే: రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో అంగన్‌వాడీల వేతనాలు పెంచడంతో పాటు మినీ సెంటర్లను ప్రధాన కేంద్రాలుగా మార్చాలని ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ కోరారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. పెరిగిన ధరలకు అనుగుణంగా 2019 నుంచి వేతనాలు పెంచలేదని 2023లో 42రోజులు సమ్మె నిర్వహించగా వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చి విస్మరించారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఇటీవల కొన్ని సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేయడం హర్షణీయమన్నారు. పెండింగ్‌లో ఉన్న 164 సూపర్‌వైజర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు ఎన్‌సీహెచ్ సుప్రజ, లలితమ్మ, వీఆర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మహిళా బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు 'కేఆర్‌యూ' జట్టు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: తమిళనాడు రాష్ట్రం దిండిగల్‌లోని అన్నా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి జరిగే అంతర్ వర్సిటీ మహిళా బాల్ బ్యాడ్మింటన్ పోటీలో తలపడే కృష్ణా వర్సిటీ జట్టును ఎంపిక కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి వాసిరెడ్డి నాగేశ్వరరావు మంగళవారం వెల్లడించారు. కె.ఉమామహేశ్వరి, పి.భువనేశ్వరి, ఎ.రాజని (ఎస్‌డీఎం సిద్ధార్థ మహిళా కళాశాల), జి.స్రవంతి, టి.అంకిత (విజయ వ్యాయామ విద్య కళాశాల, నున్న), కె.హరిసత్య హరిత (డాక్టర్ ఎల్‌హెచ్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మైలవరం), ఎన్.హారిక (కేవీఆర్ కళాశాల, నందిగామ), కె.రమ్య (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తిరువూరు), పి.పావని సాయి (శ్రీవిజయానంద డిగ్రీ కళాశాల, పెడన), సీహెచ్ నాగ ధరణి (నోబుల్ కళాశాల, మచిలీపట్నం) జట్టులో చోటు దక్కించుకున్నారు.



వర్సిటీ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

వసుంధర

vasundhara@eenadu.in

వ్యాపారంగా మలచగలనా..!

నాకు ఎనిమిదేళ్ల వయసున్నప్పట్నుంచీ కర్ణాటక సంగీతం నేర్చుకుంటున్నాను. అయితే, దీన్ని ఇప్పటివరకూ అభిరుచిగానే కొనసాగించా. ఇప్పుడు నాకు పెళ్లై, ఇద్దరు పిల్లలు. వాళ్లు స్కూళ్లకు వెళ్లాక చాలా ఖాళీగా అనిపిస్తోంది. మా పరిసర అపార్ట్‌మెంట్ ఫ్రెండ్స్‌కి నేర్పుతున్నాను. అమెను చూసిన ప్రతిసారీ నేనూ మ్యూజిక్ సెంటర్ ప్రారంభిస్తే బాగుంటుంది అనిపిస్తుంది. నా అభిరుచిని వ్యాపారంగా మలుచుకోగలనా? సలహా ఇవ్వగలరు.

– ఓ సోదరి

అభిరుచిని వృత్తి, వ్యాపారంగా మలుచుకోవాలనే మీ ఆలోచన చాలా మంచిది. మీలాంటి ప్రతి ఒక్కరూ ఆలోచిస్తే మహిళలకు ఆర్థిక స్వేచ్ఛ దొరుకుతుంది. వ్యాపారంగానూ ఉపయోగపడుతుంది. అయితే, ఈ క్రమంలో మీరు కొన్ని విషయాల్ని గమనించుకోవాలి. మీరు అందించే సేవలు డబ్బులు చెల్లించి నేర్చుకునే వాళ్లు ఉన్నారా, లేదా... అనేది తెలుసుకోవాలి. ఒక మ్యూజిక్ సెంటర్ని ప్రారంభించే ముందు... పెట్టుబడి ఎంత అవసరం, ఒక్కరే మొదలుపెట్టాలి అనుకుంటున్నారు కాబట్టి రిస్క్ ఏ మేరకు తట్టుకోగలరు, బ్రేక్ ఈవెన్ పాయింట్(ఖర్చులు-ఆదాయం సమం అయ్యే దశ)కు ఎప్పటికల్లా చేరుకోగలరన్న ఆర్థిక ప్రణాళికలు అవసరం. కనీసం ఏడాది ఆర్థిక ప్రణాళికల్ని స్పష్టంగా అంచనా వేయగలగాలి. లాభదాయకంగా నడపగలరా లేదా అనేది బేరీజు వేసుకోగలగాలి. ఎందుకంటే ఆనందం, సంతృప్తితోపాటు స్థిర ఆదాయం రావడం కూడా అవసరం కదా. వీటన్నింటి విషయంలో స్పష్టత తెచ్చుకుంటే... తప్పకుండా వ్యాపారం ప్రారంభించొచ్చు. లేదా ముందుగా ఉపాధ్యాయురాలిగా స్కూళ్లలో బోధించడానికి ప్రయత్నించండి. నైపుణ్యాలకు మెరుగులద్దుకుని కాన్సర్ట్‌లు, వేదికల మీద ప్రదర్శనలు ఇవ్వండి. ఆలాంటి గ్రూప్‌లో చేరండి. ఇవన్నీ ఈ రంగంలో మీ అనుభవాన్ని పెంచుతాయి. తదుపరి కార్యాచరణ మీద మీకూ స్పష్టతను ఇస్తాయి. ఆల్ ది బెస్ట్.

డియర్ వసుంధర



కవితా గూడపాటి



ఓసారి విని చూద్దాం!

'ఎప్పుడూ ఫోనేనా... నాలుగు కబుర్లు చెప్పొచ్చు కదా' పెద్దవాళ్లంటే ఈ అభ్యర్థన వస్తూనే ఉంటుంది. వీళ్లకి ఫోనే పడదు. అదే సగం తలనొప్పులకు కారణమంటారు. వీళ్ల చాలదన్నట్లు జెన్‌జీలు తయారయ్యారు. సోషల్‌మీడియా మా సమయాన్ని తినేస్తోంది. మనసుని పాడు చేస్తోంది అంటున్నారు. కాసేపు విశ్రాంతి తీసుకుందామని ఫోన్ పట్టుకుంటే అందరి సలహా పక్కన పెట్టమనే! ఇది కాకుండా మరి ఇంకేం చేయొచ్చు అంటే...

మనకి చిన్న బ్రేక్ అంటే స్క్రోలింగే! కానీ నిపుణులేమంటారో తెలుసా? దేన్నైనా ఆస్వాదించడం, శ్వాసని అదుపులోకి తెచ్చుకోవడం, శరీరాన్ని కదిలించడం... వంటి సమాధానాలు చెబుతారు. కాబట్టి, పది నిమిషాల్లోపు సమయం దొరికిందనుకోండి... హాయిగా చల్లగాలికి నడవండి. మెడ, భుజాలు, కాళ్లకు సంబంధించిన స్ట్రెచెస్ చేయొచ్చు. కావాలంటే చల్లటి నీటితో ముఖాన్ని కడిగేయండి. తక్షణం రిఫ్రెష్ అయిపోతారు. లేదంటే బయటికి వెళ్లి పిల్లల ఆటనో, పచ్చని మొక్కలనో చూస్తే సరి. మనసంతా ప్రశాంతంగా మారిపోతుంది. మానసికంగా బాగా అలసిపోయినట్లు అనిపిస్తోందా? గుంజీలు తీయండి. రెండంతస్థులు మెట్లు ఎక్కి దిగండి. శ్రమతో కూడుకున్నవి అనిపిస్తున్నా మెదడుని ఉత్తేజితం చేస్తాయి. ఇవేమీ కాదు కుర్చీలోంచి లేవకుండా చేయాలంటారా? కళ్లు మూసుకుని శ్వాసను గమనించండి. లేదంటారా మీ హ్యాండ్ బ్యాగు, డెస్క్‌ని సర్దేయండి. ఏదైనా పుస్తకం తీసుకుని రెండు పేజీలు చదవండి. టీ లేదా కాఫీ చిన్న చిన్న సిప్‌లు తీసుకుంటూ తాగొచ్చు. చక్కని పాట వినొచ్చు. గమనించాలే కానీ బోలెడు ఆప్షన్లు. ఇంకా సమయం ఉందా... చక్కగా ఫ్రెండ్‌తో లంచ్, లేదా స్నాక్ ప్లాన్ చేసుకుని బయటకు వెళ్లండి. పార్క్, విండో షాపింగ్ వంటివెన్నో ప్రయత్నించొచ్చు. ఈ తరం అమ్మాయిలు చేస్తున్నవే ఇవన్నీ. పైగా సోషల్‌మీడియాని ప్రెజర్ ప్లాట్‌ఫాంగా చెబుతూ అకౌంట్లు డిలీట్ చేస్తున్నవాళ్లూ బోలెడు మందే! మీరు మాత్రం దానిలోనే ఎందుకు అస్తమానం గడపడం... వాళ్ల మాట విని అప్పుడప్పుడైనా సరదాగా వేరేవి ప్రయత్నించొచ్చుగా! ఏమంటారు?

బంగారం - వెండి

10న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,61,650	1,45,150	2,71,342
విజయవాడ	1,55,685	1,44,750	2,72,000
ప్రొద్దుటూరు	1,59,500	1,46,740	2,67,000
రాజమహేంద్రవరం	1,58,780	1,45,550	3,00,000
విశాఖపట్నం	1,57,910	1,44,750	2,70,000
తమిళనాడు	-----	1,45,800	3,00,000

ఎనిమిది దశాబ్దాల

సంగీత రాజసం

నుదుట రూపాయి కాసంత బొట్టు, చేతిలో వయొలిన్, వికసిత ప్రశాంత వదనం... ఇదీ డా.ఎన్. రాజం పేరు వినగానే గుర్తొచ్చే రూపం. వేదికమీద ఆమెను చూడగానే ఆ సంగీత సరస్వతికి మరో రూపంగా భావిస్తుంటారు అభిమానులు. ఇటీవల భారత రెండో అత్యున్నత పురస్కారమైన పద్మవిభూషణ్‌కు ఎంపికైన ఆమెను 'వసుంధర' పలకరించింది.



ఏ ఇంటిలోనైనా తరాలతోపాటే ఆసక్తులూ మారతాయి. కానీ వయొలిన్‌నే ఇంటిపేరుగా మార్చుకున్న రాజం కుటుంబం దీనికి పూర్తి భిన్నం. ఒకరి నుంచి ఒకరు వయొలిన్ వాద్యాన్ని వారసత్వంగా అందుకుంటూనే ఉన్నారు. తండ్రి నుంచి తాను పొందిన ఆ సంగీతామృతాన్ని వారసులకీ అందిస్తున్నారు రాజం. కూతురుతోపాటు మనవరాళ్లనీ ఈ వాద్యంలో ప్రవీణులుగా తీర్చిదిద్దుతున్నారు. ఆ నలుగురూ కలిసి వేదిక ఎక్కితే కళ్లనీ తిప్పుకోలేం అంటారు ప్రేక్షకులు.

కళను ఓ తపస్సులా స్వీకరించారు రాజం. మూడేళ్ల వయసులోనే సంగీత సామ్రాజ్యంలోకి అడుగుపెట్టారు. సోలో వయొలిన్ విద్వాంసురాలుగా ఎదిగారు. ప్రముఖ వాద్యకారులూ అసాధ్యం అనుకున్న దాన్ని చిన్నవయసులోనే సుసాధ్యం చేశారామె. వయొలిన్ వాద్యానికి హిందుస్థానీ గాత్ర శైలిని జోడించారు. అంటే, రాగాలే కాదు, గొంతులోంచి భావోద్వేగాల్నీ వయొలిన్ తీగల్లో పలికించిన ప్రతిభాశాలి. ఈ ప్రక్రియకి ప్రేక్షకులు చప్పట్లు కొట్టకుండా ఉంటారా. అందుకే ఆమెను 'గాయకి అంగ్ లేదా సింగింగ్ వయొలిన్'గా పిలుస్తుంటారు.

వయొలిన్‌పై ఆమె చేతి వేళ్ల విన్యాసం ఆ గంగా ప్రవాహాన్ని తలపిస్తూ సంగీతాభిమానుల్ని మంత్రముగ్ధుల్ని చేస్తుంది. దేశవిదేశాల్లో కచేరీలిచ్చి, సంగీత ప్రపంచంలో వయొలిన్ వాద్యాన్ని చిరస్థాయిగా నిలిపారు రాజం. అందుకే ప్రపంచవ్యాప్తంగా వయొలిన్ వాద్యకారులు తమ సామర్థ్యాలను సాన బెట్టుకునేందుకు ఆమె దగ్గరకు వస్తుంటారు. వయొలిన్‌లో రాజం చేసిన కృషిని ఫ్లూట్‌లో పన్నాలాల్ ఘోష్, షహనాయ్‌లో ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్‌ల కృషితో సమానంగా చెబుతుంటారు.

ఎలా సాధ్యమైంది?

'మాది కేరళ, నా చిన్నతనంలో చెన్నైలో ఉన్నాం. నాన్న ఎ.నారాయణ అయ్యర్. వయొలిన్, వీణ వాద్యకారులు. అమ్మ అమ్మిణి అమ్మాళ్. మేం ఐదుగురం సంతానం. నేనొక్కదాన్నే అమ్మాయిని. సోదరులతోపాటే నాకూ మూడేళ్ల వయసులోనే వయొలిన్ చేతికిచ్చారు నాన్న. కర్ణాటక సంగీత దిగ్గజం ముసిరి సుబ్రమణ్య అయ్యర్ దగ్గర శిక్షణ తీసుకున్నా. ఆయన్ని అనుసరిస్తూ తొమ్మిదేళ్లకే కర్ణాటక సంగీతంలో ప్రావీణ్యం సాధించా. పన్నెండేళ్లకే ఎం.ఎస్. సుబ్బులక్ష్మి కచేరీల్లోనూ పాల్గొన్నా. ఆమె అమ్మలా ఆదరించి ప్రోత్సహించారు. అది నాకు సువర్ణావకాశం. కొన్నాళ్లకి నాన్న ముంబయికి మారారు. అప్పుడే హిందుస్థానీ సంగీతం పట్ల ఆసక్తి ఏర్పడింది. తరవాత ఉస్తాద్‌జీతో కలిసి ఎన్నో ప్రదర్శనల్లో పాల్గొన్నా. ఆయనా కూతురిలానే అభిమానించారు.

బాంబే కాలేజీలో మ్యూజిక్ డిగ్రీ చేయడానికి వయసు తక్కువ కావడంతో, బనారస్ హిందూ యూనివర్సిటీకి వెళ్లా. అక్కడి సంగీత విభాగానికి డీన్ అయిన పండిట్ ఓంకార్‌నాథ్ ఠాకూర్ నన్ను శిష్యురాలిగా స్వీకరించి, మెలకువలన్నీ నేర్పించారు. విన్న ఏ రాగాన్నైనా వయొలిన్‌లో పలికించేదాన్ని. కర్ణాటక సంగీతంలో వాద్యం స్వరాన్ని అనుసరించే ఉంటుంది. హిందుస్థానీలోనూ అలా ఎందుకు చేయలేం అనుకున్నా. నాన్న సాయంతో చిన్న టెక్నిక్‌తో వయొలిన్‌మీద హిందుస్థానీ స్వరాల్నీ పలికించా. ఒకే రకమైన పదార్థాలతో దక్షిణాది, ఉత్తరాది వంటకాలు చేస్తుంటాం కదా. ఇదీ అలానే అన్నమాట. అప్పటివరకూ ఎవరూ ఈ కోణంలో ప్రయత్నించలేదు. దాంతో హిందుస్థానీలో కొత్త ఒరవడిని సృష్టించానంటూ 'గాయకి అంగ్'గా పిలవసాగారు. తరవాత చాలామంది వాద్యకారులు ఈ పద్ధతిని స్వీకరించారు. నాన్న నేర్పిన క్రమశిక్షణ, మా గురువుల శిక్షణ, నా కృషితోనే ఇదంతా సాధ్యమైంది' అంటారు రాజం.

సంస్కృతంలో ఎంఏ, సంగీతంలో పీహెచ్‌డీ చేశారు రాజం. అనేక అవార్డులూ పతకాలూ అందుకున్నారు. బనారస్ హిందూ యూనివర్సిటీలో నాలుగు దశాబ్దాలకు పైగా మ్యూజిక్ బోధించారు. 'ఎమెరిటస్ ప్రొఫెసర్' గుర్తింపు దక్కించుకున్నారు. వారణాసిలో శాస్త్రీయ సంగీతాన్ని ప్రోత్సహించడంలో చురుకుగా వ్యవహరించారు. పండిట్ ఓంకార్‌నాథ్ మ్యూజిక్ ఫౌండేషన్‌కు వ్యవస్థాపక అధ్యక్షురాలిగా ఉన్నారు. పద్మశ్రీ, పద్మభూషణ్, సంగీత నాటక అకాడమీ అవార్డులు అందుకోవడంతోపాటు ఇటీవల పద్మ విభూషణ్‌కీ ఎంపికయ్యారు.



సంగీత కుటుంబం!

'మావారు టి.ఎస్.సుబ్రమణియన్ చార్టర్డ్ అకౌంటెంట్. అత్తగారు పద్మా స్వామినాథన్ కర్ణాటక సంగీత విద్వాంసురాలు. నా విజయాల్లో వీళ్ల ప్రోత్సాహమెంతో. ప్రముఖ గాయని వాణీ జయరాం మా తోటికోడలు. అన్నయ్య ఎన్.కృష్ణన్ కూడా వయొలిన్ విద్వాంసులే. మేనకోడలు కళా రామనాథ్, కూతురు సంగీతా శంకర్, సూపర్ 30 ప్రణవ్ కుమార్, మనవరాళ్లు నందిని, రాగిణి, మరెందరో విద్యార్థులు నా దగ్గరే వయొలిన్ పాఠాలు నేర్చుకున్నారు. మా కుటుంబంలో డజనుకు పైగా వయొలిన్ వాద్యకారులు ఉన్నారు. మూడేళ్ల వయసులోనే వాళ్ల చేతికి వయొలిన్ ఇచ్చాం. దాన్ని వాళ్లు వదలకుండా చూసే బాధ్యత మనదే' అంటారు రాజం.

'మాకు వేరే మార్గం లేదు. మూడేళ్ల వయసులో మేం స్నానాన్ని వద్దన్నట్లే వయొలిన్ నేర్చుకోవడాన్నీ వ్యతిరేకించాం. కానీ అమ్మాజీ(అమ్మమ్మని అంతా ఇలానే పిలుస్తారు)కఠినమైన గురువు. ఆమె మమ్మల్ని తిట్టలేదు, కొట్టలేదు, బుజ్జగించనూ లేదు... వయొలిన్ మాత్రం నేర్చుకోవాల్సిందే అన్నారు. క్రమంగా దాంతో ప్రేమలో పడ్డాం అంటారీమె మనవరాళ్లు. డిజిటల్ టెక్నాలజీతో వీళ్లూ ఇప్పుడు వయొలిన్‌తో ఎన్నో ప్రయోగాలు చేస్తున్నారు.

గురుకుల పద్ధతిలో...

'అన్ని రంగాల్లోలాగే సంగీత రంగంలోనూ మార్పులు వస్తుంటాయి. ఆ పరిణామాన్ని ఆహ్వానించాల్సిందే. ఒకప్పటిలా ప్రజలకు ఎక్కువ తీరిక లేదు. కాబట్టి కచేరీ సమయాన్ని తగ్గించడం మంచిదే. అయితే రంగం ఏదయినా సాధనే ముఖ్యం. సంగీతంలో రాణించాలంటే రోజూ ఆరేడుగంటల సాధన అవసరం. అటు కెరియర్నీ ఇటు ఇంటినీ సమన్వయం చేసుకోలేం అంటుంటారు. కానీ మనసుంటే అన్నీ సాధ్యమే. నేను ఇంటిని చూసుకుంటూనే కెరియర్‌లోనూ రాణించా. కచేరీలూ చేశా. సంగీతంలోనే నాకు విశ్రాంతి. 88 ఏళ్ల వయసులోనూ చురుకుగా ఆరోగ్యంగా ఉండటానికి కారణం మితాహారం, క్రమం తప్పని సంగీత సాధన, వ్యాయామాలే' అనే రాజం... ప్రస్తుతం ముంబయిలో నివసిస్తున్నారు. మధ్యమధ్యలో బెంగళూరు సమీపంలోని తమ 'స్వర్- సాధన తపోవన్'లో గురుకుల పద్ధతిలో తరగతులు నిర్వహిస్తూ... సంగీత ప్రపంచానికి మరెందరో వాద్యకారుల్ని అందించే పనిలో ఉన్నారు.





ఓటమి దాటి... అయిదు కొలువులు

వర్షిత

ఓటమి ఎప్పుడూ నిరుత్సాహాన్నే ఇస్తుంది. కానీ దాన్నే పాఠంలా భావించి, తిరిగి ప్రయత్నిస్తే... అదిచ్చే విజయం గుర్తుండిపోతుంది. ఇది చిదిగే సాయి వర్షితకు బాగా అనుభవం. అలా ప్రయత్నించే... ఏకంగా అయిదు కేంద్ర ప్రభుత్వ కొలువులు సాధించారామె.

సాయి వర్షితది కడప జిల్లాలోని పులివెందుల. తల్లి అనిలాదేవి ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, తండ్రి గురుదత్త వ్యాపారి. అక్క సాయి వర్ణిత రాష్ట్ర ఖనిజాభివృద్ధి శాఖలోని న్యాయ విభాగంలో అసిస్టెంట్ మేనేజరుగా చేస్తున్నారు. వర్షిత... స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) పోటీపరీక్ష రాసి, ఉద్యోగం సాధించాలని కఠోర సాధన చేశారు. 2024లో ప్రిలిమ్స్ అర్హత సాధించినా మెయిన్స్ చేజారింది. అయినా కుంగిపోలేదామె. ఈసారి పొరపాట్లను సరిచేసుకుంటూ తిరిగి ప్రయత్నించారు. తాజా ఫలితాల్లో ప్రతిభ కనబరిచి ఏకంగా అయిదు కేంద్ర ప్రభుత్వ కొలువులు సాధించారు. వర్షిత న్యాయశాస్త్రం చదివారు. సివిల్స్ ఆమె లక్ష్యం. దాంతోపాటే ఈ కొలువులకీ సిద్ధమయ్యారు. న్యాయశాఖలో సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్, జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్, జూనియర్ కో-ఆపరేటివ్ ఆఫీసర్, జూనియర్ అకౌంటెంట్, టెక్నికల్ క్లర్క్ పోస్టులు సాధించారు. గత ఏడాది ఆర్ఆర్‌బీ ఎన్‌టీపీసీతోపాటు ఎస్ఎస్‌సీ కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్(సీజీఎల్) పరీక్షలూ రాశారు. 'సీజీఎల్ పరీక్ష కీ చూసుకున్నా. 330కి పైగా మార్కులొస్తాయి. దీనిలోనూ ఉద్యోగం సాధిస్తా. కానీ నా లక్ష్యం మాత్రం సివిల్స్. ముందు ఒక మంచి ప్రభుత్వోద్యోగం సాధించి, ఆర్థిక సురక్షిత పొందాలని కష్టపడ్డా. అది ఫలించింది. ఈ క్రమంలో అమ్మానాన్నల ప్రోత్సాహాన్ని మర్చిపోలేను. నేను ప్రముఖ న్యాయవాది సిద్ధార్థ లూత్రా వద్ద ఇంటర్న్‌షిప్ చేశా. అదీ నాకు మంచి అనుభవమే. ఎస్ఎస్‌సీ నిర్వహించే ఎనిమిది ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోగా అయిదు ఉద్యోగాలు సాధించా. ఇది నాలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది' అంటారు వర్షిత.

– ఫణిరాజు, పులివెందుల

పంట వ్యర్థం... కోట్ల వ్యాపారం!





అనసూయ

జీరో వేస్ట్ వంట, ఫ్యాషన్... ఇలాంటివి చాలాసార్లు వినే ఉంటాం కదా! అనసూయ జెనాది జీరో వేస్ట్ వ్యాపారం. దాంతోనే రూ.కోట్ల వ్యాపారం చేస్తున్నారామె. ఇంతకీ అదేంటో తెలుసుకుందాం రండి.

అనసూయది ఒడిశా. ఓసారి తమ ఊరు బాలిపట్నాకి వెళ్లినప్పుడు అరటి రైతుల ఇబ్బందుల్ని గమనించారామె. 'ఊళ్లో దాదాపు అందరి ఇళ్లల్లో అరటి చెట్లు ఉండేవి. కొందరు అరటి సాగు చేసేవాళ్లు. అందరిదీ ఒకే సమస్య! పంట కోశాక ఆ వ్యర్థాలను ఏం చేయాలనే! ఇది మమ్మల్ని ఆలోచనలో పడేసింది. నిజానికి గెలను కోశాక చెట్టుని పీకేస్తాం కానీ... కొన్ని తెగల్లో దాని కాండం, పువ్వులను ఆహారంగా వినియోగిస్తారు. నారతో దుస్తులు, వస్తువులు చేస్తుంటారు. వాటిని ప్రయత్నిస్తే రైతులకు పరిష్కారం చూపించొచ్చు. మేమూ ఆదాయం సమకూర్చుకోవచ్చు అనుకున్నాం. వివిధ రాష్ట్రాలు తిరిగి, అవగాహన తెచ్చుకున్నాక 2021లో మావారితో కలిసి 'జయదేవ్ బనానా ఫార్మర్స్ అండ్ ఆర్టిసన్స్ అసోసియేషన్ ప్రారంభించాం' అంటారు అనసూయ.

మొదట రైతులను కలిసి, ఆ పంటవ్యర్థాల గురించి సమాచారం ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. తరవాత వాటిని సేకరించి, తమ ఫ్యాక్టరీకి తరలిస్తారు. కాండం, పూల నుంచి పచ్చళ్లు, జ్యూస్, వడియాలు, నారతో బ్యాగులు, వస్త్రం, గృహాలంకరణ వస్తువులు, ఎరువులు ఇలా దాదాపు 300 రకాలు తయారు చేసి, దేశవ్యాప్తంగా అమ్ముతున్నారు. 'మొదట ఉచితంగా వ్యర్థాలను సేకరిస్తాం అన్నప్పుడు అంతా ఆశ్చర్యపోయారు. చెత్తనేం చేసుకుంటారని అడిగేవారు. కానీ అరటి మొక్కలోని ప్రతిభాగమూ పోషకాలతో నిండి ఉంటుంది. దానిలో వృథా అన్న భాగమే ఉండదు. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు... ఇలా అరటితో ఆహార ఉత్పత్తులు, వస్తువులు తయారు చేసే ప్రాంతాలన్నీ తిరిగి అవన్నీ నేర్చుకున్నాం. బోలెడు ప్రయోగాలు చేశాం. తరవాతే సంస్థని ప్రారంభించాం. వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి, రైతులను చేర్చాం. మొక్కకి రూ.10 చొప్పున ఇస్తుండటంతో పంట కోయగానే రైతులే సమాచారం ఇస్తారు' అంటారు అనసూయ.

ఇప్పుడు వాళ్లు తమ ఊరే కాదు, చుట్టుపక్కల గ్రామాల్లోని వెయ్యి మంది రైతులతో కలిసి పనిచేస్తున్నారు. ప్రభుత్వం నుంచి రూ.2 కోట్లు పెట్టుబడినీ అందుకున్నారు. ప్రారంభించిన రెండేళ్లలోనే రూ.కోటి వ్యాపారం చేశారు అనసూయ దంపతులు. గత ఏడాది దాన్ని రూ.2.5 కోట్లకు చేర్చారు. 'రైతులకు సాయం చేయాలి అనుకున్నాం. అదనపు ఆదాయాన్నీ ఇవ్వగలుగుతున్నందుకు ఆనందంగా ఉంది. మా ఉత్పత్తులకు ఆదరణ పెరుగుతుండటమూ సంతోషాన్నిచ్చే అంశమే. ఈ ఉత్సాహంతో 2030 నాటికి రూ.10కోట్లకు వ్యాపారాన్ని చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నాం' అంటోన్న వీళ్ల వృథా వ్యాపారం బాగుంది కదూ!

డ్యాన్స్ చేస్తే... అర్థమవుతారు!



ఈ రోజుల్లో పిల్లలకు ఆడుకునే తీరిక ఉండటం లేదు. దీనికి తోడు ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్‌తో సావాసం. ఈ క్రమంలో వారికి సరైన శారీరక శ్రమ ఉండటంలేదు. దీంతో ఊబకాయం, అలసట, తరచూ అనారోగ్యాలు... వీటిని దూరం చేయాలంటే చిన్నారులకు నచ్చిన డ్యాన్స్ నేర్పండి. రోజూ ఓ అరగంటైనా సాధన చేసేలా చూడండి. ఎన్ని ఫలితాలుంటాయో! బాడీకి ఫ్లెక్సిబిలిటీ వస్తుంది. పోశ్చర్ మెరుగుపడుతుంది. కండరాలకు తగిన మసాజ్ అందుతుంది. అంతేకాదు, మెదడుకీ శరీరానికీ మధ్య సమన్వయం కుదరడం వల్ల జ్ఞాపకశక్తీ పెరుగుతుందట. తోటి పిల్లలతో కలిసి సాధన చేయడం వల్ల నలుగురిలో కలిసిపోయే తత్వం, చొరవ వంటివే కాదు... ఇతరుల హావభావాలను అర్థం చేసుకోవడం, సమయస్ఫూర్తి కూడా అలవడతాయి. భవిష్యత్తులో దేనికీ స్టేజ్ ఫియర్ అంటూ వెనకడుగు వేయరు కూడా. మానసికంగా దృఢంగా ఉంటారు. భావోద్వేగాలనూ అదుపులో ఉంచుకోగలుగుతారు. వీటన్నింటి ఫలితంగా ఆనందంగా, ఆరోగ్యంగానూ ఉండగలరు. ఇన్ని ప్రయోజనాలున్నప్పుడు మన పిల్లలకీ నేర్పిస్తే మంచిది కదా! మీరేమంటారు.

ఆహ్వానం

వసుంధర పేజీపై మీ అభిప్రాయాలు, సలహాలు, నిపుణులకు ప్రశ్నలు... ఇలా మాతో ఏది పంచుకోవాలన్నా 9154091811కు వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

దోమల్ని తరిమే నూనెలివి...

ఆహారవ్యర్థాలు, తేమ, నిలిచిన నీరు, గాలి ప్రసరణ సరిగా లేకపోవడం ఇలా ఎన్నో కారణాల వల్ల బొద్దింకలు, పురుగులు ఇంట్లో చేరుతుంటాయి. వీటిని సహజంగా సులువుగా తరిమేయాలంటే...



- పావుకప్పు ఆవనూనెలో, ఐదారు పుదీనా ఆకులు వేసి మరగనివ్వాలి. ఆ మిశ్రమాన్ని వడకట్టి ఓ సీసాలో పోసుకోవాలి. ఇప్పుడు గ్లాసు నీళ్లలో అరచెంచా ఈ నూనెను కలిపి వంటగది మూలల్లో స్ప్రే చేయండి. కొన్ని రోజులు ఇలా చేస్తే బొద్దింకలు దరిచేరవు.
- వేప నూనె సహజ క్రిమి సంహారిణిగా పనిచేస్తుంది. పావులీటరు నీటిలో చెంచా వేపనూనె, అరచెంచా వంట సోడా కలపాలి. దాన్ని అవసరమైన చోట స్ప్రే చేయండి. పావుగంట తర్వాత దోమలే కాదు... చిన్న చిన్న పురుగులు కూడా పోతాయి. ఇక, బొద్దింకలు పోవాలంటే... నిమ్మ చెక్కపై కాస్తవేప నూనె అద్ది... సింకుల కింద, మురికి నీళ్ల గొట్టాలు, తలుపు మూలల్లో పెడితే సరి. వాటికి అడ్డుకట్ట వేయొచ్చు.
- నిమ్మగడ్డి నూనె ఘాటైన వాసనకు బొద్దింకలు పరారవుతాయి. లీటరు నీటిలో కాస్త బేకింగ్ సోడా, నాలుగైదు చుక్కల నిమ్మగడ్డి నూనెను కలిపి... వంటింటి గట్టు, గోడలు తుడవండి. మూలల్లో స్ప్రే చేయండి.





వంటింట్లోనూ క్రోషె అందాలు..!

ఓర్పు, సృజనాత్మకత కలగలిపి చేసిన క్రోషె అందాల్ని చూసి ముగ్ధులవ్వని వాళ్లు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. అందుకే చిన్నపిల్లల నుంచి పెద్దవాళ్ల వరకూ క్రోషెతో అల్లిన గౌన్లు, స్వెటర్లు, కోట్‌లు వేసుకుని మురిసిపోతుంటారు. కొన్ని ప్రాంతాల్లో అయితే గర్భం దాల్చిన వెంటనే గర్భస్థ శిశువుకు క్రోషె దుస్తులు అల్లడం ఓ సంప్రదాయంగానూ భావిస్తారు. ఈ అల్లికలో ఉన్న అందం, సౌకర్యం, మృదుత్వమే ఇందుకు కారణం. మరి ఇంత చరిత్ర ఉన్న ఈ అల్లికల్ని కేవలం దుస్తులకో, ఏదో ఒక ప్రాంతానికో పరిమితం చేయడం సబబు కాదు అనుకున్నారో ఏమో తయారీదారులు... మొక్కల దగ్గర్నుంచీ పడకగది, హాల్, బాల్కనీ అన్నీ దీంతో తయారుచేసిన అలంకరణ వస్తువులతోనే నింపేస్తున్నారు. ఇప్పుడు ఈ క్రోషె అందాలు వంటింట్లోకీ వచ్చేశాయి. టీ కప్పులకు అలంకరణ వస్త్రం, సరకుల్ని ఉంచే బాక్సులు, స్పూన్లు-గరిటెలు పెట్టుకునే ఆర్గనైజర్లు, పండ్లు కూరగాయలు సర్దుకునే బ్యాగులు... ఇలా చెప్పుకొంటూ పోవాలే కానీ... వంటిల్లు మొత్తం క్రోషె అందాలతో నింపే పనిలో పడ్డారు. వీటిల్లో ఎక్కువ శాతం వేలాడదీసే డిజైన్లే. కాబట్టి స్థలాభావ సమస్యే ఉండదు. గాజు, సెరామిక్ వంటి వాటితో పోలిస్తే మన్నిక కూడా ఎక్కువే. అంతేనా... అందానికి అందం, సౌలభ్యం కూడా. మినిమలిస్టిక్ డిజైన్లు మెచ్చే వాళ్లకి ఇవి మంచి ఎంపిక. మీకూ నచ్చాయా. ఆన్‌లైన్ వేదికల్లో వెతికేయండి మరి!

స్మార్ట్ కిచెన్



టీ20 ధమాకా ప్రపంచకప్ ఫిబ్రవరి 7 - మార్చి 8

ఛాంపియన్

టీ20 ప్రపంచకప్‌లో ఈనాడు

దక్షిణాఫ్రికా × అఫ్గానిస్థాన్
వేదిక: అహ్మదాబాద్, ఉ. 11.00

ఆస్ట్రేలియా × ఐర్లాండ్
వేదిక: కొలంబో, మ. 3.00

ఇంగ్లాండ్ × వెస్టిండీస్
వేదిక: ముంబయి, రా. 7.00

టీ20 ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌కు వరుసగా రెండో విజయం. తొలి మ్యాచ్‌లో నెదర్లాండ్స్‌ను అతికష్టంగా ఓడించిన ఆ జట్టు.. అమెరికాపై మాత్రం అలవోకగా నెగ్గింది. ఫర్హాన్ అదిరే ఇన్నింగ్స్‌తో పాక్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. షాదాబ్ ఖాన్ ఆల్‌రౌండ్ సత్తా చాటాడు. టోర్నీలో అమెరికాకు ఇది రెండో ఓటమి.

ఈసారి ఘనంగా..

- అమెరికాపై పాక్ విజయం
- మెరిసిన ఫర్హాన్, తారిఖ్




కొలంబో

టీ20 ప్రపంచకప్‌లో పాకిస్థాన్ సత్తా చాటింది. సాహిబ్‌జాదా ఫర్హాన్ (73; 41 బంతుల్లో 6×4, 5×6) మెరవడంతో మంగళవారం ఏకపక్షంగా సాగిన గ్రూప్-ఎ మ్యాచ్‌లో పాక్ 32 పరుగుల తేడాతో అమెరికాను మట్టికరిపించింది. ఫర్హాన్‌తో పాటు బాబర్ ఆజమ్ (46; 32 బంతుల్లో 4×4, 1×6) రాణించడంతో మొదట పాక్.. 9 వికెట్ల నష్టానికి 190 పరుగులు చేసింది. అనంతరం ఉస్మాన్ తారిఖ్ (3/27), షాదాబ్ ఖాన్ (2/26)ల ధాటికి అమెరికా.. 8 వికెట్లకు 158 పరుగులే చేయగలిగింది. శుభమ్ రంజానే (51; 30 బంతుల్లో 3×4, 3×6) టాప్ స్కోరర్. టాస్ ఓడి పాక్ బ్యాటింగ్‌కు దిగగా.. ఇన్నింగ్స్‌కు ఓపెనర్ ఫర్హాన్ వెన్నెముకలా నిలిచాడు. ఎడాపెడా ఫోర్లు, సిక్స్‌లతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. అతడు సయిమ్ అయూబ్ (19)తో తొలి వికెట్‌కు 51, బాబర్‌తో మూడో వికెట్‌కు 81 పరుగులు జోడించాడు. ఫర్హాన్ 27 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేశాడు. ఇక ఎదుర్కొన్న తొలి 18 బంతుల్లో 15 పరుగులే చేసిన బాబర్ ఆ తర్వాత.. బ్యాట్ ఝుళిపించాడు. జోరు మీదున్న దశలో మూడో వికెట్‌గా వెనుదిరిగాడు. 16వ ఓవర్లో ఫర్హాన్ నిష్క్రమించేటప్పటికి పాకిస్థాన్ స్కోరు 143. అతడు నాలుగో వికెట్‌గా పెవిలియన్ బాట పట్టాడు. ఆఖర్లో పాక్ చకచకా వికెట్లు కోల్పోయింది. అయితే షాదాబ్ ఖాన్ (30; 12 బంతుల్లో 4×4, 1×6) విరుచుకుపడడంతో చివరి నాలుగు ఓవర్లలో 45 పరుగులు రాబట్టింది. ఛేదనలో అమెరికా ప్రయత్నం సరిపోలేదు. శుభమ్ రంజానే, జహంగీర్ (49; 34 బంతుల్లో 5×4, 2×6), మిలింద్ కుమార్ (29; 22 బంతుల్లో 2×4, 1×6)ల పోరాటం ఓటమి అంతరాన్ని తగ్గించడానికే ఉపయోగపడింది. ఫర్హాన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

పాకిస్థాన్ ఇన్నింగ్స్: సయిమ్ అయూబ్ (సి) నేత్రావల్కర్ (బి) షాడ్లీ వాన్ షాల్క్‌విక్ 19; ఫర్హాన్ (సి) సంజయ్ కృష్ణమూర్తి (బి) హర్మీత్ సింగ్ 73; సల్మాన్ ఆఘా (సి) జహంగీర్ (బి) షాడ్లీ షాల్క్‌విక్ 1; బాబర్ (సి) మిలింద్ కుమార్ (బి) మోసిన్ 46; నవాజ్ (సి) జహంగీర్ (బి) నేత్రావల్కర్ 5; షాదాబ్ ఖాన్ (సి) గౌస్ (బి) షాడ్లీ షాల్క్‌విక్ 30; ఫహీమ్ అష్రఫ్ (సి) నేత్రావల్కర్ (బి) షాడ్లీ షాల్క్‌విక్ 1; ఉస్మాన్ ఖాన్ రనౌట్ 0; షహీన్ అఫ్రిది నాటౌట్ 9; అబ్రార్ రనౌట్ 0; ఎక్స్‌ట్రాలు 6 **మొత్తం:** (20 ఓవర్లలో 9 వికెట్లకు) **190;** **వికెట్ల పతనం:** 1-54, 2-56, 3-137, 4-143, 5-177, 6-179, 7-179, 8-182, 9-190; **బౌలింగ్:** షహీన్ షా అఫ్రిది 4-0-42-1; సయిమ్ అయూబ్ 1-0-11-0; అబ్రార్ అహ్మద్ 4-0-30-1; నవాజ్ 3-0-21-1; షాదాబ్ ఖాన్ 4-0-26-2; ఉస్మాన్ ఖాన్ 4-0-27-3

అమెరికా ఇన్నింగ్స్: ఆండ్రీస్ గౌస్ (సి) సల్మాన్ ఆఘా (బి) నవాజ్ 13; జహంగీర్ (సి) షహీన్ అఫ్రిది (బి) షాదాబ్ 49; మోనాంక్ పటేల్ (సి) అండ్ (బి) షహీన్ అఫ్రిది 3; మిలింద్ కుమార్ (సి) షహీన్ అఫ్రిది (బి) ఉస్మాన్ తారిఖ్ 29; శుభమ్ రంజానే ఎల్బీ (బి) షాదాబ్ 51; సంజయ్ కృష్ణమూర్తి (బి) అబ్రార్ 0; హర్మీత్ సింగ్ (సి) నవాజ్ (బి) ఉస్మాన్ తారిఖ్ 1; షాడ్లీ వాన్ షాల్క్‌విక్ (సి) సయిమ్ (బి) ఉస్మాన్ తారిఖ్ 0; మోసిన్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 5 **మొత్తం:** (20 ఓవర్లలో 8 వికెట్లకు) **158;** **వికెట్ల పతనం:** 1-42, 2-58, 3-69, 4-123, 5-124, 6-152, 7-152, 8-156; **బౌలింగ్:** నేత్రావల్కర్ 4-0-40-1; ఆదిల్ 3-0-39-0; షాడ్లీ షాల్క్‌విక్ 4-0-25-4; మిలింద్ కుమార్ 1-0-16-0; మోసిన్ 4-0-27-1; హర్మీత్ సింగ్ 4-0-41-1

పాక్ ఎందుకు తగ్గింది?



పాకిస్థాన్‌లో బీసీబీ, పీసీబీ, ఐసీసీ ప్రతినిధులు

దిల్లీ

బంగ్లాదేశ్‌కు మద్దతుగా అసలు టీ20 ప్రపంచకప్‌లోనే ఆడనంది. ఆ తర్వాత టోర్నీలో ఆడతాం కానీ భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరిస్తామని చెప్పింది. విపరీతమైన రచ్చ, నాటకీయ పరిణామాల అనంతరం భారత్‌తోనూ ఆడతామని ప్రకటించింది. తగ్గేదేలే అంటూ ప్రగల్భాలు పలికిన పాకిస్థాన్.. తోకముడిచిన తీరిది. కొన్ని రోజుల పాటు క్రికెట్ ప్రపంచంలో గందరగోళం సృష్టించిన పాక్.. అనిశ్చితికి తెరదించుతూ షెడ్యూలు ప్రకారం ఈ నెల 15 భారత్‌తో మ్యాచ్ ఆడతామని ప్రకటించిన సంగతి తెలిసిందే. క్రికెట్ ప్రయోజనాల కోసమని పాక్ పైకి చెబుతున్నప్పటికీ.. ఇది కచ్చితంగా దిగిరావడమే. పాకిస్థానేమీ ఐచ్ఛికంగా మనసు మార్చుకోలేదు. దౌత్యం, డబ్బు, ఐసీసీ అధికారానికి ఆ దేశం తలవంచక తప్పలేదు. ప్రపంచకప్ నుంచి వైదొలిగినందుకు బంగ్లాదేశ్‌పై ఆంక్షలు విధించబోమని ఐసీసీ చెప్పడంతో కాస్త గౌరవప్రదంగా తన నిర్ణయాన్ని మార్చుకోవడానికి పాకిస్థాన్‌కు అవకాశం దక్కింది.

అంతా డబ్బు మాయ

భారత్-పాక్ మ్యాచ్‌కు మార్గం సుగమం కావడానికి కారణాలు చాలా వరకు రాజకీయ పరమైనవే కావొచ్చు. కానీ ఇందులో ఆర్థిక కోణాన్ని విస్మరించలేం. ఇది చాలా ముఖ్యమైంది కూడా. భారత్-పాక్ మ్యాచ్ విలువ రూ.4500 కోట్లకు పైనే ఉంటుందని అంచనా. మ్యాచ్ జరగకపోతే భారీ నష్టమే వచ్చేది. ఐసీసీతో పాటు అన్ని సభ్య దేశాలు ఆదాయం కోల్పోయేవి. ఈ నేపథ్యంలో జట్లన్నీ ఈ మ్యాచ్ జరగాలని కోరుకున్నాయి. దీంతో పాకిస్థాన్‌పై అన్ని వైపులా నుంచి ఒత్తిడి రావడం మొదలైంది. ఆర్థిక జరిమానాలు విధిస్తామని పీసీబీని ఐసీసీ హెచ్చరించింది. నష్టాలను పూడ్చుకోవడం కోసం ప్రసారదారు కూడా న్యాయస్థానాన్ని ఆశ్రయించడానికి సిద్ధమైంది. జరిమానాకు గురికావడమే కాదు.. ప్రపంచ క్రికెట్లో ఎంతో ఆసక్తి ఉన్న ఇంత పెద్ద మ్యాచ్ నుంచి వైదొలగడం వల్ల పీసీబీ వాణిజ్యపరంగా ఏకాకి అయ్యేది కూడా. భారత్‌తో మ్యాచ్ బహిష్కరణ నిర్ణయాన్ని పాక్ వెనక్కి తీసుకోవడం వల్ల ఐసీసీకి రూ.1470 కోట్లు ఆదా అయ్యాయని ఓ అంచనా. ఈ నిర్ణయంతో పాక్ కూడా పెద్ద ఆర్థిక సంక్షోభాన్ని తప్పించుకుంది.

శ్రీలంక కీలక పాత్ర

ఆర్థికంగా తానూ భారీగా నష్టపోయే అవకాశం ఉండడంతో భారత్‌తో మ్యాచ్ ఆడాలని పాకిస్థాన్‌కు బంగ్లాదేశ్ బోర్డు విజ్ఞప్తి చేసింది. నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని యూఏఈ కూడా పీసీబీని కోరింది. ఐసీసీ ఒత్తిడి ఉండనే ఉంది. అలాంటి స్థితిలో పాకిస్థాన్ ప్రభుత్వం తన నిర్ణయం మార్చుకోవడంలో శ్రీలంక ఇంకా కీలక పాత్ర పోషించింది. దౌత్యపరంగా జోక్యం చేసుకుంది. స్వయంగా శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార.. పాకిస్థాన్ ప్రధాని షరీఫ్‌కు ఫోన్ చేసి, బహిష్కరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారని పాక్ మీడియా పేర్కొంది. అంతకుముందు శ్రీలంక క్రికెట్ బోర్డు (ఎస్ఎల్‌సీ).. పీసీబీకి ఓ భావోద్వేగ లేఖ రాసింది. కఠిన వ్యాఖ్యలు చేయడానికి కూడా వెనుకాడలేదు. 2009లో లాహోర్‌లో తమ జట్టు బస్సుపై దాడి తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌కు పాక్ దూరమైన రోజులను ఎస్ఎల్‌సీ గుర్తు చేసింది. అప్పట్లో శ్రీలంక ఒక్కటే పాకిస్థాన్‌లో పర్యటించి ఆ దేశంలో అంతర్జాతీయ క్రికెట్ పునరుద్ధరణకు దోహదపడింది. అదే విషయాన్ని గుర్తు చేసిన ఎస్ఎల్‌సీ.. కొలంబోలో భారత్‌తో మ్యాచ్ ఆడడం ద్వారా ఇప్పుడు తమకు మేలు చేయాలని కోరింది. ఆ మ్యాచ్ రద్దయితే తమకు చాలా నష్టం వస్తుందని పేర్కొంది. భారత్-పాకిస్థాన్ మ్యాచ్‌తో టికెట్లు, కార్పొరేట్ బాక్స్‌లు, స్టేడియంలో వ్యాపార ప్రకటనలు, ఇతర మార్గాల ద్వారా శ్రీలంకకు ఆదాయం వస్తుంది. మ్యాచ్ జరగకపోతే కొలంబోలో స్థానిక ఆర్థిక వ్యవస్థకు ప్రత్యక్షంగా, పరోక్షంగా చాలా నష్టం వచ్చేది. అందుకే భారత్‌తో మ్యాచ్ బహిష్కరించడంపై పునరాలోచించాలని పీసీబీకి రాసిన లేఖలో ఎస్ఎల్‌సీ పేర్కొంది.

వాళ్ల తీరే అంత!

ముందు హెచ్చరికలు చేయడం, తర్వాత వెనక్కి తగ్గడం.. పాకిస్థాన్ క్రికెట్ జట్టుకు, క్రికెట్ పాలకులకు అలవాటైన వ్యవహారమే. గత ఏడాది ఛాంపియన్స్ ట్రోఫీ కోసం తమ దేశానికి భారత జట్టు రావాల్సిందే అని పట్టుబట్టింది. లేదంటే ఛాంపియన్స్ ట్రోఫీ ఆతిథ్యం నుంచి తప్పుకొంటామంది. హైబ్రిడ్ పద్ధతిలో టోర్నీ నిర్వహణకు ససేమిరా అంది. చివరికి భారత్‌లో జరిగే టీ20 ప్రపంచకప్‌ను తాము కూడా హైబ్రిడ్ మోడల్‌లోనే ఆడతామన్న షరతు మీద భారత్ దుబాయ్‌లో మ్యాచ్‌లు ఆడడానికి పాక్ అంగీకరించింది. నిరుడు ఆసియా కప్‌లో పాక్‌తో మ్యాచ్ సందర్భంగా ఆ జట్టు ఆటగాళ్లతో టీమ్ఇండియా కెప్టెన్, సహచరులు కరచాలనం చేయకపోవడంపై పాక్ చాలా రాద్ధాంతమే చేసింది. ఇందుకు బాధ్యుడిగా పేర్కొంటూ మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్‌ను తప్పించాలని ఐసీసీని డిమాండ్ చేసింది. లేదంటే యూఏఈతో మ్యాచ్ ఆడమంటూ మొండికేసింది. చివరికి పైక్రాఫ్ట్ అధికారికంగా క్షమాపణ చెప్పకపోయినా.. అతను సారీ చెప్పాడని ప్రకటించుకుని గంట ఆలస్యంగా మ్యాచ్‌లో పాల్గొంది. ఇక వర్తమానంలోకి వస్తే.. బంగ్లాదేశ్ ప్రపంచకప్‌లో ఆడనందుకు తాము కూడా ఈ టోర్నీని బహిష్కరిస్తామని హెచ్చరించింది. తర్వాత భారత్‌తో మ్యాచ్ ఆడమని ప్రకటించింది. అయితే పాక్ యుటర్న్ తీసుకుంటుందంటూ గావస్కర్ సహా పలువురు భారత మాజీలు చెబుతూనే వచ్చారు. ఆ మాటనే నిజం చేస్తూ భారత్‌తో మ్యాచ్‌కు సిద్ధమైపోయింది. ఈ వ్యవహారంలో బంగ్లాదేశ్ లాభ పొందినా.. పాక్ పరువు పోగొట్టుకుంది.

మా లక్ష్యం బంగ్లాదేశ్ గౌరవం: నఖ్వీ

పెషావర్: బంగ్లాదేశ్ గౌరవం కోసమే భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరించాలన్న నిర్ణయంపై వెనక్కి తగ్గామని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఛైర్మన్ మోసిన్ నఖ్వీ పేర్కొన్నాడు. "మేం బంగ్లాదేశ్ గురించి తప్ప ఇంకేమీ మాట్లాడలేదు. ఆ దేశానికి జరిగిన అన్యాయం గురించి ప్రస్తావించి, వారికి గౌరవం తెచ్చిపెట్టడమే మా ఉద్దేశం. బంగ్లాదేశ్ డిమాండ్లన్నింటికీ ఐసీసీ అంగీకరించింది. అలా చేశారంటే వారికి అన్యాయం జరిగిందంటే ఒప్పుకొన్నట్లే. ఈ సమావేశంలో మా వ్యక్తిగత ప్రయోజనాలు ఏమీ లేవు. మా ప్రభుత్వం నిర్ణయం కూడా బంగ్లా మీద ఆధారపడిందే" అన్నాడు.

కంగారూలు.. ఎట్టకేలకు

నేడు ఐర్లాండ్‌తో తొలి పోరు



మిచెల్ మార్ష్

కొలంబో: టీ20 ప్రపంచకప్ మొదలై నాలుగు రోజులు గడిచిపోయింది. మిగతా జట్లన్నీ మైదానంలోకి అడుగు పెట్టేశాయి. న్యూజిలాండ్, పాకిస్థాన్, నెదర్లాండ్స్, స్కాట్లాండ్, అమెరికా జట్లు రెండేసి మ్యాచ్‌లు ఆడేశాయి. కానీ టైటిల్ ఫేవరెట్లలో ఒకటైన ఆస్ట్రేలియా మాత్రం ఇంకా బరిలోకే దిగలేదు. ఈ మాజీ ఛాంపియన్.. ఎట్టకేలకు బుధవారం తన తొలి మ్యాచ్‌ను ఆడబోతోంది. తమ ఆరంభ పోరులో ఆతిథ్య శ్రీలంక చేతిలో పోరాడి ఓడిన ఐర్లాండ్‌ను.. కంగారూ జట్టు ఢీకొనబోతోంది. ఈ జట్లున్న గ్రూప్-సిలో మ్యాచ్‌లన్నీ కొలంబోలోనే జరగనున్న సంగతి తెలిసిందే. స్పిన్‌కు బాగా అనుకూలించే ఈ వేదికలో ఆస్ట్రేలియా.. ఇద్దరు స్పెషలిస్టు స్పిన్నర్లు ఆడమ్ జంపా, మాథ్యూ కునెమన్‌లతో పాటు స్పిన్ ఆల్‌రౌండర్లు మ్యాక్స్‌వెల్, కూపర్ కనోలీలను తుది జట్టులో ఆడించే అవకాశముంది. కెప్టెన్ మిచెల్ మార్ష్, ట్రావిస్ హెడ్‌లకు తోడు గ్రీన్, ఇంగ్లిస్, డేవిడ్, స్టాయినిస్, మ్యాక్స్‌వెల్‌లతో ఆ జట్టు బ్యాటింగ్ ఎంతో బలంగా కనిపిస్తోంది. ఎలిస్, బార్ట్‌లెట్ కొత్త బంతిని పంచుకుంటారు. మరోవైపు ఐర్లాండ్.. స్టిర్లింగ్, హ్యారీ టెక్టార్, టక్కర్, మార్క్ అడైర్, మెకార్తీలపై ఆశలు పెట్టుకుంది. బుధవారం మిగతా రెండు మ్యాచ్‌ల్లో దక్షిణాఫ్రికాతో అఫ్గానిస్థాన్, ఇంగ్లాండ్‌తో వెస్టిండీస్ తలపడతాయి.

డెలీడ్ ఆల్‌రౌండ్ జోరు

ఖాతా తెరిచిన నెదర్లాండ్స్



దిల్లీ

టీ20 ప్రపంచకప్‌లో నెదర్లాండ్స్ ఖాతా తెరిచింది. గ్రూప్-ఎ తొలి మ్యాచ్‌లో పాకిస్థాన్‌ను ఓడించినంత పని చేసిన డచ్ జట్టు.. రెండో మ్యాచ్‌లో సాధికారిక విజయాన్ని అందుకుంది. మంగళవారం నెదర్లాండ్స్ 7 వికెట్ల తేడాతో నమీబియాను చిత్తు చేసింది. మొదట నమీబియా 8 వికెట్లకు 156 పరుగులు చేసింది. లాఫ్టీ ఈటన్ (42; 38 బంతుల్లో 1×4, 2×6) టాప్ స్కోరర్. ఫ్రైలింక్ (30), స్మిత్ (22) రాణించారు. వాన్ బీక్ (2/13), బాస్ డెలీడ్ (2/20) ప్రత్యర్థికి కళ్లెం వేశారు. డెలీడ్ (72 నాటౌట్; 48 బంతుల్లో 5×4, 4×6) బ్యాటుతోనూ అదరగొట్టడంతో నెదర్లాండ్స్ 18 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. అకర్‌మ్యాన్ (32), లెవిట్ (28) కూడా డచ్ విజయంలో కీలకపాత్ర పోషించారు.

డెలీడ్ దూకుడు: ఛేదనలో నెదర్లాండ్స్‌కు ఆరంభంలో ఎదురు దెబ్బ తగిలింది. మూడో ఓవర్లోనే ఓపెనర్ ఒడౌడ్ (7) వెనుదిరిగాడు. ఈ స్థితిలో డెలీడ్ జట్టును నడిపించాడు. మరో ఓపెనర్ మైకేల్ లెవిట్ జతగా స్కోరు పెంచాడు. ఉన్నంతసేపు దూకుడుగా ఆడిన లెవిట్‌ను పవర్‌ప్లే చివరి ఓవర్లో ట్రంపుల్‌మ్యాన్ ఔట్ చేయడంతో నెదర్లాండ్స్ 5.3 ఓవర్లకు 46/2తో నిలిచింది. వికెట్ పడినా డెలీడ్ తగ్గలేదు. ధాటిగా ఆడిన అతడు.. సాధించాల్సిన రన్‌రేట్‌ను నియంత్రణలో ఉంచాడు. అకర్‌మ్యాన్ నుంచి అతడికి చక్కటి సహకారం అందింది. అకర్‌మ్యాన్ వెనుదిరిగినా.. కెప్టెన్ ఎడ్వర్డ్స్ (18 నాటౌట్)తో కలిసి డెలీడ్ పని పూర్తి చేశాడు. ఈ క్రమంలోనే అతడు 38 బంతుల్లో అర్ధసెంచరీ అందుకున్నాడు. అంతకుముందు లాఫ్టీ ఈటన్, ఫ్రైలింక్ రాణించడంతో నమీబియా ఓ మోస్తరు స్కోరు చేయగలిగింది. అయితే ఆరంభం నుంచి డచ్ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులు వేయడంతో నమీబియా వేగంగా ఆడలేకపోయింది. 15 ఓవర్లకు ఆ జట్టు స్కోరు 109 పరుగులే. పైగా నాలుగు వికెట్లు పడ్డాయి. ఈ స్థితిలో స్మిట్, ఎరాస్మస్ (18) నిలవడంతో నమీబియా పోరాడే స్కోరు చేయగలిగింది. డెలీడ్, వాన్ బీక్ బౌలింగ్‌లో ఆకట్టుకున్నారు.

నమీబియా ఇన్నింగ్స్: స్టీన్‌కాంప్ (స్టంప్డ్) ఎడ్వర్డ్స్ (బి) ఆర్యన్ దత్ 6; ఫ్రైలింక్ (సి) ఎడ్వర్డ్స్ (బి) వాన్ బీక్ 30; లాఫ్టీ ఈటన్ (సి) వాండర్‌మెర్వ్ (బి) వాన్‌బీక్ 42; ఎరాస్మస్ (సి) ఆర్యన్ దత్ (బి) డెలీడ్ 18; స్మిట్ (బి) డెలీడ్ 22; జేన్ గ్రీన్ (సి) లెవిట్ (బి) క్లాసెన్ 9; ట్రంపుల్‌మ్యాన్ రనౌట్ 9; లీచెర్ నాటౌట్ 6; మైబర్గ్ రనౌట్ 4; ఎక్స్‌ట్రాలు 10 **మొత్తం:** (20 ఓవర్లలో 8 వికెట్లకు) **156;** **వికెట్ల పతనం:** 1-10, 2-60, 3-95, 4-107, 5-127, 6-137, 7-145, 8-156; **బౌలింగ్:** ఆర్యన్ దత్ 3-0-13-1; వాన్ బీక్ 3-0-13-2; ఫ్రెడ్ క్లాసెన్ 3-0-25-1; కొలిన్ ఆకర్‌మ్యాన్ 3-0-33-0; జాక్ క్యాషే 1-0-6-0; టిమ్ వాండర్‌గ్యూటన్ 2-0-21-0; బాస్ డెలీడ్ 3-0-20-2; వాండర్‌మెర్వ్ 2-0-22-0

నెదర్లాండ్స్ ఇన్నింగ్స్: మైకేల్ లెవిట్ (సి) మైబర్గ్ (బి) ట్రంపుల్‌మ్యాన్ 28; మ్యాక్స్ ఒడౌడ్ (సి) ఎరాస్మస్ (బి) షోల్జ్ 7; బాస్ డెలీడ్ నాటౌట్ 72; ఆకర్‌మ్యాన్ (సి) ఎరాస్మస్ (బి) లాఫ్టీ ఈటన్ 32; స్కాట్ ఎడ్వర్డ్స్ నాటౌట్ 18; ఎక్స్‌ట్రాలు 2 **మొత్తం:** (18 ఓవర్లలో 3 వికెట్లకు) 159; **వికెట్ల పతనం:** 1-16, 2-46, 3-116; **బౌలింగ్:** బెర్నార్డ్ షోల్జ్ 4-0-27-1; ట్రంపుల్‌మ్యాన్ 4-0-30-1; స్మిట్ 3-0-25-0; మ్యాక్స్ హింగో 2-0-22-0; మైబర్గ్ 2-0-12-0; ఎరాస్మస్ 1-0-11-0; లాఫ్టీ ఈటన్ 2-0-31-1



మంగళవారం తన కుటుంబంతో పాటు ప్రధాని నరేంద్ర మోదీని కలిసిన దిగ్గజ క్రికెటర్ సచిన్ తెందుల్కర్. మార్చి 5న జరగబోయే తన కొడుకు అర్జున్ వివాహానికి ప్రధానిని సచిన్ ఆహ్వానించాడు.

ఆకృతికి రజతం



ఆకృతి

దిల్లీ: ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఆకృతి దహియా, అంజుమ్ మౌద్గిల్ సత్తాచాటారు. మంగళవారం జరిగిన పోటీల్లో ఆకృతి రజతం, అంజుమ్ కాంస్య పతకాలతో మెరిశారు. మహిళల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్‌లో ఆకృతి (354.2) రెండు, అంజుమ్ (340.4) మూడో స్థానాల్లో నిలిచారు. సోఫియా షుజెంకో (358.2- కజకిస్థాన్) ప్రపంచ రికార్డుతో స్వర్ణ పతకం గెలుచుకుంది. ఆసియా, ప్రపంచ జూనియర్, ఆసియా జూనియర్ రికార్డుల్ని సైతం సోఫియా తిరగరాసింది. జూనియర్ మహిళల 3 పొజిషన్‌లో ప్రాచి గైక్వాడ్ (353.3) స్వర్ణం, తొమిరిస్ అమనోవా (351.4- కజకిస్థాన్) రజతం, అనుష్క తోకుర్ (341.1) కాంస్యం సాధించారు. ప్రాచి, అనుష్క, హేజెల్‌లతో కూడిన భారత బృందం టీమ్ విభాగంలో బంగారు పతకం కైవసం చేసుకుంది.

పాక్‌కు అది కలిసొచ్చేదే: డస్కాటే

దిల్లీ: టీ20 ప్రపంచకప్ లీగ్ మ్యాచ్‌లో పాకిస్థాన్‌ను ఎదుర్కొనేందుకు భారత్ ఎల్లప్పుడూ మానసికంగా సిద్ధంగా ఉంటుందని టీమ్ఇండియా సహాయ కోచ్ ర్యాన్ టెన్ డస్కాటే అన్నాడు. మైదానం ఆవలి పరిణామాలు భారత డ్రెస్సింగ్ రూమ్‌పై ఎలాంటి ప్రభావం చూపలేదని డస్కాటె తెలిపాడు. "పాక్ జట్టు రాకపై మాకు ఎలాంటి సందేహాలు లేవు. ఆ జట్టు మైదానంలో అడుగుపెట్టనంత వరకు మేం మ్యాచ్ జరుగుతుందనే భావించాం. యథాతథ స్థితిని ముందుగానే అంగీకరించాం. రెండు దేశాల మధ్య ఉన్న రాజకీయ పరిస్థితులు, భావోద్వేగాల కంటే క్రికెట్‌పై దృష్టిసారించడమే మాకు అత్యంత ముఖ్యం. రెండు వారాల నుంచి కొలంబోలో ఉండడం పాక్‌కు కలిసొస్తుంది. ఆ జట్టుతో తలపడటం సవాలే. ఈ మ్యాచ్‌లో మా అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం" అని డస్కాటే పేర్కొన్నాడు.

174.. వికెట్ పడకుండా

రెచ్చిపోయిన సీఫర్ట్, అలెన్

- యూఏఈపై కివీస్ ఘనవిజయం
- మెరిసిన సీఫర్ట్, అలెన్



చెన్నై

జట్టంతా కష్టపడితే.. 20 ఓవర్లు ఆడి 173 పరుగులు చేసింది యూఏఈ. నెమ్మదిగా ఉండే చెన్నై పిచ్‌పై న్యూజిలాండ్‌కు ఛేదన అంత తేలిక కాదేమో అనిపించింది. కానీ మ్యాచ్ 16 ఓవర్లలోపే అయిపోయింది. ధనాధన్ బ్యాటింగ్‌తో చెలరేగిన ఓపెనర్లు సీఫర్ట్, అలెన్.. కివీస్‌కు అదిరే విజయాన్ని అందించారు. మంగళవారం గ్రూప్-డి మ్యాచ్‌లో మొదట యూఏఈ 6 వికెట్లకు 173 పరుగులు చేసింది. కెప్టెన్ మహ్మద్ వసీమ్ (66 నాటౌట్; 45 బంతుల్లో 4×4, 3×6), షరాఫు (55; 47 బంతుల్లో 5×4, 2×6) సత్తా చాటారు. హెన్రీ రెండు.. డఫీ, ఫెర్గూసన్, శాంట్నర్, ఫిలిప్స్ తలో వికెట్ తీశారు. ఛేదనలో సీఫర్ట్ (89 నాటౌట్; 42 బంతుల్లో 12×4, 3×6), అలెన్ (84 నాటౌట్; 50 బంతుల్లో 5×4, 5×6) మెరుపులతో కివీస్ 15.2 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా లక్ష్యాన్ని అందుకుంది. టోర్నీలో న్యూజిలాండ్‌కు ఇది వరుసగా రెండో విజయం.

సీఫర్ట్, అలెన్ బాదుడు: ఛేదనలో ఆరంభం నుంచి సీఫర్ట్, అలెన్ మెరుపులు మెరిపించారు. రెండో ఓవర్లో సీఫర్ట్ రెండు ఫోర్లు, అలెన్ ఒక ఫోర్‌తో బాదుడు షురూ చేశారు. జునైద్ వేసిన నాలుగో ఓవర్లో అలెన్ రెండు సిక్స్‌లు.. సీఫర్ట్ రెండు బౌండరీలతో దూకుడు మరింత పెంచారు. ఈ జంట బాదుడే లక్ష్యంగా సాగడంతో పవర్‌ప్లే ముగిసే సమయానికి కివీస్ 78/0తో లక్ష్యం దిశగా దూసుకెళ్లింది. పవర్ ప్లే తర్వాతా సీఫర్ట్, అలెన్ తగ్గలేదు. దొరికిన బంతిని దొరికినట్లు బాదేశారు. ఈ క్రమంలోనే సీఫర్ట్ 23 బంతుల్లో.. అలెన్ 27 బంతుల్లో అర్ధసెంచరీలు అందుకున్నారు. అర్ధసెంచరీల తర్వాతా ఈ ఇద్దరూ ధాటిని కొనసాగించడంతో కివీస్ 28 బంతులు మిగిలుండగానే లక్ష్యాన్ని అందుకుంది. అంతకుముందు మహ్మద్ వసీమ్, షరాఫు రాణించడంతో యూఏఈ మెరుగైన స్కోరు చేసింది. 12 పరుగులకే తొలి వికెట్ పడినా.. వసీమ్, షరాఫు జంట రెండో వికెట్‌కు 107 పరుగులు జోడించి యూఏఈ ఇన్నింగ్స్‌ను నిలబెట్టింది. అలీషాన్ ఔటైనా.. మయాంక్ (21) జతగా వసీమ్ స్కోరును 170 దాటించాడు. ఫిలిప్స్ వేసిన 18వ ఓవర్లో యూఏఈ 2 సిక్స్‌లు, 2 ఫోర్లు సహా 27 పరుగులు రాబట్టింది.

175 సీఫర్ట్, అలెన్‌ల అజేయ భాగస్వామ్యం. టీ20 ప్రపంచకప్‌లో ఏ వికెట్‌కైనా ఇదే అత్యుత్తమం. హేల్స్, బట్లర్‌ల రికార్డు (2022లో 170*)ను ఈ జోడీ బద్దలు కొట్టింది.

యూఏఈ ఇన్నింగ్స్: ఆర్యాంశ్ శర్మ (సి) ఫిలిప్స్ (బి) డఫీ 8; మహ్మద్ వసీమ్ నాటౌట్ 66; షరాఫు (సి) మిచెల్ (బి) శాంట్నర్ 55; హర్షిత్ (సి) నీషమ్ (బి) ఫిలిప్స్ 2; మయాంక్ కుమార్ (సి) శాంట్నర్ (బి) ఫెర్గూసన్ 21; షోయబ్ ఖాన్ (సి) ఫిలిప్స్ (బి) హెన్రీ 7; మహ్మద్ అర్ఫాన్ (సి) ఫిలిప్స్ (బి) హెన్రీ 0; ఎక్స్‌ట్రాలు 14 **మొత్తం:** (20 ఓవర్లలో 6 వికెట్లకు) **173;** **వికెట్ల పతనం:** 1-12, 2-119, 3-124, 4-164, 5-173, 6-173; **బౌలింగ్:** హెన్రీ 4-0-37-2; డఫీ 2-0-16-1; ఫెర్గూసన్ 4-0-35-1; శాంట్నర్ 4-0-23-1; రచిన్ రవీంద్ర 3-0-19-0; నీషమ్ 1-0-7-0; ఫిలిప్స్ 2-0-30-1

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: సీఫర్ట్ నాటౌట్ 89; అలెన్ నాటౌట్ 84; ఎక్స్‌ట్రాలు 2 **మొత్తం:** (15.2 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా) **175;** **బౌలింగ్:** హైదర్ అలీ 4-0-27-0; మహ్మద్ రోహిద్ 3.2-0-51-0; జునైద్ సిద్ధిఖి 4-0-47-0; ధ్రువ్ పరాశర్ 1-0-14-0; మహ్మద్ అర్ఫాన్ 3-0-36-0

హసరంగ, బ్రేస్‌వెల్ ఔట్

దిల్లీ: టీ20 ప్రపంచకప్‌లో శ్రీలంక, న్యూజిలాండ్ జట్లకు గట్టి ఎదురు దెబ్బలు తగిలాయి. లంక ప్రధాన స్పిన్నర్ వనిందు హసరంగ, కివీస్ ఆల్‌రౌండర్ మైకేల్ బ్రేస్‌వెల్ గాయాలతో టోర్నీ నుంచి వైదొలిగారు. ఐర్లాండ్‌తో ఆదివారం శ్రీలంక తొలి మ్యాచ్ సందర్భంగా హసరంగకు తొడకండరాల గాయమైంది. అదే రోజు అఫ్గానిస్థాన్‌తో కివీస్ మ్యాచ్ ముంగిట వార్మప్ చేస్తుండగా బ్రేస్‌వెల్ కాలికి దెబ్బ తగిలింది. హసరంగ స్థానంలో హేమంత, బ్రేస్‌వెల్ బదులు కోల్ మెకంజీ ఆయా జట్లలోకి రానున్నారు.

బెంగాల్ చేతిలో ఆంధ్ర ఓటమి

రంజీ ట్రోఫీలో ముగిసిన పోరాటం

కల్యాణి: రంజీ ట్రోఫీలో ఆంధ్ర పోరాటం ముగిసింది. బెంగాల్‌తో క్వార్టర్‌ఫైనల్లో ఆ జట్టు ఓటమి పాలైంది. మంగళవారం ముగిసిన మ్యాచ్‌లో బెంగాల్ ఇన్నింగ్స్, 90 పరుగుల ఆధిక్యంతో ఆంధ్రను చిత్తు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 64/3తో అయిదో రోజు ఉదయం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర.. 72.2 ఓవర్లలో 244 పరుగులకు ఆలౌటైంది. నితీశ్‌కుమార్‌రెడ్డి (90; 144 బంతుల్లో 7×4, 2×6), త్రిపురణ విజయ్ (46; 61 బంతుల్లో 6×4, 2×6) పోరాడినా ఫలితం లేకపోయింది. బెంగాల్ బౌలర్లలో షాబాజ్ అహ్మద్ (4/72) మెరిశాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఆంధ్ర 295.. బెంగాల్ 629 పరుగులకు ఆలౌటయ్యాయి.

హంస వాహనంపై శ్రీశైల మల్లన్న


హంస వాహనంపై కొలువుదీరిన స్వామి, అమ్మవారు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో మూడో రోజైన మంగళవారం శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి వార్లు హంస వాహనంపై దర్శనమిచ్చారు. రాత్రి 7 గంటలకు ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో ఉత్సవమూర్తులకు విశేష పూజలు నిర్వహించారు. మంగళవాయిద్యాలు, జానపద కళాకారుల సందడి నడుమ శ్రీగిరి పురవీధుల్లో గ్రామోత్సవం జరిగింది. వేల మంది భక్తులు స్వామిఅమ్మవార్ల దివ్యమంగళ స్వరూపాన్ని దర్శించుకున్నారు. విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీదుర్గ మల్లేశ్వరస్వామి దేవస్థానం తరఫున శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఇంద్రకీలాద్రి దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షుడు బి.రాధాకృష్ణ, ఈవో కె.వి.శీనా నాయక్ పట్టువస్త్రాలు సమర్పించారు.


చంద్రావతి కల్యాణ మండపంలో దర్శనం కోసం వేచి ఉన్న శివదీక్ష భక్తులు

భక్తులతో కిక్కిరిసిన శ్రీశైలం

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. మంగళవారం పాదయాత్రలో భక్తుల తాకిడి పెరిగింది. రాత్రి 8.45 గంటలకు పాదయాత్రగా 22,678 మంది తరలివచ్చారు. చంద్రావతి కల్యాణ మండపం ద్వారా శివదీక్షా జ్యోతిర్లింగ స్పర్శ దర్శనానికి 17,883 మంది భక్తులు వచ్చారు. సోమవారం శివదీక్షా భక్తుల నిరసనను దృష్టిలో పెట్టుకుని సీఎంవో ఆదేశాల మేరకు పోలీసు, దేవస్థానం అధికారులు అప్రమత్తమయ్యారు. సోమవారం రాత్రే కర్నూలు డీఐజీ కోయ ప్రవీణ్, కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ సునీల్ షెరాన్ శ్రీశైలం చేరుకుని ఏర్పాట్లను పర్యవేక్షించారు. సీసీ కమాండ్ కంట్రోల్ రూం నుంచి పరిస్థితిని పరిశీలించారు.

శివాలయాల్లో భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు ఉండాలి

- త్వరగా దర్శనం జరిగేలా అధికారులు పర్యవేక్షించాలి
- సీఎం చంద్రబాబు ఆదేశం

ఈనాడు, అమరావతి: శివరాత్రి నేపథ్యంలో శ్రీశైలం సహా, రాష్ట్రంలోని అన్ని శివాలయాల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి త్వరగా దర్శనం పూర్తయ్యేలా చూడాలని, వారికి వసతి వీలైనంత వేగంగా కల్పించేలా తగిన కార్యాచరణ అమలు చేయాలని ఆదేశించారు. శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల రద్దీ, అక్కడి సౌకర్యాలపై ముఖ్యమంత్రి మంగళవారం దిల్లీ నుంచి మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, ఇతర అధికారులతో సమీక్షించారు. శ్రీశైలంలో దేవాదాయ అధికారులు, నంద్యాల జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీఎం మాట్లాడుతూ దీక్షలు తీసుకున్నవారు, మాలధారులు ఎంతో కష్టపడి ఆలయానికి చేరుకుంటారని, వారికి ఇబ్బంది కలిగేలా, అగౌరవపరిచేలా ఎవరూ వ్యవహరించకూడదని ఆదేశించారు.

● దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మంగళవారం తాడేపల్లిలోని నివాసం నుంచి దేవాదాయశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్యూలైన్లలో ఉన్న భక్తులకు తాగునీరు, పాలు, బిస్కట్లు వంటివి అందించాలని కోరారు. ఆలయ ఆచార వ్యవహారాల్లో అధికారులు జోక్యం చేసుకోరాదని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆ శాఖ ముఖ్యకార్యదర్శి హరిజవహర్‌లాల్, కమిషనర్ రామచంద్రమోహన్, ఆర్‌జేసీలు, డీసీలు, జిల్లా దేవాదాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

తొలి రోజు ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించనున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

- 20కిపైగా ప్రాధాన్య అంశాలపై చర్చకు సిద్ధమైన అధికారపక్షం
- తొలిరోజు సమావేశానికి హాజరవ్వాలని వైకాపా నిర్ణయం

● 14న రాష్ట్ర బడ్జెట్


అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో వివిధ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ఇతర అధికారులతో భేటీ అయిన సభాపతి అయ్యన్నపాత్రుడు, ఉప సభాపతి రఘురామకృష్ణరాజు

ఈనాడు, అమరావతి: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 10 గంటలకు ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగించనున్నారు. మరోవైపు తొలిరోజు గవర్నర్ ప్రసంగం వరకు మాత్రం సభకు హాజరవ్వాలని వైకాపా నిర్ణయించింది. తర్వాత సమావేశాలకు ఆ పార్టీ సభ్యులు హాజరవుతారా? లేదా? అనేదానిపై స్పష్టత లేదు. వైకాపా హయాంలో తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగించి అపచారానికి పాల్పడడంపై, పరకామణిలో చోరీని సెటిల్‌మెంట్ చేసిన ఘోరం సహా.. ఇతర అంశాలపైనా సభా వేదికగా చర్చించేందుకు అధికార పక్షం సిద్ధమవుతోంది. అమరావతి నిర్మాణంలో పురోగతి, సూపర్-6 అమలు, పెట్టుబడులు, సంక్షేమానికి ప్రాధాన్యం, విద్యా రంగంలో సంస్కరణలు, సామూహిక గృహప్రవేశాలు వంటి మొత్తం 20కిపైగా ప్రాధాన్య అంశాలపై చర్చించాలని అధికార తెదేపా బీఏసీ సమావేశంలో కోరనుంది. గతేడాది మాదిరిగానే ఇప్పుడు కూడా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు మూడు రోజులపాటు క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. మార్చి 5 నుంచి 7 వరకు ఈ పోటీలు ఉండనున్నాయి. బడ్జెట్ సమావేశాలు మార్చి 12 వరకు కొనసాగే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు మంగళవారం లోక్‌భవన్‌కు వెళ్లి గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో.. తొలిరోజున ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించాలని ఆహ్వానించారు. సమావేశాలకు చేపట్టిన ఏర్పాట్లను వివరించారు. స్పీకర్‌తోపాటు అసెంబ్లీ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్నకుమార్ కూడా ఉన్నారు.

● గవర్నర్ ప్రసంగం ముగిశాక తొలిరోజు సభ వాయిదా పడనుంది. తర్వాత శాసనసభ వ్యవహారాల సలహా మండలి(బీఏసీ) సమావేశం స్పీకర్ అయ్యన్నపాత్రుడు అధ్యక్షతన చేపట్టనున్నారు. ప్రస్తుత సమావేశాలకు సంబంధించి ఎజెండాను, ఏ రోజు ఏ చర్చ చేపట్టాలనేది, మొత్తమ్మీద ఎన్ని పని దినాలు సమావేశాలు నిర్వహించాలనేదీ అందులోనే ఖరారు చేస్తారు.

సమావేశాలిలా..!



- ప్రాథమిక సమాచారం మేరకు తొలిరోజైన బుధవారం గవర్నర్ ప్రసంగం తర్వాత సభ వాయిదా పడనుంది.
- 12, 13 తేదీల్లో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ, చివర్లో ముఖ్యమంత్రి చంద్రబాబు సమాధానం ఉంటాయి.
- 14న ప్రభుత్వం సభలో బడ్జెట్‌ను ప్రవేశపెడుతుంది.
- శివరాత్రి నేపథ్యంలో 15(ఆదివారం), 16న సెలవు ఇచ్చే అవకాశం.
- 17 నుంచి రెండు మూడు రోజులపాటు బడ్జెట్‌పై సాధారణ చర్చ.
- ఆ తర్వాత శాఖల వారీగా గ్రాంట్లు, డిమాండ్లపై చర్చ కొనసాగే అవకాశం.
- ఈ సమావేశాల్లో ప్రభుత్వం నాలుగు ఆర్డినెన్సుల స్థానంలో బిల్లులను సభలో ప్రవేశపెట్టనుంది.

పవన్ కల్యాణ్ ఫొటోతో మీకొచ్చిన బాధేంటి?

- పిటిషనర్‌కు సీజేఐ ప్రశ్న
- ప్రభుత్వ కార్యాలయాల్లో ఉపముఖ్యమంత్రి ఫొటోల ఏర్పాటుపై దాఖలైన పిటిషన్ కొట్టివేత

ఈనాడు, దిల్లీ: ప్రభుత్వ కార్యాలయాల్లో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఫొటో ప్రదర్శిస్తే.. మీకొచ్చిన బాధేంటి అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పిటిషనర్‌ను ప్రశ్నించారు. దాంతో మీకేం సమస్య ఉందన్నారు. ఇష్యూస్ సెటిల్ చేసుకోవడానికి ప్రయత్నించొద్దంటూ పిటిషన్‌ను కొట్టివేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఫొటో ప్రదర్శించడాన్ని సవాల్ చేస్తూ విజయవాడకు చెందిన విశ్రాంత రైల్వే ఉద్యోగి ఏము కొండలరావు వేసిన పిటిషన్‌పై మంగళవారం విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చి, జస్టిస్ ఎన్వీ అంజారియాలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. అంతకుముందు పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ 'ఉప ముఖ్యమంత్రి పదవికి రాజ్యాంగ హోదా లేదు. అయినప్పటికీ ఆయన ఫొటోలను అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, 12వేలకు పైగా సచివాలయాల్లో ప్రదర్శించడం ద్వారా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. రాజకీయ ప్రభావాన్ని చాటిచెప్పుకోవడానికి ప్రజాధనాన్ని ఉపయోగించకూడదని సుప్రీంకోర్టు చెప్పింది' అని వాదించారు. ఆ వాదనలను తిరస్కరిస్తూ ధర్మాసనం పిటిషన్‌ను కొట్టివేసింది. ఈ అంశంపై కొండలరావు తొలుత ఏపీ హైకోర్టులో పిల్ వేశారు. హైకోర్టు దాన్ని కొట్టేయడంతో ఆ తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు.

విద్యార్థులకు తీపి కబురు

2024-25 ఫీజుల మొత్తం రూ.1,200 కోట్లు విడుదల

ఈనాడు, అమరావతి: విద్యార్థులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను పూర్తిగా విడుదల చేసింది. బీసీ కార్పొరేషన్ల ద్వారా రూ.736.01 కోట్లు, మైనారిటీ కార్పొరేషన్ ద్వారా రూ.98.92 కోట్లు, ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ ద్వారా రూ.365.07 కోట్లు.. మొత్తం రూ.1200 కోట్లకు ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను నేరుగా కళాశాలలకు విడుదల చేసే విధానాన్ని తీసుకొచ్చింది. ఒకేసారి భారీ మొత్తంలో ఫీజుల డబ్బులు విడుదల చేయడంపై కళాశాలల యాజమాన్యాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

దాగుడుమూతలు ఇక కుదరవు

- సభకొచ్చి.. సీట్లలో కూర్చుంటేనే అటెండెన్స్
- ఫేషియల్ రికగ్నిషన్‌తో హాజరు నమోదు
- రిజిస్టర్‌లో చేసే సంతకాలు చెల్లవు
- స్పీకర్ అయ్యన్నపాత్రుడి ఆదేశాలతో బులెటిన్ జారీ

ఈనాడు, అమరావతి: శాసనసభ్యులు సభకు వచ్చి.. తమకు కేటాయించిన సీట్లలో కూర్చుంటేనే వారి హాజరును గుర్తించేలా డిజిటల్ అటెండెన్స్ విధానాన్ని బుధవారం ప్రారంభం కానున్న బడ్జెట్ సమావేశాల నుంచే అమలుచేసేందుకు ఏపీ శాసనవ్యవస్థ సన్నద్ధమైంది. సభలోకి రాకుండా అసెంబ్లీ ఆవరణలో, లాబీల్లో ఎక్కడో ఒక చోటకు రిజిస్టర్ తెప్పించుకుని సంతకం చేసి వెళ్లిపోయేవారి హాజరు చెల్లుబాటు కాని విధంగా ఈ విధానానికి శ్రీకారం చుట్టారు. 'స్పీకర్ ఆదేశాల మేరకు ఇకపై శాసనసభలో సభ్యుల హాజరు నిరంతరాయంగా డిజిటల్ పద్ధతిలో నమోదవుతుంది. ఇకపై సభ్యులు రిజిస్టర్‌లో సంతకం చేయక్కర్లేదు' అని ఎమ్మెల్యేలకు సమాచారమిస్తూ అసెంబ్లీ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్నకుమార్ మంగళవారం బులెటిన్ జారీచేశారు. కొందరు వైకాపా సభ్యుల దాగుడుమూతలకు చెక్ పెట్టేందుకు ఈ విధానాన్ని తీసుకువచ్చినట్లు అసెంబ్లీ వర్గాలు చెబుతున్నాయి.

నిబంధనలేం చెబుతున్నాయి

ఆంధ్రప్రదేశ్ శాసనసభలో కార్యనిర్వహణ నియమాలలోని 362వ నియమం ప్రకారం... స్పీకర్, డిప్యూటీ స్పీకర్, మంత్రులు, ప్రతిపక్ష నాయకుడు, పార్లమెంటరీ కార్యదర్శులు, చీఫ్ విప్, హాజరైన విప్‌లు కాకుండా ఇతర సభ్యుల హాజరును ఎలక్ట్రానిక్ పద్ధతిలో రికార్డ్ చేయడానికి కార్యదర్శి అసెంబ్లీ ప్రతి సమావేశంలో అవసరమైన ఏర్పాట్లు చేయాలి. అక్కడ తన హాజరును గుర్తించడంలో ఏదైనా సాంకేతిక సమస్య వస్తే ఆ సభ్యుడు తాను హాజరైనట్లు స్పీకర్‌కు దరఖాస్తు చేసుకుంటే.. వాళ్ల హాజరును స్పీకర్ ఆమోదిస్తారు. సభా విధానాలపై ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీచేసే అధికారం స్పీకర్‌కు ఉంటుంది.

సీట్లో కూర్చుంటేనే..

డిజిటల్ అటెండెన్స్ విధానం కర్ణాటకలోనూ ఉంది. అయితే అక్కడ అసెంబ్లీ ప్రాంగణంలోకి సభ్యుడు అడుగుపెట్టగానే ఎలక్ట్రానిక్ పద్ధతిలో వారి హాజరును గుర్తించి నమోదు చేస్తారు. దాన్ని మరింత మెరుగుపరిచి ఏపీ అసెంబ్లీలో అమలుచేయనున్నారు. ఇక్కడ అసెంబ్లీ ప్రాంగణంలోకి వస్తే సరిపోదు.. సభలో తమ సీట్లలో కూర్చుంటేనే ఫేషియల్ రికగ్నిషన్ ద్వారా డిజిటల్ అటెండెన్స్ నమోదవుతుంది. వారు సభలో ఎంతసేపు ఉన్నారనేదీ నిరంతరం రికార్డు చేస్తారు. సభ్యులంతా తప్పనిసరిగా సభలోకి వచ్చేలా చేయడానికే ఇప్పుడీ డిజిటల్ అటెండెన్స్ విధానాన్ని తెరపైకి తీసుకువచ్చారు.

కూరగాయలు, కోడిగుడ్లలో కక్కుర్తి ఎందుకు?

బీసీ హాస్టళ్ల అధికారులతో సమీక్షలో మంత్రి సవిత



ఈనాడు, అమరావతి, గుంటూరు (జిల్లా పరిషత్తు), న్యూస్‌టుడే: "బీసీ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం వడ్డించాలి. కూరగాయలు, కోడిగుడ్లలో కక్కుర్తి ఎందుకు? ఆ సొమ్ములు మిగిల్చి ఏం బతికేస్తారు మీరు? మీ పిల్లలు హాస్టళ్లలో ఉంటే ఇలాగే చేస్తారా? బయట చెప్పుకోవడానికే అవమానం" అని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తంచేశారు. గుంటూరులోని ఏపీ ఎన్జీవో కల్యాణమండపంలో మంగళవారం సాయంత్రం ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు, ప్రకాశం, మార్కాపురం, బాపట్ల, పల్నాడు, గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల బీసీ హాస్టళ్ల అధికారులు, ఉద్యోగులు, మహాత్మా జ్యోతిబా ఫులె గురుకులాల ప్రిన్సిపాళ్లతో ప్రాంతీయ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఐవీఆర్ఎస్‌లో వచ్చిన ఫిర్యాదులు, సంతృప్తి స్థాయిలు, హాస్టళ్ల పనితీరుపై జిల్లాల వారీగా మాట్లాడారు. నిర్లక్ష్యం వహించిన ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అనిశా దాడుల్లో బీసీ సంక్షేమశాఖలో ముగ్గురు పట్టుబడటం అవమానకరమన్నారు. సీఎం వద్ద సమీక్షకు వెళ్లడానికీ భయపడ్డామన్న ఆమె.. మద్యం తాగి వసతి గృహాల్లోకి వెళితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదన్నారు. పిల్లలకు వైద్య పరీక్షలు జరగాలని.. వండిన భోజనం వార్డెన్లు రుచి చూశాకే పిల్లలకు పెట్టాలన్నారు. ఎన్టీఆర్ జిల్లా అధికారుల పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ఉన్నతాధికారులు.. వైఖరి మారకుంటే మూకుమ్మడి బదిలీలు తప్పవని హెచ్చరించారు. నెల్లూరు జిల్లా అనంతసాగరం బాలుర వసతిగృహంలో ఆహారం, చికెన్ సరిగా పెట్టడం లేదంటూ తమకొచ్చిన ఫిర్యాదును అధికారులు ప్రస్తావించారు. కార్యక్రమంలో ఆ శాఖ రాష్ట్ర ఎక్స్-అఫీషియో ముఖ్య కార్యదర్శి సత్యనారాయణ, సంచాలకులు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

కల్తీ నెయ్యి, రెవెన్యూ సమస్యల ప్రస్తావన

- రాష్ట్రానికి కేంద్ర సాయంపై అసెంబ్లీలో చర్చ
- భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ వెల్లడి
- విజయవాడలో భాజపా శాసనసభాపక్షం భేటీ


రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన ర్యాంకుల్లో సుజనాచౌదరి ప్రాతినిధ్యం వహిస్తున్న విజయవాడ పశ్చిమ నియోజకవర్గం ప్రథమ స్థానంలో నిలవడంతో ఆయన్ను సన్మానిస్తున్న భాజపా నేతలు పోతుల సునీత, సోము వీర్రాజు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, విష్ణుకుమార్‌రాజు, మంత్రి సత్యకుమార్, పీవీఎన్ మాధవ్, కామినేని శ్రీనివాస్, పార్థసారథి

ఈనాడు, అమరావతి: కూటమి ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రజల్లోకి తీసుకెళ్తామని, రాష్ట్ర ప్రభుత్వ చొరవతో కేంద్రం ఉదారంగా అందిస్తున్న ఆర్థిక సాయాన్ని అసెంబ్లీ వేదికగా వివరిస్తామని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. రైల్వే కారిడార్లు, సెమీకండక్టర్ ప్రాజెక్టులు, పోలవరం, రాజధాని నిర్మాణాలకు నిధులు వంటివి ఇటీవలి కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించారని వాటిపై ధన్యవాదాలు తెలిపేలా తమ పార్టీ సభ్యులు అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెడతారని చెప్పారు. మంగళవారం విజయవాడలోని ఎమ్మెల్యే సుజనాచౌదరి ఇంట్లో భాజపా శాసనసభాపక్షం భేటీ అయ్యింది. బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. మంత్రి సత్యకుమార్ యాదవ్, శాసనసభాపక్ష నేత విష్ణుకుమార్‌రాజు, శాసనమండలి పక్ష నేత సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు సుజనాచౌదరి, కామినేని శ్రీనివాస్, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, పార్థసారథి, ఈశ్వరరావు, ఎమ్మెల్సీ పోతుల సునీత చర్చించారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి గైర్హాజరయ్యారు. ఈ భేటీ తర్వాత మాధవ్ మీడియాతో మాట్లాడారు. వీబీజీ రామ్‌జీ పథకం కొత్త మార్గదర్శకాలు, వైకాపా హయాంలో జరిగిన ఆలయాల విధ్వంసం, బాధ్యులకు శిక్షలపై తమ పార్టీ సభ్యులు ఉభయసభల్లో ప్రస్తావిస్తారని తెలిపారు. శ్రీవారి లడ్డూ ప్రసాదానికి కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంపై పార్టీ వాణి బలంగా వినిపించాలని నిర్ణయించారు. 'కులం, ఇతర అంశాలపై జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఇటీవల అన్న మాటలు వ్యక్తిగత హోదాలో చేసినవే. ఆయన్నుంచి పార్టీపరంగా వివరణ తీసుకుంటామ'ని మాధవ్ స్పష్టంచేశారు. విప్ హోదాలో ఆదినారాయణరెడ్డి సభలో పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండకపోవడం వల్ల తెదేపా సభ్యులపై ఆధారపడాల్సి వస్తోందని పలువురు ఎమ్మెల్యేలు ప్రస్తావించినట్లు తెలిసింది.

కేంద్ర సాయంపై అసెంబ్లీలో చర్చ

ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ 'కేంద్ర బడ్జెట్‌లో విశాఖ డేటా సెంటర్‌కు 2047 వరకు పన్ను రాయితీ ప్రకటించింది. రాజధాని అమరావతి అభివృద్ధికి రూ.1,128 కోట్లు కేటాయించింది. పట్టణాభివృద్ధి, గ్రామీణ రహదారులు, జల్‌జీవన్ మిషన్, మురుగునీటి నిర్వహణ, పోలవరం, రైల్వే ప్రాజెక్టులకు ఇతోధికంగా కేటాయింపులు చేసినందున ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌లకు ధన్యవాదాలు తెలిపేలా శాసనసభలో తీర్మానం ప్రవేశపెడతామ'ని తెలిపారు. వైకాపా పాలనలో జరిగిన నష్టాన్ని పూడ్చేందుకు కేంద్రం ఉదారంగా నిధులిస్తోందని సుజనాచౌదరి తెలిపారు. వెనుకబడిన జిల్లాలకు ఇచ్చే ప్యాకేజీని కేంద్రం పేరు మార్చి, మరో రూపంలో ఇస్తోందని గుర్తుచేశారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలపై కలెక్టర్ల సమావేశాల్లో సీఎం చంద్రబాబు పలుసార్లు దిశానిర్దేశం చేసినా క్షేత్రస్థాయిలో మార్పు రాలేదని, దీన్ని శాసనమండలిలో ప్రస్తావిస్తామని చెప్పారు.

జంతుకొవ్వు కాదు.. జగన్ కొవ్వు కరగదీయాలి

- ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వ్యాఖ్య
- కమ్మని సమాజమంటే.. బలమైన సమాజమని వివరణ

ఈనాడు, అమరావతి: 'కమ్మని సమాజమంటే.. బలమైన సమాజం, ఒకటే సమాజం అన్నది నా ఉద్దేశం. నా వ్యాఖ్యలను తప్పుగా ప్రచారం చేస్తున్నారు. నా మాటల వల్ల ఎవరైనా బాధపడి ఉంటే.. నేనూ బాధపడుతున్నా' అని భాజపా ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. విజయవాడలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తిరుపతిలో ఇటీవల తాను చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. 'నాలుగోసారి ఎమ్మెల్యేను. సొంత అభిప్రాయం వ్యక్తం చేశా. ప్రాసలో భాగంగా ప్రభుత్వం పాలన బాగుంది, అందులో కమ్మదనం ఉందని చెప్పా. జగన్‌ది దారుణమైన క్యారెక్టర్. అతన్ని అడ్డుకోవాలంటే మెత్తగా ఉండకూడదని అలా అన్నాను. ఏ పనిచేసినా తనదే పైచేయి అనే జగన్ కొవ్వు కరగదీయాలన్న ఉద్దేశంతో అలా మాట్లాడా. లడ్డూలో జంతు కొవ్వు కంటే.. జగన్ కొవ్వు కరగదీయాలి. అయితే నా ప్రాసను ప్రయాసగా మార్చారు' అని పేర్కొన్నారు. కూటమిని విడగొట్టాలని జగన్ రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. మీ వ్యాఖ్యలపై అధిష్ఠానం వివరణ కోరిందా అని అడగ్గా, 'సాధారణంగా చర్చ జరిగి ఉంటుంది. కానీ వివరణలు, సవరణలు, విశ్లేషణలు ఏమీ ఉండవు' అని వ్యాఖ్యానించారు.

నాడు బురదమయం.. నేడు రోడ్డు సౌకర్యం

పవన్‌కల్యాణ్ చొరవతో దశాబ్దాల సమస్యకు పరిష్కారం


బురదలో పాఠశాలకు వెళుతూ గతంలో సామాజిక మాధ్యమాల్లో పెట్టిన చిత్రం


నేడు పూర్తయిన రోడ్డు

కలువాయి, న్యూస్‌టుడే: వర్షం పడితే రోడ్డంతా బురదగా మారి అడుగుతీసి వేయలేని దుస్థితి. కాలనీకి ఆటో కూడా రాకపోవడంతో నడుస్తూనే వెళుతూ స్థానికులు అవస్థలు పడ్డారు. దశాబ్దాలుగా ఉన్న ఈ సమస్య డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చొరవతో పరిష్కారమైంది. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కలువాయి మండలం రాజుపాళెం ఎస్సీ, ఎస్టీ కాలనీలో 80 కుటుంబాలకు చెందిన 250 మంది ఉంటున్నారు. ఆ కాలనీకి గతంలో గ్రావెల్ రోడ్డు వేయగా పూర్తిగా ధ్వంసమైంది. విద్యార్థులు పాఠశాలకు వెళ్లాలంటే 1.5 కిలోమీటర్ల మార్గంలో 750 మీటర్లు బురదలో నడుస్తూ ఇబ్బందులు పడేవారు. కూటమి వచ్చాక.. 2024 నవంబరు వర్షాకాలంలో అవస్థలతో బడికి వెళుతున్న చిత్రాలను సామాజిక మాధ్యమాల్లో పెట్టడంతో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పందించారు. వెంటనే ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రూ.30 లక్షలతో 750 మీటర్ల రోడ్డు మంజూరైంది. గతేడాది పంచాయతీరాజ్ అధికారులు టెండర్ల ప్రక్రియ పూర్తి చేయగా ప్రస్తుతం రోడ్డు పనులు పూర్తి చేశారు. వర్షపు నీరు నిల్వ ఉండి బురదగా మారనున్న చోట రోడ్డు నిర్మించడంతో కాలనీ వాసుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి.



నిరంతరం అందుబాటుతో అనర్థాలు

మొబైల్ ఫోన్ల వినియోగం పెరగడంతో ప్రతిఒక్కరూ నిరంతరం అందుబాటులో ఉండే పరిస్థితి ఏర్పడింది. దీంతో ప్రజల నాడీ వ్యవస్థలు దెబ్బతింటున్నాయి. ఈ పరిస్థితి నుంచి బయటపడేందుకు మీ ఫోన్లలో నోటిఫికేషన్లను ఆఫ్ చేయండి. మీరు నిద్రపోయే సమయంలో మొబైల్‌ను మీ పడకగదికి దూరంగా పెట్టండి. సందేశాలు చదివేందుకు ఓ నిర్దిష్ట సమయాన్ని ఏర్పాటు చేసుకోండి.

– డొమినిక్, న్యూరోసైంటిస్ట్

అనాథ పిల్లలకు ఉప ముఖ్యమంత్రే అమ్మానాన్నయ్యారు!

- ఇద్దరు చిన్నారులకు ప్రతి నెలా చెరో రూ.5 వేలు అందించాలని ఆదేశం


తల్లిదండ్రుల చిత్రపటాలతో చైతన్య, కె.సత్య

పిఠాపురం, న్యూస్‌టుడే: తల్లిదండ్రులను కోల్పోయామని, తమను ఆదుకోవాలంటూ వీడియో తీసి పోస్ట్ చేసిన ఇద్దరు చిన్నారులకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేయందించారు. వారికి ప్రతి నెలా చెరో రూ.5 వేల చొప్పున రూ.10 వేలు అందించాలని తన కార్యాలయ అధికారులను ఆదేశించారు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం మాధవపురానికి చెందిన కె.శ్రీను రెండేళ్ల క్రితం అనారోగ్యంతో చనిపోగా, ఆయన భార్య జ్యోతి 2 నెలల క్రితం క్యాన్సర్‌తో కాలం చేశారు. వీరి కుమార్తె కె.సత్య ఇంటర్ పూర్తి చేయగా, కుమారుడు చైతన్య 8వ తరగతి చదువుతున్నాడు. ఈ నేపథ్యంలో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తమను ఆదుకోవాలని వారు వీడియో చేసి మంగళవారం సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. ఈ విషయం పవన్‌కల్యాణ్ దృష్టికి చేరడంతో ఆయన వ్యక్తిగతంగా డబ్బులు పంపిస్తానని హామీ ఇచ్చారు. దీంతో పాటు వారికి ఇల్లు కట్టించి, ఇద్దరినీ వచ్చే విద్యా సంవత్సరం నుంచి రెసిడెన్షియల్ పాఠశాలలో చేర్పించాలని కలెక్టర్‌కు బాధ్యత అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

అటు అభివృద్ధి... ఇటు సేవా కార్యక్రమాలు

పవన్‌కల్యాణ్ తాను ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో ఒక పక్క అభివృద్ధి కార్యక్రమాలు, మరోపక్క సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఆయన ఆదేశాలతో కొద్ది నెలలుగా నియోజకవర్గంలోని 42 మంది అనాథ పిల్లలకు ప్రతి నెలా ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున జనసేన కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి అందిస్తున్నారు. ఇందులో భాగంగానే మరో ఇద్దరు అనాథ చిన్నారులకు పవన్‌కల్యాణ్ అమ్మానాన్నయ్యారు.

ఈ నెదర్లాండ్స్ ఆలూ.. షుగర్ ఫ్రీ





అన్ని రకాల వంటకాల్లో ఇట్టే కలిసిపోయే బంగాళాదుంపలంటే అందరికీ ఇష్టమే. వీటితో తయారుచేసే కరకరలాడే చిప్స్, ఫ్రెంచ్ ఫ్రైస్ అన్నా పిన్నల నుంచి పెద్దలదాకా ఇష్టంగా తింటారు. మధుమేహం (డయాబెటిస్) ఉన్నవారు మాత్రం వీటికి దూరంగా ఉంటారు. ఇటువంటి వారి కోసం మార్కెట్‌లోకి 'లేడీ రోసెట్టా' రకం బంగాళాదుంపలు రాబోతున్నాయి. వీటి సాగు ప్రపంచంలోనే తొలిసారిగా నెదర్లాండ్స్‌లో జరిగింది. ఆ తర్వాత ఇతర దేశాలకు విస్తరించింది. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో ఉన్న రాజమాత విజయరాజె సింధియా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు ఏరోపోనిక్స్ ల్యాబ్‌లో ఈ లేడీ రోసెట్టా రకం ఆలుగడ్డలు సాగు చేస్తున్నారు. ఇందులో మట్టి లేకుండా మొక్కలను తీగలపై వేలాడదీసి పెంచుతారు. మరో రెండేళ్లలో ఈ విత్తనాలు రైతులకు అందుబాటులోకి వస్తాయని ఏరోపోనిక్స్ ప్రాజెక్ట్ హెడ్, వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ సుష్మా తివారీ తెలిపారు. ఈ రకం ఆలుగడ్డల్లో పిండిపదార్థం (స్టార్చ్) చాలా తక్కువ, యాంటీఆక్సిడెంట్లు మోతాదు ఎక్కువ. చక్కెర మోతాదు అతితక్కువ. గుండ్రంగా, లేత గులాబీ రంగులో ఉండే ఈ బంగాళాదుంపలు త్వరగా ఉడకవు.. గట్టిగా ఉంటాయి.

ఐఐటీ కాన్పూర్ 1976 బ్యాచ్ రూ.13.40 కోట్ల విరాళం

ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) కాన్పూర్‌లో 1976 బ్యాచ్ విద్యార్థులు తాము చదువుకున్న కళాశాలకు ఆర్థికంగా అండగా నిలబడ్డారు. ఇక్కడి క్యాంపస్‌లో చదివి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పూర్వ విద్యార్థులు స్వర్ణోత్సవం జరుపుకొన్నారు. ఈ సందర్భంగా కళాశాలకు రూ.13.40 కోట్ల విరాళం అందించారు. ఈ బ్యాచ్‌లో చదువుకున్న వారంతా ప్రస్తుతం దేశ, విదేశాల్లో స్థిరపడి ఉన్నారు. 50 ఏళ్ల కిందటి విద్యార్థి జీవిత జ్ఞాపకాలను గుర్తుచేసుకునేలా పూర్వ విద్యార్థులు అందరూ తిరిగి అదే క్యాంపస్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముందుగా తమ తరగతి గదిని వీక్షించారు. ఆ గదితో పెనవేసుకున్న జ్ఞాపకాలు, అనుభూతులను నెమరువేసుకొని విద్యార్థి జీవితాన్ని మళ్లీ గుర్తు చేసుకున్నారు. మొబైల్ ఫోన్లతో సెల్ఫీలు దిగారు. ఈ విద్యాసంస్థ పూర్వ విద్యార్థులు సాధించిన విజయాలు, పాటిస్తున్న విలువల పట్ల గర్వంగా ఉందని ఐఐటీ కాన్పూర్ డైరెక్టర్, ప్రొఫెసర్ మణీంద్ర అగర్వాల్ తెలిపారు.



చిన్నారుల అదృశ్యం వెనుక దేశవ్యాప్త ముఠాల ప్రమేయం ఉందేమో?

నిర్ధరించాలని కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశం

దిల్లీ: దేశంలోని వివిధ ప్రాంతాల్లో చిన్న పిల్లల అదృశ్యాలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. దీని వెనుక దేశవ్యాప్త ముఠాల హస్తం కానీ, రాష్ట్రాల వారీగా మరేదైనా ముఠాల ప్రమేయం కానీ ఉందేమో నిర్ధరించాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. అదృశ్య ఘటనలు యాదృచ్ఛికమా, ఇతరత్రా కారణాలేమైనా ఉంటే విశ్లేషించి నివారణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం మంగళవారం అభిప్రాయపడింది. అన్ని రాష్ట్రాల నుంచి సమాచారాన్ని సేకరించాలని తెలిపింది. చిన్నారుల అదృశ్య ఘటనలకు సంబంధించి 12 రాష్ట్రాల నుంచి ఇంకా సమాచారం రావాల్సి ఉందని అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యా భాటీ ధర్మాసనం దృష్టికి తెచ్చారు. సమాచారం పంపించని రాష్ట్రాలను హెచ్చరించాలని ధర్మాసనం సూచించింది. పలు రాష్ట్రాల్లో చిన్నారులు జాడలేకుండా పోవడంపై 'గురియా స్వయం సేవి సంస్థాన్' దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యంపై విచారణ కొనసాగుతోంది.

స్పీకర్ తొలగింపా.. ఇంతవరకు చూడలేదు

- మూడుసార్లు విఫల యత్నాలు



దిల్లీ: లోక్‌సభ స్పీకర్‌ను ఆ పదవి నుంచి తొలగింపజేసేందుకు ఇదివరకు స్వతంత్ర భారత చరిత్రలో మూడుసార్లు జరిగిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఈ నేపథ్యంలో తాజాగా ఇచ్చిన నోటీసు చర్చనీయాంశమయింది. స్పీకర్ తొలగింపునకు తీర్మానం ప్రవేశపెట్టాలంటే నోటీసుపై కనీసం ఇద్దరు లోక్‌సభసభ్యులు సంతకం చేయాలి. సాధారణ ఆధిక్యంతో సభ ఆమోదిస్తే సరిపోతుంది. దీనికోసం సభలో ప్రస్తుతం ఉన్న సభ్యులందరినీ లెక్కిస్తారు. ఖాళీలు మినహాయించి మిగిలిన సభ్యులంతా లెక్కలోకి వస్తారని లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్ పి.డి.టి.ఆచారి పీటీఐ వార్తాసంస్థకు తెలిపారు. "ఆరోపణలు నిర్దిష్టంగా ఉన్నాయా లేదా అనేది ప్రాథమిక దశలోనే చూస్తారు. ఎందుకంటే అవి కచ్చితంగా ఉన్నప్పుడే వాటిపై స్పీకర్ స్పందించగలరు. తనను తాను సమర్థించుకునేందుకు ఆయనకు అవకాశం ఉంది. నోటీసును ఉపసభాపతికి కాకుండా సెక్రటరీ జనరల్‌కే సమర్పించాలి. ప్రతిపాదిత తీర్మానంలో పరువుకు నష్టం కలిగించే భాష, ఇతర అంశాలు ఉండకూడదు. తీర్మానంలో వాడిన భాషను సాధారణంగా డిప్యూటీ స్పీకర్ పరిశీలిస్తారు. ప్రస్తుత లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్ లేకపోవడంతో ప్యానెల్ ఛైర్‌పర్సన్‌లలో అత్యంత సీనియర్ సభ్యుడు దీన్ని పరిశీలించే అవకాశం ఉంది" అని వివరించారు.

14 రోజుల ముందు నోటీసులు

తీర్మానం ప్రవేశపెట్టడానికి కనీసం 14 రోజుల ముందే నోటీసులు ఇవ్వాల్సి ఉంటుంది. తీర్మానం పరిగణనలో ఉన్న సమయంలో సభకు స్పీకర్ నేతృత్వం వహించే అవకాశం లేదు. తీర్మానాన్ని అనుమతించేందుకు 50 మంది సభ్యుల మద్దతు అవసరం. అన్నిపక్షాల నేతలతో మాట్లాడిన అనంతరం, నిబంధనలకు అనుగుణంగా తగిన సమయంలో చర్చకు తేదీని ప్రకటిస్తారు. తీర్మానం ప్రవేశపెట్టిన 10 రోజుల్లోగా దీనిపై చర్చించి తేల్చాల్సి ఉంటుంది. సభ ముందుకు ఇలాంటి మూడు తీర్మానాలు గతంలో వచ్చినప్పటికీ.. ప్రభుత్వానికి తగిన బలం ఉన్నందువల్ల ఇప్పటివరకు ఒక్కటి కూడా ఆమోదం పొందలేదు.

17న భారత్‌కు ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్

దిల్లీ: మూడు రోజుల పర్యటన కోసం ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ ఈ నెల 17న భారత్ రానున్నారు. ఆయన ప్రధాని మోదీతో చర్చలు జరుపుతారు. వాణిజ్యం, రక్షణ వంటి కీలక రంగాల్లో రెండు దేశాల మధ్య బంధాన్ని బలోపేతం చేయడంపై ఇరువురు నేతలు దృష్టిసారిస్తారు. మెక్రాన్ 17న ముంబయిలో అడుగుపెడతారు. అక్కడ మోదీతో కలిసి 'ఇండియా-ఫ్రాన్స్ ఇయర్ ఆఫ్ ఇన్నోవేషన్'ను ప్రారంభిస్తారు. ఇద్దరు నేతలు ముంబయిలో ద్వైపాక్షిక చర్చలు జరిపే అవకాశం ఉంది.



"హొరైజన్- 2047 మార్గసూచీలో పేర్కొన్న అంశాలపై మోదీ, మెక్రాన్ సమాలోచనలు జరుపుతారు" అని భారత విదేశీ వ్యవహారాల శాఖ పేర్కొంది. హొరైజన్ మార్గసూచీని 2023లో మోదీ, మెక్రాన్‌ల మధ్య జరిగిన చర్చల సమయంలో ఆవిష్కరించారు. 19న దిల్లీలో జరిగే 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్'లో మెక్రాన్ పాల్గొంటారు. భారత్‌కు 114 రఫేల్ యుద్ధవిమానాల సరఫరాకు మెక్రాన్ పర్యటన సమయంలోనే ఒప్పందం కుదిరే అవకాశం ఉంది. ఈ కాంట్రాక్టు విలువ రూ.3.25 లక్షల కోట్లు. ఇది ఖరారైతే దేశ చరిత్రలో అతిపెద్ద రక్షణ ఒప్పందంగా నిలవనుంది.

హెచ్-1బీ వీసాల రద్దుకు బిల్లు

వాషింగ్టన్: హెచ్-1బీ వీసా కార్యక్రమాన్ని పూర్తిగా రద్దు చేయాలని కోరుతూ ఫ్లోరిడాకు చెందిన రిపబ్లికన్ ప్రతినిధి గ్రెగ్ స్టూబ్ అమెరికా ప్రతినిధుల సభలో బిల్లును ప్రవేశపెట్టారు. 'ఎండింగ్ ఎక్స్‌ప్లాయిటేటివ్ ఇంపోర్టెడ్ లేబర్ ఎగ్జెంప్షన్స్ (ఎక్సైల్) యాక్ట్' పేరుతో ఈ బిల్లును ప్రతిపాదించారు. "అమెరికా పౌరుల సంక్షేమం కంటే విదేశీ కార్మికులకు ప్రాధాన్యమివ్వడం సరికాదు. కార్పొరేట్ సంస్థలు తక్కువ వేతనాలకే విదేశీయులను తెచ్చుకుంటూ, అమెరికా యువతకు దక్కాల్సిన ఉద్యోగాలను హరిస్తున్నాయి" అని గ్రెగ్ పేర్కొన్నారు. ఒకవేళ ఈ బిల్లు చట్టంగా మారితే.. అమెరికాలో స్థిరపడాలనుకునే లక్షలమంది భారత టెకీల ఆశలపై నీళ్లు చల్లినట్లవుతుంది.

భారత్‌లో స్వల్పంగా తగ్గిన అవినీతి


- 96 నుంచి 91వ స్థానానికి సూచీలో ఎగబాకిన దేశం
- అతి తక్కువ మకిలి అంటిన దేశంగా డెన్మార్క్
- ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ వెల్లడి



దిల్లీ: భారత్‌లో అవినీతి తగ్గుముఖం పట్టిందని ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ వెల్లడించింది. ప్రపంచ అవినీతి సూచీలో (2024) 96వ స్థానంలో ఉన్న భారత్ 2025 నాటికి 91వ స్థానానికి ఎగబాకిందని పేర్కొంది. 2025 సంవత్సరానికి సంబంధించిన నివేదికను మంగళవారం ఆ సంస్థ వెలువరించింది. విభిన్న కసరత్తులు, నిపుణుల విశ్లేషణలు, సర్వేల ఆధారంగా ఈ సూచీని రూపొందిస్తారు. ఇందులో 0 పాయింట్లు సాధించిన దేశం పూర్తి అవినీతిమయమని, 100 పాయింట్లు పొందిన దేశంలో అవినీతి లేనేలేదని అర్థం. డెన్మార్క్ 100కు 89 పాయింట్లు పొంది అతి తక్కువ అవినీతి కలిగిన దేశంగా అగ్రభాగాన నిలిచింది. తదుపరి రెండు స్థానాలు ఫిన్లాండ్, సింగపూర్‌లకు దక్కాయి. అంతకుముందు సంవత్సరమూ ఈ మూడు దేశాలే అగ్రభాగాన నిలిచాయి. అవినీతి నిర్మూలన విషయంలో భారత్ 39 పాయింట్లు సాధించగలిగింది. పాకిస్థాన్, ఇరాక్‌లు చెరి 28 పాయింట్లు పొందాయని ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ తెలిపింది. దక్షిణ సూడాన్, సోమాలియా దేశాలు ఈ సూచీలో చెరి 9 పాయింట్లతో అట్టడుగున నిలిచాయి.

ట్రంప్ పగ్గాలు చేపట్టిన తర్వాత ఏడాది కాలంలో అమెరికాలో అవినీతి పెరిగిందని నివేదిక వెల్లడించింది. అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే 2025లో ఒక పాయింటు తక్కువ పొంది అవినీతి సూచీలో ఆ దేశం 29వ స్థానంలో నిలిచింది.

'నా పుస్తకం పరిస్థితి ఇదే'



- 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ'పై ఎంఎం నరవణె స్పష్టత

దిల్లీ: భారత సైన్యం మాజీ అధిపతి జనరల్ మనోజ్ ముకుంద్ నరవణె రచించిన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకంపై రాజకీయ దుమారం రేగుతోంది. పార్లమెంటు సమావేశాల్లోనూ ఈ పుస్తకంపై పెద్ద ఎత్తున చర్చలు జరిగాయి. ఆ పుస్తకం ఇంకా ప్రచురితం కాలేదని కేంద్రం వాదిస్తుండగా.. ఇప్పటికే ప్రచురితమైందని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ అంటున్నారు. మార్కెట్లో ఆ పుస్తకాన్ని అమ్ముతున్నారని మంగళవారం ఆయన వ్యాఖ్యానించారు. ఈ గందరగోళం నేపథ్యంలో ఎంఎం నరవణె స్పందించారు. 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ పుస్తకం ఇంకా ప్రచురితం కాలేదు. అది ప్రి ఆర్డర్ దశలోనే ఉంది. ప్రచురితం అయిన పుస్తకం.. ప్రి ఆర్డర్ దశలో ఉన్న పుస్తకం ఒకటి కావు' అని ఎక్స్ వేదికగా పెంగ్విన్ ర్యాండమ్ హౌజ్ ఇండియా (పీఆర్‌హెచ్‌ఐ) విడుదల చేసిన ప్రకటనను ఆయన రీపోస్టు చేశారు. 'నా పుస్తకం ప్రస్తుత పరిస్థితి ఇదే' అని పేర్కొన్నారు. దీంతో ఆ పుస్తకం ఇంకా ప్రచురితం కాలేదని అర్థమవుతోంది.

24 గంటల్లో రెండోసారి పెంగ్విన్ వివరణ

నరవణె, పీఆర్‌హెచ్‌ఐలలో ఎవరో ఒకరు అబద్ధం చెబుతున్నారని మంగళవారం రాహుల్ వ్యాఖ్యానించారు. 'నా పుస్తకం అందుబాటులో ఉంది' అంటూ 2023లో నరవణె చేసిన ట్వీట్‌ను ఆయన ప్రస్తావించారు. 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకాన్ని మార్కెట్లో అమ్ముతున్నారని ఆయన తెలిపారు. దీనికి స్పందనగా.. మంగళవారం మళ్లీ పీఆర్‌హెచ్‌ఐ వివరణను విడుదల చేసింది. ఆ పుస్తకం ప్రచురితం కాలేదని, అది మార్కెట్‌లో అందుబాటులో లేదని పునరుద్ఘాటించింది. అధికారికంగా విడుదల చేసి, రిటైల్ వేదికల్లో విక్రయానికి సిద్ధంగా ఉంచిన పుస్తకాలనే ప్రచురితమైనవి పరిగణిస్తారని వెల్లడించింది. పెంగ్విన్ ఈ అంశంపై 24 గంటల్లో రెండు సార్లు వివరణను విడుదల చేయడం గమనార్హం.

విజేతలు ఇలా వ్యవహరిస్తారు



అత్యంత విజయవంతమైన వ్యక్తులు కేవలం ఎక్కువ కష్టపడటంతో వదిలిపెట్టరు. వారు ప్రతీ పనిని విభిన్నంగా చేస్తారు. ఎక్కువ అపజయాల్నీ ఎదుర్కొంటారు. అధికంగా ప్రయోగాలు చేస్తారు. ఫలితం వెంటనే రాకపోయినా చేపట్టిన కార్యాన్ని పట్టుదలతో కొనసాగిస్తారు.

– జాన్ బ్రాసియో, ఇన్‌ఫ్లుయెన్సర్

మా ఎంపీలను నిలువరించకపోయి ఉంటే..

- సభలో పరిస్థితులు ఇబ్బందికరంగా ఉండేవి: రిజిజు

దిల్లీ: లోక్‌సభలో కాంగ్రెస్ సభ్యులతో ఘర్షణ పడేందుకు తమ మహిళా ఎంపీలను అనుమతించి ఉంటే పరిస్థితులు అత్యంత ఇబ్బందికరంగా ఉండేవని, అందుకే వారిని నిలువరించామని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు చెప్పారు. ఈ నెల 4న విపక్ష మహిళా ఎంపీలు అధికార పక్షం వైపు దూసుకురావడానికి సంబంధించిన వీడియో దృశ్యాలను మంగళవారం ఆయన మీడియాతో పంచుకున్నారు. పార్లమెంటులో కాంగ్రెస్ మహిళా ఎంపీలు చేసిన ఆందోళనలను, వారి అవమానకరమైన ప్రవర్తనను చూసి ఆ పార్టీ నేతలు గర్వపడుతున్నారని ఎద్దేవా చేశారు. ఆ సమయంలో తమ ఎంపీలను తాము ఆపకపోయి ఉంటే.. అక్కడి పరిస్థితి చేయిదాటిపోయి ఉండేదని చెప్పారు. పార్లమెంటు గౌరవం, పవిత్రతను కాపాడటానికి భాజపా ఎంపీలు సహనంతో ఉండాల్సి వచ్చిందన్నారు. కాంగ్రెస్ ఎంపీలు బ్యానర్ పట్టుకొని నినాదాలు చేస్తూ.. ప్రధాని సీటు వద్ద ఆందోళన చేస్తున్న దృశ్యాలు ఈ వీడియోలో కనిపిస్తున్నాయి. విపక్ష ఎంపీలు ఎంత దురుసుగా ప్రవర్తించినా భౌతిక ఘర్షణలకు దిగకుండా సభ హుందాతనాన్ని కాపాడేలా చూడాలనేది భాజపా నాయకత్వం తమ సభ్యులకు విస్పష్టంగా ఇచ్చిన ఆదేశమని రిజిజు చెప్పారు.

దేశ ప్రయోజనాలను మోదీ తాకట్టు పెట్టారు

- అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై ఖర్గే



దిల్లీ: భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందంపై కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభ విపక్ష నేత మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. ఈ ఒప్పందం భారత్ వ్యూహాత్మక ప్రయోజనాలను తాకట్టు పెట్టిందని, మోదీ ప్రభుత్వ ద్రోహాన్ని బయట పెట్టిందని విమర్శించారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందాన్ని 'బలవంతంగా లొంగిపోవడమే' అంటూ మంగళవారం 'ఎక్స్' వేదికగా ఖర్గే పోస్టు పెట్టారు. 'వాణిజ్య ఒప్పందం విషయంలో మోదీ ప్రభుత్వం దేశ వ్యూహాత్మక ప్రయోజనాలను పణంగా పెట్టింది. మధ్యంతర వాణిజ్య ఒప్పందంలోని నిజాలు ఇప్పుడిప్పుడే బయటకు వస్తున్నాయి. 25 శాతం అదనపు సుంకాలు తగ్గించేందుకు రష్యా నుంచి ఇంధనం కొనుగోలు ఆపడానికి భారత్ అంగీకరించినట్లు శ్వేతసౌధం ప్రకటన స్పష్టం చేస్తోంది. చరిత్రలో తొలిసారిగా భారత వ్యవసాయ మార్కెట్‌లో విదేశీ ఉత్పత్తులకూ కేంద్రం ద్వారాలు తెరిచింది. ఇది దేశ రైతులను మోసం చేయడమే. మోదీ నిర్ణయంతో ఇక్కడి పాడి రైతులు నష్టపోతారు. జౌళి రంగం దెబ్బతింటుంది. వాణిజ్య ఒప్పందం విషయంలో మోదీ ప్రభుత్వం సాధించిన విజయం ఇదేనా' అని ఖర్గే దుయ్యబట్టారు.

జాడలేని మంచు!

- అమెరికాలో నీటి కొరత భయం
- పశ్చిమ రాష్ట్రాల్లో వేసవిని తలపిస్తున్న వాతావరణం

లాస్ ఏంజెలెస్: అమెరికా పశ్చిమ రాష్ట్రాల్లో హిమపాతం దశాబ్దాల కనిష్ఠానికి పడిపోవడం పర్యావరణ వేత్తలను విస్మయానికి గురిచేస్తోంది. దీనికితోడు పొడి వాతావరణం, ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతుండటంతో రానున్న రోజుల్లో నీటి కొరత, కార్చిచ్చుల ప్రమాదం తప్పదనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ శీతాకాలంలో ఓరెగాన్, కొలరాడో, యూటా తదితర పశ్చిమ రాష్ట్రాల్లో సగటున 4,60,000 చదరపు మైళ్ల పరిధిలో మంచు పడాలి. ప్రస్తుతం అది 1,55,000 చదరపు మైళ్లకే పరిమితమైందని నేషనల్ స్నో అండ్ ఐస్ డేటా సెంటర్ వెల్లడించింది. డిసెంబరు నుంచి ఇప్పటి వరకు తమ ప్రాంతంలో వేసవి తరహా వాతావరణాన్ని చవిచూశామని కనీసం 67 వాతావరణ కేంద్రాలు వెల్లడించాయి. 40 ఏళ్ల కాలంలో ఇలాంటి శీతాకాలాన్ని తాను చూడలేదని కొలరాడో వాతావరణ కేంద్ర డైరెక్టర్ మార్క్ సెరేజ్ తెలిపారు. మరోవైపు ఈ పరిస్థితికి పర్యావరణ మార్పే ప్రధాన కారణమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. గాలిలో ఉన్న అవపాతం మంచులా మారకుండా వర్షపు చినుకులుగానే భూమిపైకి చేరుకుంటోందని, అందుకే హిమపాతం తగినంతగా నమోదు కాలేదని వివరించారు. మరోవైపు మంచు లేకపోవడంతో ఆయా రాష్ట్రాల్లో పర్యాటక రంగం తీవ్రంగా దెబ్బతింది. రానున్న రోజుల్లో వర్షం, మంచు కురుస్తుందనే అంచనాలున్నా జరిగిన నష్టాన్ని పూడ్చలేవని వాతావరణ అధికారులు పేర్కొన్నారు.

అమెరికాతో బంగ్లాదేశ్ వాణిజ్య ఒప్పందం

- ఢాకా ఉత్పత్తులపై 1 శాతం తగ్గిన సుంకాలు



ఢాకా: అమెరికా, బంగ్లాదేశ్ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేసుకున్నాయి. దీంతో బంగ్లాపై సుంకాలు ప్రస్తుతమున్న 20 శాతం నుంచి.. 19 శాతానికి తగ్గనున్నాయి. అమెరికా వాణిజ్య ప్రతినిధి జెమీసన్ గ్రీర్, బంగ్లాదేశ్ వాణిజ్య ప్రతినిధి షేక్ బషీరుద్దీన్‌లు వాషింగ్టన్‌లో ఈ వాణిజ్య ఒప్పందంపై సంతకాలు చేశారని శ్వేతసౌధం సోమవారం ధ్రువీకరించింది. ద్వైపాక్షిక ఆర్థిక, వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడంలో ఇది ఓ గొప్ప ముందడుగని అమెరికా వాణిజ్య ప్రతినిధి కార్యాలయం పేర్కొంది. దుస్తుల తయారీకి అమెరికా నుంచి దిగుమతయ్యే కాటన్, ఫైబర్‌లను ఉపయోగించేందుకు తాము అంగీకరించినట్లు బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ సామాజిక మాధ్యమాల్లో వెల్లడించారు. ఇలా తయారుచేసి ఎగుమతి చేసే దుస్తులకు అమెరికా మార్కెట్‌లో సుంకాలు ఉండబోవని పేర్కొన్నారు. గతంలో బంగ్లాదేశ్‌పై ట్రంప్ 37 శాతం టారిఫ్‌లు విధించగా.. తర్వాత దానిని 20 శాతానికి పరిమితం చేశారు. వాణిజ్య ఒప్పందంతో మరొక శాతం తగ్గించారు. 18 శాతం సుంకాలకు అంగీకరిస్తూ అమెరికాతో భారత్ ఇటీవల వాణిజ్య ఒప్పందం ఖరారు చేసుకుంది. దీంతో వస్త్ర పరిశ్రమ ఆధారిత ఆర్థిక వ్యవస్థ అయిన బంగ్లాదేశ్.. భారత్ కంటే తక్కువ సుంకాలతో అమెరికాతో ఒప్పందం కుదుర్చుకునేందుకు యత్నించింది. అమెరికా పారిశ్రామిక, వ్యవసాయ ఉత్పత్తులు, రసాయనాలు, వైద్య పరికరాలు, ఆటోమొబైల్ విడిభాగాలు, ఇంధన ఉత్పత్తులకు మార్కెట్‌ను తెరిచేందుకు ఢాకా అంగీకరించింది.

మా దేశంపై దాడి చేయండి

ట్రంప్‌నకు ఇరాన్ వ్యక్తి అభ్యర్థన.. ఆపై ఆత్మహత్య

ఇంటర్నెట్ డెస్క్: తమ దేశంపై దాడి చేయాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను ఇరాన్‌కు చెందిన ఓ వ్యక్తి అభ్యర్థించాడు. చర్చలు జరపకుండా నేరుగా దాడికి దిగడమే సరైన మార్గమని పేర్కొన్నాడు. ఈ మేరకు 10 నిమిషాల నిడివి ఉన్న వీడియోను సామాజిక మాధ్యమాల్లో గతవారం విడుదల చేసి.. అనంతరం ఆత్మహత్య చేసుకున్నాడు. బాధితుడిని బుషెహర్ నగరానికి చెందిన హక్కుల కార్యకర్త పౌరియా హమీదీగా గుర్తించారు. "ఈ వీడియోను మీరు చూసే సమయానికి నేను బతికి ఉండకపోవచ్చు. ఇరాన్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలను ఎంత ఘోరంగా అణచివేశారో అంతర్జాతీయ సమాజానికి తెలియాలి. దాదాపు 40 వేల మందిని మా నాయకులు హత్య చేశారు. విదేశీ జోక్యం లేకుండా ఇరాన్ నాయకత్వాన్ని అడ్డుకోలేం. ఇప్పుడు మా నమ్మకమంతా అమెరికా మీదే. అలా కాదని ఇరాన్‌తో అగ్రరాజ్యం చర్చలు జరిపితే.. మమ్మల్ని మోసం చేసినట్లే. సంప్రదింపులు వద్దు.. మా దేశంపై దాడి చేయండి" అని వీడియోలో హమీదీ అభ్యర్థించాడు.

ఒకే కుటుంబంలో ఐదుగురి ఆత్మహత్య

మథుర: ఉత్తర్‌ప్రదేశ్‌లోని మథుర జిల్లాలో ఒక జంట, వారి ముగ్గురు చిన్నారులు తమ నివాసంలో శవాలై కనిపించారు. ఈ ఘటన ఖప్పర్‌పుర్ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. దీన్ని పోలీసులు సామూహిక ఆత్మహత్యగా అనుమానిస్తున్నారు. ఘటనా స్థలంలో ఆత్మహత్య లేఖ, గోడపై రాసిన సందేశంతోపాటు ఆ ఇంటి పెద్ద తన ఫోన్‌లో చిత్రీకరించిన ఒక వీడియోను కనుగొన్నట్లు పోలీసులు వెల్లడించారు.



ఘటనా స్థలం వద్ద పోలీసులు

మరణించిన వారిని మనీశ్ కుమార్ (35) అనే రైతు, ఆయన 32 ఏళ్ల భార్య, హనీ (8), ప్రియాన్షి (5) అనే ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ప్రతీక్‌లుగా గుర్తించామని ఎస్పీ శ్లోక్ కుమార్ తెలిపారు. తమ మరణానికి ఎవరూ కారణం కాదని, తమ జీవితాన్ని తామే ముగించుకోవాలనుకున్నట్లు మనీశ్ తను చిత్రీకరించిన వీడియోలో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు.

సంస్కృతి, ప్రగతికి చిహ్నంగా బస్తర్

- ప్రధాని మోదీ వ్యాఖ్య



దిల్లీ: ఒకప్పుడు మావోయిస్టుల కంచుకోటగా ఉన్న బస్తర్, ఇప్పుడు గొప్ప సంస్కృతి, ప్రగతి, ఆత్మ విశ్వాసానికి చిహ్నంగా మారిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో ఈ నెల 7 నుంచి 9 వరకు జరిగిన 'బస్తర్ పండుమ్'పై ఆయన ప్రశంసలు కురిపించారు. ఈ వేడుకలో బస్తర్ ప్రాంతపు గొప్ప సంస్కృతి, సంప్రదాయాలు, గిరిజన వారసత్వాన్ని అద్భుతంగా ప్రదర్శించారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. 'గతంలో బస్తర్ అనగానే మావోయిజం, హింస, వెనుకబాటుతనం గుర్తుకు వచ్చేవి. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది.



నేడు బస్తర్ ప్రాంతం అభివృద్ధి చెందుతోంది. స్థానిక ప్రజల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతోంది. ఈ ప్రాంతం భవిష్యత్తులోనూ శాంతి, ప్రగతి, సాంస్కృతిక గౌరవంతో నిండి ఉండాలని నేను ఆశిస్తున్నాను' అని 'ఎక్స్' వేదికగా మోదీ పోస్టు పెట్టారు. ఈ నెల 7న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రారంభించిన ఈ ఉత్సవం, గిరిజనులు హస్తకళలు, స్థానిక వంటకాలు, సంప్రదాయ గిరిజన నృత్యాలు, జానపద గీతాలతో బస్తర్ వైభవాన్ని చాటి చెప్పింది.

బంగ్లాదేశ్‌లో హిందూ వ్యాపారి హత్య



ఢాకా: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు ఆగడం లేదు. తాజాగా ఓ హిందూ వ్యాపారిని (62) గుర్తు తెలియని వ్యక్తులు కత్తితో పొడిచి చంపారు. హత్యకు గురైన వ్యక్తిని దక్షిణ కుండ గ్రామానికి చెందిన సుసేన్ చంద్రశేఖర్‌గా గుర్తించారు. సోమవారం రాత్రి చంద్రశేఖర్ బొగర్ బజార్‌లోని తన బియ్యం దుకాణంలో ఉండగా.. లోపలికి చొరబడిన కొందరు గుర్తు తెలియని దుండగులు ఆయనపై కత్తితో దాడి చేశారు. అనంతరం దుకాణం తలుపులు మూసివేసి పారిపోయారు. అతని కోసం వెతుకుతూ దుకాణానికి వచ్చిన కుటుంబ సభ్యులకు చంద్రశేఖర్ రక్తపు మడుగులో కనిపించాడు. వెంటనే ఆసుపత్రికి తరలించినా అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తమ కుటుంబానికి ఎవరితోనూ వైరం లేదని, దుకాణంలోకి చొరబడిన దుండగులు డబ్బును దొంగిలించి తన తండ్రిపై దాడి చేశారని చంద్రశేఖర్ కుమారుడు సుజన్ సర్కార్ మీడియాకు తెలిపారు.

హైవేపై విమానం అత్యవసర ల్యాండింగ్

- 3 కార్లు ధ్వంసం.. ఇద్దరికి గాయాలు

గెయిన్స్‌విల్: రద్దీగా ఉన్న హైవేపై చిన్న విమానం ఒకటి అత్యవసరంగా దిగడంతో 3 కార్లు ధ్వంసమైన ఘటన అమెరికాలోని జార్జియాలో చోటుచేసుకుంది. దీంతో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. అట్లాంటాకు 80 కిలోమీటర్ల దూరంలోని గెయిన్స్‌విల్‌లో బ్రౌన్స్ బ్రిడ్జి రోడ్డుపై హాకర్ బీచ్‌క్రాఫ్ట్ బీఈ-36 విమానం సోమవారం అత్యవసరంగా దిగింది. ఇంజిన్‌లో తలెత్తిన లోపం కారణంగా విమానం అత్యవసరంగా దిగాల్సి వచ్చింది. హైవేపై భారీగా కార్లు ఉన్న సమయంలో ఒక్కసారిగా విమానం రోడ్డుపై దిగడం, వాటిని ఢీకొట్టినట్లున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది.



ఎప్‌స్టీన్ 'వైల్డ్ డిన్నర్'లో మస్క్, జుకర్‌బర్గ్

ఇంటర్నెట్ డెస్క్: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్, మెటా అధినేత మార్క్ జుకర్‌బర్గ్, లింక్డిన్ సహ వ్యవస్థాపకుడు హాఫ్‌మన్, పేపాల్ సహ వ్యవస్థాపకుడు పీటర్ థీల్ వంటి ప్రముఖులు లైంగిక నేరాల కేసు నిందితుడు ఎప్‌స్టీన్‌తో కలిసి విందులో పాల్గొన్నట్లు తాజాగా వెల్లడైంది. ఈ పార్టీని 'వైల్డ్' అని



పేర్కొంటున్న ఈమెయిల్‌ను ఎప్‌స్టీన్ తనకు తానే పంపించుకున్నట్లు అమెరికా విడుదల చేసిన పత్రాలు వెల్లడిస్తున్నాయి. బయటకు వచ్చిన ఫొటోలో ఎప్‌స్టీన్ నిర్వహించిన ఓ పార్టీకి హాజరైన మస్క్, జుకర్‌బర్గ్ సహ ఇతర ప్రముఖులు పొడవైన డైనింగ్ టేబుల్ చుట్టూ కూర్చున్నట్లు కనిపిస్తోంది. అయితే అందులో ఎప్‌స్టీన్ కనిపించలేదు. 2015 ఆగస్టు 3న ఈ ఫొటో తీసినట్లు అతడి ఈమెయిల్‌లో ఉంది.

కెనడా, అమెరికా మధ్య వంతెనను మూసివేస్తాం: ట్రంప్

ఇంటర్నెట్‌డెస్క్: కెనడాపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విరుచుకుపడ్డారు. ఇప్పటివరకు అమెరికా నుంచి పొందిన అన్ని ప్రయోజనాలకు ప్రతిఫలంగా తిరిగి తమకు మూల్యం చెల్లించాలని, లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తమ నుంచి పొందిన వాటికి పూర్తి పరిహారం చెల్లించేవరకు కెనడాలోని ఒంటారియో ప్రావిన్స్‌ను అమెరికాలోని మిషిగన్‌తో కలిపే గోర్డీ హోవే అంతర్జాతీయ వంతెనను మూసివేస్తామని బెదిరించారు. 2014లో అప్పటి అమెరికా అధ్యక్షుడు ఒబామా తెలివి తక్కువగా ఆలోచించి ఈ వంతెన నిర్మాణానికి మినహాయింపులు ఇచ్చారని ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వంతెన నిర్మాణానికి అయిన ఖర్చులో సగమైనా అమెరికాకు చెల్లించాలని, లేదంటే వంతెనపై ఇరు దేశాలకు సమాన యాజమాన్య హక్కులు కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలని ట్రంప్ కెనడాకు సూచించారు.

నిలకడగా శరద్ పవార్ ఆరోగ్యం

పుణె: ఛాతీ ఇన్ఫెక్షన్ కారణంగా ఆసుపత్రిలో చేరిన ఎన్సీపీ-ఎస్పీ అధినేత శరద్ పవార్ (85) ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు మంగళవారం వెల్లడించారు. ఆయన కోలుకుంటున్నట్లు తెలిపారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, తీవ్రమైన దగ్గుతో బాధపడుతున్న శరద్ పవార్‌ను సోమవారం మధ్యాహ్నం బారామతి పట్టణం నుంచి పుణెకు తరలించి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చిన విషయం తెలిసిందే.

మరిన్ని దేశాలతో ఒప్పందాలు అవసరం

- భారత వ్యవసాయ రంగం బలోపేతం కావాలి
- ఉత్పాదకత, పంటల మార్పిడి పెరగాలి
- అమెరికాతో ఒప్పందం ప్రయోజనకరమే



'ఈనాడు'తో అంతర్జాతీయ వ్యవసాయ రంగ నిపుణుడు ప్రభు పింగళి

ఈనాడు, హైదరాబాద్: భారత్‌లో వ్యవసాయ రంగం మరింత బలోపేతం కావాలి.. అధిక ఉత్పాదకత, పంటల మార్పిడితో పాటు ప్రధానంగా పండ్లు, కూరగాయలు, పౌష్టికాహార పంటల సాగుపై దృష్టిసారించాలని అమెరికా కార్నెల్ విశ్వవిద్యాలయంలోని టాటా కార్నెల్ వ్యవసాయ, పౌష్టికాహార సంస్థ (టీసీఏఎన్) డైరెక్టర్ ప్రభు లక్ష్మీనారాయణ పింగళి తెలిపారు. దేశంలోని ఆహార అవసరాలను పోను మిగులు ఉత్పత్తులను వృథా కాకుండా ఎగుమతులను ప్రోత్సహించాలన్నారు. అమెరికా, భారత్ మధ్య వాణిజ్య ఒప్పందం ప్రయోజనకరమేనని అభిప్రాయపడ్డారు. భారత వ్యవసాయరంగం బలోపేతానికి మరిన్ని దేశాలతో వాణిజ్య ఒప్పందాల అవసరం ఉందని స్పష్టంచేశారు. హైదరాబాద్‌కు వచ్చిన ఆయన 'ఈనాడు'తో మాట్లాడారు.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ విద్యార్థి

అంతర్జాతీయ వ్యవసాయ, ఆహార, ఆర్థిక రంగ నిపుణులైన ప్రభు.. ఆంధ్రప్రదేశ్‌లోని గుడివాడలో జన్మించారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో చదివారు. 1977లో బిట్స్ పిలానీ నుంచి ఆర్థిక శాస్త్రంలో ఎంఏ పట్టా పొందారు. భారత ఆహారభద్రత చట్ట కమిటీ సభ్యునిగా ఉన్నారు. పలు జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్నారు.

భారత్- అమెరికా మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. మీ అభిప్రాయం?

ఈ ఒప్పందం లాభదాయకమే. స్వాగతించాల్సిందే. ఇంతకుముందు ఇలాంటి ఒప్పందం లేదు. దీనివల్ల రెండు దేశాల మధ్య సంబంధాలు మరింత దృఢమవుతాయి. వ్యవసాయమే కాదు.. అన్ని రంగాల్లోనూ ఇరు దేశాల మధ్య బలమైన సంబంధం ఉండటం చాలా ముఖ్యం. అమెరికన్లు కూడా దీనిని సానుకూలంగానే చూస్తున్నారు.

భారత్‌లోని వ్యవసాయ రంగానికి, రైతులకు నష్టం కలుగుతుందనే విమర్శలు వస్తున్నాయి? ఇది నిజం కాదా?

నేను రాజకీయాలు మాట్లాడను. రెండు దేశాల మధ్య కుదిరిన తాజా ఒప్పందం గతంలో కంటే మెరుగ్గా ఉంది. వ్యవసాయ రంగానికి నష్టమేమీ ఉండదు. అమెరికాకు భారత్‌లో పండే పండ్లు, సుగంధద్రవ్యాలు, సముద్ర ఉత్పత్తుల ఎగుమతులు పెరుగుతాయి. ఏపీలో సాగవుతున్న రొయ్యల ఎగుమతుల ద్వారా అక్కడి రైతులకు లబ్ధి కలుగుతుంది. అమెరికా నుంచి సోయాబీన్ వంటి ఉత్పత్తులు భారత్‌కు రావడం వల్ల వినియోగం పెరిగి ఇక్కడి ఉత్పత్తులకూ డిమాండ్ వస్తుంది.

భారత్ నుంచి వ్యవసాయ ఎగుమతులు పెరగకపోవడానికి కారణం?

దేశం ఐటీ, ఔషధ రంగాల్లో అగ్రస్థానంలో ఉంది. వ్యవసాయానికి సంబంధించి బాస్మతి బియ్యం, మరికొన్నింటినే ఎగుమతి చేస్తున్నారు. వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు కూడా పెరగాలి. అందుకు వీలుగా ప్రభుత్వం ఆంక్షలు సడలించాలి. నాణ్యతా ప్రమాణాలు, వ్యాల్యూ చైన్‌పై రైతులకు అవగాహన కల్పిస్తే మరింత అభివృద్ధి సాధిస్తారు.

అమెరికాతో పోలిస్తే భారత వ్యవసాయ రంగం తీరు ఎలా ఉంది?

భారత్‌లో రైతులు ఎక్కువ మంది సన్న, చిన్నకారు రైతులే. సగటున వారికి రెండు ఎకరాల భూమే ఉంది. ఉత్పాదకతలో పరిమాణం ముఖ్యం కాదు. సాంకేతికత, ప్రభుత్వ విధానాలు తోడైతే చిన్న రైతులు కూడా అద్భుతాలు చేయగలరు. అమెరికాలో తక్కువ మంది రైతులు ఎక్కువ భూమిని సాగు చేస్తుంటే.. భారత్‌లో కోట్ల మంది చిన్న రైతులు దేశానికి అన్నం పెడుతున్నారు.

భారత వ్యవసాయ విధానాల్లో లోపాలున్నాయా? వాటిని ఎలా అధిగమించాలి?

ప్రస్తుతం కూరగాయలు, పండ్లు, పాడి ఉత్పత్తులకు డిమాండ్ వేగంగా పెరుగుతోంది. మనం కేవలం వరి, గోధుమ వంటి ధాన్యాల మీద దృష్టి పెట్టడం వల్ల, వైవిధ్యమైన ఆహార ఉత్పత్తులను అందుకోలేకపోతున్నాం. రైతులకు సూపర్ మార్కెట్లకు మధ్య సరైన అనుసంధానం లేదు. మరోవైపు సులభంగా దొరికే జంక్ ఫుడ్, చక్కెర క్యాలరీలు ఎక్కువగా ఉండే ఆహారం వల్ల భారతదేశంలో కొత్త సమస్య మొదలైంది. అధిక బరువు ఊబకాయం, మధుమేహం, రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నాం. ఆరోగ్యకరమైన, పోషక విలువలున్న ఆహారం అందుబాటులో లేకపోవడమే దీనికి ప్రధాన కారణం.

ఈ సవాళ్లను ఎదుర్కోవడం ఎలా?

ఈ సవాళ్లను ఎదుర్కోవాలంటే పప్పుధాన్యాలు, కూరగాయలు, పండ్లు, పాడి పరిశ్రమపై దృష్టి పెట్టాలి. టమాటాలు, బంగాళాదుంపలు, ఇతర తాజా కూరగాయలు, పాడి ఉత్పత్తులు ప్రజలకు తక్కువ ధరకు అందుబాటులోకి రావాలి. చిన్న రైతులను నగరాల మార్కెట్లతో అనుసంధానం చేయాలి. స్థానిక పరిస్థితులకు తగ్గట్టుగా ఏ పంట వేయానేది రైతులే నిర్ణయించుకోవాలి. ఆహారంలో వైవిధ్యం ఉండటం చాలా ముఖ్యం. అమెరికాలో ప్రజలు నిత్యం కూరగాయలు, వివిధ రకాల ఆహారాన్ని తీసుకుంటారు. దీంతో ఆరోగ్యంగా ఉంటున్నారు. భారత్ కూడా ఆ దిశగా వెళ్లాలి. వ్యవసాయ, ఆరోగ్య, శిశు సంక్షేమ శాఖలు కలిసి పనిచేయాలి. అప్పుడే పోషకాహార సమస్యను పరిష్కరించగలం. అమెరికా మాదిరే భారత్‌లో డ్రోన్లు, శాటిలైట్ సాంకేతికత ప్రవేశపెట్టాలి. అది ఆహార భద్రతకు చాలా అవసరం.

తెలుగు రాష్ట్రాల్లో వ్యవసాయ స్థితిగతులు ఎలా ఉన్నాయి?

తెలంగాణ ప్రాంతం గత రెండు దశాబ్దాల్లో పత్తి, వరి, సోయాబీన్ సాగులో అద్భుతమైన వృద్ధి సాధించింది. సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో ఆంధ్రప్రదేశ్ చాలా ముందంజలో ఉంది. హరిత విప్లవాలకు బాటలు వేసిన తెలుగు రాష్ట్రాలు మరింతగా పురోగమించాలి.

వెట్టిచాకిరీ ఘటనలు బాధాకరం

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్



మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్

ఈనాడు, అమరావతి, తుళ్లూరు, న్యూస్‌టుడే: ఆధునిక సమాజంలో ఇంకా వెట్టిచాకిరీ ఘటనలు పునరావృతం కావటం బాధాకరమని, వెట్టిచాకిరీ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హైకోర్టు న్యాయమూర్తి, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షులు జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ పేర్కొన్నారు. వెట్టిచాకిరీ నిర్మూలన చట్టం-1976 అమలు 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మంగళవారం అమరావతిలోని వీఐటీ-ఏపీ యూనివర్సిటీలో రాష్ట్రస్థాయి కార్యశాల నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ మాట్లాడుతూ.. పేదల బలహీనతలను ఆసరాగా చేసుకొని ఆర్థిక దోపిడీ ద్వారా వారిని వెట్టిచాకిరీలోకి నెట్టడం వల్ల వారి రాజ్యాంగ హక్కులు, స్వేచ్ఛ, గౌరవం హరిస్తున్నారన్నారు. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎ.వి.శేషసాయి మాట్లాడుతూ వెట్టిచాకిరీ సమాజంపై ఒక మాయని మచ్చగా, ఒక వ్యాధిలా మారిందన్నారు. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ వి.ఆర్.కె. కృపాసాగర్, సీసీఎల్ఏ జి.జయలక్ష్మి, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బి.ఎస్.వి. హిమబిందు, ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ (స్వచ్ఛంద సేవాసంస్థ) ప్రతినిధి కమాండర్ అశోక్‌కుమార్ తదితరులు మాట్లాడారు. వెట్టిచాకిరీ బాధితురాలు, జీవన్ జ్వాల సంస్థ ప్రధాన కార్యదర్శి తన్మయి మాట్లాడుతూ ఇకపై రాష్ట్రంలో వెట్టిచాకిరీ అనే మాట వినిపించకూడదని, తనలాంటి పరిస్థితి మరెవరికీ రాకూడదని ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవల సంస్థ డిప్యూటీ సెక్రటరీ హెచ్.అమర రంగేశ్వరరావు, వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయం ఉపకులపతి అరుల్ మోజీ వర్మన్, రిజిస్ట్రార్ జగదీష్‌చంద్ర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. వెట్టిచాకిరీపై విద్యార్థులు ప్రదర్శించిన వీధినాటకం ఆకట్టుకుంది.

అమరావతి నిర్మాణం కోసం రూ.750 కోట్లు విడుదల

- ప్రపంచబ్యాంక్, ఏడీబీల నుంచి మరో రూ.5,120 కోట్లు
- రాజ్యసభలో కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి వెల్లడి

పార్లమెంటులో ఆంధ్రప్రదేశ్

ఈనాడు, దిల్లీ: అమరావతికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక సాయం కింద ప్రకటించిన రూ.1,500 కోట్లలో గత జనవరి వరకు రూ.750 కోట్లు విడుదల చేసినట్లు కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్‌చౌధరి తెలిపారు. ఆయన మంగళవారం రాజ్యసభలో వైకాపా సభ్యుడు పరిమళ నత్వాని అడిగిన ప్రశ్నకు ఈ సమాధానం ఇచ్చారు. దీనికితోడు ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు(ఏడీబీ)ల ద్వారా రుణాల కింద మరో రూ.5,120 కోట్లు కూడా పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ రుణాలతోపాటు, కేంద్రం ప్రభుత్వం ఇచ్చిన గ్రాంట్లకు సంబంధించిన ఖర్చుల వివరాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అమరావతి నిర్మాణం కోసం 2024-25లో రూ.15 వేల కోట్లు ఏర్పాటుచేస్తామని ఆర్థికమంత్రి బడ్జెట్‌లో ఇచ్చిన హామీ మేరకు ప్రపంచబ్యాంకు, ఏడీబీల నుంచి రూ.7,245 కోట్ల రుణ సాయం అందించిందని చెప్పారు. ఈ రెండు రుణాలు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో చెప్పిన మొత్తంలో 90శాతానికి సమానమని, మిగిలిన 10 శాతాన్ని ఏపీ ప్రభుత్వానికి ప్రత్యేక సాయం (గ్రాంట్) కింద అందించడానికి కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందని వెల్లడించారు.

ఏపీకి 42శాతం నానో ఎరువుల సరఫరా

ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన నానో ఎరువుల్లో 42.36% మాత్రమే సరఫరా చేసినట్లు కేంద్ర ఎరువులు, రసాయనాలశాఖ సహాయమంత్రి అనుప్రియ పటేల్ తెలిపారు. మంగళవారం రాజ్యసభలో తెదేపా సభ్యుడు సానా సతీష్‌బాబు అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానం ఇచ్చారు. గత మూడేళ్ల వ్యవసాయ సీజన్‌లో ఏపీకి 34.68 లక్షల బాటిళ్ల నానో యూరియా, 21.76 లక్షల బాటిళ్ల నానో డీఏపీ కలిపి 56.44 లక్షల బాటిళ్లు కేటాయించగా, అందులో 23.91 లక్షల బాటిళ్లు మాత్రమే (42%) సరఫరా జరిగినట్లు చెప్పారు.

ఏపీ వైద్య మండలి ఎన్నికల ఫలితాలు వెల్లడి

- విజేతలుగా 13 మంది అభ్యర్థులు



ఫలితాలు వెల్లడిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి చక్రధర్ బాబు. చిత్రంలో వైద్యారోగ్యశాఖ కార్యదర్శి సౌరభ్‌గౌర్, ఏపీఎంసీ రిజిస్ట్రార్ రమేష్ తదితరులు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ వైద్య మండలి (ఏపీఎంసీ) ఎన్నికల ఫలితాలు మంగళవారం వెల్లడించారు. తాడేపల్లిలోని సెకండరీ హెల్త్ సంచాలకుల కార్యాలయంలో వైద్యారోగ్య- కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి- సెకండరీ హెల్త్ డైరెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు, ఏపీఎంసీ రిజిస్ట్రార్ ఐ.రమేష్ పర్యవేక్షణలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ సాగింది. 84 మంది అభ్యర్థులు పోటీచేసిన ఈ ఎన్నికల్లో ఈ- ఓటింగ్ విధానంలో 55% ఓట్లు పోలయ్యాయి. అధిక ఓట్లు సాధించిన 13 మంది ఏపీఎంసీ సభ్యులుగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించి, విజేతలకు ధ్రువీకరణపత్రాలు అందించారు. అభ్యర్థుల వారీగా దక్కిన ఓట్ల వివరాలు వెల్లడించారు.

విజేతలుగా నిలిచిన వైద్యులు వీరే..

కె.అలేఖ్య, బి.మౌనిక, ఎం.మహేష్, ఎం.వినోద్‌కుమార్, ఎ.వెంకటసుబ్బారెడ్డి, ఎ.శివమౌర్య గుప్త, ఐ.వాణి, ఎం.వెంకటరమణ, ఎం.జయచంద్రరెడ్డి, బి.తేజ నవీన్, జి.నంద కిశోర్, కె.శ్రీహరి, కె.తిరుమల.

ఏపీ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా బాలాజి మెడమల్లి

- నియామకానికి రాష్ట్రపతి ఆమోదముద్ర
- నోటిఫికేషన్ జారీ చేసిన కేంద్ర న్యాయశాఖ



ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా న్యాయవాది బాలాజి మెడమల్లి నియమితులయ్యారు. ఈ నియామకానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదముద్ర వేయడంతో కేంద్ర న్యాయశాఖ మంగళవారం నోటిఫికేషన్ జారీ చేసింది. బాలాజి గురు, శుక్రవారాల్లో హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా ప్రమాణం చేసే అవకాశం ఉంది. 37 మంది న్యాయమూర్తుల పోస్టులు మంజూరైన ఏపీ హైకోర్టులో ప్రస్తుతం 32 మంది సేవలందిస్తున్నారు. బాలాజి నియామకంతో ఆ సంఖ్య 33కి చేరింది. న్యాయవాదుల కోటా నుంచి హైకోర్టు న్యాయమూర్తిగా నియమించేందుకు బాలాజి పేరును హైకోర్టు కొలీజియం సుప్రీంకోర్టుకు సిఫారసు చేసింది. దీనికి ఆమోదం తెలుపుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలో కొలీజియం ఇటీవల కేంద్రానికి సిఫారసు చేసిన విషయం తెలిసిందే.

వ్యవసాయ కుటుంబం నుంచి..

మెడమల్లి బాలాజి 1972 మే 29న వైఎస్సార్ కడప జిల్లా రాజంపేట మండలం శేషన్నగారిపల్లి గ్రామంలో లక్ష్మీనరసమ్మ, సుబ్బయ్యనాయుడు దంపతులకు జన్మించారు. సుబ్బయ్యనాయుడు కోపరేటివ్ సెంట్రల్ బ్యాంక్‌లో ఉద్యోగం చేసి పదవీ విరమణ పొందారు. బ్యాంక్ ఉద్యోగి అయినప్పటికీ వారిది ప్రధానంగా వ్యవసాయ ఆధారిత కుటుంబం. బాలాజి పాఠశాల విద్య రాజంపేటలో, డిగ్రీ తిరుపతి శ్రీవెంకటేశ్వర ఆర్ట్స్ కళాశాలలో పూర్తి చేశారు. హైదరాబాద్‌లోని పడాల రామిరెడ్డి న్యాయ కళాశాలలో న్యాయవిద్యను అభ్యసించారు. 1997లో అప్రంటీస్ చేసి, 1998 ఏప్రిల్ 9న బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకున్నారు. న్యాయవాది గూడపాటి వెంకటేశ్వరరావు ఆఫీసులో న్యాయవాదిగా చేరి ప్రాక్టీసు ప్రారంభించారు. భార్య కల్యాణి, కుమారుడు సుచంద్రహాస్, కుమార్తె లక్ష్మీశ్వేత ఉన్నారు.

ప్రతిష్ఠాత్మక సంస్థలకు స్టాండింగ్ కౌన్సెల్‌గా..

రాజ్యాంగ సంబంధ అంశాలతోపాటు సివిల్, క్రిమినల్, సర్వీసు, కమర్షియల్ కేసుల విషయంలో బాలాజికి అపార అనుభవం ఉంది. ఎన్నో కీలక కేసుల్లో వాదనలు వినిపించారు. 2004 నుంచి 2006 వరకు అప్పటి ఏజీ కార్యాలయానికి అటాచ్ అయి ఏజీపీగా పనిచేశారు. 2018-19 మధ్య కాలంలో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సెల్‌గా సేవలందించారు. వివిధ బ్యాంకులు, ప్రతిష్ఠాత్మక సంస్థలకు స్టాండింగ్ కౌన్సెల్‌గా పనిచేశారు.

పీఆర్సీ ఛైర్మన్ నియామకాన్ని వెంటనే చేపట్టాలి

- ఏపీ జేఏసీ ఛైర్మన్ ఎ.విద్యాసాగర్

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు చట్టబద్ధంగా లభించిన హక్కులు కోల్పోయే పరిస్థితి వచ్చినా, నష్టం కలిగించే ఏ నిబంధననైనా ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని ఏపీ ఎన్జీజీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ స్పష్టం చేశారు. మంగళవారం విజయవాడ ఎన్జీజీవో హోంలో నిర్వహించిన ఏపీ జేఏసీ కార్యవర్గ సమావేశంలో ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారంపై చర్చించారు. ఈ సందర్భంగా ఏపీ జేఏసీ ఛైర్మన్‌గా ఎ.విద్యాసాగర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2023 జులైలో నియమించాల్సిన పీఆర్సీ ఛైర్మన్ నియామకంలో జాప్యం జరగకుండా అసెంబ్లీ సమావేశాలు ముగిసేలోపు నిర్ణయం ప్రకటించాలని కోరారు.

మాజీ మంత్రి కాకాణిపై కేసు నమోదు

కోవూరు, న్యూస్‌టుడే: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు పోలీసు స్టేషన్‌లో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు. షరతులతో కూడిన బెయిల్‌పై ఉంటూ.. నిబంధనలు ఉల్లంఘించారని, ఇటీవల కోవూరులో ఓ బాలిక మృతి విషయంలో విలేకర్ల సమావేశం నిర్వహించి ఆమె వివరాలు పరోక్షంగా వెల్లడించారని స్థానిక తెదేపా నాయకులు పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కాకాణిపై పోక్సో కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

వాన్‌పిక్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురు

- సీబీఐ కేసును కొట్టేయాలంటూ దాఖలుచేసిన పిటిషన్‌ను తోసిపుచ్చిన ధర్మాసనం

ఈనాడు, దిల్లీ: వాన్‌పిక్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. హైదరాబాద్ సీబీఐ కోర్టులో విచారణలో ఉన్న క్రిమినల్ కేసును కొట్టేయాలని కోరుతూ ఆ సంస్థ దాఖలుచేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. మంగళవారం దీనిపై విచారించిన జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ ఎన్‌కే సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీచేసింది. తమకు వ్యతిరేకంగా తెలంగాణ హైకోర్టు గత ఏడాది ఆగస్టు 26న ఇచ్చిన తీర్పును కొట్టేయాలని ఆ సంస్థ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ దవే చేసిన విజ్ఞప్తిని ధర్మాసనం తోసిపుచ్చింది. విచారణ ఎదుర్కొని, అక్కడ ఏది కావాలంటే అది చెప్పుకోవాలని సూచిస్తూ విచారణ ముగించింది. సిద్ధార్థ దవే వాదనలు వినిపిస్తూ "మాకు అనుకూలంగా హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ సీబీఐ దాఖలుచేసిన పిటిషన్‌పై విచారించిన సుప్రీంకోర్టు ఈ కేసును మళ్లీ హైకోర్టుకు తిప్పి పంపుతూ మెరిట్స్ ప్రాతిపదికన విచారించాలని నిర్దేశించింది. సీబీఐ ఛార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకోవడంలో ట్రయల్‌కోర్టు తప్పు చేసింది. ఏ నేరాభియోగాల ఆధారంగా ఛార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకుందో చెప్పలేదు. అందుకే గతంలో హైకోర్టు సీబీఐ కేసును క్వాష్ చేసింది. దాన్ని సవాలు చేస్తూ సీబీఐ దాఖలుచేసిన అప్పీల్‌ను పరిశీలించిన సుప్రీంకోర్టు కేసును మళ్లీ హైకోర్టుకు తిప్పి పంపుతూ అందులోని మెరిట్స్ దృష్ట్యా ఏదో ఒక నిర్ణయం చెప్పాలని ఆదేశించింది. హైకోర్టు కేసును పునఃపరిశీలించినా, మెరిట్స్‌పై అభిప్రాయం చెప్పలేదు. దానివల్ల మా పరిస్థితి ఎటూ కాకుండా పోయింది" అని పేర్కొన్నారు. ఆ వాదనలతో జస్టిస్ సుందరేష్ విభేదించారు. ఛార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకునే విషయంలో ట్రయల్ కోర్టు అన్ని విషయాలూ చూసిందన్నారు. విచారణ ఎదుర్కొని, అక్కడ ఏది కావాలంటే అది చెప్పుకోవాలని సూచిస్తూ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నట్లు ప్రకటించారు.

ఇదీ నేపథ్యం

వాన్‌పిక్ కుంభకోణం వ్యవహారంలో సీబీఐ నమోదుచేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా దాఖలుచేసిన క్రిమినల్ ఫిర్యాదును హైదరాబాద్‌లోని సీబీఐ కోర్టు పరిగణనలోకి తీసుకోవడాన్ని సవాలు చేస్తూ వాన్‌పిక్ సంస్థ తొలుత తెలంగాణ హైకోర్టును ఆశ్రయించింది. వారి వాదనలను విన్న హైకోర్టు... ట్రయల్‌కోర్టు ముందున్న క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను కొట్టేస్తూ 2022 జులై 28న తీర్పుచెప్పింది. ఆ ఉత్తర్వులను సీబీఐ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. దానిపై విచారించిన జస్టిస్ సుందరేష్, జస్టిస్ రాజేష్ బిందల్‌లతో కూడిన ధర్మాసనం వాన్‌పిక్‌కు అనుకూలంగా హైకోర్టు ఇచ్చిన తీర్పును కొట్టేసి కేసును మళ్లీ మొదటినుంచి విచారించాలని హైకోర్టును ఆదేశిస్తూ 2025 మార్చి 25న తీర్పు వెలువరించింది. ట్రయల్ ప్రొసీడింగ్స్ దశాబ్దం నుంచి పెండింగ్‌లో ఉన్న విషయాన్ని దృష్టిలో ఉంచుకొని హైకోర్టు నాలుగు నెలల్లోపు ఈ పిటిషన్‌పై విచారణ ముగించాలని నిర్దేశించింది. ఆ ఉత్తర్వులను అనుసరించి తెలంగాణ హైకోర్టు మరోసారి వాన్‌పిక్ పిటిషన్‌పై విచారించి దాన్ని కొట్టేస్తూ 2025 ఆగస్టు 26న తీర్పు చెప్పింది. ఆ తీర్పును సవాలు చేస్తూ వాన్‌పిక్ సంస్థ గత ఏడాది అక్టోబరు 28న దాఖలుచేసిన పిటిషన్‌పై విచారించిన సుప్రీంకోర్టు ధర్మాసనం మంగళవారం కొట్టేసింది.



చేసే పనిని ప్రేమించండి

మనం చేసే పనిని ప్రేమించడమే గొప్ప పని చేయడానికి ఏకైక మార్గం. దాని ప్రయోజనంపై అవగాహన కలిగి ఉంటే ఆ కార్యం మనకు భారం అనిపించదు. ప్రభావవంతమైన వ్యక్తులు తమ విధుల పట్ల అత్యంత శ్రద్ధ వహిస్తారు. వాటిని రోజూ మెరుగుపరుస్తూ ఆ పనుల్లో లీనమవుతుంటారు. కఠిన పరిస్థితుల్లోనూ అదే వైఖరి కొనసాగిస్తారు. అర్థవంతమైన విధుల నిర్వహణకు ఇదే నిదర్శనం.

– వివేక్ బింద్రా, వ్యాపారవేత్త

ద్విచక్ర వాహనంపై మృతదేహం తరలింపు

- బాపట్ల జిల్లాలో ఘటన



నాగేశ్వరరావు మృతదేహాన్ని ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న కుటుంబ సభ్యులు

బాపట్ల, కర్లపాలెం, న్యూస్‌టుడే: మృతదేహం తరలింపునకు పేదరికం శాపమైంది. చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో అందుబాటులో ఉన్న బైక్‌పైనే మృతదేహాన్ని ఆసుపత్రి నుంచి ఇంటికి తీసుకెళ్లారు. బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం చింతాయపాలెం పంచాయతీ రాళ్ల చెరువు వద్ద నివాసం ఉంటున్న నక్కా నాగేశ్వరరావు(55)కు మంగళవారం ఉదయం గుండెనొప్పి వచ్చింది. కుటుంబ సభ్యులు ద్విచక్రవాహనంపై బాపట్ల ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతదేహాన్ని తరలించడానికి ఆసుపత్రిలో మహాప్రస్థానం వాహనాలు లేవు. కుటుంబ సభ్యులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు. ఆటోలో తీసుకెళ్లాలన్నా రూ.3 వేల నుంచి రూ.4 వేలు వెచ్చించాల్సి రావడంతో అంత ఇచ్చే ఆర్థిక స్థోమత లేక.. మృతదేహాన్ని ద్విచక్ర వాహనంపైనే 12 కి.మీ. దూరంలోని స్వగ్రామానికి తరలించారు. మృతదేహాన్ని బైక్‌పై తరలిస్తుండగా స్థానికులు కొందరు ఫొటో తీసి సామాజిక మాధ్యమాల్లో ఉంచటంతో మంగళవారం అది వైరల్ అయింది. ఘటనపై కలెక్టర్ వినోద్‌కుమార్ స్పందించి సమగ్ర విచారణకు ఆదేశించారు. బాపట్ల ప్రాంతీయ ఆసుపత్రికి మహాప్రస్థానం వాహనాన్ని మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తున్నామన్నారు.

అక్కడెక్కడో... మునిగిపోకుండా..!!



ఓటీపీ రాలేదు.. ఎవరితోనూ పంచుకోనూలేదు.. అయినా కార్డు నుంచి సొమ్ము మాయమైంది. అదికూడా విదేశీ లావాదేవీలో.. ఇదీ ప్రస్తుతం క్రెడిట్‌కార్డుహోల్డర్ల పరిస్థితి. ఇలా జరగకూడదంటే మనమేం చేయాలి?

- మన దేశం నుంచి జరిగే కార్డుల లావాదేవీలకు రిజర్వు బ్యాంకు నిబంధనల ప్రకారం పిన్ నంబరు, ఆన్‌లైన్‌లో అయితే ఓటీపీ తప్పనిసరి.
- అయితే విదేశాల నుంచి జరగాలంటే కేవలం కార్డు నంబరు, గడువు తేదీ, సీవీవీ నంబరు వంటి వివరాలు సైట్లలో టైప్ చేస్తే సరిపోతుంది.
- అందుకే క్రెడిట్ కార్డు మోసాల్లో చాలావరకు విదేశాల నుంచే జరుగుతున్నాయి.
- ప్రైవేటు ఏజెన్సీలు తమ వద్ద ఉన్న ఖాతాదారుల వివరాలను పలువురికి విక్రయిస్తున్నాయి. ఇవి మోసగాళ్లకు చేరుతున్నాయి.
- దీంతో పాటు పలు షాపింగ్ సైట్లలో కొనుగోళ్ల సమయంలో నమోదు చేసే కార్డు సమాచారం దుర్వినియోగం అవుతోంది.
- ఆన్‌లైన్‌లో ఆటలు ఆడేందుకు, పిజ్జా, బర్గర్లు, హోటళ్లలో గదులు బుక్ చేసుకునేందుకు, వస్తువులు కొనుగోలు చేసేందుకు ఉపయోగిస్తున్నారు.
- అమెరికా, ఐర్లండ్, స్విట్జర్లాండ్, కొరియా, ఆస్ట్రేలియా దేశాల నుంచి ఈ మోసాలు చేస్తున్నారు. ఇలా నేరాలకు పాల్పడేవారిని పట్టుకోవడమూ కష్టమే.

☛ ఓ ప్రైవేటు ఉద్యోగికి ఇటీవల ఓ ఎస్ఎంఎస్ వచ్చింది. 99 ఆస్ట్రేలియన్ డాలర్ల విలువైన వస్తువులను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసినట్లు అందులో ఉంది. కొద్ది సేపటికి మరో వస్తువు కొనుగోలు చేసినట్లు సంక్షిప్త సందేశం వచ్చింది ఈ రెండింటికీ సొమ్ము తన అకౌంట్‌లో నుంచి డెబిట్ అయింది నిర్ఘాంతపోయిన ఆ ఉద్యోగి వెంటనే బ్యాంకు కాల్‌సెంటర్‌కు ఫోన్‌చేసి కార్డును బ్లాక్ చేయించారు.

☛ విజయవాడ నగరానికి చెందిన ఓ వ్యక్తి క్రెడిట్ కార్డు నుంచి రూ.6,412 ఖర్చు చేసినట్లు ఇటీవల ఎస్ఎంఎస్ వచ్చింది. వెంటనే అప్రమత్తమై బ్యాంకుకు ఫోన్‌చేసి కార్డును బ్లాక్ చేయించారు. ఒక యాప్ ద్వారా విదేశాల్లో చెల్లింపులు చేసినట్లు తర్వాత తేలింది.

- క్రెడిట్ కార్డులు రాగానే.. అంతర్జాతీయ వినియోగ సదుపాయం ఉందో లేదో బ్యాంకు కస్టమర్ కేర్‌కు ఫోన్ చేసి ధ్రువీకరించుకోవాలి.
- ఒకవేళ ఉన్నట్లయితే వెంటనే ఆఫ్ చేయించాలి. దీని వల్ల దుర్వినియోగం జరగదు.
- మీ బ్యాంకు యాప్ లేదా ఇంటర్నెట్ బ్యాంకింగ్ లాగిన్‌లోకి వెళ్లి కూడా ఈ ఆప్షన్‌ను డిజేబుల్ చేసుకోవచ్చు.

ఆప్షన్‌ను డిజేబుల్ చేసుకోవాలి

- విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేనివారు తప్పనిసరిగా ఈ సదుపాయాన్ని తొలగించుకోవడం మంచిది.
- కార్డును మనం వినియోగించకపోయినా లావాదేవీలు జరిగినట్లు సందేశం వస్తే సంబంధిత బ్యాంకుకు ఫోన్ చేసి కార్డును బ్లాక్ చేయించాలి.
- అనుమానాస్పద లావాదేవీలు జరిగిన వెంటనే బ్యాంకుకు తెలిపి.. సంబంధిత పోలీస్ స్టేషనులోనూ ఫిర్యాదు చేయాలి.
- సంఘటన జరిగిన 10 రోజుల్లో బ్యాంకు దర్యాప్తు చేసి బాధితుల ఖాతాలకు సొమ్మును క్రెడిట్ చేస్తుంది.

- ఈనాడు, అమరావతి

కుక్కను కాపాడటానికి దిల్లీ నుంచి వైద్యుడు

- విశాఖలో సూది మింగిన గోల్డెన్ రిట్రీవర్
- ఎండోస్కోపీ విధానంలో తొలగింపు



సూది మింగిన కుక్క



కుక్క పొట్టలోంచి తొలగించిన సూది, దారపు రీలు

గాజువాక, న్యూస్‌టుడే: దారపు రీలు, సూదిని మింగిన తన పెంపుడు కుక్కను ఎలాగైనా కాపాడాలని వేడుకున్న ఓ వ్యక్తి వేదన నిపుణుడ్ని దిల్లీ నుంచి విశాఖ రప్పించింది. శస్త్రచికిత్స ఫలించడంతో ఆఖరికి శునకం ప్రాణాలకు ముప్పు తప్పింది. విశాఖలో గోల్డెన్ రిట్రీవర్ జాతికి చెందిన పెంపుడు కుక్క (3) కొన్ని రోజులుగా తీవ్ర ఇబ్బంది పడుతుండటంతో దాని యజమాని గురువారం (5వ తేదీ) ఓ పెట్‌డాగ్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుడు డాక్టర్ శ్రీధర్ ఎక్స్‌రే తీసి కుక్క పొట్టలో దారపు ఉండ, సూది ఉన్నట్లు గుర్తించారు. సాధారణ శస్త్రచికిత్సతో బయటకు తీద్దామంటే కుక్కకు ప్లేట్‌లెట్స్ పడిపోవడంతో సాధ్యం కాలేదు. ఎలాగైనా తన కుక్కను బతికించాలని యజమాని వేడుకోవడంతో శ్రీధర్ దిల్లీలో ఉన్న తన మిత్రుడు, స్పెషలిస్ట్ వెటర్నరీ డాక్టర్ విక్రమ్ మల్హోత్రకు పరిస్థితి వివరించారు. ఆయన అవసరమైన పరికరాలతో విమానంలో శుక్రవారం మధ్యాహ్నం విశాఖ చేరుకున్నారు. అదే రోజు ఎండోస్కోపీ విధానంలో 45 నిమిషాలు శ్రమించి కుక్క పొట్టలో నుంచి సూది, దారపు రీలును విజయవంతంగా తొలగించారు. మరణం అంచులదాకా వెళ్లిన తన శునకానికి పునర్జన్మ ఇవ్వడంతో యజమాని ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి.

చదువుకునే వయసులో ప్రేమ పేరిట జీవితాన్ని నాశనం చేసుకోవద్దు

• మద్రాసు హైకోర్టు వ్యాఖ్య

చెన్నై (ప్యారిస్), న్యూస్‌టుడే: చదువుకునే వయసులో ప్రేమలో పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని మద్రాసు హైకోర్టు పేర్కొంది. తమిళనాడులోని కళ్లక్కురిచ్చికి చెందిన ఓ మహిళ దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. సేలం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో చదువుకుంటున్న తన 17 ఏళ్ల కుమార్తె కనిపించడం లేదని జనవరి 19న పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని సదరు మహిళ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ వ్యాజ్యం న్యాయమూర్తులు జస్టిస్ వేల్‌మురుగన్, జస్టిస్ జ్యోతిరామన్‌ల ధర్మాసనం ముందుకు మంగళవారం విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా 17 ఏళ్ల అమ్మాయిని పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. తనను ఎవరూ కిడ్నాప్ చేయలేదని, శరవణన్(23) అనే యువకుడిని ప్రేమించానని, ఇష్టంతోనే అతనితో వెళ్లానని ఆమె తెలిపింది. ఇంటికి వెళితే మరొకరితో పెళ్లి చేస్తారని, ప్రేమికుడితో వెళ్లేందుకు అనుమతివ్వాలని ఆ అమ్మాయి కోరింది. ధర్మాసనం స్పందిస్తూ.. చదువుకునే వయసులో ప్రేమలో పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని, జీవితాన్ని గెలిచేందుకు విద్య ఉపయోగపడుతుందని, తల్లిదండ్రులు కష్టపడేది పిల్లలు మంచి స్థితికి రావాలనేనని వ్యాఖ్యానించింది. 18 ఏళ్ల వయసు వరకు తల్లిదండ్రులు వివాహం చేయరని, నిర్బంధం చేస్తే కోర్టు లేదా పోలీసులను ఆశ్రయించాలని, చదువుపై శ్రద్ధ వహించాలని ఆ బాలికకు సూచించింది. శరవణన్‌పై పోక్సో కింద కేసు నమోదు చేసి చర్యలు చేపట్టాలని ఉత్తర్వులు ఇచ్చింది.

పుర కార్మికుల సమ్మె కాలానికి వేతనాలు

ఈనాడు, అమరావతి: గత ఏడాది జులైలో వివిధ పుర, నగరపాలక సంస్థల్లో పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ పొరుగు సేవల కార్మికులు చేసిన సమ్మె కాలాన్ని క్రమబద్ధీకరించి వారందరికీ వేతనాలు చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఈ మేరకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సమ్మె కాలం జీతం చెల్లింపులకు ఆ మేరకు సెలవు రోజుల్లో పని చేయాలన్న నిబంధన వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు.

విడాకుల కేసులో శ్రీధర్ వెంబు జవాబివ్వాలి

• మద్రాసు హైకోర్టు ఆదేశం

చెన్నై(ప్యారిస్), న్యూస్‌టుడే: తన భార్య దాఖలు చేసిన విడాకుల కేసుకు సంబంధించిన పిటిషన్‌పై జోహో సంస్థ సహ వ్యవస్థాపకుడు శ్రీధర్ వెంబు జవాబివ్వాలని మద్రాసు హైకోర్టు ఆదేశించింది. అమెరికాలోని కాలిఫోర్నియా కోర్టులో విచారణలో ఉన్న విడాకుల కేసు వ్యవహారమై సహాయం చేయాలని శ్రీధర్ వెంబుతో విడిపోయిన ఆయన భార్య ప్రమీల శ్రీనివాసన్ మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తిరునెల్వేలిలో ఉన్న శ్రీధర్ వెంబు, సంస్థ అధికారి రాధా వెంబు తదితర 10 మందికి సంబంధించిన పత్రాలు, సాక్ష్యాలను కాలిఫోర్నియా కోర్టు గతేడాది అక్టోబరు 2న వేర్వేరుగా అడిగిందని, శ్రీధర్ వెంబుతో పాటు వేళచ్చేరి, కాంచీపురం, చెంగల్పట్టులో ఉంటున్న ఆయన బంధువులు, జోహో సంస్థ అధికార ప్రతినిధుల వాంగ్మూలం నమోదు చేసి కాలిఫోర్నియా కోర్టుకు పంపేందుకు విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి లేదా అడ్వకేట్‌ను కమిషనర్‌గా నియమించాలని ఆమె కోరారు. న్యాయమూర్తి జస్టిస్ ధనపాల్ ఎదుట ఈ పిటిషన్ మంగళవారం విచారణకు రాగా.. శ్రీధర్ వెంబు, సంస్థ అధికారులు జవాబివ్వాలని ఆదేశిస్తూ విచారణను 23కి న్యాయమూర్తి వాయిదా వేశారు.

EENADU Vol: 52, Issue: 182 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

క్వాంటమ్ మాయాబంధం

కంప్యూటర్లు, సూపర్ కంప్యూటర్లను దాటుకొని ప్రపంచం శరవేగంగా క్వాంటమ్ కంప్యూటింగ్ దిశగా సాగుతోంది. అగ్రదేశాలన్నీ క్వాంటమ్ టెక్నాలజీపై ముమ్మరంగా కసరత్తు చేస్తున్నాయి. మనమేమీ తక్కువ కాదు. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో క్వాంటమ్ వ్యాలీకి శంకుస్థాపన చేయటమే దీనికి నిదర్శనం. ఇందులో త్వరలోనే ఐబీఎం హెరాన్ ప్రాసెసర్‌తో కూడిన 133 క్యూబిట్ క్వాంటమ్ కంప్యూటర్ నెలకొననుంది. మందుల ఆవిష్కరణ, మెటీరియల్ సైన్స్, ఖగోళ అన్వేషణ, ఇంధనం వంటి రంగాల్లో ఎదురవుతున్న అసాధ్యమైన సమస్యలకు అత్యంత వేగంగా పరిష్కారం చూపటం క్వాంటమ్ కంప్యూటింగ్ ప్రత్యేకత. క్వాంటమ్ ఫిజిక్స్ సూత్రాలతో పనిచేసే ఇందులో ఎంటాంగిల్‌మెంట్, సూపర్‌పొజిషన్లు అత్యంత కీలకమైన అంశాలు. ఇవేంటో తేలికగా అర్థం చేసుకునే ప్రయత్నం చేద్దాం.



'హలో బ్రదర్' సినిమా చూశారా? అందులో ఇద్దరు నాగార్జునలు ఉంటారు. వీరు కవలలు. ఒకరు సిటీలో రౌడీ, ఇంకొకరు మ్యూజిషియన్. చిత్రమేంటంటే- ఒక నాగార్జునని ఎవడైనా కొడితే, ఎక్కడో దూరంగా ఉన్న రెండో నాగార్జునకి నొప్పి పుడుతుంది. ఒకరు ఇక్కడ కూల్ డ్రింక్ తాగితే, రెండో అతనికి అక్కడ తేన్పు వస్తుంది. మధ్యలో సిగ్నల్ టవర్లు లేవు, బ్లూటూత్ లేదు, కనీసం వైర్లు లేవు. కానీ ఒకరి శరీరంలో ఏం జరిగినా రెండో వారికి ఇట్టే తెలిసిపోతుంది. ఆ సినిమాలో దీనిని 'రిఫ్లెక్స్ యాక్షన్'గా పేర్కొన్నారు. సరిగ్గా ఇదే అద్భుతం అణువుల ప్రపంచంలో జరిగితే? దాన్నే శాస్త్రవేత్తలు ముద్దుగా 'క్వాంటమ్ ఎంటాంగిల్‌మెంట్' అని పిలుస్తారు! క్వాంటమ్ ప్రపంచంలో ఇదో ఆశ్చర్యకరమైన మయాబంధం!

మ్యాజిక్ సాక్సుల ముచ్చట!

ఎంటాంగిల్‌మెంట్ గందరగోళాన్ని అర్థం చేసుకోవడానికి సరళమైన సాక్సుల ఉదాహరణ చూద్దాం. మీ దగ్గర ఒక జత సాక్సులున్నాయి. ఒకటి ఎడమ కాలిది, మరోటి కుడి కాలిది. ఇప్పుడు ఆ రెండింటిని రెండు వేర్వేరు బాక్సుల్లో ప్యాక్ చేసి, ఒక బాక్స్‌ని మీ తమ్ముడికి ఇచ్చి అమెరికా పంపేశారు. రెండో బాక్స్ మీ దగ్గరే ఉంది. క్వాంటమ్ భౌతిక శాస్త్రం ప్రకారం.. మీరు ఆ బాక్స్ తెరిచి చూసేంత వరకు, మీ దగ్గర ఉన్న సాక్సు అటు ఎడమదీ కాదు, ఇటు కుడిదీ కాదు. అది రెండూ అయి ఉంటుంది (సూపర్ పొజిషన్). కానీ, ఎప్పుడైతే మీరు బాక్స్ తెరిచి 'అరే.. ఇది ఎడమ కాలి సాక్సు' అని కన్ఫర్మ్ చేసుకుంటారో.. ఆ మరుక్షణమే అమెరికాలో ఇంకా బాక్స్ లోపలే ఉన్న మీ తమ్ముడి సాక్సు కుడి కాలి సాక్సుగా ఫిక్స్ అయిపోతుంది. ఇక్కడ మీరు చేసిన పరిశీలన అక్కడ ఉన్న వస్తువును ప్రభావితం చేసింది. క్వాంటమ్ ఎంటాంగిల్‌మెంట్ ఒక రకంగా ఇలాంటి అదృశ్య బంధమే అనుకోవచ్చు

ఐన్‌స్టీన్ షాక్

మహామేధావి ఐన్‌స్టీన్ కూడా క్వాంటమ్ స్వభావానికి ఆశ్చర్యానికి లోనయ్యారు. దీన్ని 'దూరం నుంచి జరుగుతున్న దయ్యపు చేష్ట'గా వర్ణించారు. 'ఏవండీ.. సమాచారం వెళ్లాలంటే కాంతి వేగంతోనైనా ప్రయాణించాలి కదా, గాలిలో సమాచారం ఇలా మాయలాగా ఎలా వెళ్తుంది?' అని ఆయన విస్తుపోయారు. క్వాంటమ్ ఎంటాంగిల్‌మెంట్‌లో సమాచారం ప్రత్యక్షంగా ప్రయాణించదు. ఇది కణాలు ఒకే క్వాంటమ్ స్థితిని పంచుకోవడం వల్ల ఏర్పడే సంబంధం మాత్రమే. ఇప్పుడు సైంటిస్టులు అవే విషయాలను ప్రయోగశాలలో అణువుల మీద రుజువు చేసి చూపిస్తూ క్వాంటం ఫిజిక్స్ ద్వారా వివరిస్తున్నారు!. ఈ నమ్మలేని నిజానికి 2022 భౌతిక శాస్త్ర నోబెల్ బహుమతే ప్రత్యక్షసాక్షి

క్వాంటమ్ అంటే ఏంటి?

క్వాంటమ్ అనే పదం ఏదో క్లిష్టమైన, కొరుకుడు పడని శాస్త్రీయ మాట అనిపించవచ్చు. కానీ భావం చాలా సింపుల్. మన చుట్టూ ఉన్న ఏ వస్తువునైనా ముక్కలుగా విభజిస్తూ పోతే, చివరకు ఇక మరింతగా విభజించలేని ఒక అతి చిన్న దశకు చేరుకుంటాం. ఆ చివరి, అత్యంత సూక్ష్మ స్థాయినే శాస్త్ర భాషలో క్వాంటమ్ అంటారు.

అదే అసలు వింత!

సూక్ష్మ స్థాయిలో నడిచే ఈ క్వాంటం ప్రపంచం మన సాధారణ లాజిక్‌కి పూర్తి విరుద్ధంగా ఉంటుంది. అందుకే ఇదొక మాయాజాలంలా తోస్తుంది. ఇది ఎలా ఉంటుందంటే.. జోనాథన్ స్విఫ్ట్ రాసిన గలివర్స్ ట్రావెల్స్ లోని లిల్లిపుట్ అనే బుల్లిమనుషుల ప్రపంచం గుర్తుందా? అక్కడంతా మనకంటే చిన్న మనుషులు, వింత నియమాలు, విచిత్రమైన జీవనశైలి. క్వాంటమ్ ప్రపంచం కూడా సరిగ్గా ఇంతే. పరిమాణం చిన్నది, కానీ ఆశ్చర్యాలు పెద్దవి! క్వాంటమ్ ఎంటాంగిల్‌మెంట్ అతి సూక్ష్మ స్థాయిలో, విడదీయలేని బంధంతో ముడిపడిన కణాల ప్రవర్తన. ఇది మన లాజిక్‌కి అందని ఒక అద్భుతమైన రహస్యం.

నాణెంతో గమ్మత్తు వివరణ!

క్వాంటమ్ పరిమాణంలో గల ఏ కణమైనా మనం కళ్లతో చూసేవరకూ అది ఏ స్థితిలో ఉంటుందో తెలియదు. ఇది అర్థం కావాలంటే ఒక నాణాన్ని తీసుకొని, టేబుల్ మీద గిర్రున తిప్పండి. అది తిరుగుతున్నంత సేపు బొమ్మా? బొరుసా? అనేది చెప్పలేరు. ఎందుకంటే అది రెండూ కలిసి ఉన్న ఒక మిశ్రమ స్థితిలో ఉంది. మీరు దాన్ని ఆపి చూస్తేనే బొమ్మనా? బొరుసునా? స్థిరపడుతుంది. క్వాంటమ్ కణాలూ ఇలా అన్ని అవకాశాలలో గిర్రున తిరుగుతుంటాయి. దీన్నే సూపర్ పొజిషన్ అంటారు. మనం పరిశీలించేంతవరకు వాటి గుణాలు నిర్ధారించలేం.

ఎంటాంగిల్‌మెంట్ అంటే?

సాధారణ భాషలో ముడిపడటం. విడదీయలేని బంధం. క్వాంటమ్, ఎంటాంగిల్‌మెంట్ రెండు పదాలు కలిస్తే వచ్చేదే 'క్వాంటమ్ ఎంటాంగిల్‌మెంట్'. అంటే, అతి సూక్ష్మ స్థాయిలో ఉన్న కణాలు, ఎలక్ట్రాన్లు, ఫోటాన్లు, అణువులు, పరమాణువులు ఒకదానితో ఒకటి ఒక బంధంలో ఉండటం. ఇవి ఎంత దూరంలో ఉన్నా.. ఈ చిక్కుముడి మూలంగా ఒక కణానికి ఏం జరిగినా, మరొక కణం వెంటనే స్పందిస్తుంది. అది ఎంత దూరంలో ఉన్నా కూడా.

రెండు శరీరాలు.. ఒకే ప్రాణంలా

క్వాంటమ్ ఎంటాంగిల్‌మెంట్‌ను అర్థం చేసుకోవటానికి మరో చిన్న ఉదాహరణ చూద్దాం. రెండు రిమోట్ కంట్రోల్ కార్లు ఉన్నాయనుకోండి. కానీ వాటికి ఉన్నది ఒకే రిమోట్. మీరు ఒక కారును కుడి వైపు తిప్పితే, దూరంగా ఉన్న రెండో కారు కూడా ఆటోమేటిక్‌గా కుడి వైపు తిరుగుతుంది. ఈ కారును ఆపితే, ఆ కారు కూడా ఆగుతుంది. అంటే ఒకదానితో ఒకటి లింక్ అయిపోయాయన్నమాట. ఇక్కడ రిమోట్ అదృశ్యంగా ఈ రెండింటినీ కలుపుతుందన్నమాట. అణువులు కూడా ఒకసారి ఇలా ఎంటాంగిల్ (ముడిపడి) అయితే, అవి ఎంత దూరంలో ఉన్నా ఒకేలా ప్రవర్తిస్తాయి. అదే విచిత్రం.

ఏంటీ ప్రయోజనం?

అణువుల బంధం బాగుంది కానీ, దీనివల్ల మనకేంటి లాభం? ఇదేగా మీ ప్రశ్న. అయితే కొన్ని ప్రయోజనాలను గమనించండి.

క్వాంటమ్ కంప్యూటింగ్: క్వాంటమ్ ప్రాసెసర్లు ఒకదానితో మరోదాన్ని అనుసంధానం చేయటం ద్వారా పెద్ద వ్యవస్థలు ఏర్పడేలా చేయగలదు. సంప్రదాయ కంప్యూటర్ల కన్నా అత్యంత వేగంగా సంక్లిష్ట సమస్యల పరిష్కారానికి తోడ్పడుతుంది. సాధారణ స్థాయి లెక్కలను సాధించటంలో ప్రస్తుత కంప్యూటర్లు నత్తలైతే, క్యూబిట్లతో కూడిన క్వాంటమ్ కంప్యూటర్లు చిరుతపులులు. సెకనుల్లో కోట్ల కోట్ల లెక్కలు తేల్చేస్తాయి.

హ్యాకింగ్ లేని అంతర్జాలం: మెసేజింగ్ యాప్‌ల ద్వారా మనం పంపే మెసేజీలు ఎవరైనా దొంగతనంగా చూడొచ్చు. కానీ క్వాంటమ్ టెక్నాలజీతో మెసేజ్ పంపితే ఇది సాధ్యం కాదు. ఎందుకంటే మధ్యలో ఎవరైనా దాన్ని చూడాలని ప్రయత్నిస్తే క్వాంటమ్ స్థితే మారిపోతుంది. అంటే దొంగిలించే ప్రయత్నమే సమాచారాన్ని నాశనం చేస్తుందన్నమాట. దీంతో అంతర్జాలానికి ఫుల్ సెక్యూరిటీ లభిస్తుంది. దీన్నే క్వాంటమ్ ఇంటర్నెట్ అంటారు.

ఇంటర్నెట్ వేగం: 1జీ, 2జీ, ఇప్పటి 5జీ. ఇంటర్నెట్ ప్రసార వేగం క్రమక్రమంగా పెరుగుతూ వస్తోంది. క్వాంటం ఎంటాంగిల్‌మెంట్‌తో ఇంటర్నెట్ ప్రసార వేగం అత్యధిక గరిష్ఠమైన కాంతి వేగాన్ని చేరగలదు. అంటే అనంత దూరాలకు కూడా క్షణాల్లో సమాచారాన్ని చేరవేయొచ్చు.

వినూత్న ప్రపంచం దిశగా..

అణువులు, పరమాణువుల మధ్య అదృశ్య 'ప్రేమలేఖ' లాంటి ఈ బంధం భవిష్యత్తులో మన ప్రపంచాన్ని పూర్తిగా మార్చబోతోంది. మనం చూస్తున్న ప్రపంచం మొత్తం నిజం కాదు, మనకు కనిపించని క్వాంటం ప్రపంచంలో ఒక లోతైన ప్రపంచముంది. అక్కడ దూరానికి అర్థమే లేదు. విడిపోవటం అసలే ఉండదు. కాబట్టి ఇకపై ఎవరైనా 'దూరం పెరిగితే బంధం తగ్గుతుంది' అంటే నమ్మకండి. క్వాంటమ్ ఫిజిక్స్ సాక్షిగా.. అణువులకైనా, మనుషులకైనా మనసులు 'కలిస్తే' దూరం ఒక లెక్కే కాదు! అదే క్వాంటమ్ ఎంటాంగిల్‌మెంట్ నిగూఢ రహస్యం!

– డా. మొహమ్మద్ నయీమ్, అసోసియేట్ ప్రొఫెసర్, భౌతిక శాస్త్ర విభాగం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అద్దంకి

సామ్‌సంగ్ గెలాక్సీ ఏ07 5జీ



సామ్‌సంగ్ తాజాగా గెలాక్సీ ఏ07 5జీ స్మార్ట్‌ఫోన్‌ను పరిచయం చేసింది. ఇది ఆండ్రాయిడ్ 16 ఆధారిత తాజా వన్ యూఐ 8.0 ఓఎస్, మీడియాటెక్ డైమెన్సిటీ 6300 ఆక్టాకోర్ ప్రాసెసర్‌తో పనిచేస్తుంది. 120హెచ్‌జెడ్ రిఫ్రెష్ వేగం, 800 నిట్స్ గరిష్ఠ ప్రకాశంతో కూడిన 6.7 అంగుళాల హెచ్‌డీ+ తెర, వెనకాల 50ఎంపీ మెయిన్ కెమెరా, 2ఎంపీ డెప్త్ సెన్సర్, ఎల్ఈడీ ఫ్లాష్‌తో కూడిన కెమెరా వ్యవస్థ.. ముందు సెల్ఫీలు, వీడియోల కోసం 8ఎంపీ కెమెరా, 25డబ్ల్యూ ఫాస్ట్ ఛార్జింగ్ సపోర్టు గల 6,000ఎంఏహెచ్ బ్యాటరీ వంటి ఫీచర్లతో అలరిస్తోంది. టు స్టెప్ టెంపర్డ్ గ్లాస్ రక్షణ, దుమ్ము, నీటిని తట్టుకోవటంలో ఐపీ65 రేటింగ్, ఫోన్ వెనకాల పలుచటి గ్లాస్ ఫైబర్ రీఇన్‌ఫోర్స్‌డ్ పాలీమర్ ఉన్నాయి. తీవ్ర భద్రత ముప్పులకు దారితీసే యాప్స్ ఇన్‌స్టాల్ కాకుండా చూసే ఆటో బ్లాకర్ ఫీచర్, బిల్టిన్ థెఫ్ట్ ప్రొటెక్షన్ మరో ప్రత్యేకతలు. ఆరు వరకూ ఓఎస్, ఆరేళ్ల పాటు సెక్యూరిటీ అప్‌డేట్స్ అందుతాయి. లైట్ వయొలెట్, లైట్ గ్రీన్, బ్లాక్ రంగుల్లో ఉండే ఇది రెండు రకాల్లో లభిస్తుంది. 4జీబీ ర్యామ్, 128జీబీ స్టోరేజీ రకం ధర రూ.15,999. 6జీబీ+128జీబీ రకం ధర రూ.17,999. మైక్రోఎస్‌డీ ద్వారా 2టీబీ వరకూ స్టోరేజీ పెంచుకోవచ్చు.

గెలాక్సీ ఎఫ్70ఇ 5జీ: సామ్‌సంగ్ తొలిసారిగా జెన్ జీ కొనుగోలు దారులను దృష్టిలో పెట్టుకొని గెలాక్సీ ఎఫ్70ఇ 5జీ అనే ఫోన్‌నూ తీసుకొచ్చింది. ప్రీమియం లెదర్ ప్యాటర్న్ ఫినిష్‌తో ఆకర్షిస్తున్న ఇది వన్ యూ 8 ఓఎస్, మీడియాటెక్ డైమెన్సిటీ 6300 ప్రాసెసర్‌తో పనిచేస్తుంది. ఆరు జనరేషన్ల వరకూ ఓఎస్, ఆరేళ్ల పాటు సెక్యూరిటీ అప్‌డేట్స్ అందుతాయి. 120హెచ్‌జెడ్ రిఫ్రెష్ వేగంతో కూడిన 6.7 అంగుళాల హెచ్‌డీ+ డిస్‌ప్లే, వెనకాల 50ఎంపీ మెయిన్ కెమెరా, సెకండరీ డెప్త్ కెమెరా.. ముందు సెల్ఫీల కోసం 8 ఎంపీ కెమెరా, 6,000ఎంఏహెచ్ బ్యాటరీ, 25డబ్ల్యూ ఛార్జింగ్ సపోర్టు వంటి ఫీచర్లున్నాయి. లైమ్‌లైట్ గ్రీన్, స్పాట్‌లైట్ బ్లూ రంగుల్లో కనువిందు చేస్తున్న ఇది రెండు రకాల్లో లభిస్తుంది. 4జీబీ+128జీబీ రకం ధర రూ.12,499. 6జీబీ+128జీబీ రకం ధర రూ.13,999. ఫిబ్రవరి 17 నుంచి అమ్మకాలు ఆరంభం.



స్పోటిఫైలో గీతానువాదం

పాట మధురంగా ఉంది. కానీ పరాయి భాష. అదేంటో అర్థం కావటం లేదు. దాని భావమేంటో తెలియటం లేదు. ఇలాంటప్పుడే పాట అనువాదం ఉంటే బాగుంటుందని అనిపిస్తుంటుంది. స్పోటిఫై ఇప్పుడు అలాంటి పనే చేసింది. ఉచిత, ప్రీమియం చందాదారులు అందరికీ ప్రపంచవ్యాప్తంగా గీతం అనువాదాలను అందుబాటులో తెచ్చింది. లిరిక్స్ కార్డు మీద ట్రాన్స్‌లేటర్ గుర్తును తాకితే అసలు పాట కింద టెక్స్ట్ అనువాదం కనిపిస్తుంది. పరికరం లాంగ్వేజ్ సెటింగ్స్‌ను బట్టి అనువాదం ఆధారపడి ఉంటుంది. కావాలంటే ఎప్పుడైనా అసలు లిరిక్స్‌కు మారిపోవచ్చు.



- ఆఫ్‌లైన్ లిరిక్స్ సపోర్టునూ స్పోటిఫై తీసుకొస్తోంది. యూజర్లు ఆఫ్‌లైన్‌లో వినటానికి పాటను డౌన్‌లోడ్ చేసుకున్నప్పుడు దాంతో పాటు లిరిక్స్ కూడా సేవ్ అవుతాయి. అంటే ప్రీమియం చందాదారులు అంతర్జాల కనెక్షన్ లేకపోయినా లిరిక్స్‌ను యాక్సెస్ చేయొచ్చన్నమాట. ప్రయాణాల్లో, అంతర్జాల సేవలు అందుబాటులో లేని ప్రాంతాల్లో ఇది బాగా ఉపయోగపడుతుంది.
- నౌ ప్లేయింగ్ వ్యూలో లిరిక్ ప్రివ్యూల కోసం కొత్త డిజైన్‌నూ స్పోటిఫై తీసుకొచ్చింది. ఆల్బమ్ ఆర్ట్‌వర్క్ లేదా కాన్వాస్ క్లిప్స్ కింద లిరిక్స్ నౌ నేరుగా కనిపిస్తుంది. దీంతో శ్రోతలు పాటను వింటున్నప్పుడు దాన్ని అనుసరించటం తేలికవుతుంది.

ఆ ఫొటోలు భద్రంగా..

స్మార్ట్‌ఫోన్ చేతిలో ఉంటే ఫొటోలు తీయకుండా ఉంటామా? జ్ఞాపకాలను పదిల పరచుకోవటానికి ఇప్పుడు అందరికీ ఇదే తేలికైన పరికరంగా మారిపోయింది. అయితే అన్ని ఫొటోలనూ అందరితో పంచుకోలేం కదా. కొన్ని వ్యక్తిగతమైనవీ ఉంటాయి. కొన్నింటిని రహస్యంగా ఉంచాల్సి రావొచ్చు. మరి మన ఫోన్‌ను ఎవరికైనా ఇచ్చినప్పుడు అవి వారి కంట పడకుండా చూసుకోవటమెలా? ఫోన్‌లో ప్రి ఇన్‌స్టాల్ అయిన యాప్స్‌తోనే వీటిని కాపాడుకోవచ్చు.

ఆండ్రాయిడ్ ఫోన్లలో

చాలా ఆండ్రాయిడ్ ఫోన్లు గూగుల్ ఫొటోస్‌తో వస్తాయి. ఫొటోలను ఇతరులకు కనిపించకుండా చూసుకోవటానికి దీనిలోని లాక్డ్ ఫోల్డర్ ఫీచర్ మంచి సదుపాయం.

- గూగుల్ ఫొటోస్‌ను ఓపెన్ చేసి, లైబ్రరీ ట్యాబ్‌ను ఎంచుకోవాలి. యుటిలిటీస్ మెనూలోకి వెళ్తే సెటప్ లాక్డ్ ఫోల్డర్ కనిపిస్తుంది. గెట్ స్టార్టెడ్ మీద తాకి పిన్, పాస్‌వర్డ్, ఫింగర్‌ప్రింట్‌తో అథెంటికేట్ చేసుకోవాలి.
- ఇప్పుడు ఫొటోస్ విభాగంలోకి వెళ్లాలి. ఇమేజ్ మీద కాసేపు అలాగే అదిమి, ఫైల్స్ టు హైడ్ మీద తాకాలి. మూడు చుక్కల మెనూను తాకి మూవ్ టు లాక్డ్ ఫోల్డర్‌ను ఎంచుకోవాలి. (పిక్సెల్ 3, ఆపై పిక్సెల్ ఫోన్లలో కెమెరా ఇమేజెస్‌ను ఆటోమేటిగ్గా లాక్డ్ ఫోల్డర్‌లో సేవ్ చేసుకునే సదుపాయముంది.). గూగుల్ ఫొటోస్‌లో లైబ్రరీ ద్వారా యుటిలిటీస్‌లోకి వెళ్లి ఈ లాక్డ్ ఫోల్డర్‌ను చూసుకోవచ్చు. లాగిన్ అయ్యి అందులోని ఫొటోలను యాక్సెస్ చేయొచ్చు.
- అథెంటికేషన్ వివరాలను మరచిపోవద్దు. ఎందుకంటే సెటింగ్స్‌లో బ్యాకప్ చేసుకుంటే తప్ప లాక్డ్ ఫోల్డర్ సింక్ కాదు. ఆన్‌లైన్‌లో బ్యాకప్ చేయకపోతే గూగుల్ ఫొటోస్‌ను అన్‌ఇన్‌స్టాల్ చేసినా, పరికరాన్ని రీసెట్ చేసినా డేటాను కోల్పోయే ప్రమాదముంది.



ఐఫోన్‌లో

ఐఫోన్లలోనైతే ఫొటోస్ యాప్‌లో బిల్టిన్‌గానే హిడెన్ ఆల్బమ్ ఉంటుంది. దాచుకోవాలనుకునే ఇమేజ్‌ను ఎంచుకొని షేర్ బటన్ (బాణంతో కూడిన చదరం) మీద తాకాలి. కిందికి స్క్రోల్ చేస్తే హైడ్ ఆప్షన్ కనిపిస్తుంది. హైడ్ ఫొటో మీద తాకి కన్ఫర్మ్ చేసుకోవాలి.

- ఈ హిడెన్ ఆల్బమ్‌ను చూడాలంటే- ఫొటోస్ యాప్ ఓపెన్ చేసి, ఆల్బమ్స్‌లోకి వెళ్లాలి. కిందికి స్క్రోల్ చేసి యుటిలిటీస్ విభాగంలోకి వెళ్తే హిడెన్ ఆల్బమ్ కనిపిస్తుంది. ఫేస్ ఐడీ, టచ్ ఐడీ లేదా పాస్‌కోడ్‌తో అథెంటికేట్ చేసుకోవాల్సి ఉంటుంది. ఐక్లౌడ్ ఫొటోస్ ఎనేబుల్ అయినప్పుడు హిడెన్ ఫొటోస్ మీ ఐక్లౌడ్ బ్యాకప్‌లో భద్రంగా ఉంటాయి.



ఆరోగ్యానికో వాచ్

యాపిల్ వాచ్ కేవలం అడుగులు లెక్కించటానికి, గంటకోసారి కుర్చీలోంచి లేచేలా సూచించటానికి మాత్రమే కాదు. సరిగ్గా వాడుకుంటే ఆరోగ్య చిత్రాన్ని సమగ్రంగా కళ్లకు కడుతుంది. వాచ్‌లోని ఫీచర్ల గొప్పతనం అలాంటిది. వీటిల్లో కొన్నింటి గురించి తెలుసుకుందాం.

నిద్ర తీరుతెన్నులు: చాలామంది బాగానే నిద్రిస్తున్నామని అనుకుంటుంటారు. కానీ డేటాను చూస్తే తెలుస్తుంది అదెంత నిజమో. యాపిల్ వాచ్‌ను చేతికి ధరించి పడుకుంటే దీనిలోని స్లీప్ యాప్ రంగంలోకి దిగుతుంది. ఎంతసేపు నిద్రిస్తున్నారు? ఎంత గాఢంగా నిద్రిస్తున్నారు? అనే వాటిని పసిగట్టి డేటా రూపంలో అందిస్తుంది. స్లీప్ షెడ్యూల్, లక్ష్యాన్ని సెట్ చేసుకుంటే ఇటీవలి కాలంలో నిద్ర తీరుతెన్నులను తేలికగా సమీక్షించుకోవచ్చు. నిద్ర తీరుతెన్నులనూ ఇది తెలియజేస్తుంది. ఆలస్యంగా పడుకోవటం, మానసిక ఒత్తిడి వంటివి నిద్ర డేటాలో కనిపిస్తాయి. యాపిల్ వాచ్ బేస్‌లైన్‌ను అనుసరిస్తుంది. అందువల్ల ఊహించి చెప్పటం కన్నా మార్పులను స్పష్టంగా చూపిస్తుంది.

గుండె మీద కన్ను: యాపిల్ వాచ్‌లో యూజర్లను బాగా ఆకట్టుకునేవి గుండె ఆరోగ్యాన్ని పసిగట్టే ఫీచర్లు. గుండె వేగం అసాధారణంగా పెరిగినా, తగ్గినా నోటిఫికేషన్స్ పంపిస్తుంది. ఇవి గుండె లయ తప్పటానికి (ఏట్రియల్ ఫిబ్రిలేషన్) సంకేతాలు కావొచ్చు. ఒకవేళ అప్పటికే ఏట్రియల్ ఫిబ్రిలేషన్ గలవారికైతే ఎప్పుడెప్పుడు గుండె లయ తప్పుతుందో కచ్చితంగా చూపిస్తుంది. మీ గుండె పని చేస్తున్న తీరును గమనిస్తూ అదేపనిగా ఏవైనా తేడాలు కనిపిస్తుంటే వెంటనే అప్రమత్తం చేస్తుంది. గుండె సామర్థ్యం తగ్గుతున్నట్టయితే ఆ విషయాన్ని చెబుతుంది.

ఆరోగ్య సంకేతాలు: వైటల్స్ యాప్ అత్యంత శక్తిమంతమైంది. వాచ్‌ను ధరించి పడుకుంటే రాత్రంతా నిద్ర, గుండె వేగం, శ్వాస వేగం, మణికట్టు వద్ద ఉష్ణోగ్రతలో వ్యత్యాసాలు, రక్తంలో ఆక్సిజన్ మోతాదుల వంటి వాటిని గమనిస్తూ వస్తుంది. క్రమంగా ఇవి ఎంత మోతాదుల్లో ఉంటున్నాయో కనిపెడుతుంది. వీటిల్లో చాలా మార్పులు వస్తున్నట్టయితే, వాటన్నింటినీ క్రోడీకరించుకొని నోటిఫికేషన్ రూపంలో చెబుతుంది. జబ్బులు, మందులు, ఇతర అంశాలేవైనా దీనికి కారణమవుతున్నాయేమో వివరిస్తుంది. ఇదేమీ జబ్బులను నిర్ధారించదు గానీ 'ఇది మామూలుగా లేదు' అని హెచ్చరిస్తుంది.



గతి తప్పకుండా: ఆరోగ్యమనేది కేవలం శారీరక లెక్కలకు సంబంధించింది కాదు. మన అభిరుచులు, అలవాట్లూ ఇందులో పాలు పంచుకుంటాయి. రోజువారీ పనుల హడావిడిలో తరచూ మరచిపోయే రోజువారీ అలవాట్లనూ యాపిల్ వాచ్ గమనిస్తుంది. ఐఫోన్‌లోని హెల్త్ యాప్‌లో యాడ్ చేసుకున్న మందుల జాబితాను వాచ్ కనిపెడుతుంది. ఎప్పుడెప్పుడు ఏయే మందులు వేసుకోవాలో గుర్తుచేస్తుంది. ఇక మైండ్‌ఫుల్‌నెస్ యాప్‌లోని స్టేట్ ఆఫ్ మైండ్ ఫీచర్ భావోద్వేగాలను ట్రాక్ చేస్తుంటుంది. మూడ్, భావాలు ఎప్పుడెలా మారుతున్నాయో వివరిస్తుంది.

వ్యక్తులకు తగినట్టుగా: యాపిల్ వాచ్ హెల్త్ ఫీచర్లు అందరికీ ఒకేలా ఉండవు. ఉదాహరణకు- సైకిల్ ట్రాకింగ్ ఫీచర్‌తో మహిళలు నెలసరి డేటాను చూసుకోవచ్చు. ఎప్పుడు నెలసరి వస్తుందో, గర్భధారణకు అనువైన సమయమేంటో తెలుసుకోవచ్చు. కొన్ని వాచ్ మోడళ్లలో గుండె వేగం, మణికట్టు వద్ద ఉష్ణోగ్రత ద్వారా వీటిని మరింత మెరుగుపరిచారు కూడా. ఫలదీకరణ ఎప్పుడు జరిగే అవకాశముందో కూడా తెలుపగలదు. పరిసరాల్లో చప్పుళ్లు పెరిగితే హెచ్చరించటం, చేతులు కడుక్కోవాలని సూచించటం వంటివీ చేస్తుంది. శ్వాస తీసుకోవటంలో ఆటంకాలు ఎదురవుతుంటే అవి సమస్యలుగా మారకముందే హెచ్చరిస్తుంది.

ఏఐ బాట్లతో జాగ్రత్త సుమా!

కృత్రిమ మేధ (ఏఐ) శరవేగంగా విస్తరిస్తోంది. రోజువారీ ముచ్చట్లు, పనులు, సృజనాత్మకత కోసం ఎంతోమంది దీని సాయం తీసుకుంటున్నారు. చాట్‌జీపీటీ, జెమినై, పర్‌ప్లెక్సిటీ వంటి ఏఐ మోడళ్లు రోజువారీ జీవితంలోకి చొచ్చుకొచ్చాయి కూడా. వీటి అధునాతన ఫీచర్లు కొంతకాలం ఉచితంగానూ అందుబాటులో ఉంటున్నాయి. ఇవి మనుషుల మాదిరిగా స్పందించటం, అడిగిన వాటికి జవాబులు ఇవ్వటం చాలామందిని ఆకట్టుకుంటోంది. జబ్బులు, చికిత్సల సలహాల కోసమూ వీటిని వాడుకుంటున్నారు. అయితే ఏఐ బాట్లతో అన్ని విషయాలను పంచుకోవటం తగదు. ముఖ్యంగా కొన్ని సమాచారాల పట్ల చాలా జాగ్రత్తగా ఉండాలి.

ఉద్యోగం, కంపెనీ సమాచారం


పనిచేసే చోట ఉద్యోగులు చాట్‌జీపీటీని వాడిన తర్వాత కంపెనీ రహస్య సమాచారం లీక్ అయిన సందర్భాలు కోకొల్లలు. మీ కంపెనీ డేటా మీది కాదని గుర్తించాలి. చాట్‌జీపీటీ వాడకంపై చాలా కంపెనీలు ఉద్యోగులను హెచ్చరించాయి. కొన్నిచోట్ల చాట్‌జీపీటీ వాడకాన్ని నిషేధించాయి కూడా. రహస్య సమాచారం లీక్ అయితే కంపెనీకే కాదు, మీకూ ఇబ్బంది తప్పదు.

న్యాయ సలహాలు

లాయర్లకు, చట్టపరమైన వివాదాల పరిష్కారానికి ఏఐ చాట్‌బాట్లు ప్రత్యామ్నాయం కావు. అందువల్ల కేసులకు సంబంధించిన వివరాల కోసం వీటి సాయం తీసుకోవద్దు. మీరు అందించిన సమాచారం బయటకు పొక్కితే కేసులో మీరు అనుసరిస్తున్న విధానానికి హాని కలగొచ్చు.

పర్సనల్ డేటా

మీ పేరు, చిరునామా, ఫోన్ నంబరు, సహోదరుల పేర్ల వంటివి ఏఐ బాట్లకు చెప్పొద్దు. ఇలాంటి వ్యక్తిగత సమాచారం దుర్వినియోగమయ్యే ప్రమాదముంది. సైబర్ నేరగాళ్లు మీ వ్యక్తిగత ఖాతాల్లోకి చొరబడొచ్చు. మీ మాదిరిగా నటించి మోసాలకు పాల్పడొచ్చు.



పాస్‌వర్డ్‌లు

ఖాతాల యూజర్ నేమ్, పాస్‌వర్డ్‌ల వంటి లాగిన్ వివరాలను చాట్‌బాట్‌కు వెల్లడించొద్దు. పేరు షేర్ చేయటం కన్నా ఇది మరింత ఎక్కువ ప్రమాదకరం. పాస్‌వర్డ్‌లను గుర్తుంచుకోవటం అన్నింటికన్నా ఉత్తమం. అవసరమైతే పాస్‌వర్డ్ మేనేజర్‌ను వాడుకోవాలి.

ఆర్థిక వివరాలు

బ్యాంకు ఖాతా సంఖ్య, క్రెడిట్, డెబిట్ కార్డుల వివరాలను అసలే షేర్ చేయొద్దు. ఇది చాలా చాలా ప్రమాదకరం. బ్యాంకులో ఎంత మొత్తం ఉందనేదీ తెలియజేయకూడదు.

ఆరోగ్యం కోసం

వైద్య సలహాల కోసం ఇప్పుడు చాలామంది చాట్‌బాట్లను ఆశ్రయిస్తున్నారు. డాక్టర్ అపాయింట్‌మెంట్ తీసుకోవటం కన్నా ఇది తేలికగా మారిపోయింది. పెద్దవాళ్లకు, స్నేహితులకు ఫోన్ చేసి అడగటమూ మానేస్తున్నారు. మీరు షేర్ చేసిన సమాచారం మళ్లీ ఎప్పుడైనా కనిపిస్తే అది రహస్యంగా లేదనే అర్థం. నిజం మనుషుల కన్నా ఏఐ విశ్వసనీయమైంది కాదు. మీ ఆరోగ్య సమాచారం చాలా సున్నితమైంది. మీ అంగీకారం లేకుండా దాన్ని మరెవరూ అంచనా వేయటం తగదు. నిర్ధారణ అయిన జబ్బులు, వేసుకుంటున్న మందుల వంటి సమాచారాన్ని చాట్‌బాట్‌కు వెల్లడిస్తే ప్రపంచం మొత్తానికి తెలియజేసినట్టేనని అనుకోవాలి.

సృజనాత్మక పనులు

మీరు రాసిన రచనలను చాట్‌బాట్‌తో పంచుకోవటమంత బుద్ధి తక్కువ పని మరోటి లేదు. మీరు ఇచ్చిన సమాచారాన్ని లార్జ్ లాంగ్వేజ్ మోడళ్లకు శిక్షణ ఇవ్వటానికి వాడుకోవచ్చు. తమ కాపీరైట్ అంశాలతో చాట్‌బాట్లకు శిక్షణ ఇస్తున్నట్టు చాలామంది రచయితలు గుర్తించారు. కొందరు న్యాయపరమైన కేసులు ఎదుర్కోవాల్సి వచ్చింది కూడా.

సున్నిత ఇమేజెస్

మీ ఐడీ, పాస్‌పోర్టు, లైసెన్సులు, వ్యక్తిగత ఫొటోలను ఏఐ చాట్‌బాట్‌తో షేర్ చేసుకుంటే దుర్వినియోగమయ్యే ప్రమాదముంది. వాటిని డిలిట్ చేసినా ఆనవాళ్లు మిగిలే ఉంటాయి. నేరగాళ్లు శృంగార పరమైన కంటెంట్ కోసమూ వాడుకోవచ్చు. అసహ్య, ఉపద్రవకరమైన కంటెంట్‌ను ఏఐ ఫ్లాగ్, బ్లాక్ చేసినప్పటికీ సిస్టమ్ లాగ్స్‌లో దాని ఆనవాళ్లు ఉండిపోతాయి. కాబట్టి రహస్యంగా ఉంచుకోవాల్సిన ఇమేజెస్‌ను చాట్‌బాట్లతో పంచుకోవద్దు.

క్యారికేచర్ హవా!



చాట్‌జీపీటీ క్యారికేచర్లు ఇప్పుడు ఏఐ ట్రెండ్‌గా మారాయి. ప్రధానంగా తమ ఉద్యోగ నేపథ్యంతో క్యారికేచర్లను సృష్టించుకోవటానికి ఇష్టపడుతున్నారు. మీరూ ఓసారి ప్రయత్నిస్తారా? ముందుగా మీ క్లోజప్ ఫొటోను చాట్‌జీపీటీలో అప్‌లోడ్ చేయండి. ఫొటో మసకగా ఉండకూడదు. ముఖంలో హావభావాలు సహజంగా ఉంటే మంచిది. ఎలాంటి క్యారికేచర్ కావాలో నిర్ణయించుకోండి. ఇది మీరు అందించే ప్రాంప్ట్‌తో ముడిపడి ఉంటుంది. చాలామంది వాడుతున్న ప్రాంప్ట్ ఇదీ.. "Create a caricature of me and my job based on everything you know about me." మీ గురించి అప్పటికే చాట్‌జీపీటీకి తెలిసి ఉన్నట్టయితే ఈ ప్రాంప్ట్ బాగా ఉపయోగపడుతుంది.

ఈనాడు సినిమా

కథాచర్చలు తుదిదశలో


పవన్ కల్యాణ్

అన్నీ అనుకున్నట్లుగా సాగితే ఉగాది రోజునే పవన్‌కల్యాణ్ - సురేందర్ రెడ్డి కలయికలో సినిమా ప్రారంభమయ్యే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఆ సినిమాకి సంబంధించిన కథ చర్చలు తుదిదశకు చేరుకున్నట్టు తెలుస్తోంది. పూర్తిస్థాయిలో స్క్రిప్ట్‌ని సిద్ధం చేసిన దర్శకుడు సురేందర్ రెడ్డి, రచయిత వక్కంతం వంశీ కలిసి పవన్ కల్యాణ్‌కి కథ చెప్పే పనిలో ఉన్నారు. మరోవైపు ఈ సినిమా కోసం కథానాయిక ఎంపికపైనా చిత్రబృందం దృష్టిపెట్టినట్టు సమాచారం. ప్రభాస్ సరసన 'ఫౌజీ' సినిమాలో నటిస్తున్న ఇమాన్వీ పేరు చిత్రబృందం పరిశీలనలో ఉన్నట్టు ప్రచారం సాగుతోంది. రామ్ తాళ్లూరి నిర్మిస్తున్న ఈ సినిమాపై త్వరలోనే మరింత స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి.


ఆ ఆరోపణలు అవాస్తవం


అల్లు అర్జున్

అల్లు అర్జున్ ఎంతో హుందాగా... అందరితోనూ ఎంతో గౌరవపూర్వకంగా మెలగుతుంటారని, ఆయనపై ప్రచారమవుతున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమంటూ ఆయన బృందం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. నిరాధారమైన ఆరోపణలు చేసిన వ్యక్తులపై న్యాయపరమైన చర్యలు తీసుకొనేందుకు తమ న్యాయ బృందం ఉపక్రమించినట్టు అందులో తెలిపింది. ఇటీవల విదుదలైన ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో కావేరీ బాజ్వా అనే ఓ బ్రాండ్ స్ట్రాటజిస్ట్ మాట్లాడుతూ అల్లు అర్జున్‌తో ప్రకటనల్ని చిత్రీకరించేటప్పుడు 42 రకాల నిబంధనల్ని పాటించాల్సి ఉంటుందంటూ వ్యాఖ్యలు చేసింది. అవి సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఆ వ్యాఖ్యల్ని ఖండిస్తూ అల్లు అర్జున్ బృందం ఓ ప్రకటనని విడుదల చేసింది.

"జాతిరత్నాలు'తో పోలిస్తే 'ఫంకీ' చాలా కొత్తగా ఉంటుంది"న్నారు దర్శకుడు కేవీ అనుదీప్. దర్శకుల జీవితాల్లో జరిగే కొన్ని సంఘటనల్ని సాధారణ ప్రేక్షకులకు కూడా అర్థమయ్యేలా ఈ సినిమాలో సరదాగా చూపించామని చెప్పారు. ఇది కచ్చితంగా అన్ని వర్గాల ప్రేక్షకుల్ని మెప్పేలా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. విష్వక్ సేన్ - కయాదు లోహర్ జంటగా నటించిన ఈ 'ఫంకీ' చిత్రం ఈ నెల 13న థియేటర్లలోకి రానున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు దర్శకుడు అనుదీప్.

నేనెందుకు ఈ పని చేస్తున్నానా అనిపిస్తుంటుంది!


అనుదీప్

"ఇది కుటుంబ సమేతంగా చూడదగ్గ మంచి రొమాంటిక్ ఎంటర్‌టైనర్. ట్రైలర్ చూసి దీన్ని కొందరు 'జాతిరత్నాలు'తో పోలుస్తున్నారు కానీ, ఇది దానికి పూర్తి భిన్నంగా ఉంటుంది. ఓ యువ దర్శకుడి చుట్టూ తిరిగే కథ ఇది. నిజ జీవితంలో ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యే సీన్స్ చాలా ఉంటాయి. అలాగే ప్రేమకథతో పాటు బలమైన కుటుంబ భావోద్వేగాలతో నిండి ఉంటుంది. నా సినిమాల్లో కామెడీ ఎక్కువ ఉంటుంది కాబట్టి లాజిక్ ఉండదని కొందరికి అనిపించొచ్చు. కానీ, నా ప్రతి సినిమాలోనూ లాజిక్ కచ్చితంగా ఉంటుంది. నేను ఈ కథ రాసుకున్నప్పుడే దీనికి విష్వక్ సేన్ అయితేనే బాగుంటుందని అనుకున్నా. 'ఈ నగరానికి ఏమైంది' చిత్రంలో తన కామెడీ టైమింగ్ నాకు చాలా ఇష్టం. ఈ సినిమాలో తను దర్శకుడిగా అందర్నీ అలరిస్తారు. ఇందులో ఫన్, ఫ్యామిలీ ఎమోషన్స్‌తో పాటు మంచి సందేశం కూడా ఉంది".

■ "జయాపజయాలు సహజం. ఓ దర్శకుడిగా ప్రతిసారీ ఓ మంచి సినిమా తీయాలనే సంకల్పంతోనే శాయశక్తులా కృషి చేస్తుంటా. కాకపోతే 'ప్రిన్స్' స్క్రిప్ట్ సిద్ధం చేయడానికి అప్పుడు తగిన సమయం లేకపోవడం వల్ల ఫలితం దెబ్బ కొట్టింది. ఇందుకే ఈసారి తగిన సమయం తీసుకుని ఎంతో జాగ్రత్తగా 'ఫంకీ' స్క్రిప్ట్‌ను సిద్ధం చేశా. దర్శకుడు త్రివిక్రమ్ ఇటీవలే ఈ సినిమా చూశారు. ఆయనకు చాలా నచ్చింది. కొన్ని విలువైన సూచనలు చేశారు. ఈతరం అభిరుచులకు తగ్గట్లుగా ఉండాలనే క్యాచీగా 'ఫంకీ' అనే పేరును ఖరారు చేశాం. దీంట్లో హీరో పాత్ర కూడా ఆ పేరుకు తగ్గట్లే ఉంటుంది. ఇందులో కొన్ని సర్‌ప్రైజ్‌లు కూడా ఉన్నాయి. దర్శకులు హరీశ్ శంకర్, కల్యాణ్ శంకర్, నిర్మాతలు దిల్‌రాజు, నాగవంశీ అతిథి పాత్రల్లో కనిపిస్తారు. వాళ్ల పాత్రలన్నీ కథలో భాగంగానే వస్తాయి. సహజమైన సంభాషణలతో హాస్యాన్ని పండిస్తాయి".

■ "మనం సృష్టించే ప్రపంచం, పాత్రలు నిజ జీవితానికి దగ్గరగా ఉండాలి. హాస్య సన్నివేశాల్లో సహజత్వం ఉట్టిపడాలి. అప్పుడే ఎలాంటి వినోదాత్మక చిత్రమైనా ప్రేక్షకులకు చేరువవుతుందని నమ్ముతా. నాకు నటన కన్నా దర్శకుడిగా సినిమాలు చేయడమంటేనే ఇష్టం. నటుడిగా కారవాన్‌లో కూర్చున్నప్పుడు చాలా ఇబ్బందిగా ఫీలవుతుంటా. నేనెందుకు ఈ పని చేస్తున్నానా అనిపిస్తుంటుంది. నాకు హారర్, యాక్షన్.. ఇలా విభిన్న జానర్లు టచ్ చేయాలని ఉంది. ప్రేక్షకులకు చెప్పాల్సిన కథలు చాలానే ఉన్నాయి. ఇకపై నా నుంచి వచ్చే ప్రతి సినిమాలోనూ ఓ మార్పు చూస్తారు. ప్రస్తుతం నా తదుపరి సినిమా కోసం ఓ నాయికా ప్రాధాన్య కథను రాస్తున్నా. అలాగే వెంకటేశ్ కోసం ఓ కథ సిద్ధం చేస్తున్నా. అది భావోద్వేగాలతో నిండి ఉంటుంది".

జానపద గీతంలో తమన్నా?



ఓ వైపు మహిళా ప్రాధాన్య కథలు.. మరోవైపు ప్రత్యేక పాటలు.. ఇలా వచ్చిన ప్రతి అవకాశాన్ని అందుకుంటూ ప్రేక్షకుల్ని అలరిస్తోంది కథానాయిక తమన్నా. ఆమె, బాలీవుడ్ కథానాయకుడు సిద్ధార్థ్ మల్హోత్రా ప్రధాన పాత్రల్లో 'వీవాన్' అనే చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. 'ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్'.. అనేది ఉపశీర్షిక. దీపక్ మిశ్రా, అరుణభ్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. ఇందులో భాగంగానే ఓ జానపద పాటను చిత్రీకరించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ గీతంలో తమన్నా, సిద్ధార్థ్ స్టెప్పులు అభిమానుల్ని ఆకట్టుకునేలా ఉంటాయని, త్వరలో ముంబయిలో ఈ పాట షూటింగ్ ప్రారంభం కానుందని బాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. భారతీయ పురాణాలు, జానపద కథల ఆధారంగా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నారు.

రెండో బ్యాచ్ సిద్ధం


ఫర్జీ

ఆశ మనిషిని బతికిస్తే.. అత్యాశ ఎంతవరకైనా తీసుకెళ్తుందని ఓ మంచి సందేశాన్ని ఇచ్చిన వెబ్‌సిరీస్ 'ఫర్జీ'. బాలీవుడ్ కథానాయకుడు షాహిద్ కపూర్, రాశీ ఖన్నా, విజయ్ సేతుపతి ప్రధాన పాత్రలు పోషించారు. రాజ్ అండ్ డీకే దర్శకత్వం వహించారు. తాత నెలకొల్పిన పత్రికా కార్యాలయం మూతపడకుండా ఎలాగైనా దాన్ని తెరవాలని నిర్ణయించుకున్న ఓ యువకుడి కథ ఆధారంగా దీన్ని తీర్చిదిద్దారు. ఈ క్రైమ్ థ్రిల్లర్ సిరీస్ విదుదలై మంగళవారంతో మూడేళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా దీనికి కొనసాగింపుగా రెండో భాగం రాబోతున్నట్టు సామాజిక మాధ్యమాల వేదికగా ప్రకటించారు దర్శకులు. "రెండో బ్యాచ్ సిద్ధం" అనే వ్యాఖ్యను జోడించారు. రాబోయే ఈ సీక్వెల్‌లో షాహిద్ తన పాత్ర కోసం ఇప్పటికే శిక్షణ తీసుకుంటున్నారని, త్వరలో చిత్రీకరణ ప్రారంభం కానున్నట్టు తెలిపాయి సిరీస్ వర్గాలు.

ఆయన పాత్రలు ఆయన ఇష్టం

కబీర్ సింగ్.. రణ్ విజయ్ సింగ్‌తో కలిసి కనిపించాలి కానీ, షెడ్యూల్ కుదరలేదంటున్నాడు నటుడు షాహిద్ కపూర్. రణ్‌బీర్ కపూర్ హీరోగా సందీప్ రెడ్డి తెరకెక్కించిన చిత్రం 'యానిమల్'. ఆయన దర్శకత్వంలోనే షాహిద్ నటించిన చిత్రం 'కబీర్ సింగ్'. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న షాహిద్ 'యానిమల్ పార్క్'లో కబీర్ సింగ్ ఉంటాడా? అనే ప్రశ్నకు స్పందించాడు. "'యానిమల్' సినిమా చిత్రీకరణ చేస్తున్నప్పుడు దర్శకుడు సందీప్ నన్ను కలవడానికి వచ్చారు. ఆ సినిమాలో నేను కబీర్‌గా అతిథి పాత్రలో అలరించేందుకు ఓ సన్నివేశాన్ని తెరకెక్కించాలని ఆయన అనుకున్నారు. కానీ కొన్ని డేట్స్ సమస్యల కారణంగా అది కార్యరూపం దాల్చలేదు. భవిష్యత్తులో ఈ పాత్రలపై క్రాస్ ఓవర్ ఏదైనా ఉంటుందా? అంటే అది కూడా సందీప్ ఇష్టం. ఎందుకంటే.. కబీర్ సింగ్, యానిమల్ చిత్రాలలోని రెండు పాత్రలు ఆయన సృష్టించిన ప్రపంచంలోనివి. కాబట్టి సందీప్ సృష్టించిన ఈ యూనివర్స్‌లో ఈ పాత్రలతో భవిష్యత్తులో ఏం చేయాలన్నా చేస్తారు"అని షాహిద్ వెల్లడించాడు.

జిందగీ నా మిలేగీ దోబారాకి సీక్వెల్ ఉంది కానీ...!


హృతిక్ రోషన్

దాదాపు పదిహేను సంవత్సరాల క్రితం రోడ్ ట్రిప్ పేరుతో ముగ్గురు స్నేహితులు పంచిన భావోద్వేగ వినోదాల చిత్రం 'జిందగీ నా మిలేగీ దోబారా'. బాలీవుడ్ నటులు హృతిక్ రోషన్, అభయ్ దేఓల్, ఫర్హాన్ అక్తర్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాని జోయా అక్తర్ తెరకెక్కించారు. 2011లో విడుదలైన ఈ హిందీ చిత్రం ప్రేక్షకాదరణతోపాటు బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లని సాధించింది. ఎప్పట్నుంచో ఈ సినిమాకి సీక్వెల్ రానుందని వార్తలు కూడా వస్తున్న సంగతి తెలిసిందే. గతంలోనూ ఓ ఇంటర్వ్యూలో హృతిక్ ఈ సినిమాకి సీక్వెల్ వస్తుంది.. కానీ, ఎప్పుడనేది చెప్పలేమని వెల్లడించారు. అయితే తాజాగా ఈ సీక్వెల్‌కు దర్శకురాలు జోయా అక్తర్ సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. "'జిందగీ నా మిలేగీ దోబారా' సీక్వెల్ తీయాలంటే ఏదైనా కొత్తగా చెప్పడానికి ఉంటేనే ఈ ప్రాజెక్ట్ చేపట్టాలని జోయా ఎప్పుడూ అంటూ ఉండేవారు. ఆమె ఎప్పట్నుంచో ఈ సీక్వెల్‌కు సంబంధించి చేయాలనుకున్న డ్రాఫ్ట్‌ను ఇప్పుడు పూర్తి చేశారు. ఈ చిత్రాన్ని పాత జ్ఞాపకాలను తిరిగి చూపించే కొత్త కథగా కాకుండా.. ఆ ముగ్గురి పాత్రల జీవితాలలో జరిగిన మార్పుల ఆధారంగా రూపొందించాలని అనుకుంటున్నారు. ఈ సినిమాతో మొదటి చిత్రంలోని హీరోలందరినీ తిరిగి కలపాలనేదే ప్రధాన ఉద్దేశం. నటులందరి డేట్స్ సర్దుబాటైతే త్వరలోనే ఈ చిత్రం పట్టాలెక్కనుంది"అని సన్నిహిత వర్గాల సమాచారం. ఇప్పటికే జోయా ఈ సీక్వెల్ గురించి నటులతో చర్చలు చేస్తున్నట్లు సమాచారం.

నిజానికి ముందు అనుకున్న టైటిల్ ఇదే


శివ, తేజు అశ్విని

శివ కందుకూరి హీరోగా నటించిన 'చాయ్ వాలా' సినిమా ఇప్పుడు టైటిల్ మార్చుకుంది. ఇది సెన్సార్ నిబంధనలకు తగ్గట్లుగా 'నవాబ్ కేఫ్' అనే కొత్త పేరుతో ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ప్రమోద్ హర్ష దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని రాధా వి.పాపుడిప్పు నిర్మించిన సంగతి తెలిసిందే. తేజు అశ్విని కథానాయిక. రాజీవ్ కనకాల, చైతన్య కృష్ణ, రాజ్‌కుమార్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈ నెల 20న థియేటర్లలోకి రానున్న నేపథ్యంలో మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హీరో శివ కందుకూరి మాట్లాడుతూ.. "సెన్సార్ నిబంధనల్ని గౌరవిస్తూ మా 'చాయ్ వాలా' పేరును 'నవాబ్ కేఫ్'గా మార్చాం. నిజానికి ఈ కథ విన్నప్పుడు మేము తొలుత అనుకున్న పేరిదే. మా సినిమాలోని కథను, ఆత్మను తెలియజేస్తుంది. సెన్సార్ సమస్యల వల్ల ఇప్పుడు పేరు మార్చాల్సి వచ్చినా మా నిర్మాత బలంగా నిలబడ్డారు. మేమంతా ఎంతో నిజాయతీగా చేసిన చిత్రమిది. ఈ సినిమా చూసి బయటకు వచ్చాక కచ్చితంగా ప్రతి ఒక్కరూ వాళ్ల నాన్నకు ఫోన్ చేసి మాట్లాడతారు" అన్నారు. "నేను చూసిన, అనుభవించిన సంఘటనల ఆధారంగా ఈ కథ రాసుకున్నా" అన్నారు దర్శకుడు ప్రమోద్ హర్ష. ఈ కార్యక్రమంలో వెంకట్, తేజు అశ్విని తదితరులు పాల్గొన్నారు.

గిన్నీ, సన్నీ వచ్చేది వేసవిలో?


మేధా శంకర్


'ట్వెల్త్ ఫెయిల్'లో విక్రాంత్ మాస్సే సరసన కనిపించి ప్రేక్షకుల్ని అలరించింది బాలీవుడ్ కథానాయిక మేధా శంకర్. ఇప్పుడామె రెండేళ్ల విరామం తర్వాత మరో అద్భుతమైన కథతో ఆకట్టుకోవడానికి సన్నద్ధమవుతోంది. మేధ, అవినాశ్ తివారీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'గిన్నీ వెడ్స్ సన్నీ 2'. హిందీ ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకున్న 'గిన్నీ వెడ్స్ సన్నీ'కి సీక్వెల్‌గా రూపొందుతున్న సినిమా ఇది. ప్రశాంత్ ఝా దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ చిత్రాన్ని వేసవి సందర్భంగా ఏప్రిల్ 24న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. త్వరలో దీన్ని అధికారికంగా ప్రకటించే అవకాశాలున్నాయని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఈ రొమాంటిక్ డ్రామాను జీ స్టూడియోస్ నిర్మిస్తుంది.

పేరు మార్చడం సరికాదు కాబట్టే...!


సంతోశ్, మానస వారణాసి, ధీరజ్ మొగిలినేని


స్వచ్ఛమైన ప్రేమకథతో తెరకెక్కిన చిత్రమే... 'కపుల్ ఫ్రెండ్లీ' అన్నారు నిర్మాత ధీరజ్ మొగిలినేని. ఆయన ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో పంపిణీ చేస్తున్న చేస్తున్న చిత్రమిది. సంతోశ్ శోభన్, మానస వారణాసి జంటగా నటించారు. అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహించారు. యు.వి.క్రియేషన్స్ సమర్పణలో, యు.వి. కాన్సెప్ట్స్ సంస్థ తెలుగు, తమిళ భాషల్లో నిర్మించింది. ఈ చిత్రం ప్రేమికుల రోజు సందర్భంగా ఈ నెల 13న సాయంత్రం నుంచే థియేటర్లలో సందడి చేయనుంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించింది చిత్రబృందం. కథానాయకుడు సంతోశ్ శోభన్ మాట్లాడుతూ "మిత్ర, శివ జంట కలిసి చేసిన ప్రయాణమే ఈ చిత్రం. మిత్ర తనకు పరిచయమయ్యాక శివ జీవితం ఎలా మారింది? మిత్ర కోసం శివ ఎంతవరకూ వెళ్లాడన్నది తెరపైనే చూడాలి. ఈ సినిమాతో మేం ఏం చెప్పాలనుకున్నామనేది థియేటర్‌లోనే చూడాలి" అన్నారు. మానస వారణాసి మాట్లాడుతూ "ట్రైలర్ బాగుందని ఇప్పటికే అందరూ మెచ్చుకున్నారు. సమష్టి కృషి అంటే ఏమిటో ఈ సినిమాతో చూస్తార"న్నారు. ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ "బలమైన హీరో హీరోయిన్ పాత్రలైన శివ, మిత్ర... ఆ ఇద్దరి కుటుంబాల నేపథ్యంలో సాగే చిత్రమిది. పేరు మార్చాలంటూ సెన్సార్ బృందం కోరింది. అయితే ఇదే పేరుతోనే తెరకెక్కించడంతో పాటు, ప్రచారం కూడా చేశాం. ఇప్పుడు పేరు మార్చడం సరికాదనిపించింది. దాంతో సెన్సార్ బృందం 'ఏ' ధ్రువీకరణ పత్రం ఇచ్చింది. అయితే, సినిమా మాత్రం ఎక్కడా ఇబ్బంది పెట్టకుండా, స్వచ్ఛమైన భావోద్వేగాలతో సాగుతుంది. గురువారం చెన్నై, హైదరాబాద్, తిరుపతి, నెల్లూరు, విశాఖపట్నం, విజయవాడలో ముందస్తు ప్రదర్శనలు వేస్తున్నాం" అన్నారు.

యాక్షన్ 'రేజర్'


రవిబాబు


'రేజర్' సినిమాతో వేసవి బరిలో సందడి చేయనున్నారు రవిబాబు. ఆయన హీరోగా నటిస్తూ.. స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రం మేలో థియేటర్లలోకి రానుంది. ఈ విషయాన్ని మంగళవారం అధికారికంగా ప్రకటించారు. తెలుగులో ఇప్పటి వరకు చూడని వినూత్న కథతో.. పూర్తి యాక్షన్ సినిమాగా దీన్ని ముస్తాబు చేస్తున్నారు. ఇందులో రవిబాబు పాత్ర చాలా వైలెంట్‌గా కనిపించనున్నట్లు ప్రచార చిత్రాలతో అర్థమవుతోంది. ఇప్పటికే చిత్రీకరణ పూర్తయిందని.. నిర్మాణానంతర పనులు మొదలయ్యాయని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి ఎస్ఎస్ రాజేశ్ సంగీతమందిస్తుండగా.. చరణ్ మాధవనేని ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు. సురేశ్ ప్రొడక్షన్ సంస్థ సమర్పిస్తోంది.

రణ్‌వీర్‌కు బెదిరింపులు


రణ్‌వీర్ సింగ్

ప్రముఖ బాలీవుడ్ నటుడు రణ్‌వీర్‌సింగ్‌కు బెదిరింపులు వచ్చాయి. వాట్సప్ వాయిస్ నోట్ ద్వారా ఓ దుండగుడు ఆయన్ను బెదిరించి రూ.కోట్లు డిమాండ్ చేశాడు. ఈ విషయాన్ని ముంబయి పోలీసులు మంగళవారం వెల్లడించారు. ఈ బెదిరింపుల వెనుక లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ఉండొచ్చని పోలీస్ అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీంతో రణ్‌వీర్ నివాసం వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. దీంతో పాటు రణ్‌వీర్ తన వ్యక్తిగత రక్షణ సిబ్బందిని కూడా పెంచారు. ఈ నేపథ్యంలో రణ్‌వీర్ నివాసం ఉంటున్న సొసైటీకి చెందిన ప్రతినిధులు పోలీసుల్ని కలిసి ఆయుధాలతో పోలీసులు, రణ్‌వీర్ వ్యక్తిగత సిబ్బంది సొసైటీలో తిరుగుతుండటంతో అక్కడ నివాసం ఉండే వారు ఇబ్బంది పడుతున్నట్లు తెలియజేశారు. ఇటీవలే ముంబయిలోని జుహూ ప్రాంతంలో బాలీవుడ్ దర్శకుడు రోహిత్ శెట్టి ఇంటివద్ద కాల్పులు జరిగిన పది రోజుల్లోనే ఈ బెదిరింపులు రావడం పట్ల అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

మీరా దాచిన రహస్యమేంటి?


కొంకణా సేన్ శర్మ

ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ వేదికగా రాబోయే చిత్రాల జాబితాను ఇటీవలే ప్రకటించింది. ఇందులో భాగంగానే రూపొందిన నెట్‌ఫ్లిక్స్ ఒరిజినల్ చిత్రం 'అక్యూజ్డ్'. నటి, దర్శకురాలు కొంకణా సేన్ శర్మ, ప్రతిభా రంతా ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. అనుభూతి కశ్యప్ దర్శకత్వం వహించిన ఈ సినిమాని ధర్మ ప్రొడక్షన్స్ నిర్మిస్తుంది. ఇటీవల ఈ సినిమాలోని పాత్రలను పరిచయం చేస్తూ ఇన్‌స్టాలో విడుదల తేదీని ప్రకటించింది చిత్రబృందం. సైకలాజికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ సినిమా ఈ నెల 27 నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా ప్రసారం కానుంది. వృత్తిలో ఎంతో పేరుండి.. అత్యంత కఠినమైన ఓ కేసులో తన గౌరవాన్ని కోల్పోయి ఆరోపణలను ఎదుర్కొంటున్న డాక్టర్ గీతిక అనే పాత్రలో కనిపించనుంది కొంకణా. అలానే ఎప్పుడూ తన కలల ప్రపంచంలో విహరించే మీరా అనే అమ్మాయిగా కనిపించనుంది ప్రతిభ. మీరా దాచిన ఓ రహస్యం పీడకలలాగా వెంటాడుతూనే ఉంటుందనే వ్యాఖ్యలతో పోస్టర్‌లను పంచుకుంది చిత్రబృందం.



డిజిటల్ సేవల పన్నులు ఇక ఉండవా?

- భారత్ రద్దు చేస్తుందని అంటున్న అమెరికా
- అధికార ప్రకటనలో స్పష్టం చేయని మన దేశం

ఇటీవల కుదిరిన మధ్యంతర వాణిజ్య ఒప్పందం కింద డిజిటల్ సేవల పన్ను (డీఎస్‌టీ)ను భారత్ తొలగిస్తుందని అమెరికా ప్రకటించింది. ఇరు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరిన వారం రోజుల తర్వాత ఈ ప్రకటన వెలువడింది. మన ప్రభుత్వ అధికారిక ప్రకటనలో మాత్రం ఈ విషయం లేదు. ఈ నేపథ్యంలోనే డిజిటల్ సేవల పన్నును మనదేశం ఎలా విధించింది, ఇప్పుడు ఏ మేరకు ఉపసంహరించుకుంటుంది అనే అంశాలను చూస్తే..

అమెరికా ప్రకటించింది ఇదీ

వాణిజ్య ఒప్పందంపై ఫ్యాక్ట్ షీట్‌ను అమెరికా విడుదల చేసింది. డిజిటల్ సేవల పన్నులను భారత్ తొలగిస్తుందని అందులో పేర్కొంది. వివక్షపూరిత, భారమైన పన్నులను భారత్ తొలగించేలా చూసేందుకు చర్చలు జరుపుతున్నట్లూ వెల్లడించింది. ఎలక్ట్రానిక్ ట్రాన్స్‌మిషన్స్‌పై కస్టమ్స్ సుంకాలు విధించడాన్ని నిషేధించే నిబంధనలు కూడా ఉన్నాయి.

- వాణిజ్య ఒప్పందంపై భారత అధికార ప్రకటనలో డిజిటల్ సేవల పన్ను తొలగింపు గురించి స్పష్టంగా ప్రస్తావించలేదు. డిజిటల్ వాణిజ్యానికి అడ్డంకులను తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మాత్రమే తెలిపింది. ఒప్పందంలో భాగంగా డీఎస్‌టీని తొలగించనున్నట్లు చెప్పలేదు. మనదేశం ఇప్పటికే ఈక్వలైజేషన్ పన్నులను రద్దు చేసింది.

డిజిటల్ సేవల పన్నులు అంటే..

'డిజిటల్ సేవలు అందించడం ద్వారా ఒక దేశ వినియోగదారుల నుంచి విదేశీ కంపెనీలు ఆర్జించే ఆదాయంపై విధించే పన్నే' డిజిటల్ సేవల పన్ను. ఒక దేశంలో విదేశీ కంపెనీకి ఎటువంటి భౌతిక కార్యకలాపాలు లేకపోయినా, ఈ పన్ను వసూలు చేస్తారు. సాధారణంగా ఆన్‌లైన్ ప్రకటనలు, ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు, డిజిటల్ మార్కెట్‌ప్లేస్‌లు, ఇతర ఇంటర్నెట్ ఆధారిత సేవల వంటి వాటిపైనే ఈ పన్నులు ఉంటాయి. ఈ పన్నుల ప్రభావం ఎక్కువగా పడిన కంపెనీల్లో గూగుల్, మెటా, అమెజాన్, ఇతర పెద్ద టెక్నాలజీ ప్లాట్‌ఫామ్‌లు ఉన్నాయి.



- 2016 ఫైనాన్స్ చట్టం ద్వారా భారత్ ఈక్వలైజేషన్ పన్నులను తీసుకొచ్చింది. నాన్-రెసిడెంట్ కంపెనీలతో పాటు కొన్ని డిజిటల్ లావాదేవీలపై ఈ పన్నులను విధించింది. ప్రారంభంలో భారత సంస్థలకు ఆన్‌లైన్ ప్రకటన సేవలు అందించే విదేశీ కంపెనీలపై వీటిని విధించారు. 2020 ఏప్రిల్‌లో ఇ-కామర్స్ సంస్థలు అందించే వస్తువులు, సేవలకు విస్తరించారు.

అమెరికా ఎందుకు వ్యతిరేకిస్తుందంటే..

మనదేశంలో విధిస్తున్న డిజిటల్ సేవల పన్నుల వల్ల, అమెరికా కంపెనీలపై భారం పడుతోందని 2021 జనవరిలో విడుదల చేసిన నివేదికలో యూఎస్‌టీఆర్ (అమెరికా వాణిజ్య ప్రతినిధి) పేర్కొంది. ఈ రంగంలోని భారత కంపెనీలకు మినహాయింపు ఇస్తూ, ఇతర దేశాల కంపెనీలపై పన్నులు విధించడం వివక్షతో కూడుకున్న చర్యగా అభివర్ణించింది. అంతర్జాతీయ పన్ను సూత్రాలకు ఇవి వ్యతిరేకమని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ పన్నుల వల్ల అమెరికా సంస్థలపై ఏటా 30 మి.డాలర్లకు పైగా పన్నుల భారం పడే అవకాశం ఉందని యూఎస్‌టీఆర్ అంచనా వేసింది. అయితే భారత్ ఇప్పటికే ఈక్వలైజేషన్ పన్నులను రద్దు చేసింది. అంతర్జాతీయ నిబంధనలకు అనుగుణంగా దేశీయ పన్ను విధానాలను తీసుకురావడం, ప్రధాన దేశాలతో వాణిజ్య ఒత్తిళ్లను తగ్గించుకునే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది.

లాభపడే కంపెనీలివే..

పన్నుల తొలగింపుతో గూగుల్, మెటా, అమెజాన్ వంటి అమెరికా కంపెనీలు లాభపడనున్నాయి. భారత డిజిటల్ ప్రకటనల మార్కెట్లో ఈ కంపెనీల వాటా 65%. ఈ మార్కెట్ విలువ 5.82 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.52,000 కోట్లు). పన్నుల ఉపసంహరణతో ప్రకటనదారులపై ఎటువంటి అదనపు భారం ఉండదు, ఖర్చులు కూడా తగ్గుతాయి. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల మార్జిన్లు మెరుగుపడతాయి.

- ఈక్వలైజేషన్ పన్నులను తొలగించినప్పటికీ.. మన దేశంలో విదేశీ డిజిటల్ సంస్థలు పన్నుల పరిధిలోనే ఉన్నాయి. 2018లో సిగ్నిఫికెంట్ ఎకనామిక్ ప్రెజెన్స్ (ఎస్ఈపీ) నియమావళిని భారత్ తీసుకొచ్చింది. తద్వారా నాన్-రెసిడెంట్ సంస్థలపై పన్నులు విధిస్తున్నారు. అదనంగా విదేశీ, దేశీయ డిజిటల్ సేవల ప్రొవైడర్లు 18% జీఎస్‌టీ చెల్లించాలి. స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్స్, క్లౌడ్ సేవలు, సాఫ్ట్‌వేర్ సబ్‌స్క్రిప్షన్స్, ఆన్‌లైన్ గేమింగ్, డిజిటల్ ప్రకటనలకు ఇది వర్తిస్తుంది. ఈ నియమావళి కింద నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్, అడోబ్, మైక్రోసాఫ్ట్ 365 వంటి సేవలు ఉన్నాయి. – ఈనాడు వాణిజ్య విభాగం

అపోలో హాస్పిటల్స్ 200% డివిడెండ్

నికరలాభంలో 35% వృద్ధి

ఈనాడు, హైదరాబాద్: ఆరోగ్య సేవల రంగంలోని అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్, డిసెంబరు త్రైమాసికంలో రూ.502 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ఆర్జించింది. 2024-25 ఇదే కాల లాభం రూ.372 కోట్ల కంటే ఇది 35% అధికం. ఇదే సమయంలో ఆదాయం రూ.5,527 కోట్ల నుంచి 17% వృద్ధితో రూ.6,477 కోట్లకు చేరింది. కంపెనీ నిర్వహణ సామర్థ్యం మెరుగుపడటం వల్లే మార్జిన్లు పెరిగాయని సంస్థ తెలిపింది. సమీక్షా త్రైమాసికంలో ఎబిటా 27% పెరిగి రూ.967 కోట్లుగా నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-డిసెంబరులో ఆదాయం రూ.18,623 కోట్లు, నికర లాభం రూ.1,412 కోట్లుగా ఉన్నాయి. బలమైన ఫలితాల నేపథ్యంలో కంపెనీ రూ.5 ముఖ విలువ ఉన్న ఒక్కో ఈక్విటీ షేరుకు రూ.10 (200%) చొప్పున మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. ఇందుకు రికార్డు తేదీగా ఈనెల 16ను నిర్ణయించింది.

- అపోలో హాస్పిటల్స్ ఛైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి స్పందిస్తూ.. 'రోగి భద్రత, నాణ్యమైన వైద్యంపై శ్రద్ధ చూపిస్తున్నాం. అందుకు ఈ ఫలితాలే నిదర్శనం. పుణెలో కొత్త ఆసుపత్రి, చెన్నైలో పార్కిన్సన్ చికిత్స కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేశామ'ని పేర్కొన్నారు.

ఇండిగోలో అదనపు పైలట్లు

- కేబిన్ సిబ్బంది కూడా పెరిగారు
- కొత్త నిబంధనల అమలుకు డీజీసీఏ గడువు ముగిసిన నేపథ్యం

దేశీయ దిగ్గజ విమానయాన సంస్థ ఇండిగో, గత రెండు నెలలుగా పైలట్లు, కేబిన్ సిబ్బంది సంఖ్యను పెంచుకుంటూ వచ్చింది. పైలట్లకు తప్పనిసరిగా విశ్రాంతి కల్పించేందుకు రూపొందించిన నూతన నిబంధనల పాటింపు విషయంలో, ఇండిగోకు గత డిసెంబరులో ఇచ్చిన సడలింపుల గడువు మంగళవారం (ఫిబ్రవరి 10)తో ముగిసింది. ఈ నిబంధనలను పాటించాలంటే అదనపు పైలట్లను ఇండిగో కలిగి ఉండాలి. లేకుంటే డిసెంబరులో మాదిరి విమాన సర్వీసులకు అంతరాయం తలెత్తవచ్చు. ఈ నేపథ్యంలోనే పైలట్ల లభ్యతను ఇండిగో పెంచుకున్నట్లు ఓ ఆంగ్ల వెబ్‌సైట్ తెలిపింది. నూతన నిబంధనల పాటింపు కోసం ఫిబ్రవరి రోస్టర్ ప్రకారం ఒక విమానానికి సగటున 7.2 పైలట్ల బృందం ఉండగా.. జనవరిలో ఈ సంఖ్య 7.1గా ఉంది. డిసెంబరులో ఒక విమానానికి 6 పైలట్ల బృందమే ఉంది. రాబోయే 3 నెలల్లో ప్రతి నెలా 20 మంది పైలట్లకు, రెండు నెలలకోసారి 75 మంది ఫస్ట్ ఆఫీసర్లకు శిక్షణ ఇవ్వాలని ఇండిగో భావిస్తున్నట్లు తెలుస్తోంది.

- ఫిబ్రవరి 10 తర్వాత మా కార్యకలాపాలకు 2,280 మంది పైలట్లు అవసరం పడొచ్చని అంచనా వేయగా.. 2,400 మంది ఉన్నారని, ఫస్ట్ ఆఫీసర్స్ కూడా అంచనాకు మించి 2,240 మంది ఉన్నారని డీజీసీఏకు ఇండిగో తెలిపింది.

భెల్‌లో 5% వాటా విక్రయం

భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ (భెల్)లో 5% వరకు వాటా విక్రయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు షేరు కనీస ధరను రూ.254గా ప్రకటించారు. భెల్‌లో ప్రభుత్వానికి 63.17% వాటా ఉంది. ఇందులో 3% వాటాను విక్రయించాలని ప్రభుత్వం తలపెట్టింది. స్పందన అధికంగా ఉంటే, మరో 2% వాటా కూడా విక్రయించాలన్నది ప్రణాళికగా పెట్టుబడులు, ప్రజా ఆస్తుల నిర్వహణ విభాగం (దీపమ్) కార్యదర్శి అరుణీశ్ చావ్లా తెలిపారు. రిటెయిల్ యేతర మదుపర్లు బుధవారం నుంచే దరఖాస్తు చేసుకోవచ్చు. రిటెయిల్ మదుపర్లు గురువారం బిడ్లు దాఖలు చేయాలి. ఇష్యూ మొత్తం (17.41 కోట్ల షేర్లు/5% వాటా) కనీసధర ప్రకారం సబ్‌స్క్రైబ్ అయితే, ఖజానాకు రూ.4,422 కోట్లు సమకూరుతాయి. మంగళవారం బీఎస్ఈలో భెల్ షేరు ధర రూ.276 కాగా, అంతకు 8% తక్కువగా రూ.254నే ఓఎఫ్ఎస్‌కు నిర్ణయించడం గమనార్హం.

ఆ ఫొటోలు, వీడియోలను 3 గంటల్లోగా తొలగించాలి

- ఏఐతో సృష్టించినట్లు తెలియపరచాలి
- ఈనెల 20 నుంచి నూతన నిబంధనల అమలు

కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ అభ్యంతరకర ఫొటోలు, వీడియోలు సృష్టిస్తుండటం, ప్రముఖుల ఫొటోలు/వీడియోలను డీప్‌ఫేక్ సాంకేతికతతో మార్పులు చేసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తుండటంపై ఇటీవల ఆందోళన పెరుగుతోంది. అందుకే ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల్లో ఇలాంటి కంటెంట్‌ను కట్టడి చేసేందుకు ప్రభుత్వం నిబంధనలను కఠినతరం చేసింది. ఇందుకుగాను ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఇంటర్మీడియరీ గైడ్‌లైన్స్ అండ్ డిజిటల్ మీడియా ఎథిక్స్ కోడ్) నిబంధనలు- 2021లో చేసిన సవరణలను ప్రభుత్వం నోటిఫై చేసింది. 2026 ఫిబ్రవరి 20 నుంచి అమల్లోకి రానున్న ఈ కొత్త నిబంధనల ప్రకారం.. ఏఐతో రూపొందించి, సామాజిక మాధ్యమాలకు అప్‌లోడ్ చేసే కంటెంట్ విషయంలో, ఆ విషయాన్ని స్పష్టంగా ప్రదర్శించాలి. ఏఐ సాయంతో సృష్టించిన ఫొటోలు, వీడియోలు, సమాచారం, డీప్‌ఫేక్ కంటెంట్‌పై కోర్టులు లేదా సంబంధిత అధికారులు అభ్యంతరాలు లేవనెత్తితే, 3 గంటల్లోగా వాటిని తొలగించాల్సి ఉంటుంది. పాక్షిక లేదా పూర్తి నగ్న ఫొటోలు, వీడియోలు లేదా శృంగార సంబంధిత కంటెంట్ విషయంలో 2 గంటల్లోపే స్పందించి, వాటిని తొలగించాల్సి ఉంటుంది.



అనిల్ - టీనా అంబానీలకు ఈడీ సమన్లు

మనీలాండరింగ్ కేసులో వచ్చే వారం విచారణకు హాజరు కావాలని రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీ, ఆయన భార్య టీనా అంబానీలకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తాజాగా సమన్లు జారీ చేసింది. ఈ నెల 17న టీనా, 18న అనిల్‌లను విచారించి వారి వాంగ్మూలాలను నమోదు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

నిడో హోమ్ ఫైనాన్స్‌లో మెజార్టీ వాటా కొనుగోలు


హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మాజీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆదిత్య పురి, ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం కార్లైల్ గ్రూప్‌తో జత కట్టి ఎడెల్‌వైజ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హోమ్ ఫైనాన్స్ విభాగం నిడో హోమ్ ఫైనాన్స్‌లో మెజార్టీ వాటాను రూ.2,100 కోట్లతో కొనుగోలు చేస్తున్నారు. పురి పెట్టుబడి సంస్థ సాలిస్‌బరీ ఇన్వెస్ట్‌మెంట్స్, కార్లైల్ గ్రూప్ అనుబంధ సంస్థ సీఏ సర్ఫో ఇన్వెస్ట్‌మెంట్స్‌తో కలిసి, నిడో హోమ్ ఫైనాన్స్‌లో 73% వాటా కొనుగోలు చేయనున్నాయి. ఈ ఏడాది జులైకి ఇది పూర్తవుతుందని భావిస్తున్నారు. ఈ రెండు సంస్థలు తొలుత నిడోలో ప్రైమరీ, సెకండరీ ఈక్విటీ కొనుగోలు ద్వారా 45% వాటా పొందుతాయి. ఆపై వారెంట్ల మార్పిడి ద్వారా మొత్తం హోల్డింగ్‌ను 73 శాతానికి పెంచుతాయి. షేర్ల ప్రాథమిక జారీ రూ.1,500 కోట్ల వరకు ఉంటుంది. మిగిలిన రూ.600 కోట్లతో ప్రస్తుత వాటాదార్ల నుంచి సెకండరీ కొనుగోళ్లు చేస్తాయి.

రిలయన్స్ కన్జ్యూమర్ చేతికి సదరన్ హెల్త్ ఫుడ్స్

తమిళనాడు కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న సదరన్ హెల్త్ ఫుడ్స్‌ను కొనుగోలు చేసినట్లు రిలయన్స్ కన్జ్యూమర్ ప్రోడక్ట్స్ లిమిటెడ్ (ఆర్‌సీపీఎల్) తెలిపింది. ఎంతకు కొనుగోలు చేసిందీ వెల్లడించలేదు. మిల్లెట్ ఆహార ఉత్పత్తుల విభాగంలోకి అడుగుపెట్టేందుకు ఆర్‌సీపీఎల్‌కు ఈ కొనుగోలు ఉపయోగపడనుంది. రెండు దశాబ్దాలకు పైగా మన్నా బ్రాండుపై ఆరోగ్య సంబంధిత ఆహార ఉత్పత్తులను సదరన్ హెల్త్ ఫుడ్స్ తయారు చేస్తోంది. తమిళనాడు, పరిసర రాష్ట్రాల్లో మన్నా బ్రాండుకు మంచి ఆదరణ ఉందని ఆర్‌సీపీఎల్ డైరెక్టరు టి కృష్ణకుమార్ తెలిపారు.

ఈవీ రంగంలో నాయకత్వం సాధించాలి

- ప్రపంచ ప్రమాణాలను నిర్దేశించాలి
- కేంద్ర భారీ పరిశ్రమల మంత్రి కుమారస్వామి



దిల్లీ: విద్యుత్ వాహన రంగంలో నాయకత్వ స్థానానికి ఎదిగి, ప్రపంచ ప్రమాణాలను నిర్దేశించడమే లక్ష్యంగా మన దేశం ముందుకెళుతోందని భారీ పరిశ్రమలు, ఉక్కు మంత్రి హెచ్‌డీ కుమారస్వామి మంగళవారం వెల్లడించారు. 5వ గ్లోబల్ ఎలక్ట్రిఫికేషన్ మొబిలిటీ సమ్మిట్‌లో ఆయన మాట్లాడుతూ.. పరిశ్రమలను స్థాపించడం, యువతకు స్థిరమైన జీవనోపాధి సృష్టించడంపై ఎక్కువగా దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. విద్యుత్ వాహన రంగంలో వినియోగం నుంచి తయారీలో నాయకత్వం వరకు, భాగస్వామ్యం నుంచి ప్రభావం చూపడానికి వెళ్లడమే మన దేశ దార్శనికత అని తెలిపారు. విద్యుత్ మొబిలిటీకి మారడం అనేది పర్యావరణ పరంగా తప్పనిసరి మాత్రమే కాదని, భారీ ఆర్థిక అవకాశం కూడా అని మంత్రి వివరించారు.

ఛార్జింగ్ స్టేషన్లకు రూ.2,000 కోట్లు

2024-25లో విద్యుత్ వాహనాల విపణి 60 శాతానికి పైగా వార్షిక వృద్ధి రేటును నమోదు చేసిందని, విద్యుత్ వాహనాల రిజిస్ట్రేషన్లు 20 లక్షలకు చేరుకున్నాయని కుమారస్వామి పేర్కొన్నారు. 2070 నాటికి నికర శూన్య ఉద్గారాలను సాధించేందుకు, విద్యుత్ వాహనాలకు మారడం కీలకమన్నారు. ఇంధన భద్రత, పారిశ్రామిక పరివర్తనకూ ఇది దోహదం చేస్తుందని తెలిపారు. దేశ వ్యాప్తంగా 70,000 ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయడానికి భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ పీఎం ఇ-డ్రైవ్ పథకం కింద రూ.2,000 కోట్లు కేటాయించిందన్నారు.

ఇనుప ఖనిజం ధర పెంచిన ఎన్ఎండీసీ

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ రంగ గనుల సంస్థ ఎన్ఎండీసీ, ఇనుప ఖనిజం ధరలను సవరించింది. లైలా లంప్ ధరను టన్నుకు రూ.4,600 నుంచి రూ.4,700కు చేర్చింది. లైలా ఫైన్స్ టన్ను ధరను రూ.3,900 నుంచి రూ.4,000 కు పెంచింది. కొత్త ధరలు ఈనెల 10 నుంచి అమల్లోకి వచ్చాయని తెలిపింది.

ఇరాన్ నుంచి దిగుమతుల సమాచారాన్ని కోరిన అమెరికా: అదానీ



దిల్లీ: ఇరాన్ నుంచి పెట్రోలియం ఉత్పత్తులను దిగుమతి చేసుకున్న ఆరోపణలపై, కంపెనీ నుంచి అమెరికా ఏజెన్సీ సమాచారాన్ని కోరినట్లు అదానీ గ్రూప్ సంస్థ అదానీ ఎంటర్‌ప్రైజెస్ తెలిపింది. అమెరికా ఆంక్షలు ఎదుర్కొంటున్న సంస్థలతో లావాదేవీలపై దర్యాప్తులో భాగంగా, ఈనెల 4న అమెరికా ఆర్థిక శాఖకు చెందిన ఆఫీస్ ఆఫ్ ఫారిన్ అసెట్స్ కంట్రోల్ (ఓఎఫ్ఏసీ) ఈ సమాచారాన్ని కోరినట్లు అదానీ ఎంటర్‌ప్రైజెస్ వెల్లడించింది. 2025 జూన్‌లో వాల్ స్ట్రీట్ జర్నల్ నివేదికకు సంబంధించిన చర్చల తర్వాత ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. అమెరికా ఆంక్షల నుంచి తప్పించుకునేందుకు ఉన్న నౌకా మార్గాల్లో ఇరాన్ నుంచి ఎల్‌పీజీను అదానీ గ్రూప్ కంపెనీలు దిగుమతి చేసుకున్నాయని నివేదిక ఆరోపించింది. ఓఎఫ్ఏసీకి పూర్తిగా సహకరిస్తున్నామని, వారు అడిగిన సమాచారాన్ని ఇవ్వనున్నట్లు అదానీ ఎంటర్‌ప్రైజెస్ స్పష్టం చేసింది.

స్వల్పంగా తగ్గిన నిరుద్యోగ రేటు

దిల్లీ: గత ఏడాది అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో దేశ నిరుద్యోగ రేటు స్వల్పంగా తగ్గి 6.7 శాతంగా నమోదైంది. నగరాల్లో 15 ఏళ్ల పైబడిన వ్యక్తుల్లో నిరుద్యోగ రేటు, జులై-సెప్టెంబరులో 6.9 శాతంగా ఉంది. పట్టణ ప్రాంత పురుషుల్లో నిరుద్యోగం 6.2% నుంచి 5.9 శాతానికి పరిమితం కావడం ఇందుకు దోహదపడింది. గ్రామీణ ప్రాంతాల్లో ఇది 4.4% నుంచి 4 శాతానికి చేరినట్లు జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) విడుదల చేసిన త్రైమాసిక పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే తెలిపింది.

ఈనాడు బిజినెస్

ఆస్ట్రాజెనెకా క్యాన్సర్ ఔషధానికి భారత్‌లో అనుమతి

క్యాన్సర్ చికిత్సలో ఇన్‌ఫ్యూజన్ (కీమోథెరపీ)గా వినియోగించే దుర్వాలుమాబ్ సొల్యూషన్‌ను మనదేశంలో విక్రయించేందుకు భారత ఔషధ నియంత్రణ సంస్థ సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సీడీఎస్‌సీఓ), డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ నుంచి అనుమతి లభించిందని ఆస్ట్రాజెనెకా ఫార్మా ఇండియా ప్రకటించింది. 120 ఎంజీ/2.4 ఎంఎల్, 500 ఎంజీ/10 ఎంఎల్ (బ్రాండ్ పేరు ఇంఫింజి) పరిమాణాల్లో విక్రయాలు, పంపిణీ కోసం దుర్వాలుమాబ్ సొల్యూషన్‌ను దిగుమతి చేసుకోవడానికి అనుమతి వచ్చినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు కంపెనీ సమాచారమిచ్చింది. కార్బోప్లాటిన్, పాక్లిటాక్సెల్‌తో కలిపి దుర్వాలుమాబ్ కాంబినేషన్‌ను, ఎండోమెట్రియల్ క్యాన్సర్ బాధితుల చికిత్సలో వాడతారు. అనంతరం మోనోథెరపీగా కూడా దుర్వాలుమాబ్‌ను చికిత్సలో సూచిస్తారు.

మ్యూచువల్ ఫండ్లలో పసిడి వెలుగులు

జనవరిలో రూ.24,000 కోట్ల పెట్టుబడులు: యాంఫీ

ఈనాడు, హైదరాబాద్: దేశీయ మ్యూచువల్ ఫండ్ రంగంలో మునుపెన్నడూ లేని విధంగా పసిడి ఫండ్లలోకి పెట్టుబడులు వెల్లువెత్తాయని భారతీయ మ్యూచువల్ ఫండ్ల సంఘం (యాంఫీ) తెలిపింది. ఈ ఏడాది జనవరిలో ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలోకి వచ్చిన నికర పెట్టుబడులు రూ.24,028 కోట్లు కాగా, గోల్డ్ ఈటీఎఫ్‌లలోకి ఏకంగా రూ.24,039.96 కోట్ల నికర పెట్టుబడులు వచ్చాయి. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో, స్టాక్ మార్కెట్లో ఆటుపోట్లను పరిగణనలోకి తీసుకుని, మదుపర్లు పసిడిని సురక్షితమైన పెట్టుబడి మార్గంగా ఎంచుకున్నారని స్పష్టమవుతోంది. 2025 డిసెంబరులో పసిడి ఫండ్లలోకి వచ్చిన రూ.11,647 కోట్ల పెట్టుబడులతో పోలిస్తే జనవరిలో 106% అధికం. వార్షిక ప్రాతిపదికన చూస్తే.. 2025 జనవరిలో గోల్డ్ ఈటీఎఫ్‌లోకి వచ్చిన పెట్టుబడులు రూ.3,751 కోట్లు మాత్రమే. దీంతో పోలిస్తే ఇప్పుడు ఏకంగా 540% వృద్ధి నమోదు చేసింది.

శ్రీసిటీలో హైసెన్స్ ఏసీల ప్లాంటు

ఈనాడు, హైదరాబాద్: చైనాకు చెందిన ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థ హైసెన్స్, మనదేశంలో తొలి తయారీ కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీలో ప్రారంభించింది. ఈపాక్ డ్యూరబుల్ అనుబంధ సంస్థ ఈపాక్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నాలజీస్ భాగస్వామ్యంతో 10 ఎకరాల్లో ఈ ప్లాంటును నెలకొల్పేందుకు దాదాపు రూ.270 కోట్లు (30 మి.డాలర్లు) పెట్టుబడి పెట్టినట్లు వివరించింది. ఈ ప్లాంటులో ఏడాదికి 7.5 లక్షల ఏసీలు తయారు చేసే సామర్థ్యం ఉంది. ఇకపై భారత్‌లో విక్రయించే హైసెన్స్ ఏసీలన్నీ పూర్తిగా ఇక్కడే తయారవుతాయని కంపెనీ తెలిపింది. ప్రస్తుతం ఎస్-సిరీస్, ఎక్స్ సిరీస్ వంటి మోడళ్లను ఇక్కడ ఉత్పత్తి చేస్తున్నారు.

టఫే నుంచి 'మాసే డైనాస్మార్ట్ కాంటెస్ట్'

హైదరాబాద్: అగ్రగామి ట్రాక్టర్ల తయారీ సంస్థ టఫే (ట్రాక్టర్స్ అండ్ ఫార్మ్ ఎక్విప్‌మెంట్ లిమిటెడ్), 'మాసే డైనాస్మార్ట్ కాంటెస్ట్ 2026' సీజన్ 3ని ప్రారంభించింది. రైతులు, విద్యార్థులు, అంకుర సంస్థల నిర్వాహకుల సాధికారత కల్పించడానికి తీసుకొచ్చిన వేదిక ఇదని తెలిపింది. మాసే ఫెర్గూసన్ ట్రాక్టర్లను వినియోగించి అర్థవంతమైన ప్రభావాన్ని చూపించే ఆవిష్కర్తలకు ఆన్‌లైన్ వేదికగా ఇది పనిచేస్తుంది. సీజన్ 3 విజేతకు రూ.8.2 లక్షల మాసే ఫెర్గూసన్ 254 డైనాస్మార్ట్ ట్రాక్టర్‌ను అందిస్తారు.

కోడి గుడ్డు

11న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్)
(వంద గుడ్ల ధర రూపాయల్లో)

హైదరాబాద్	495
వరంగల్	497
విజయవాడ	515
తూ/ప గోదావరి	485
విశాఖపట్నం	490
చిత్తూరు	563

హామీ లేని రుణాల పరిమితి రెట్టింపు

- పట్టణ సహకార బ్యాంకులకు వెసులుబాటు
- ప్రతిపాదించిన ఆర్‌బీఐ

ముంబయి: పట్టణ సహకార బ్యాంకులు (యూసీబీ) మంజూరు చేసే హామీ లేని రుణాల పరిమితిని పెంచాలని ఆర్‌బీఐ ప్రతిపాదించింది. ప్రస్తుతం మొత్తం ఆస్తుల్లో 10 శాతంగా ఉన్న ఈ రుణాల పరిమితిని, 20 శాతానికి పెంచాలని ప్రతిపాదించింది. ఈ మేరకు నిబంధనల సవరణ కోసం ముసాయిదాను మంగళవారం విడుదల చేసింది. నియంత్రిత సంస్థలు, వాటాదారులు, ప్రజలు ఈ ముసాయిదాపై మార్చి 4లోగా తమ అభిప్రాయాలను తెలియజేయాలి. పరిమితికి మించి ఇచ్చే అదనపు హామీ లేని రుణాలను, కేవలం ప్రాధాన్య రంగాల్లో అర్హత కలిగిన వాటికే ఇస్తారు. ఒకరికి రూ.50,000 కు మించి ఇవ్వకూడదు. సభ్యులకు గృహోపకరణాల కొనుగోలు కోసం ఇచ్చే రుణ పరిమితిని రూ.2.5 లక్షలకు పెంచనున్నారు. మూడు, నాలుగో శ్రేణి పట్టణ సహకార బ్యాంకులకు సంబంధించి, గృహ రుణాల కాలపరిమితి మారటోరియం నిబంధనలపై నియంత్రణలను తొలగించాలని ప్రతిపాదించింది.

త్వరలో ఆర్వీ ఇంజినీరింగ్ ఐపీఓ

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఆర్వీ ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్ తొలి పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) ప్రతిపాదనకు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఆమోదం తెలిపింది. ఈ ఐపీఓ ద్వారా రూ.202.5 కోట్ల విలువైన తాజా షేర్లను కంపెనీ జారీ చేయనుంది. ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్)లో ప్రమోటర్ వెంకటాచల చక్రపాణి రెడ్డి 67.5లక్షల ఈక్విటీ షేర్లను విక్రయించనున్నారు. తాజా షేర్ల జారీ ద్వారా వచ్చే నిధుల్లో రూ.76 కోట్లను కంపెనీ రుణాలను తీర్చేందుకు వినియోగించనుంది. జియోస్పేషియల్ సొల్యూషన్స్, డిజిటల్ ఇంజినీరింగ్ టెక్నాలజీ అభివృద్ధి కోసం భారతీయ అనుబంధ సంస్థ ఎస్ఆర్ఏ ఓఎస్ఎస్‌లో రూ.21.9 కోట్లు, ఆస్ట్రేలియా అనుబంధ సంస్థలో రూ.34.8 కోట్లు, యూకే అనుబంధ సంస్థలో రూ.20.8 కోట్లు పెట్టుబడులు పెట్టనున్నట్లు తెలిపింది. ఆర్వీ ఇంజినీరింగ్.. అమరావతి క్యాపిటల్ సిటీ, హై స్పీడ్ రైల్, సుదర్శన్ సేతు వంటి ప్రాజెక్టుల్లో పాలుపంచుకుంది. ఎన్‌హెచ్ఏఐ, రైల్వేస్, టాటా ప్రాజెక్ట్స్, మేఘా ఇంజినీరింగ్, జేఎస్‌డబ్ల్యూ, అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ వంటి సంస్థలకు సేవలందిస్తోంది. గత ఆర్థిక సంవత్సరం కంపెనీ రూ.567 కోట్ల ఆదాయంపై రూ.51 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది.

ఈపీసీ సేవల విస్తరణలో ప్రీమియర్ ఎనర్జీస్

హైదరాబాద్: పునరుత్పాదక ఇంధన రంగ ఈపీసీ (ఇంజినీరింగ్, సమీకరణ, నిర్మాణం) వ్యాపారంలో మరింత విస్తరించేందుకు బీపీ ప్రేర్ణ రెన్యూవబుల్స్‌తో కలిసి సంయుక్త సంస్థ హీలియోస్‌ఆంథోస్ ఎనర్జీస్ ప్రైవేట్ లిమిటెడ్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రీమియర్ ఎనర్జీస్ తెలిపింది. సంయుక్త సంస్థలో ప్రీమియర్‌కు 51% వాటా ఉంటుంది. సౌర, పవన, హైబ్రిడ్ ప్రాజెక్టులను ఈ సంయుక్త సంస్థ చేపడుతుంది.

మూడో రోజూ లాభాలే

ఎఫ్ఐఐ కొనుగోళ్లు: రూ.69.45 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు: రూ.1,174.21 కోట్లు

సెన్సెక్స్ ▲208 84274 | నిఫ్టీ ▲68 25935

సూచీలు వరుసగా మూడో రోజూ లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ సానుకూల సంకేతాలు, భారత్-అమెరికా మధ్య కుదిరిన మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై ఆశావాదం కలిసొచ్చాయి. అధిక స్థాయుల్లో మదుపర్లు లాభాల స్వీకరణకు దిగినా, సూచీలు సానుకూలంగానే స్థిరపడ్డాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 10 పైసలు పెరిగి 90.56 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు ధర 0.20% తగ్గి 68.89 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో జపాన్, హాంకాంగ్, దక్షిణ కొరియా, షాంఘై సూచీలు సానుకూలంగా ముగిశాయి. ఐరోపా మార్కెట్లూ ఇదే ధోరణిలో ట్రేడయ్యాయి.

- బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.1.14 లక్షల కోట్లు పెరిగి, రూ.474.48 లక్షల కోట్ల (5.24 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.
- సెన్సెక్స్ ఉదయం 84,210 పాయింట్ల వద్ద సానుకూలంగా ప్రారంభమైంది. దాదాపు రోజంతా లాభాల్లోనే కొనసాగిన సూచీ ఒక దశలో 84,482.95 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని, 84,063.47 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరకు 208.17 పాయింట్ల లాభంతో 84,273.92 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సూచీ 67.85 పాయింట్లు పెరిగి 25,935.15 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 25,989.45-25,870.45 పాయింట్ల మధ్య కదలాడింది.
- సెన్సెక్స్ 30 షేర్లలో 18 లాభపడ్డాయి. ఎటర్నల్ 5.19%, టాటా స్టీల్ 2.89%, ఎం అండ్ ఎం 1.79%, పవర్‌గ్రిడ్ 1.69%, టెక్ మహీంద్రా 1.43%, ఎన్‌టీపీసీ 1.37%, ఎల్ అండ్ టీ 1.36%, టీసీఎస్ 1.26%, మారుతీ సుజుకీ 1.17%, యాక్సిస్ బ్యాంక్ 1.12% చొప్పున పెరిగాయి. హెచ్‌సీఎల్ టెక్ 1.86%, బజాజ్ ఫైనాన్స్ 1.8%, భారతీ ఎయిర్‌టెల్ 1.36%, ఏషియన్ పెయింట్స్ 0.94% నష్టపోయాయి.
- రంగాల వారీగా.. వాహన, లోహ, పారిశ్రామిక, యుటిలిటీస్, చమురు-గ్యాస్, ఫోకస్డ్ ఐటీ, ఐటీ, టెలికాం సూచీలు రాణించాయి. పీఎస్‌యూ బ్యాంక్, మన్నికైన వినిమయ వస్తువులు, బ్యాంకింగ్, ప్రైవేటు బ్యాంకుల సూచీలు డీలాపడ్డాయి. బీఎస్ఈలో 2,587 షేర్లు సానుకూలంగా, 1,675 షేర్లు ప్రతికూలంగా ముగిశాయి. 145 షేర్లలో ఎలాంటి మార్పు లేదు.

ఫండ్ సేవల కోసం తపాలా, ఎన్ఎస్ఈ జట్టు: ఎన్ఎస్ఈ ఎంఎఫ్ ఇన్వెస్ట్ ప్లాట్‌ఫామ్ ద్వారా, మ్యూచువల్ ఫండ్‌లకు ప్రజలకు చేరువ చేయడానికి తపాలా విభాగం (డీఓపీ), నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) మంగళవారం ఒక ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందం కింద దేశవ్యాప్తంగా ఉన్న 1.64 లక్షల తపాలా కార్యాలయాల్లోనూ ఫండ్ సేవలు అందుతాయి. దశల వారీగా ఈ సేవలను విస్తరిస్తారు.

ఆర్‌బీఐ బోర్డు సమావేశంలో 23న ఆర్థిక మంత్రి ప్రసంగం

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కేంద్ర బోర్డును ఉద్దేశించి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ నెల 23న ప్రసంగించనున్నారు. దేశీయంగా తయారీ రంగ వృద్ధికి దోహదపడే చర్యలు, వ్యవసాయ, పర్యాటక రంగానికి మద్దతు, 2026-27 బడ్జెట్‌లోని ముఖ్య అంశాలపై ఆర్థిక మంత్రి మాట్లాడతారని సమాచారం.



సంక్షిప్తంగా

- ఇటలీకి చెందిన **బోన్‌ఫిగ్లియోలి గ్రూప్** భారతీయ అనుబంధ సంస్థ బోన్‌ఫిగ్లియోలి ట్రాన్స్‌మిషన్స్, ఐపీఓ ద్వారా నిధులు సమీకరించడానికి మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ వద్ద ప్రాథమిక ముసాయిదా పత్రాలు దాఖలు చేసింది. ఈ ఇష్యూ పరిమాణం రూ.2,000 కోట్లకు పైగా ఉండొచ్చని తెలుస్తోంది. ఇది పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) విధానంలో ఉండబోతోంది. ప్రమోటర్ బోనఫిగ్లియోలి ఎస్‌పీఏ 4.7 కోట్ల షేర్లను విక్రయించనుంది.
- రెవా అల్ట్రా మెగా సోలార్ లిమిటెడ్ నుంచి రూ.1,700 కోట్ల సౌర ప్రాజెక్టును దక్కించుకున్నట్లు ప్రకటించడంతో, **సీగాల్ ఇండియా** షేరు బీఎస్ఈలో 3.96% పెరిగి రూ.295.35 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఒక దశలో 8.52% లాభపడి రూ.308.30 వద్ద 52 వారాల గరిష్ఠ స్థాయిని కూడా తాకింది.
- **ఫ్రాక్టల్ అనలిటిక్స్** ఐపీఓ రెండో రోజుకు 20% స్పందనే లభించింది. కంపెనీ 1,85,79,360 షేర్లను ఆఫర్ చేయగా, 36,40,320 షేర్లకే మదుపర్ల నుంచి బిడ్లు దాఖలయ్యాయి. రిటెయిల్ విభాగంలో 60%, సంస్థాగతేతర మదుపర్ల విభాగంలో 27%, అర్హులైన సంస్థాగత మదుపర్ల (క్యూఐబీ) విభాగంలో 2% స్పందన దక్కింది.

అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం) 2025-26	నికర లాభం/(నష్టం) 2024-25	మొత్తం ఆదాయం 2025-26	మొత్తం ఆదాయం 2024-25
టైటన్	1684	1047	24915	--
హ్యాపియెస్ట్ మైండ్స్	40.3	22.03	587.56	--
బ్రిటానియా	682	582	4970	4593
గ్రాసిమ్ ఇండస్ట్రీస్	2233	1734	44312	35378
దిలీప్ బిల్డ్‌కాన్	789	158	2138	2590
బలరాంపూర్ చినీ	113	70	1464	1199
పీఎన్ గాడ్గిల్	171	86	3303	2436
చోళమండలం ఫైనాన్స్	1386	1093	10084	8593
వోఖార్డ్	61	20	888	725
యాక్సిస్‌కేడ్స్	28	15	343	275
ఐషర్‌మోటార్స్	1421	1170	6114	4973



సాయంత్రం ఆరైందంటే.. గ్రామ వీధులు నిర్మానుష్యం

ఈటీవీ భారత్: ఛత్తీస్‌గఢ్‌లోని ధంతరీ జిల్లా బిరేతరా గ్రామంలో సాయంత్రం ఆరైందంటే వీధులన్నీ నిర్మానుష్యమే! ఊరు ఏడారిలా కనిపిస్తుంది. గ్రామ రహదారుల మీద, కూడళ్లలో విద్యార్థి ఎవరైనా కనబడితే సంబంధిత కుటుంబసభ్యులకు రూ.5 వేల నుంచి రూ.50 వేల వరకు జరిమానా ఉంటుంది. రాత్రి ఎనిమిదింటికే దుకాణాలన్నీ మూసివేయాలి. ఆ సమయంలో మొబైల్ ఫోన్ల వాడకం, టీవీ చూడటం కూడా నిషేధం. ధూమపానం, మత్తు పదార్థాల వాడకం, దుర్భాషలాడటం వంటివి ఎవరూ చేయకూడదు. తల్లిదండ్రులు పిల్లల హోంవర్కును పర్యవేక్షించాలి. 10, 12 తరగతుల విద్యార్థుల పరీక్షలను దృష్టిలో పెట్టుకొని గ్రామసభలో పెద్దలందరూ కలిసి ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రతి కుటుంబం ఈ నిబంధనలు పాటించాలని గ్రామంలో చాటింపు వేశారు. మరోవైపు.. బిరేతరాలోని ప్రభుత్వ హయ్యర్ సెకండరీ స్కూలు కమిటీ సమావేశమై ఈసారి పదో తరగతిలో 80 శాతం, 12వ తరగతిలో వందశాతం ఫలితాలు సాధించాలని లక్ష్యాలు నిర్దేశించుకొంది. బిరేతరా గ్రామస్థుల చొరవ మిగతా గ్రామాలకు స్ఫూర్తిదాయకమని ధంతరీ జిల్లా కలెక్టర్ అబినాశ్ మిశ్ర ప్రశంసించారు.

కాంగ్రెస్ నేతలపై రూ.500 కోట్లకు హిమంత పరువునష్టం దావా

గువాహటి: తన కుటుంబానికి దాదాపు 12 వేల బిఘాల (సుమారు 3,960 ఎకరాలు) భూమి బినామీ పేర్ల మీద ఉందంటూ కాంగ్రెస్ నేతలు జితేంద్ర సింగ్, భూపేశ్ బఘేల్, గౌరవ్ గొగొయ్ చేసిన ఆరోపణలపై అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. తన ప్రతిష్ఠకు భంగం కలిగించేలా, దురుద్దేశపూర్వకంగా ఆరోపణలు చేశారంటూ.. వారి నుంచి రూ.500 కోట్ల నష్టపరిహారం కోరుతూ దావా వేశారు. ఈ విషయాన్ని హిమంత 'ఎక్స్' వేదికగా మంగళవారం వెల్లడించారు. మరోవైపు- ఓ వర్గాన్ని లక్ష్యంగా చేసుకొని హిమంత బిశ్వశర్మ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన వీడియోను విస్తృతంగా ప్రచారం చేస్తోందంటూ అస్సాం భాజపాపై పోలీసులకు కాంగ్రెస్ ఫిర్యాదు చేసింది. దిస్‌పుర్ పోలీసు స్టేషన్‌లో హస్తం పార్టీ నేతలు సిబామోనీ బోరా, దిగంతా బర్మాన్ మంగళవారం ఈ మేరకు ఫిర్యాదు అందజేశారు.

బాబ్రీపై కలలు కనొద్దు
యూపీ సీఎం యోగి స్పష్టీకరణ



బారాబంకీ: బాబ్రీ మసీదును పునర్నిర్మిస్తామనే కలలను కనొద్దని, నిబంధనలకు కట్టుబడి జీవించడం నేర్చుకోవాలని ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్పష్టం చేశారు. 'మేం వస్తాం. రామ మందిరం నిర్మిస్తాం అని చెప్పాం. వచ్చాం. నిర్మించాం' అని పేర్కొన్నారు. మంగళవారం బారాబంకీలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'డూమ్స్ డే ఎప్పటికీ రాదు. బాబ్రీ పునర్నిర్మాణం ఎప్పటికీ జరగదు. ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే అది నరకానికి దారితీస్తుంది. స్వర్గానికి కాదు' అని హెచ్చరించారు. మరోవైపు పశ్చిమ బెంగాల్‌లోని ముర్షీదాబాద్‌లో బాబ్రీ మసీదును నిర్మిస్తానని తృణమూల్ బహిష్కృత ఎమ్మెల్యే ప్రకటించిన నేపథ్యంలో అక్కడికి నిరసన యాత్ర చేపట్టాలని హిందూ సంఘాలు పిలుపునిచ్చాయి.

ఊబకాయుల్లో అంటువ్యాధులు మరింత ప్రాణాంతకం!

దిల్లీ: సాధారణ వ్యక్తులతో పోలిస్తే ఊబకాయులు ఫ్లూ, కొవిడ్, న్యుమోనియా వంటి అంటువ్యాధుల వల్ల ఆస్పత్రిపాలయ్యే, మరణించే ప్రమాదం 70 శాతం ఎక్కువని బ్రిటన్, ఫిన్లాండ్ దేశాల పరిశోధకులు తేల్చారు. వారి అధ్యయనం లాన్సెట్ పత్రికలో ప్రచురితమైంది. 2023లో ప్రపంచవ్యాప్తంగా అంటువ్యాధుల వల్ల సంభవించిన ప్రతి 10 మరణాల్లో ఒకటి ఊబకాయం మూలంగా జరిగినదేనని నిర్ధారణ అయింది. కొవిడ్ మహమ్మారి విజృంభణ సమయంలో స్థూలకాయులు పెద్దసంఖ్యలో ఆస్పత్రి పాలై మరణించిన సంగతి తెలిసిందే. అయితే ఊబకాయానికీ, అంటువ్యాధి వల్ల మరణాలకూ సంబంధం ఉందని అప్పటికి నిర్ధారణ కాలేదు. దాంతో పరిశోధకులు బ్రిటన్, ఫిన్లాండ్‌లలో 13-14 ఏళ్లపాటు సేకరించిన 5,40,000 మంది ఆరోగ్య రికార్డులను పరిశీలించారు. ఊబకాయులు అంటువ్యాధుల వల్ల మరణించే ప్రమాదం 70 శాతం ఎక్కువనీ, స్థూలకాయం మరీ ఎక్కువగా ఉంటే మరణించే ముప్పు మూడింతలు ఎక్కువని వారు తేల్చారు.

ఉఖ్రుల్‌లో మరిన్ని ఇళ్లకు నిప్పు
అంతర్జాల సేవలను నిలిపివేసిన మణిపుర్ ప్రభుత్వం

ఇంఫాల్: మణిపుర్‌లోని ఉఖ్రుల్ జిల్లాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. అక్కడి లిటాన్ సరిఖోంగ్ ప్రాంతంలో సాయుధ ముష్కరులు మంగళవారం మరో 21 ఖాళీ ఇళ్లకు నిప్పుపెట్టారు. గాల్లోకి కాల్పులు జరిపారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ముందుజాగ్రత్త చర్యగా ఐదు రోజుల పాటు ఉఖ్రుల్ జిల్లాలో అంతర్జాల సేవలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. తాంగ్‌ఖుల్ నాగా వర్గానికి చెందిన ఓ వ్యక్తిపై దాడి జరగడం, ఆపై ముష్కరులు కొందరి ఇళ్లకు నిప్పు పెట్టడం వంటి పరిణామాలతో సోమవారం నుంచి ఉఖ్రుల్‌లో ఉద్రిక్తతలు నెలకొన్న సంగతి గమనార్హం.

సొంత జిల్లాల్లోని అధికారులను బదిలీ చేయండి: ఈసీ

దిల్లీ: త్వరలో ఎన్నికలు జరగనున్న నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతానికి సంబంధించి ఎన్నికల సంఘం (ఈసీ) కీలక ఆదేశాలు జారీ చేసింది. సొంత జిల్లాల్లో పనిచేస్తున్న అధికారులను బదిలీచేయాలని తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేరళ, అస్సాం రాష్ట్రాలతో పాటు పుదుచ్చేరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు రాసిన లేఖలో పేర్కొంది. ఎన్నికల నిర్వహణ విధులతో నేరుగా సంబంధం ఉండే అధికారులను వారి సొంత జిల్లాల్లోనూ, దీర్ఘకాలంగా పనిచేస్తున్న ప్రాంతాల్లోనూ ఉంచరాదని ఈసీ స్పష్టం చేసింది. ఎన్నికల నిర్వహణకు ముందు ఇటువంటి బదిలీలు చేయడం సాధారణమే.

లైంగిక దాడుల కేసుల్లో

నిర్లక్ష్యపు వ్యాఖ్యల నియంత్రణకు చర్యలు

- కోర్టుల కట్టడికి సుప్రీం యోచన



దిల్లీ: లైంగిక దాడుల సంబంధిత కేసుల్లో హైకోర్టులు, దిగువ కోర్టుల నిర్లక్ష్యపూరిత, అసంబద్ధ వ్యాఖ్యల నియంత్రణకు మార్గనిర్దేశాలను జారీ చేయాలని యోచిస్తున్నట్లు సుప్రీంకోర్టు మంగళవారం ప్రకటించింది. ఈ కేసుల్లో కోర్టులు చేస్తున్న వ్యాఖ్యలపై ఒక సమగ్ర నివేదిక అందించాలని జాతీయ జ్యుడీషియల్ అకాడమీని కోరాలని భావిస్తున్నట్లు తెలిపింది. ఒక లైంగిక దాడికి సంబంధించి అలహాబాద్ హైకోర్టు 2025 మార్చి 17న వెలువరించిన ఆదేశాలను పక్కన పెడుతున్నట్లు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ ఎన్.వి. అంజారియాలతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. ఒక మైనర్ బాలిక వక్షస్థలాన్ని పట్టుకోవడం, ఆమె పైజామా బొందును ఊడదీయడం, నడుముకు కింది భాగంలో ఉండే వస్త్రాన్ని తొలగించేందుకు ప్రయత్నించడం.. అత్యాచార ప్రయత్నం కిందకు రావని అలహాబాద్ హైకోర్టు నాటి తీర్పులో పేర్కొంది. ఆ ఆదేశాలను పరిగణనలోకి తీసుకున్న అత్యున్నత న్యాయస్థానం తనంత తానుగా విచారణ చేపట్టింది. లైంగిక దాడి కేసుల్లో మతిలేని నిర్లక్ష్య వ్యాఖ్యలు బాధితులపై, వారి కుటుంబాలపై, సమాజంపై దారుణ ప్రభావం చూపుతున్నాయని గత డిసెంబరులోనే సుప్రీంకోర్టు పేర్కొంది. ఇలాంటి వ్యాఖ్యలపై మార్గనిర్దేశాల్ని నిర్ణయించే విషయంలో ఒక సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని జాతీయ జ్యుడీషియల్ అకాడమీని కోరతామని ధర్మాసనం మంగళవారం పేర్కొంది. ఇలాంటి కేసుల్లో కోర్టులు.. వయసుకు తగిన భాషను వాడాలని కోరినట్లు వాదనలు వినిపించిన న్యాయవాది ఒకరు పేర్కొన్నారు. లైంగిక దాడి కేసుల్లో బాధితుల క్రాస్ ఎగ్జామినేషన్ పూర్తి చేయని కేసులు ఎనిమిది నుంచి తొమ్మిదేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయని సీనియర్ న్యాయవాది హెచ్.ఎస్. ఫూల్కా తెలిపారు.

ప్రతిపక్ష నేత అభ్యంతరాలను బహిర్గతం చేయాలని ఆదేశించలేం

కేంద్ర సమాచార కమిషన్‌లో ముఖ్య సమాచార కమిషనర్, ఇతర కమిషనర్ల నియామక ప్రక్రియలో భాగంగా ప్రతిపక్ష నేత లేవనెత్తిన అభ్యంతరాలను బహిర్గతం చేయాల్సిందిగా తాము ఆదేశించజాలమని సుప్రీంకోర్టు మంగళవారం స్పష్టం చేసింది. కేంద్ర సమాచార కమిషన్‌లో ఖాళీగా ఉన్న పోస్టుల్ని భర్తీ చేసినట్లు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ ఎన్.వి. అంజారియాల ధర్మాసనానికి కేంద్ర ప్రభుత్వం తెలియజేసింది. ఖాళీల భర్తీలో 2019 నాటి సుప్రీంకోర్టు తీర్పును పరిగణనలోకి తీసుకున్నారా లేదా అన్న విషయంపై ఒక నివేదికను సమర్పించాల్సిందిగా ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. 2019 నాటి తీర్పులో సుప్రీంకోర్టు కేంద్ర, రాష్ట్ర సమాచార కమిషనర్ల నియామకానికి మార్గనిర్దేశాలు సూచించింది. కేంద్ర, రాష్ట్ర సమాచార కమిషనర్ల నియామకంపై దాఖలైన ఒక అభ్యర్థనపై కోర్టు విచారణ జరిపింది. రాష్ట్ర ప్రభుత్వాలు తమ సమాచార కమిషనర్ల నియామక ప్రక్రియను పూర్తిచేయాలని ధర్మాసనం తెలిపింది. కేంద్ర సమాచార కమిషనర్ పదవులకు ఎవరెవరు దరఖాస్తు చేసుకున్నారు, ఎవరెవరి పేర్లు పరిశీలించారు అన్న వివరాలను కేంద్ర ప్రభుత్వం వెల్లడించలేదని పిటిషనర్ తరఫు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ పేర్కొన్నారు. ఈ పదవుల కోసం ఎవరెవరు దరఖాస్తు చేసుకున్నారన్న వివరాలను ప్రభుత్వం వెల్లడించాలన్నారు. 'నియమితులైన అభ్యర్థుల పేర్లు ప్రకటించారు కానీ వారి అర్హతలేమిటో తెలపలేదు. ప్రతిపక్షనేత ఈ నియామకాలపై అభ్యంతరాలు లేవనెత్తారు. ఆమేరకు ప్రజలకు తెలియాలి' అని ప్రశాంత్ భూషణ్ వ్యాఖ్యానించారు. సమాచార కమిషనర్ల నియామక కమిటీ సమావేశంలో జరిగిన చర్చల వివరాలను ప్రభుత్వం బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాలు తమ సమాచార కమిషనర్ల నియామక ప్రక్రియను రెండు నెలల్లో పూర్తిచేయాలని కోర్టు గడువు విధించింది. సమాచార కమిషనర్ల సంఖ్యను పెంచే విషయం కూడా పరిశీలించాలని రాష్ట్రాలను కోరింది. భిన్న రంగాలకు చెందిన ప్రముఖుల్ని సమాచార కమిషనర్లుగా నియమించాలని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది.

ఎన్నికల వ్యయ నియంత్రణపై పిటిషనర్ ప్రతిపాదనలు పరిశీలించండి

ఎన్నికల్లో విజయం సాధించడం కోసం అడ్డదారులు తొక్కుతున్న అభ్యర్థులపై చర్యలు తీసుకోవడం, మితిమీరిన వ్యయాన్ని నియంత్రించడానికి బిజేపీ వల్లభ్రదుడు ప్రభాకర్ దేశ్‌పాండే ప్రతిపాదనలు పరిశీలనార్హమైనవేనని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. అభ్యర్థుల నిర్వారం కోసం ప్రామాణిక నిబంధనలు రూపొందించాల్సిన ఆవశ్యకతను పిటిషనర్ వివరిస్తున్నారని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ ఎన్.వి. అంజారియా ధర్మాసనం పేర్కొంది. పిటిషనర్ ప్రతిపాదనలను ఎన్నికల సంఘం (ఈసీ) పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని సూచిస్తూ.. ఆ వ్యాజ్యంపై విచారణను ముగించింది. అభ్యర్థుల వ్యయ నియంత్రణకు తాము తీసుకుంటున్న చర్యలను, పరిశీలకుల నియామకం విషయాన్ని ధర్మాసనానికి ఈసీ వివరించింది. ఈ చర్యలు సరిపోతాయని అభిప్రాయపడింది. పిటిషనర్ సమర్పించిన నివేదిక విశ్వసనీయతను ప్రశ్నించింది.



వరిచెత్తతో వన్నెచిన్నెలు

ఈటీవీ భారత్: సాధారణంగా వరికోతలు ముగియగానే మిగిలిన గడ్డిని పశువులకు మేతగా రైతులు ఉపయోగిస్తారు. కొందరు పనికిరాని చెత్తగా భావించి పొలాల్లోనే కాల్చేస్తారు. ఒడిశాలోని భువనేశ్వర్‌కు చెందిన సుశాంత్ మొహంతి చేతిలో ఆ గడ్డి పరకలు అపురూపమైన కళాఖండాలుగా మారుతున్నాయి. గత 30 ఏళ్లుగా ఈ స్ట్రా క్రాఫ్టులో ఆయన కుటుంబం అద్భుతాలు చేస్తోంది. భువనేశ్వర్‌తోపాటు దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో నిర్వహించే జాతీయ హస్తకళా వేదికలపై ఈ కళాఖండాలు సందడి చేస్తుంటాయి. ఒడిశా జానపద సంప్రదాయాలు, గిరిజన జీవనం వాటిలో ప్రతిబింబిస్తాయి. ఈ బొమ్మల తయారీలో సహజమైన రంగులనే వాడుతారు. ఒక్కో కళాఖండం తయారీకి మూడు నుంచి అయిదు రోజుల సమయం పడుతుంది. భారీ స్థాయిలో ఉన్నవాటి ధర రూ. 50,000 వరకు ఉంటుంది. ఉత్తర భారతంలో పంట వ్యర్థాలను కాల్చడం వల్ల కాలుష్యం పెద్ద సమస్యగా మారుతుండగా.. సుశాంత్ ప్రతిభ ఆ వ్యర్థాలను కళాఖండాలు చేస్తోంది.

జగమంత కుటుంబం.. ఏకాకి జీవితం!

ఈటీవీ భారత్: ఆయన వయసు 85. పేరు వంశీధర్ డోగ్రా. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాలో డిప్యూటీ కమిషనరుగా ఉన్నత హోదాలో పనిచేసి పదవీ విరమణ పొందారు. సోమవారం మధ్యాహ్నం లఖ్‌నవూ పోలీసులు తలుపులు పగులగొట్టి మరీ ఆయనను కాపాడటంలో ఏమాత్రం ఆలస్యం చేసినా.. పెనువిషాదమే జరిగేది. ఈ విషయం తెలిశాక పెద్ద కుమారుడు ఉత్తరాఖండ్‌లోని అల్మోరా నుంచి.. ఇతర కుటుంబసభ్యులు ఆగ్రా, దిల్లీల నుంచి లఖ్‌నవూకు బయలుదేరారు. అపార్ట్‌మెంటులోని నాలుగో అంతస్తులో ఉంటున్న వంశీధర్ ఫ్లాటుకు ఉదయం వంటమనిషి వచ్చింది. పలు ఫోన్‌కాల్స్ చేసినా లోపల నుంచి సమాధానం లేదు. ఏం జరిగిందో చూద్దామని కేర్‌టేకర్ శివం వచ్చారు. పదే పదే బెల్లు కొట్టినా తలుపు తెరుచుకోలేదు. ఏదో జరిగిందన్న కంగారుతో మెట్రోపాలిటన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు రెండు భారీ తలుపులు పగులగొట్టి లోనికి ప్రవేశించారు. మంచంపై ఒంటరిగా స్పృహతప్పి పడున్న వంశీధర్‌ను హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. దీంతో ప్రాణాపాయం తప్పింది.



మా చమురును కొనకుండా అమెరికా అడ్డుకుంటోంది

- భారత్‌సహా ఇతర దేశాలపై ఒత్తిడి తెస్తోంది
- రష్యా విమర్శలు

మాస్కో: భారత్‌సహా ఇతర దేశాలు తమ నుంచి చమురును కొనకుండా అమెరికా అడ్డుకుంటోందని రష్యా మండిపడింది. ప్రపంచంలో ఆర్థిక ఆధిపత్యం సాధించేందుకు సుంకాలు, ఆంక్షలు, ప్రత్యక్ష నిషేధాల వంటి బలవంతపు చర్యలకు పాల్పడుతోందని విమర్శించింది. అధిక ధరలకు ఎల్‌ఎన్‌జీని కొనుగోలు చేయాలని వివిధ దేశాలను బలవంతం చేస్తోందని పేర్కొంది. ఓ టీవీ ఇంటర్వ్యూలో రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లవ్రోవ్ ఈ అంశంపై స్పందించారు. 'ఉక్రెయిన్ సమస్యను పరిష్కరించాలని అమెరికా మాకు చెబుతోంది. ఆ ప్రతిపాదనకు అంగీకరించాం. ఉక్రెయిన్ సమస్యను పరిష్కరించే దిశగా వెళ్లాం. అయితే వాస్తవికత దీనికి పూర్తి విరుద్ధంగా ఉంది. అమెరికా కొత్త ఆంక్షలు విధించింది. సముద్ర చట్టంపై ఐరాస కన్వెన్షన్‌ను ఉల్లంఘించింది. బహిరంగ సముద్రంలో ట్యాంకర్లపై యుద్ధం జరుగుతోంది' అని సెర్గీ లవ్రోవ్ పేర్కొన్నారు.

'అమెరికా చర్యలు న్యాయమైన పోటీకి విరుద్ధం'

'ఆర్థిక ఆధిపత్యం సాధించడాన్ని అమెరికా లక్ష్యంగా పెట్టుకుంది. ప్రముఖ దేశాలకు రష్యా ఇంధన వనరులు వెళ్లే మార్గాలను నియంత్రించేందుకు యత్నిస్తోంది. ఈ చర్యలు న్యాయమైన పోటీకి విరుద్ధం. భారత్, చైనా, ఇండోనేసియా, బ్రెజిల్‌లాగా అమెరికా వంటి ప్రధాన శక్తులతో సహా అన్ని దేశాలతో మంచి సంబంధాలను మేం ఏర్పరుచుకోవాలి. అమెరికా చేపడుతున్న చర్యలను పరిగణనలోకి తీసుకోవాలి' అని లవ్రోవ్ వ్యాఖ్యానించారు.



మహా మృత్యుంజయ్ రుద్ర మహాయజ్ఞం సందర్భంగా రాజస్థాన్ రాజధాని జైపుర్‌లో మంగళవారం 108 కలశాలతో ప్రదర్శన నిర్వహిస్తున్న మహిళలు

ఎస్సీ ఎస్టీలకు క్రీమీలేయర్ కోరుతూ పిటిషన్లు

- కేంద్రం స్పందన కోరిన సుప్రీం

దిల్లీ: క్రీమీలేయర్ పరిధిలోకి వచ్చే షెడ్యూల్డు కులాలు, తెగలకు చెందిన ధనిక వర్గాలవారు విద్యాసంస్థల్లో ప్రవేశాలతోపాటు ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ల సదుపాయం పొందకుండా నిరోధించేందుకు ప్రమాణాలను నిర్ణయించాల్సిందిగా కోరుతూ సుప్రీంకోర్టులో వ్యాజ్యం దాఖలైంది. దీంతో అభిప్రాయం చెప్పాల్సిందిగా మంగళవారం కేంద్ర ప్రభుత్వాన్ని అత్యున్నత న్యాయస్థానం కోరింది. అయితే దీనికి గడువు విధించలేదు. 2024 ఆగస్టు 1న సుప్రీం కోర్టు రిజర్వేషన్లపై వెలువరించిన చరిత్రాత్మక తీర్పును అమలు చేయాలని కోరుతూ ఓ.పి. శుక్లా ఒక పిటిషన్ దాఖలు చేయగా.. సమతా ఆందోళన్ సమితి అనే సంస్థ మరో పిటిషన్ వేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ ఎన్.వి. అంజారియాలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్లపై విచారణ చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం కొంత కాలం తర్వాత తన స్పందనను తెలియజేయవచ్చని ధర్మాసనం సూచించింది. మండల్ కమిషన్ తీర్పు సమయంలో సుప్రీంకోర్టు క్రీమీలేయర్ సూత్రాన్ని తొలిసారి అమల్లోకి తెచ్చింది. దీని ప్రకారం ఓబీసీల్లోని క్రీమీలేయర్ వర్గానికి చెందినవారు విద్యా సంస్థల్లో ప్రవేశాలు పొందడంలో, ప్రభుత్వోద్యోగాల్లో రిజర్వేషన్లు పొందడానికి వీల్లేకుండా పోయింది. ఎస్సీల వర్గీకరణ చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు రాజ్యాంగం అధికారం కల్పించిందని పేర్కొంటూ గతంలో జస్టిస్ డి.వై. చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల ధర్మాసనం తీర్పు వెలువరించింది. షెడ్యూల్డు కులాలకూ క్రీమీ లేయర్ సూత్రం వర్తించాలన్న వాదన న్యాయబద్ధమైనదేనని నాటి ధర్మాసనంలో సభ్యుడిగా ఉన్న చీఫ్ జస్టిస్ (రిటైర్డ్) జస్టిస్ బి.ఆర్.గవాయ్ పేర్కొన్నారు. 'స్టేట్ ఆఫ్ పంజాబ్ వర్సెస్ దేవేందర్ సింగ్ అండ్ అదర్స్' కేసులో ఏడుగురు సభ్యుల ధర్మాసనం జారీ చేసిన ఆదేశాలను అమలు చేయాల్సిందిగా కేంద్రాన్ని ఆదేశించాలని పిటిషన్‌దారులు కోర్టును అభ్యర్థించారు.

సోదాలపై ముందస్తు నోటీసులిస్తే మొదటికే మోసం: సుప్రీంకోర్టు

దిల్లీ: ఆదాయపు పన్ను అధికారులు ఎవరైనా పన్ను చెల్లింపుదారుని ఇల్లు, కార్యాలయాన్ని సోదా చేయదలచుకుంటే ముందస్తు నోటీసు ఇవ్వాలనడం మొదటికే మోసం తెస్తుందని సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం మంగళవారం వ్యాఖ్యానించింది. సోదా జరపడానికి ముందే నోటీసు ఇస్తే.. ఈ డిజిటల్ యుగంలో ఎలక్ట్రానిక్ రికార్డులను వేగంగా మాయం చేసే ప్రమాదం ఉందని పేర్కొంది. దీనివల్ల అసలు ఆరంభం కాకుండానే దర్యాప్తు ముగిసిపోవచ్చని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఆదాయపు పన్ను శాఖకు చట్టమిచ్చిన అధికారాలు అడ్డూఅదుపూ లేనివి కావని సీజేఐ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. సోదా, స్వాధీనాలకు సంబంధించి ఆదాయపు పన్ను చట్టంలోని 132వ సెక్షన్‌ను అధికారులు దుర్వినియోగపరిచే అవకాశం ఉందంటూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని సుప్రీం విచారిస్తోంది. వాదప్రతివాదాలు విన్న తరవాత విచారణను సుప్రీం రెండు వారాలపాటు వాయిదా వేసింది.

మెలాస్మాకు ఆయుర్వేద ఔషధం

భోపాల్: గర్భధారణ, గర్భనిరోధక చర్యల కారణంగా సంభవించే హార్మోన్ మార్పులు, సూర్యరశ్మిలోని యూవీ కిరణాలు, జన్యు ప్రభావాల కారణంగా ఎక్కువగా మహిళల్లో చెక్కిళ్లు, నుదురు, ముక్కు భాగంలో గులాబీ, ఎరుపు, గోధుమ రంగు మచ్చలు ఏర్పడుతూ ఉంటాయి. ఈ స్థితిని మెలాస్మా అని వ్యవహరిస్తారు. ఈ మచ్చల్ని పూర్తిగా నిర్మూలించే ఔషధాన్ని భోపాల్‌కు చెందిన పండిట్ ఖుషిలాల్ శర్మ ఆయుర్వేదిక్ ఇన్‌స్టిట్యూట్ అభివృద్ధిచేసింది. పది మూలికలతో తయారు చేసిన ఈ ఔషధం అత్యంత సమర్థంగా పనిచేస్తుందని అధ్యయనాల్లో వెల్లడైంది.

మెలాస్మాకు హార్మోన్ మార్పులతో ప్రత్యక్ష సంబంధం ఉందని పరిశోధనలో పాల్గొన్న కాజల్ జైన్ తెలిపారు. అందుకే గర్భిణులకు ఈ మచ్చలు ఎక్కువగా వస్తుంటాయి. కొన్నిసార్లు ఎండ ప్రభావం కూడా ఈ వ్యాధికి దారితీస్తూ ఉంటుంది. అత్యంత ప్రభావవంతమైన రక్త చందనం, గిలోయ, పటోల, కుట్కి తదితర పది మూలికల్ని నువ్వుల నూనెతో మేళవించి తమ ఇన్‌స్టిట్యూట్ ఈ ఔషధాన్ని తయారు చేసిందని కాజల్ జైన్ తెలిపారు.



దిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసిన క్రికెటర్ రవీంద్ర జడేజా, ఆయన సతీమణి గుజరాత్ రాష్ట్ర మంత్రి రివాబా జడేజా

ప్రధాని మోదీ విద్యార్హత కేసు..

అప్పీళ్ల జాప్యంపై అభ్యంతరాల దాఖలుకు దిల్లీ విశ్వవిద్యాలయానికి మూడు వారాల గడువు

దిల్లీ: ప్రధాని మోదీ చదివిన డిగ్రీ వివరాల వెల్లడికి నిరాకరించిన ఏకసభ్య ధర్మాసనం ఉత్తర్వును సవాల్ చేసిన అప్పీళ్ల జాప్యంపై అభ్యంతరాల దాఖలుకు దిల్లీ విశ్వవిద్యాలయాని(డీయూ)కి దిల్లీ హైకోర్టు మంగళవారం మూడు వారాల గడువునిచ్చింది. డీయూ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ...'సంచలనం సృష్టించాలన్న ఉద్దేశం మినహా ఈ కేసులో మరేమీ లేదు' అని తెలిపారు. 2025 ఆగస్టులో వెలువడిన ఏకసభ్య ధర్మాసనం ఉత్తర్వులను సవాల్ చేస్తూ అప్పీళ్లు దాఖలు చేయడంలో జాప్యంపై, పిటిషన్ అర్హతపై సమాధానం ఇవ్వడానికి సమయం కోరారు. ఈ అభ్యర్థనకు సమ్మతించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.కె.ఉపాధ్యాయ, జస్టిస్ తేజస్ కరియా ధర్మాసనం కేసు విచారణను ఏప్రిల్ 27కు వాయిదావేసింది. అభ్యంతరం తెలపడానికి కోర్టు అనుమతించినప్పటికీ రెండున్నర నెలల తర్వాత కూడా డీయూ దానిని దాఖలు చేయలేదని పిటిషనర్ తరఫు న్యాయవాది తెలిపారు.

ఎన్ఐఏ ప్రత్యేక కోర్టుల ఏర్పాటుపై 17 రాష్ట్రాల స్పందన కోరిన సుప్రీంకోర్టు

దిల్లీ: ఉగ్రవాద నిరోధక చట్టాల కింద నమోదైన కేసులు పదికిపైగా పెండింగ్ ఉన్న రాష్ట్రాల్లో ప్రత్యేక ఎన్ఐఏ కోర్టులు ఏర్పాటు చేయాలన్న కేంద్ర హోంశాఖ ప్రతిపాదనకు సమాధానమివ్వాలని 17 రాష్ట్రాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. దీనికి సంబంధించి నోటీసులు జారీ అయిన వాటిల్లో గుజరాత్, మహారాష్ట్ర, దిల్లీ తదితర రాష్ట్రాలు ఉన్నాయి. ఈ ప్రత్యేక కోర్టులకు ఆర్థిక సహాయం నిబంధనలను కూడా హోం శాఖ ఖరారు చేసిందని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ ఎన్.వి.అంజారియా ధర్మాసనానికి అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యా భాటీ మంగళవారం తెలియజేశారు. మూడు వారాల్లోగా సమాధానం ఇవ్వాలని రాష్ట్రాలను ధర్మాసనం ఆదేశించింది.

అస్సాం సీఎం వివాదాస్పద వీడియోపై వామపక్షాల పిటిషన్ పరిశీలనకు సుప్రీం సమ్మతి

దిల్లీ: ముస్లిం సామాజికవర్గం వ్యక్తులపై రైఫిల్ ఎక్కుపెట్టి కాల్పులు జరుపుతున్నట్లుగా వ్యాప్తిలోకి వచ్చిన వీడియోకి సంబంధించి అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మపై చర్యలు తీసుకోవాలని వామపక్షాల నేతలు కోరారు. ఈ మేరకు వారు దాఖలు చేసిన పిటిషన్ మంగళవారం సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ ఎన్.వి.అంజారియా ధర్మాసనం ముందుకు వచ్చింది. విచారణ జాబితాలో చేర్చే అంశాన్ని పరిశీలిస్తామని ధర్మాసనం తెలిపింది. త్వరలో అస్సాం అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న విషయాన్ని గుర్తు చేస్తూ.... సగం ఎన్నికల పోరాటం న్యాయస్థానంలో జరగటమే అసలు సమస్య అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

భారత్‌లో ఇద్దరు జపాన్ పర్యాటకుల అదృశ్యం!

ఈటీవీ భారత్: రాజస్థాన్ రాజధాని జైపుర్‌లో పర్యటిస్తున్న ఇద్దరు జపాన్ పర్యాటకులు కనిపించకుండా పోయారు. వాళ్ల బ్యాగులను ట్యాక్సీలో వదిలి భోజనం కోసం హోటల్‌కు వెళ్లిన వారు మళ్లీ తిరిగి రాకపోవడంతో ట్యాక్సీ డ్రైవర్ పోలీసులకు సమాచారం అందించాడు. జపాన్‌కు చెందిన హిబికి షిబా, యుమా అనే ఇద్దరు పర్యాటకులు ఈ నెల 6న పర్యాటక వీసాలతో దిల్లీకి వచ్చారు. వారు ఒక ట్యాక్సీని బుక్ చేసుకుని.. 7న జైపుర్‌కు చేరుకున్నారు. అదే రోజు రాత్రి అశోక్ నగర్‌లోని ఓ రెస్టారెంట్‌కు డిన్నర్ కోసం వెళ్లారు. తమ బ్యాగ్‌లను ట్యాక్సీలోనే వదిలి వెళ్లిన వారు.. ఎంత సేపటికీ తిరిగి రాకపోవడంతో ట్యాక్సీ డ్రైవర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు గాలింపు చర్యలు మొదలు పెట్టారు. రెస్టారెంట్‌కు వెళ్లిన 5 నిమిషాల్లోనే వారు బయటకు వచ్చేసినట్లు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు నిర్ధారించారు. వారు రెస్టారెంట్ బయటకు వచ్చి.. వీధిలో నడుచుకుంటూ వెళ్లారని పోలీసు అధికారి మోతీలాల్ శర్మ వెల్లడించారు. ఆ తరువాత ఎక్కడికి వెళ్లారనే దానిపై ఎలాంటి ఆధారాలు లభించలేదని తెలిపారు.

పార్లమెంటరీ వ్యవస్థ పూర్వ వైభవాన్ని కోల్పోయింది: జైరాం రమేశ్

దిల్లీ: దేశ తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ నిర్మించిన పార్లమెంటరీ వ్యవస్థ ఇప్పుడు తన పూర్వ వైభవాన్ని కోల్పోయి, వెలవెలబోతోందని కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్స్) జైరాం రమేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. 1954లో అప్పటి స్పీకర్ తొలగింపు తీర్మానంపై చర్చ సందర్భంగా.. ప్రతిపక్షాలకు ఎక్కువ సమయం కేటాయించాలని, నెహ్రూ చెప్పిన ఉదంతాన్ని ఆయన గుర్తుచేశారు. గతవారం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై పెట్టిన చర్చలో రాహుల్ గాంధీని, ఇతర ప్రతిపక్ష నేతలను మాట్లాడనివ్వకుండా స్పీకర్ అడ్డుకోవడంపై విపక్షాలు నిరసన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని ప్రతిపక్షాలు యోచిస్తున్న నేపథ్యంలో.. 1954 డిసెంబరు 18 నాటి లోక్‌సభ చర్చల వివరాలను 'ఎక్స్'లో జైరాం గుర్తుచేశారు. నాటి స్పీకర్ జి.వి.మౌలాంకర్ తొలగింపు తీర్మానంపై చర్చ జరిగిన తీరును వివరించారు.

కార్పొరేట్ ప్రపంచం వదిలి ఆటో డ్రైవర్‌గా..



ఇంటర్నెట్ డెస్క్: కార్పొరేట్ జాబ్ అంటే రూ.లక్షల్లో జీతం.. సౌకర్యవంతమైన జీవితం. ఈ ఉద్యోగాలు పొందేందుకు ఎంతో మంది కలలు కంటుంటారు. అయితే ఓ వ్యక్తి మాత్రం ఆ రంగాన్ని వదిలి, ఆటోడ్రైవర్‌గా మారిపోయాడు. భారీ జీతం లేకపోయినా.. మనశ్శాంతిని వెతుక్కున్నాడు. బెంగళూరుకు చెందిన రాకేశ్ కార్పొరేట్ ఉద్యోగం చేస్తూ. . మంచి జీతం పొందేవారు. తన కుటుంబాన్ని ఏ లోటు లేకుండా చూసుకునేవారు. కానీ మరోవైపు.. తన ఉద్యోగ జీవితంలో ఒత్తిడి సాధారణమైపోయింది. దాంతో మానసికంగా అలసిపోయేవారు. దానిని ఎదుర్కొనే క్రమంలో ఏదో తెలియని ఉద్వేగానికి గురయ్యేవారు. దాంతో 2022లో ఉద్యోగాన్ని వదిలేశారు. దాంతో కొంచెం ఊపిరి పీల్చుకున్నట్లుగా అనిపించింది. కానీ మరోవైపు ఆర్థిక ఇబ్బందులు మొదలయ్యాయి. చిన్న పాప, వృద్ధాప్యంలో ఉన్న తల్లి.. ఇంటి బాధ్యతలు కంటిముందు కనిపిస్తున్నాయి. దీంతో మళ్లీ ఒత్తిడి మొదలైంది. రోజువారీ అవసరాలు తీర్చుకోవడానికి చిన్న ఉద్యోగాలు చేయడం ప్రారంభించారు. ఇలా ఒక ఏడాది పని చేసి, కొంత డబ్బు దాచుకున్నారు. స్వేచ్ఛగా పని చేయగలిగే ఉపాధి గురించి ఆలోచించారు. చివరకు బ్యాంకులో రుణం తీసుకుని ఒక ఆటో రిక్షా కొనుగోలు చేశారు. ఇప్పుడు రోజుకు రూ.600 నుంచి రూ.800 వరకూ సంపాదిస్తున్నారు. కానీ ఎలాంటి ఒత్తిడి లేకుండా తన పని తాను చేసుకుపోతున్నారు రాకేశ్. ఈ కొత్త లైఫ్ తనకు మానసికంగా సంతృప్తినిస్తోందని రాకేశ్ వెల్లడించారు. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట్లో వైరల్‌గా మారింది.

కరెంట్ అఫైర్స్

మాదిరి ప్రశ్నలు

★ బెర్క్‌షైర్ హత్‌వే నూతన చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ)గా 2026, జనవరి 1న ఎవరు బాధ్యతలు చేపట్టారు? (1965 నుంచి ఈ పదవిలో కొనసాగిన లెజెండరీ ఇన్వెస్టర్ వారెన్ బఫెట్ తాజాగా పదవి నుంచి వైదొలిగారు. 95 ఏళ్ల వారెన్ బఫెట్ బెర్క్‌షైర్ హత్‌వే ఛైర్మన్‌గా కొనసాగుతారు.)



జ: గ్రెగ్ అబెల్

★ కేంద్ర ప్రభుత్వ తాజా గణాంకాల ప్రకారం 2024-25 ఆర్థిక సంవత్సరంలో దేశంలో ఎన్ని లక్షలకు పైగా దేశీయ ట్రేడ్ మార్క్ రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి? (ఓ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు ఇలా అత్యధిక సంఖ్యలో ట్రేడ్ మార్క్ రిజిస్ట్రేషన్లు నమోదు కావడం ఇదే మొదటిసారి.)

జ: 5.5 లక్షలు

★ ఉన్నత విద్య ప్రపంచీకరణపై ఇటీవల విడుదలైన నీతి ఆయోగ్ నివేదిక భారత్‌లోని ఏ విశ్వవిద్యాలయాన్ని ప్రపంచ ఉన్నత విద్యకు ఓ నమూనాగా ప్రశంసించింది? జ: గుజరాత్ బయోటెక్నాలజీ విశ్వవిద్యాలయం

(ఉన్నత విద్యను ప్రపంచీకరించడానికి జాతీయ విద్యావిధానం 2020, వికసిత్ భారత్@2047లను సమన్వయం చేస్తూ ప్రపంచ విశ్వవిద్యాలయాలను ఆకర్షించడానికి, భారతీయ ప్రతిభను ప్రోత్సహించడానికి జీబీయూ మార్గదర్శక నమూనాగా ఉందని నీతి ఆయోగ్ నివేదిక ప్రశంసించింది.)

మరింత సమాచారం

కమ్మీ చిత్రాలు

(బార్ డయాగ్రమ్స్)

బార్‌గ్రాఫ్ దీర్ఘ చతురస్రాకార కమ్మీల రూపంలో ఉంటుంది. నిర్దిష్ట దత్తాంశాన్ని సూచించడానికి ఉపయోగిస్తారు. దీనిలో ప్రతి బార్ పొడవు అది సూచించే విలువకు అనులోమానుపాతంలో ఉంటుంది. సంక్లిష్టమైన డేటాను సులభంగా అర్థం చేసుకోవడానికి ఉపయోగపడతాయి. ఉత్పత్తి వారీగా అమ్మకాలు, ప్రాంతాల వారీగా ఆదాయాల సర్వే, ప్రతిస్పందనలు, వర్ణాలు, సమూహాలను పోల్చడానికి దోహదపడతాయి.

అందరికీ ప్రతి రోజూ అనేక రకాల సమాచారం తెలుస్తుంటుంది. అందులో క్రికెట్ స్కోర్లు, తరగతిలో విద్యార్థుల హాజరు, వారి మార్కులు, ఊరిలో కురిసిన వర్షపాతం తదితరాలు ఎన్నో ఉంటాయి. సంబంధిత అంకెలు లేదా సంఖ్యలను చూసినప్పుడు వాటిలో ఎక్కువ తక్కువలను వెంటనే కనిపెట్టడం కష్టం. కానీ అదే ఆ సమాచారం రంగురంగుల కమ్మీల రూపంలో ఎదురుగా ఉంటే చూడగానే అర్థమైపోతుంది. అంటే సంఖ్యల రూపంలో ఉన్న సమాచారాన్ని వేర్వేరు పొడవులు కలిగిన స్తంభాలు లేదా కమ్మీల రూపంలో ప్రదర్శించే పటాలే కమ్మీ చిత్రాలు. అభ్యర్థుల గణిత సామర్థ్యాలను, విశ్లేషణాత్మక నైపుణ్యాలను అంచనా వేయడానికి పోటీ పరీక్షల్లో ఈ కమ్మీ చిత్రాలపై ప్రశ్నలు అడుగుతుంటారు. వాటికి సరైన సమాధానాలను వేగంగా, కచ్చితంగా గుర్తించాలంటే దత్తాంశ సేకరణ, దాని నిర్వహణ గురించి తెలుసుకోవాలి. కమ్మీ చిత్రాల్లోని అక్షాలు, శీర్షిక, స్కేలు, కమ్మీలు అనే నాలుగు భాగాలపై అవగాహన పెంచుకోవాలి.




సంఖ్యల సమాచారానికి నిలువెత్తు రూపాలు!

మాదిరి ప్రశ్నలు

జనరల్ స్టడీస్ – అరిథ్‌మెటిక్

I. కింది బార్ చిత్రాన్ని గమనించి, ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

2004, మార్చిలో 5 కంపెనీల్లోని టీవీల డిమాండ్, ఉత్పత్తిని సూచించే బార్ చిత్రం.



1. ఉత్పత్తి కంటే తక్కువ డిమాండ్ ఉన్న కంపెనీలు, డిమాండ్ కంటే తక్కువ ఉత్పత్తి ఉన్న కంపెనీల మధ్య నిష్పత్తి ఎంత?

1) 1 : 2 2) 2 : 1
3) 2 : 3 4) 3 : 2

వివరణ: బార్ చిత్రం నుంచి,
ఉత్పత్తి కంటే డిమాండ్ తక్కువ ఉన్న కంపెనీలు – ఎ, బి, ఇ = 3
డిమాండ్ కంటే ఉత్పత్తి తక్కువ ఉన్న కంపెనీలు – సి, డి = 2
∴ కావాల్సిన నిష్పత్తి = 3 : 2 **జ: 4**

2. అన్ని కంపెనీల సగటు డిమాండ్, సగటు ఉత్పత్తుల మధ్య భేదం ఎంత?

1) 180 2) 280 3) 380 4) 480

వివరణ: బార్ చిత్రం నుంచి,
అన్ని కంపెనీల సగటు ఉత్పత్తి

$$= \frac{3000 + 600 + 2500 + 1200 + 3300}{5}$$

$$= \frac{10600}{5} = 2120.$$




అన్ని కంపెనీల సగటు డిమాండ్

$$= \frac{1500 + 1800 + 1000 + 2700 + 2200}{5}$$

$$= \frac{9200}{5} = 1840$$

∴ కావాల్సిన భేదం = 2120 – 1840 = 280 **జ: 2**

III. కింది బార్ చిత్రాన్ని గమనించి, ప్రశ్నలకు సమాధానాలు రాయండి.




1. 2001–02లో మొత్తం విద్యార్థుల సంఖ్య, అదే సంవత్సరంలో కామర్స్ చదివే విద్యార్థుల సంఖ్యకు ఎన్ని రెట్లు?

1) 2 2) 3 3) 4 4) 5

వివరణ: 2001 – 02లోని మొత్తం విద్యార్థుల సంఖ్య
= 550 + 500 + 250 + 200
= 1500
2001 – 02లో కామర్స్ చదివే విద్యార్థుల సంఖ్య = 500
∴ 3 రెట్లకు సమానం
= 3 × 500
= 1500 **జ: 2**

II. పక్కన ఉన్న బార్ చిత్రంలో 2004-05లో వివిధ దేశాలకు సంబంధించిన రత్నాలు, ఆభరణాల ఎగుమతులు (బిలియన్లలో) ఇచ్చారు. దాని ఆధారంగా ప్రశ్నలకు జవాబులు రాయండి.



1. అన్ని దేశాల ఎగుమతులు, బార్ చిత్రంలో కింద నుంచి ఆరు దేశాల ఎగుమతుల మొత్తం నిష్పత్తి ఎంత?

1) 2 : 3 2) 3 : 2 3) 1 : 6 4) 6 : 1

వివరణ: అన్ని దేశాల ఎగుమతుల మొత్తం = 69.5
బార్ చిత్రంలో కింది నుంచి 6 దేశాల ఎగుమతుల మొత్తం = 3.3 + 2.5 + 1.6 + 1.6 + 1.6 + 1.1 = 11.7
∴ కావాల్సిన నిష్పత్తి
= 11.7 : 69.5 = 1 : 6 **జ: 3**

2. 2004–05లో ఏ దేశం ఎగుమతులను రెండింతలు చేస్తే మొత్తం ఎగుమతుల సగటుకు సమానం అవుతుంది?

1) జపాన్ 2) థాయ్‌లాండ్
3) ఇజ్రాయెల్ 4) యూఏఈ

వివరణ: మొత్తం ఎగుమతుల సగటు

$$= \frac{\text{మొత్తం ఎగుమతులు}}{\text{10 దేశాలు}} = \frac{69.5}{10} = 6.95$$

ఇది యూఏఈ దేశం ఎగుమతికి రెండు రెట్లు (సుమారుగా)
= 3.3 × 2 = 6.6 **జ: 4**

3. హాంకాంగ్ ఎగుమతులు జర్మనీ ఎగుమతులకు ఎన్ని రెట్లు?

1) 3 2) 4 3) 5 4) 10

వివరణ: హాంకాంగ్ ఎగుమతులు = 10.6
జర్మనీ ఎగుమతులు = 1.1
∴ సుమారుగా 10 రెట్లు
= 1.1 × 10
= 10 **జ: 4**



రచయిత: జె.వి.ఎస్.రావు

TENTH English – A Long Walk to Freedom: Nelson Mandela



Read the following passage carefully.

But then I slowly saw that not only was I not free, but my brothers and sisters were not free. I saw that it was not just my freedom that was curtailed, but the freedom of everyone who looked like I did. That is when I joined the African National Congress, and that is when the hunger for my own freedom became the greater hunger for the freedom of my people. It was this desire for the freedom of my people to live their lives with dignity and self-respect that animated my life, that transformed a frightened young man into a bold one, that drove a law-abiding attorney to become a criminal, that turned a family-loving husband into a man without a home, that forced a life-loving man to live like a monk. I am no more virtuous or self-sacrificing than the next man, but I found that I could not even enjoy the poor and limited freedoms I was allowed when I knew my people were not free. Freedom is indivisible; the chains on any one of my people were the chains on all of them, the chains on all of my people were the chains on me. **(A Long Walk to Freedom)**

Now, answer the following questions. **(5 x 2 = 10)**

1. What did the narrator realise gradually?
2. The narrator joined African National Congress. What was the outcome of that?
3. 'I saw that it was not just my freedom that was curtailed'. What does the word 'curtailed' mean?
   A) consented B) reduced C) increased
4. The sole reason for the transformation in the young man
   A) the need for power
   B) psychological satisfaction
   C) urge for liberty
5. What is the essence of the passage?
   A) The wish to be successful in career
   B) The problems in leading a race
   C) The transformation of a leader

Final Exams-2026 IMPORTANT Q & A

Answers: 1A: He gradually realised that not only he but all his brothers and sisters were not free and that the freedom of everyone who looked like him was curtailed.
2A: After joining the African National Congress, his personal hunger for freedom changed into a greater hunger for the freedom of his people and his whole life was devoted to their struggle.
3A: (B), 4A: (C),
5A: (C)

For more IMP Q & A



Writer: A. Madhubabu

చట్టాల చెల్లుబాటును పరీక్షించే సమీక్ష!




ప్రజాస్వామ్య దేశంలో పౌరహక్కుల పరిరక్షణకు దోహదపడే కీలక అంశం న్యాయవ్యవస్థ క్రియాశీలత. శాసన, కార్యనిర్వాహక వ్యవస్థలు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించనప్పుడు, రాజ్యాంగ నిర్దేశాలను అతిక్రమించినప్పుడు న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోవడమే క్రియాశీలత. దేశ ప్రజలకు సామాజిక న్యాయాన్ని అందించడానికి, ప్రభుత్వంలో జవాబుదారీతనాన్ని పెంచడానికి ఉన్నత న్యాయస్థానాలకు సహేతుక అధికార పరిధిని కల్పించే ఈ ప్రక్రియపై పోటీ పరీక్షార్థులు తగిన అవగాహన కలిగి ఉండాలి. న్యాయవ్యవస్థ క్రియాశీలతకు ప్రధాన సాధనాలైన న్యాయసమీక్ష, ప్రజాప్రయోజన వ్యాజ్యాల గురించి తెలుసుకోవాలి. న్యాయసమీక్షకు గురయ్యే, గురికాని అంశాలను, వాటిపై గతంలో సుప్రీంకోర్టు వెలువరించిన ముఖ్యమైన తీర్పులను, వ్యక్తుల హక్కులపై ఇచ్చిన మార్గదర్శకాలను, సంబంధిత రాజకీయ పరిణామాలను గుర్తుంచుకోవాలి.

జనరల్ స్టడీస్ - ఇండియన్ పాలిటీ

న్యాయవ్యవస్థ క్రియాశీలత

1. అమెరికా సుప్రీంకోర్టు న్యాయమూర్తి జాన్ మార్షల్ 1803లో ఏ కేసు సందర్భంగా ఇచ్చిన తీర్పు ప్రపంచంలో 'న్యాయ సమీక్ష' భావనకు పునాదిగా పేర్కొంటారు?



జాన్ మార్షల్


1) మార్బురీ Vs మాడిసన్ కేసు
2) వాషింగ్టన్ Vs మేరీజోన్స్ కేసు
3) జాన్ అబ్రహాం Vs జాన్ లింకన్ కేసు
4) స్లావెరీ యూనియన్ Vs రిచర్డ్ కేసు

2. భారత న్యాయవ్యవస్థకు న్యాయ సమీక్షాధికారాన్ని కల్పించాలని ప్రతిపాదించిన రాజ్యాంగ సభ సభ్యుడు?
1) అల్లాడి కృష్ణ స్వామి అయ్యర్
2) మహ్మద్ సయ్యద్ సాదుల్లా
3) కె.ఎం.మున్షీ 4) టి.టి.కృష్ణమాచారి

3. న్యాయవ్యవస్థకు న్యాయ సమీక్షాధికారాన్ని కల్పించేందుకు కారణం?
ఎ) ప్రభుత్వ అధికార దుర్వినియోగాన్ని నియంత్రించడం
బి) ప్రాథమిక హక్కులను పరిరక్షించడం
సి) రాజ్యాంగ ఆధిక్యతను కాపాడటం
డి) సమాఖ్య వ్యవస్థలో చెలరేగే వివాదాలను పరిష్కరించడం
1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

4. భారత సుప్రీంకోర్టు తొలిసారిగా న్యాయ సమీక్షాధికారాన్ని ఏ కేసు సందర్భంగా వినియోగించింది?
1) శంకరీ ప్రసాద్ Vs యూనియన్ ఆఫ్ ఇండియా కేసు (1951)
2) సజ్జన్ సింగ్ Vs యూనియన్ ఆఫ్ ఇండియా కేసు (1951)
3) బెరుబారి Vs యూనియన్ ఆఫ్ ఇండియా కేసు (1960)
4) గోలక్‌నాథ్ Vs స్టేట్ ఆఫ్ పంజాబ్ కేసు (1967)

5. 'న్యాయ సమీక్షాధికారం భారత రాజ్యాంగ మౌలిక స్వరూపంలో అంతర్భాగం' అని సుప్రీంకోర్టు ఏ కేసు సందర్భంగా తీర్పునిచ్చింది?
1) పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ Vs యూనియన్ ఆఫ్ ఇండియా కేసు (1966)




2) మోహినీ జైన్ Vs స్టేట్ ఆఫ్ కర్ణాటక కేసు(1961)
3) మినర్వామిల్స్ Vs యూనియన్ ఆఫ్ ఇండియా కేసు (1980)
4) మేనకా గాంధీ Vs యూనియన్ ఆఫ్ ఇండియా కేసు (1978)

6. 'న్యాయ సమీక్ష' అర్థ వివరణకు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
ఎ) "శాసన వ్యవస్థ రూపొందించే శాసనాలు, ప్రభుత్వం అమలుపరచే పరిపాలనా విధానాలు రాజ్యాంగ నియమాలకు వ్యతిరేకంగా ఉంటే అవి చెల్లవు" అని న్యాయశాఖ తీర్పునివ్వడాన్నే న్యాయ సమీక్ష అంటారు.
బి) శాసనవ్యవస్థ రూపొందించే శాసనాలు, ప్రభుత్వం అమలుపరచే పరిపాలనా విధానాలు రాజ్యాంగబద్ధంగా ఉంటే వాటిని 'ఇంట్రావైర్స్' అంటారు.
సి) శాసన వ్యవస్థ రూపొందించే శాసనాలు, ప్రభుత్వం అమలుపరచే పరిపాలనా విధానాలు రాజ్యాంగ విరుద్ధంగా ఉంటే వాటిని 'అల్ట్రావైర్స్' అంటారు.
1) ఎ, బి, సి 2) ఎ, సి 3) ఎ, బి 4) బి, సి


7. ఇందిరాగాంధీ ప్రభుత్వ కాలంలో న్యాయస్థానాలకు ఉన్న న్యాయ సమీక్షాధికారాన్ని ఏ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా పరిమితం చేశారు?
1) 24వ రాజ్యాంగ సవరణ చట్టం, 1971
2) 25వ రాజ్యాంగ సవరణ చట్టం, 1971
3) 39వ రాజ్యాంగ సవరణ చట్టం, 1975
4) 42వ రాజ్యాంగ సవరణ చట్టం, 1976

8. మొరార్జీ దేశాయ్ నేతృత్వంలోని జనతా ప్రభుత్వం ఏ రాజ్యాంగ సవరణ ద్వారా న్యాయస్థానాలకు ఉన్న న్యాయ సమీక్షాధికారాన్ని పునరుద్ధరించింది?
ఎ) 77వ రాజ్యాంగ సవరణ చట్టం, 1977
బి) 43వ రాజ్యాంగ సవరణ చట్టం, 1977
సి) 44వ రాజ్యాంగ సవరణ చట్టం, 1978
డి) 45వ రాజ్యాంగ సవరణ చట్టం, 1978
1) ఎ, బి 2) ఎ, సి
3) బి, సి 4) ఎ, బి, సి, డి

9. మన దేశంలో ప్రజాప్రయోజన వ్యాజ్యాలకు ప్రాచుర్యం కల్పించడం ద్వారా న్యాయశాఖ క్రియాశీలతకు తోడ్పడిన సుప్రీంకోర్టు న్యాయమూర్తులను గుర్తించండి.



జస్టిస్ భగవతి



జస్టిస్ కృష్ణయ్యర్

1) జస్టిస్ పీఎన్ భగవతి, జస్టిస్ వీఆర్ కృష్ణయ్యర్
2) జస్టిస్ ఎఎస్ ఆనంద్, జస్టిస్ రంగనాథ్ మిశ్రా
3) జస్టిస్ కేజీ బాలకృష్ణన్, జస్టిస్ వైకే సబర్వాల్
4) జస్టిస్ వైవీ చంద్రచూడ్, జస్టిస్ గజేంద్ర గడ్కర్

10. రాజ్యాంగపు 9వ షెడ్యూల్‌లో పేర్కొన్న అంశాలను కూడా న్యాయసమీక్ష చేయవచ్చని ఏ కేసు సందర్భంగా సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది?
1) కామన్ కాజ్ Vs యూనియన్ ఆఫ్ ఇండియా కేసు
2) రిషి మల్హోత్రా Vs యూనియన్ ఆఫ్ ఇండియా కేసు
3) ఐ.ఆర్.కొల్హాయ్ Vs యూనియన్ ఆఫ్ ఇండియా కేసు
4) కేశవానంద భారతి Vs స్టేట్ ఆఫ్ కేరళ కేసు

11. భారత సుప్రీంకోర్టు కింద పేర్కొన్న ఏ అంశాన్ని న్యాయసమీక్షకు గురిచేయవచ్చు?
ఎ) ఆర్టికల్ 248 ప్రకారం అవశిష్ట అధికారాల నిర్ణయం.
బి) ఆర్టికల్ 13 ప్రకారం ప్రాథమిక హక్కులకు వ్యతిరేకంగా ఉండే చట్టాలు.
సి) ఆర్టికల్ 82 ప్రకారం డీలిమిటేషన్ కమిషన్ సిఫార్సుల మేరకు జరిపిన చట్టసభల నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ.
డి) ఆర్టికల్ 132 ప్రకారం రాజ్యాంగబద్ధమైన అప్పీళ్ల విచారణ.
1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

12. కింద పేర్కొన్న ఏ అంశాన్ని సుప్రీంకోర్టు న్యాయసమీక్ష చేయడానికి అవకాశం లేదు?
ఎ) ఆర్టికల్ 361 ప్రకారం రాష్ట్రపతి, గవర్నర్లకు కల్పించే ప్రత్యేక రక్షణలు.
బి) ఆర్టికల్ 368 ప్రకారం పార్లమెంటు చేసే రాజ్యాంగ సవరణ చట్టాలు.
సి) రాజ్యాంగపు 5వ షెడ్యూల్‌లో పేర్కొన్న షెడ్యూల్డు జాతులు, షెడ్యూల్డు తెగల పరిపాలన అంశాలు.
డి) ఆర్టికల్ 105 ప్రకారం పార్లమెంటు సభ్యులకు కల్పించే ప్రత్యేక వసతులు, సదుపాయాలు.
1) ఎ, సి, డి 2) ఎ, బి, సి
3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

13. కార్యనిర్వాహక శాఖ నుంచి న్యాయశాఖను వేరు చేయాలని రాజ్యాంగంలోని ఏ ఆర్టికల్ పేర్కొంది?
1) ఆర్టికల్ 49 2) ఆర్టికల్ 50
3) ఆర్టికల్ 51 4) ఆర్టికల్ 51 (ఎ)

14. వెనుకబడిన వర్గాలవారికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో 27% రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగబద్ధమేనని ఏ కేసు సందర్భంగా సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది?
1) ఇందిరాసహాని Vs యూనియన్ ఆఫ్ ఇండియా కేసు
2) ఎస్.పి.గుప్తా Vs యూనియన్ ఆఫ్ ఇండియా కేసు
3) పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ Vs యూనియన్ ఆఫ్ ఇండియా కేసు
4) ఐ.ఆర్.కొల్హాయ్ Vs స్టేట్ ఆఫ్ తమిళనాడు కేసు

15. సామాజిక న్యాయ ధర్మాసనానికి సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
ఎ) సుప్రీంకోర్టు 2014, డిసెంబరు 3న సామాజిక న్యాయ ధర్మాసనాన్ని ఏర్పాటు చేసింది.
బి) 2014, డిసెంబరు 12 నుంచి ప్రతి శుక్రవారం సమావేశమవుతుంది.
సి) మహిళలు, అణగారిన వర్గాలకు చెందిన కేసులను విచారిస్తుంది.
1) ఎ, బి 2) ఎ, సి 3) బి, సి 4) ఎ, బి, సి

16. భర్తను అతడి తల్లిదండ్రుల నుంచి వేరుచేయడం క్రూరత్వం కిందకు వస్తుందని 2016లో ఏ కేసు సందర్భంగా సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది?
1) నరేంద్ర Vs కె.మీనా 2) మిశ్రా Vs సీమాసేన్
3) చలమేశ్వర్ Vs రేవతి 4) నారాయణ్ Vs శ్రీదేవి

17. వివాహాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేయాలని 2008లో సుప్రీంకోర్టు ఏ కేసు సందర్భంగా తీర్పునిచ్చింది?
1) శారదా Vs కుట్టియన్ 2) బ్రిజ్‌భూషణ్ Vs రీమా
3) సీమా Vs అశ్వినీ కుమార్
4) అనూప్ మిశ్రా Vs రాగిని

18. న్యాయ ప్రక్రియలో లోపాలకు తావు లేకుండా ఉండేందుకు 'క్యూరేటివ్ పిటిషన్' విధివిధానాలను 2002లో ఏ కేసు సందర్భంగా సుప్రీంకోర్టు ప్రకటించింది?
1) రూప్ హుర్రా Vs అశోక్ హుర్రా కేసు
2) పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ Vs యూనియన్ ఆఫ్ ఇండియా కేసు
3) యంగ్ లాయర్స్ అసోషియేషన్ Vs యూనియన్ ఆఫ్ ఇండియా కేసు
4) బంధువా ముక్తి మోర్చా Vs యూనియన్ ఆఫ్ ఇండియా కేసు

19. కింద పేర్కొన్న అంశాల్లో సరైన జవాబు?
ఎ) న్యాయవ్యవస్థ క్రియాశీలత న్యాయ సమీక్షాధికారంలో అంతర్భాగం.
బి) ప్రజా ప్రయోజన వ్యాజ్యాల వల్ల క్రియాశీలత పెరిగింది.
సి) న్యాయవ్యవస్థ క్రియాశీలత వల్ల జీవించే హక్కు పరిధి పెరిగింది.
డి) ఒక చట్టం చెల్లుబాటును నిర్ణయించే అధికారం న్యాయవ్యవస్థకు మాత్రమే ఉండటం న్యాయవ్యవస్థ క్రియాశీలతకు మరొక కారణం.
1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

20. న్యాయమూర్తుల నియామకానికి ఉద్దేశించిన 'నేషనల్ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్ కమిషన్' చెల్లుబాటు కాదని ఏ కేసు సందర్భంగా 2015లో సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది?
1) సుప్రీంకోర్ట్ అడ్వకేట్స్ ఆన్ రికార్డ్ Vs యూనియన్ ఆఫ్ ఇండియా కేసు.
2) డెమొక్రటిక్ రిఫామ్స్ ఇన్ ఇండియా Vs యూనియన్ ఆఫ్ ఇండియా కేసు.
3) పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ Vs యూనియన్ ఆఫ్ ఇండియా కేసు.
4) మాధవరావు సింధియా Vs యూనియన్ ఆఫ్ ఇండియా కేసు.

21. ఖాప్ పంచాయతీలకు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.



ఎ) ఇవి మన దేశంలో కొన్ని రాష్ట్రాల్లో నేటికీ సాంప్రదాయబద్ధంగా కొనసాగుతూ గ్రామీణ న్యాయ విషయాల్లో తీర్పునిస్తూ గ్రామీణ సమాజాన్ని శాసిస్తున్నాయి.
బి) సమాజంపై ఆధిపత్యాన్ని కొనసాగించే 'ఖాప్ పంచాయతీ'లో పురుషులు మాత్రమే అధిపతులుగా వ్యవహరిస్తారు.
సి) గ్రామీణ ప్రాంతాల్లో కట్టుబాట్లు, వివాహాలు, విడాకులు, కులపరమైన అంశాలు మొదలైన అంశాలపై తీర్పులిస్తున్నాయి.
డి) ఖాప్ పంచాయతీలు రాజ్యాంగేతర, చట్టబద్ధేతర సమస్యలపై కూడా తీర్పులిస్తున్నాయి.
1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

22. ఖాప్ పంచాయతీలు రాజ్యాంగ విరుద్ధమైనవని, వాటిని వెంటనే నిరోధించాలని ఏ కేసు సందర్భంగా సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది?
1) ఆర్ముగంసెరవాయి Vs స్టేట్ ఆఫ్ తమిళనాడు కేసు
2) రతీనామ్ Vs యూనియన్ ఆఫ్ ఇండియా కేసు
3) జ్ఞాన్‌కౌర్ Vs యూనియన్ ఆఫ్ ఇండియా కేసు
4) జగత్‌నారాయణ్‌మిశ్రా Vs యూనియన్ ఆఫ్ ఇండియా కేసు

సమాధానాలు

1-1, 2-3, 3-4, 4-1, 5-3, 6-1, 7-4, 8-3, 9-1, 10-3, 11-3, 12-1, 13-2, 14-1, 15-4, 16-1, 17-3, 18-1, 19-4, 20-1, 21-4, 22-1.



ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
రీజనింగ్

పరిస్థితులపై పరీక్ష.. మెరుగైన స్పందనే జవాబు

పరిస్థితి - ప్రతిచర్య పరీక్ష

రీజనింగ్ విభాగంలో పరిస్థితి - ప్రతిచర్య పరీక్ష (Situation - Reaction Test) అంశం నుంచి ప్రశ్నలు అడుగుతుంటారు. సాధారణంగా ఈ విభాగానికి సంబంధించిన ప్రశ్నలు పోటీపరీక్షార్థుల్లోని సమయస్ఫూర్తిని పరీక్షించేలా ఉంటాయి. నిజజీవితంలో ఎదురయ్యే పరిస్థితులను ఆధారంగా చేసుకుని ప్రశ్నలు సంధిస్తుంటారు. ఆయా సమయాల్లో అభ్యర్థుల ప్రవర్తన, స్పందన సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు ఇవి ఉపయోగపడతాయి.

సూచన (ప్ర: 1 – 10): దిగువ ప్రశ్నల్లో నాలుగు సంభావ్యతలు ఉన్న సమాధానాలు ప్రత్యామ్నాయంగా ఉంటాయి. వాటిలో నుంచి సరైన దాన్ని గుర్తించండి.

1. మీ పనిమనిషి తన కుమార్తె వివాహానికి మిమ్మల్ని ఆహ్వానించింది. అప్పుడు మీరు....
1) ఆమెపై నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తాను.
2) వివాహానికి హాజరవుతాను.
3) వివాహం సందర్భంగా ఓ బహుమతి కొనుగోలు చేసి ఇస్తాను.
4) ఆమెను అభినందించి, వివాహానికి హాజరుకాలేనని చెబుతాను.

సాధన: ఇలాంటి పరిస్థితుల్లో వారు ఏదైనా సహాయం ఆశిస్తారు. కాబట్టి పనిమనిషి కుమార్తె వివాహం కోసం ఓ బహుమతిని కొనడం లేదా నగదు సహాయం సబబుగా ఉంటుంది.

సమాధానం: 3

2. మీ స్నేహితులకు పొగ తాగే అలవాటు ఉంది. మిమ్మల్ని కూడా తాగమని బలవంతం చేస్తే మీ స్పందన?
1) పొగ తాగడాన్ని నిరాకరిస్తాను.
2) వారి సమక్షంలో మాత్రమే పొగ తాగుతాను.
3) స్నేహితులు తాగమన్నారు. కాబట్టి పొగ తాగుతాను.
4) ఆయాసం ఉందని అబద్ధం చెప్పి పొగ తాగడాన్ని నిరాకరిస్తాను.

సాధన: చెడు అలవాట్లకు ఆకర్షితులు కాకుండా వాటిని నిరాకరించడం ఉత్తమ మార్గం. ఎందుకంటే ఈ ఆకర్షణలే భవిష్యత్‌లో హాని కారకమవడమే కాకుండా, ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి.

సమాధానం: 1

3. కోపం వచ్చినప్పుడు, సాధారణంగా మీరు?
1) వస్తువులను విసిరేస్తాను.
2) వెనక్కి తగ్గి ఏడవడం ప్రారంభిస్తాను.
3) ఆ పరిస్థితిని వదిలేసి, వేరే పనిపై దృష్టి సారిస్తాను.
4) ఏదీకాదు

సాధన: కోపాన్ని వస్తువులు లేదా చుట్టూ ఉన్నవారిపై ప్రదర్శించడం ఉత్తమమైన పద్ధతి కాదు. ఇలాంటి సమయాల్లో దృష్టిని ఇతర విషయాలు లేదా వేరే పనులపై కేంద్రీకరించడం మంచిది.

సమాధానం: 3

4. ఒక అంధుడు రోడ్డు దాటుతూ కనిపించాడు. అప్పుడు మీరేం చేస్తారు?
1) అతడు రోడ్డు దాటేంత వరకు ఎదురుచూస్తాను.
2) వెంటనే వెళ్లి రోడ్డు దాటిస్తాను.
3) అతడిని పట్టించుకోకుండా ముందుకు వెళ్తాను.
4) అతడిని రోడ్డు దాటించమని ఎవరికైనా చెబుతాను.

సాధన: అంధులకు చూపు ఉండదు. కాబట్టి వెంటనే వెళ్లి వారిని రోడ్డు దాటించి, సహాయం చేస్తే మంచిది.

సమాధానం: 2

5. ఒక ఆఫీసులో పనిచేసే రిసెప్షనిస్ట్‌కు ఉండాల్సిన లక్షణం?
1) సహనం
2) క్రమశిక్షణ
3) నాయకత్వ లక్షణాలు
4) వ్యక్తిత్వం

సాధన: అన్ని కార్యాలయాల్లో ఫ్రంట్ ఆఫీస్ అనేది అత్యంత ముఖ్యమైంది. ఏదైనా పని నిమిత్తం ఆఫీసుకి వచ్చే వ్యక్తులు, ఇంటర్వ్యూలకు వచ్చే అభ్యర్థులు లేదా ప్రముఖ వ్యక్తులు మొదటగా ఇక్కడే సంప్రదించాల్సి ఉంటుంది. కాబట్టి అక్కడ పనిచేసే రిసెప్షనిస్ట్‌కు సహనంతో కూడిన ప్రవర్తన చాలా ముఖ్యం.

సమాధానం: 1

6. మీ స్నేహితుడు మిమ్మల్ని డబ్బు అడిగాడు, అప్పుడు మీరు?
1) అవసరం ఏంటో తెలుసుకోకుండా వెంటనే ఇస్తాను.
2) ఇవ్వనని తిరస్కరిస్తాను.
3) ఎందుకు/ఎంత అవసరమో తెలుసుకుని నిర్ణయించుకుంటాను.
4) ఏదీకాదు

సాధన: స్నేహితులు డబ్బు అడిగినప్పుడు మన ఆర్థిక పరిస్థితులను అంచనా వేసుకుని సహాయం చేస్తే మంచిది. అదేవిధంగా ఎంత డబ్బు కావాలి, అవసరం ఏంటో తెలుసుకోవడంతో పాటు వారు తిరిగి ఇచ్చే పద్ధతి గురించి ముందే మాట్లాడుకుని ఇవ్వాలి.

సమాధానం: 3

7. బస్సులో మర్చిపోయిన డబ్బు సంచిని గుర్తించారు. అప్పుడు మీరేం చేస్తారు?
1) ఆ డబ్బు సంచి తీసుకుని యాచకులకు ఇస్తాను.
2) బస్సు కండక్టరుకు అందజేస్తాను.
3) ఆ సంచిని బస్సులోనే వదిలేసి వెళ్తాను.
4) వారి అడ్రస్ తెలుసుకునేందుకు ప్రయత్నించి, ఈ విషయం తెలియజేస్తాను. లేదా పోలీస్ స్టేషన్‌లో అప్పగిస్తాను.

సాధన: ఇలాంటి సమయంలో ఆ సంచి యజమాని ఎవరో, అతడి అడ్రస్ ఏంటో తోటి ప్రయాణికులు లేదా ఇతరుల ద్వారా కనుక్కునే ప్రయత్నం చేయడం, కుదరనప్పుడు పోలీస్ స్టేషన్‌లో అప్పగించడం సరైంది.

సమాధానం: 4

8. దుకాణంలో సరుకులు కొన్న తర్వాత దుకాణదారుడు రూ.100 అదనంగా ఇచ్చాడు. అప్పుడు మీరు?
1) అదనపు డబ్బును దుకాణదారుడికి తిరిగి అందజేస్తాను.
2) తిరిగి అదనంగా రూ.100 ఇస్తాడనే ఉద్దేశంతో ఇంకొక వస్తువు కొంటాను.
3) స్నేహితులకు విందు ఇస్తాను.
4) రూ.20 గుడిలోని హుండీలో వేసి ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగాలని ప్రార్థిస్తాను.

సాధన: అదనంగా రూ.100 ఇచ్చారని దుకాణదారుడితో చెప్పి, తిరిగి ఇచ్చేస్తాను.

సమాధానం: 1

9. స్నేహితుడి అజాగ్రత్తతో మీ కెమెరా కిందపడింది. అప్పుడు మీ స్పందన?
1) అతడితో తిరిగి స్నేహం చేయను.
2) చిరాకు పడతాను.
3) కొత్త కెమెరా కొనివ్వమని అడుగుతాను.
4) సున్నితమైన వస్తువులు వాడేటప్పుడు జాగ్రత్తగా ఉండమని చెప్తాను.

సాధన: వస్తువుల కంటే విలువైంది స్నేహం. కాబట్టి సున్నితమైన వస్తువులను వినియోగించేటప్పుడు జాగ్రత్తగా ఉండమని స్నేహితుడికి తెలియజేస్తాను.

సమాధానం: 3

10. మీరు వెళ్లేదారిలో ఒక శవాన్ని చూశారు. ఇప్పుడు మీరు చేసే పని...
1) ఏడుస్తాను. రోజు మొత్తం దాని గురించే ఆలోచిస్తూ ఉంటాను.
2) చేతులు కలిపి మనసులోనే ప్రార్థిస్తాను. సద్గతి ప్రాప్తించాలని కోరుతాను.
3) మరణం అనేది ఒక ప్రక్రియ మాత్రమే కాబట్టి చలించక అలానే వెళ్లిపోతాను.
4) కుటుంబంలో ఇటీవల సంభవించిన మరణాన్ని గుర్తుచేసుకుని బాధపడతాను.

సాధన: వారికి సద్గతి ప్రాప్తించాలని చేతులు కలిపి మనసులోనే ప్రార్థిస్తాను.

సమాధానం: 2



రచయిత
బూసర గణేష్, విషయ నిపుణులు

Word of the Day

918

Fatigue

Telugu meaning: అలసట, నిస్సత్తువ

English meaning: The word fatigue (ఫెటీగ్) is a noun or verb that refers to extreme tiredness caused by physical or mental effort.

Synonyms: Exhaustion, Weariness

Antonyms: Energy, Freshness

Usage: **1. (As a Noun):** After working continuously for twelve hours, he felt intense fatigue and could barely concentrate.

2. (As a Verb): Long journeys without proper rest fatigue both the body and the mind.

కరెంట్ అఫైర్స్



ప్రధాని నరేంద్ర మోదీతో సీషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినీ 2026, ఫిబ్రవరి 9న దిల్లీలో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఈ సందర్భంగా హిందూ మహాసముద్ర ప్రాంతంలో వ్యూహాత్మకంగా కీలకమైన సీషెల్స్‌కు భారత్ రూ.1,500 కోట్ల (175 మిలియన్ అమెరికన్ డాలర్లు) ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని ప్రకటించింది. ఈ నిధులతో సీషెల్స్‌లో అభివృద్ధి, భద్రత, మౌలిక సదుపాయాల రంగాల్లో కీలక ప్రాజెక్టులు చేపట్టనున్నారు.

భారత వృద్ధి రేటు వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27)లో 6.4 శాతంగా నమోదయ్యే అవకాశం ఉందని మూడీస్ రేటింగ్స్ అంచనా వేసింది. తద్వారా జీ-20 దేశాల్లో అత్యంత వేగవంత వృద్ధిని నమోదు చేస్తుందని తెలిపింది.



ప్రపంచంలోనే అతిపెద్ద అణు విద్యుత్ కేంద్రమైన కాషివాజాకి-కరీవా ప్లాంట్‌ను జపాన్ 2026, ఫిబ్రవరి 9న పునఃప్రారంభించింది. గతంలో సాంకేతిక లోపం కారణంగా నిలిచిపోయిన ఈ కర్మాగారం తిరిగి విద్యుదుత్పత్తికి సిద్ధమైంది. 2011లో సంభవించిన భారీ భూకంపం, సునామీ కారణంగా ఫుకుషిమా ప్లాంట్‌లో ప్రమాదం సంభవించింది. దీంతో దేశవ్యాప్తంగా అణు విద్యుత్ కేంద్రాలను జపాన్ ప్రభుత్వం మూసివేసింది.



డాక్టర్ రాకేశ్ కలపాల 'ఫెలోషిప్ ఆఫ్ ది యూరోపియన్ సొసైటీ ఆఫ్ గ్యాస్ట్రోఇంటెస్టినల్ ఎండోస్కోపీ (ఎఫ్ఈఎస్‌జీఈ)' గౌరవాన్ని పొందారు. యూరోపియన్ సొసైటీ అందించే ఈ అత్యున్నత గౌరవానికి ఎంపికైన రెండో భారతీయుడిగా అరుదైన ఘనత సాధించారు.

వింటర్ ఒలింపిక్స్ ఇటలీలోని మిలన్‌లో 2026, ఫిబ్రవరి 7న ఘనంగా మొదలయ్యాయి. ఇటలీలోనే అతి పెద్ద స్టేడియమైన సా సిరోలో ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. పరేడ్‌లో ఆరిఫ్ మహ్మద్ ఖాన్ భారత మువ్వన్నెల పతాకాన్ని చేబూని మన బృందానికి నాయకత్వం వహించాడు. అతడు కాకుండా భారత్ నుంచి స్టాంజిన్ లండప్ మాత్రమే ఈ క్రీడల్లో పోటీపడుతున్నాడు.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

ఇంటర్నేషనల్ డే ఆఫ్ ఉమెన్ అండ్ గర్ల్స్ ఇన్ సైన్స్

ఫిబ్రవరి 11
చరిత్రలో ఈనాడు


ప్రపంచవ్యాప్తంగా సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణితం (ఎస్‌టీఈఎం) విభాగాల్లోని అన్ని స్థాయుల్లో నేటికీ గణనీయమైన లింగ అంతరం కొనసాగుతోంది. స్త్రీలు విద్యలో రాణించడంతోపాటు ప్రస్తుత టెక్నాలజీ ప్రపంచంలో నాయకత్వ స్థాయికి ఎదగాలి. అప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుంది. శాస్త్రీయ రంగాల్లో బాలికలు, మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో ఏటా ఫిబ్రవరి 11న 'ఇంటర్నేషనల్ డే ఆఫ్ ఉమెన్ అండ్ గర్ల్స్ ఇన్ సైన్స్'గా నిర్వహిస్తారు. ఎస్‌టీఈఎం రంగాల్లో విజయవంతమైన స్త్రీలను గౌరవించుకోవడంతోపాటు వారి సహకారాన్ని గుర్తించడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

✦ మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యం. ముఖ్యంగా శాస్త్ర సాంకేతిక రంగాల్లో వారి సహకారంతో మరెన్నో అద్భుతాలు సృష్టించవచ్చు. లింగ అసమానతలు, సామాజిక కట్టుబాట్లు లాంటివి వారు తమ ఆశలు, లక్ష్యాలను నెరవేర్చుకోవడంలో ప్రధాన అడ్డంకులుగా ఉన్నాయి.

✦ శాస్త్రీయ రంగాల్లో బాలికలు, మహిళలను ప్రోత్సహించేందుకు వివిధ కార్యక్రమాలు చేపట్టినప్పటికీ వారి భాగస్వామ్యంలో గణనీయమైన అంతరం కొనసాగుతోంది.

చారిత్రక నేపథ్యం


2013, డిసెంబరు 20న యూఎన్ జనరల్ అసెంబ్లీ 'అభివృద్ధి కోసం సైన్స్, టెక్నాలజీ, ఆవిష్కరణ' (science, technology and innovation for development) అనే తీర్మానాన్ని ఆమోదించింది. అందులో లింగ సమానత్వం, మహిళలు - బాలికల సాధికారతకు సైన్స్ అండ్ టెక్నాలజీ, ఆవిష్కరణల్లో సమాన అవకాశాలు, భాగస్వామ్యం తప్పనిసరని పేర్కొంది. ఈ భావనను మరింత విస్తృతం చేసే లక్ష్యంతో ఏటా ఫిబ్రవరి 11న 'ఇంటర్నేషనల్ డే ఆఫ్ ఉమెన్ అండ్ గర్ల్స్ ఇన్ సైన్స్'గా జరుపుకోవాలని 2015లో ప్రకటించింది.



విరాస గణాంకాలు, భారత్‌లో పరిస్థితి, గత పరీక్షల్లో అడిగిన ప్రశ్నలు - జవాబుల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - ఇండియన్ పాలిటీ

భారత రాజ్యాంగ రచన



ప్రపంచంలోని అనేక దేశాలు తమ రాజ్యాంగానికి అత్యున్నత స్థానాన్ని కల్పించాయి. రాజ్యాంగం లేకపోతే పాలన అస్తవ్యస్తమవుతుంది. ఇది దేశ నాయకులు, పాలకులు, పౌరులకు దిశానిర్దేశం చేస్తుంది. భారత్‌లో స్వాతంత్ర్యానికి పూర్వమే రాజ్యాంగ రచన కోసం రాజ్యాంగ పరిషత్ ఏర్పాటైంది. దీనిలోని సభ్యులు అనేక దేశాల రాజ్యాంగాలను అధ్యయనం చేసి, దేశానికి అవసరమైన రాజ్యాంగ రచనను పూర్తి చేశారు. పోటీపరీక్షార్థులు రాజ్యాంగ పరిషత్ ఎన్నిక విధానం, అధ్యక్షులు, ఆమోదం, అమలు తదితర విషయాలపై అవగాహన ఏర్పర్చుకోవాలి.

☛ భారతదేశానికి ఒక రాజ్యాంగ నిర్మాణ సభ ఉండాలని మొదటిసారిగా కమ్యూనిస్టు ఉద్యమకారుడు, రాడికల్ డెమోక్రటిస్ సిద్ధాంతవాది ఎం.ఎన్.రాయ్ ప్రతిపాదించారు.

☛ భారత రాజ్యాంగ పరిషత్ ఏర్పాటు కోసం మొట్టమొదటిసారిగా డిమాండ్ చేసిన రాజకీయ పార్టీ - స్వరాజ్‌పార్టీ.

రాజ్యాంగ రచన సమయం

☛ రాజ్యాంగ పరిషత్ సభ్యులు సుమారు 60 దేశాల రాజ్యాంగాలను అధ్యయనం చేసి రాజ్యాంగం రాశారు. దీన్ని రాసేందుకు అయిన మొత్తం ఖర్చు రూ.64 లక్షలు. రాజ్యాంగం రాయడానికి పట్టిన సమయం 2 సంవత్సరాల 11 నెలల 18 రోజులు.

రాజ్యాంగ పరిషత్ సమావేశాలు

☛ గవర్నర్ జనరల్ వేవెల్ ఆదేశానుసారం రాజ్యాంగ పరిషత్ తొలి సమావేశం 1946 డిసెంబరు 9న పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో జరిగింది. ఈ సమావేశానికి 211 మంది సభ్యులు హాజరయ్యారు.

భారత రాజ్యాంగానికి ఆధారాలు, భారత రాజ్యాంగంలోని షెడ్యూళ్లు మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

IAF Agniveervayu Non-Combatant Posts

The Indian Air Force has released a notification for the recruitment of Agniveervayu Non-Combatant under the Agnipath Scheme for Intake 02/2026. Eligible candidates can apply offline before 23 February 2026.

Junior Research Fellow Posts

The Defence Research and Development Organisation - Vehicles Research and Development Establishment (VRDE), Ahmednagar, will conduct an interview for the Junior Research Fellow posts. The total no. of posts is 10. The interview dates are 24 and 26 February 2026.

Technical Assistant Posts

The National Physical Laboratory, New Delhi, is inviting applications for Technical Assistant posts on a contractual basis. The total no. of posts is 18. Eligible candidates can apply online before 27 February 2026.

Senior Resident Jobs

The Employees' State Insurance Corporation (ESIC) in Jaipur is conducting interviews to fill Senior Resident posts on a contract basis. Total no.of posts is 43. The interview date is 25 February 2026.

Did You Apply..?

Today (February 11) is the last date for the following Jobs

☛ 66 Security Guard jobs in South Eastern Coalfields. ***Eligibility:*** 8th class.

☛ Senior Research Fellow posts at ICAR-IIOR. ***Eligibility:*** Postgraduate degree.

For more information and other notifications - scan QR code

Antonyms

Directions (Qs. 1 - 10): *In each of the questions given below, a sentence is given with one word printed in bold letters, along with five options to choose from. Choose the appropriate antonym from those options that suits the word given in bold letters.*

1. The manager remained **lenient** while evaluating the employees' minor mistakes.
A) Harsh B) Flexible
C) Merciful D) Tolerant
E) Forgiving

2. Her explanation was **ambiguous**, leaving everyone confused about her actual intention.
A) Vague B) Uncertain
C) Doubtful D) Clear
E) Obscure

3. The villagers showed **hostility** toward the new policy introduced by the authorities.
A) Anger B) Resistance
C) Friendship D) Hatred
E) Opposition

4. Despite several obstacles, she remained **optimistic** about the project's success.
A) Hopeful B) Cheerful
C) Positive D) Confident
E) Pessimistic

5. The instructions were **compulsory** for all applicants appearing for the examination.
A) Mandatory B) Optional
C) Binding D) Essential
E) Required

6. His **meticulous** planning ensured that every detail of the event was perfect.
A) Careful B) Thorough
C) Negligent D) Precise
E) Systematic

7. The witness gave a **credible** account of the incident before the court.
A) Believable B) Trustworthy
C) Reliable D) Doubtful
E) Convincing

8. The company adopted an **economical** approach to reduce unnecessary expenses.
A) Frugal B) Thrifty C) Prudent
D) Saving E) Costly

9. His remarks were **insignificant** and failed to influence the committee's decision.
A) Trivial B) Important C) Minor
D) Petty E) Small

10. The soldier remained **vigilant** throughout the night to guard the camp.
A) Careless B) Watchful
C) Alert D) Observant
E) Attentive

Bank Exams

English

Directions (Qs. 11 - 22): *In each of the questions given below, a word is given in bold letters and five options are presented. Choose the appropriate antonym from those options that suits the word given in bold letters.*

11. Sparse
A) Scanty B) Thin C) Meagre
D) Dense E) Few

12. Abundant
A) Plentiful B) Sufficient
C) Scarce D) Ample
E) Copious

13. Vigorous
A) Weak B) Active
C) Dynamic D) Energetic
E) Robust

14. Transparent
A) Clear B) Opaque
C) Obvious D) Lucid
E) Plain

15. Benevolent
A) Kind B) Neutral
C) Compassionate D) Charitable
E) Cruel

16. Fleeting
A) Short-lived B) Brief
C) Momentary D) Lasting
E) Temporary

17. Mitigate
A) Reduce B) Ease C) Lessen
D) Relieve E) Intensify

18. Obedient
A) Defiant B) Loyal C) Submissive
D) Dutiful E) Compliant

19. Superficial
A) Shallow B) External
C) Deep D) Trivial
E) Surface

20. Hinder
A) Delay B) Facilitate C) Block
D) Obstruct E) Prevent

21. Amiable
A) Friendly B) Pleasant
C) Cordial D) Polite
E) Irritable

22. Artificial
A) Synthetic B) Fake
C) Natural
D) Imitation
E) False

Scan the QR code for Key

Writer: P. Manoj Kumar, Subject Expert

జూనియర్ రెసిడెంట్లు

ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్), బీబీనగర్ జూనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- జూనియర్ రెసిడెంట్: 13 పోస్టులు

అర్హత: ఎంబీబీఎస్‌తో పాటు పని అనుభవం.
దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీలకు రూ.1,180, ఈడబ్ల్యూఎస్‌లకు రూ.944. ఇతరులకు ఫీజు లేదు.
ఎంపిక: ఇంటర్వ్యూతో
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 23.02.2026
వెబ్‌సైట్: https://aiimsbibinagar.edu.in/recruitment.html

నిట్ వరంగల్‌లో

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ), వరంగల్.. ఇంటర్న్‌షిప్పుల కోసం దరఖాస్తులు కోరుతోంది.

అర్హత: సంబంధిత విభాగంలో బీటెక్/ ఎంటెక్ లేదా ఎంసీఏ.
ఎంపిక: ఇంటర్వ్యూతో.
స్టైపెండ్: నెలకు రూ.10,000.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 15.02.2026
వెబ్‌సైట్: https://nitw.ac.in/page/?url=/careersnitw/Jobs/



అవకాశాల వేదిక ఆరెంజ్ ఎకానమీ

ఇటీవల బడ్జెట్ ప్రసంగంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆరెంజ్ ఎకానమీ గురించి ప్రస్తావించారు. వచ్చే ఐదేళ్లలో ఈ రంగం 20 లక్షల ఉద్యోగాలను సృష్టిస్తుందని చెప్పారు. ఆరెంజ్ ఎకానమీ అంటే ఏమిటి? ఇందులో ఎలాంటి కొలువులు ఉంటాయి? వీటిపై అవగాహన పెంచుకుంటే అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు.

ఆరెంజ్‌లోకి వచ్చే రంగాలివీ

కళలు, సంస్కృతి, వారసత్వం: సంప్రదాయ హస్త కళలు, ప్రాంతీయంగా ప్రాచుర్యం పొందిన దుస్తులు, కళా రూపాలు, సంగీతం, నాటకం, నృత్య రూపకాలు, మ్యూజియంలు, సాంస్కృతిక పరిరక్షణా కేంద్రాలు.

మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్: ఫిల్మ్ ప్రొడక్షన్, టెలివిజన్, రేడియో బ్రాడ్ కాస్టింగ్, మ్యూజిక్ స్టూడియోస్, పుస్తకాలు, పత్రికల ప్రచురణ.

డిజైన్ సర్వీసులు: ఫ్యాషన్ డిజైన్, గ్రాఫిక్ డిజైన్, ఆర్కిటెక్చర్, అడ్వర్‌టైజింగ్ నైపుణ్యాలు వివిధ భారీ పరిశ్రమలకు కావలసిన సృజనాత్మక సామర్థ్యాలను అందిస్తాయి. ఉదాహరణకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్(ఎన్ఐడీ).. రాకెట్లు, క్షిపణుల ఉపగ్రహాలు, సూక్ష్మమైన రోబోటిక్ డిజైన్లను రూపొందిస్తుంది.

గ్రీన్ రివల్యూషన్ (వ్యవసాయం), వైట్ రివల్యూషన్ (పాలు), బ్లూ రివల్యూషన్ (మత్స్య సంపద), ఎల్లో రివల్యూషన్ (నూనె గింజలు), గోల్డెన్ రివల్యూషన్ (హార్టికల్చర్), సిల్వర్ రివల్యూషన్ (గుడ్లు), బ్లాక్ రివల్యూషన్ (పెట్రోలియం ఉత్పత్తులు) లాంటి వివిధ విప్లవాలెన్నో చూశాం. కానీ ఆరెంజ్ రివల్యూషన్ గురించి మొన్నటి దాకా పెద్దగా తెలీదు. ఇది ఏదో ఒక విభాగానికే పరిమితమైంది కాదు. కొన్ని రంగాల సమాహారం. సంస్కృతి, మేధాపరమైన సృష్టి, సృజనాత్మక స్రవంతిల కలయిక ద్వారా ఉద్భవించిన రంగాల మేళవింపే ఆరెంజ్ రివల్యూషన్. దీని ద్వారా సృష్టించే సంపదే ఆరెంజ్ ఎకానమీ. మన దేశంలో ఈ తరహా ఆర్థిక కార్యకలాపాలకు అవకాశాలు నిక్షిప్తంగా ఉన్నాయని, వాటిని వెలుగులోకి తేవడానికి ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందించనుందని, దీంతో అపార సంపద, 20 లక్షల మందికి ఉపాధి కల్పన జరుగుతుందని బడ్జెట్‌లో అంచనా వేశారు. మరింత సూక్ష్మంగా చెప్పాలంటే సృజనకారుల ఆలోచనలు, సాంస్కృతిక వీచికలు వాణిజ్య రూపాన్ని సంతరించుకొని వస్తూత్పత్తి (గూడ్స్), సేవల (సర్వీసెస్) కింద పరిణామం చెందడమే ఆరెంజ్ ఎకానమీ.

ఎలాగంటే

- ఒక భారతీయ దర్శకుడు సృజనాత్మక కళాకారులందరినీ ఒక బృందంగా చేర్చి, అద్భుతమైన సినిమాను తీశారు. ప్రపంచ వ్యాప్తంగా విడుదలైన ఆ చిత్రం కాసుల వర్షం కురిపించింది. సినిమా నిర్మాణంపై పెట్టిన పెట్టుబడికి పదింతలు లాభం వచ్చింది. దాదాపు మూడేళ్ల పాటు నిర్మాణ దశలో వేల మందికి ఉపాధీ లభించింది. ఇది కేవలం మేధా సంపత్తి ఫలితంగా సృష్టించిన సంపద తప్ప మరో విధంగా కాదు.
- భారతీయ కామిక్ పాత్రల సృష్టికర్త విడుదల చేసిన ఒక క్యారెక్టర్ దేశ విదేశాల్లోని పిల్లలందరికీ నేస్తంగా నిలిచింది. టీవీ ఛానెళ్లు, యూట్యూబ్ ఛానెళ్లు, ఓటీటీ, వీడియో ఫిల్మ్స్ ద్వారా చిన్నారులను ఉర్రూతలూగించింది. ఈ క్యారెక్టర్ బొమ్మలు, స్కూల్ బ్యాగులు, కీ చైన్స్ రూపంలోకి మారి, వేలకోట్ల రూపాయల వ్యాపారాన్ని సృష్టించాయి.
- మైసూరు దసరా ఉత్సవాలకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉంది. ఈ వేడుకలను చూసేందుకు దేశ విదేశాల నుంచీ వేల సంఖ్యలో వస్తారు. బొమ్మలతో పాటు పలు కళాత్మక వస్తువుల అమ్మకాలు బాగా జరుగుతాయి. ఈ ఉత్సవాల కారణంగా పది రోజుల పాటు మైసూరు ప్రాంతం కిక్కిరిసి పోతుంది. అంచనాలకు మించిన ఆదాయ సృష్టి జరుగుతుంది.

మొదటి రెండూ మేధాసంపత్తి ఫలితంగా సృష్టించిన ఆదాయమైతే, మూడోది భారతీయ సంస్కృతిలో భాగమైన దసరా పండుగ కారణంగా జరిగిన ఆదాయ సృష్టి.

ఎందుకింత ప్రాధాన్యం?

రెండు లక్ష్యాలతో ప్రభుత్వం కొత్త రంగాలను అన్వేషిస్తోంది. మొదటిది ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయగల రంగం అయ్యుండాలి. ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించిన భారత్ 2030 నాటికి మూడో స్థానానికి చేరుకోవాలని భావిస్తోంది. ఈ లక్ష్యాన్ని అందుకోవడానికి ఆరెంజ్ ఎకానమీ తోడ్పడగలదని అంచనా వేస్తున్నారు. ఇందులో ఎంతో ముఖ్యమైన మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ రంగం 2024 లోనే పాతిక వేల కోట్ల రూపాయల మార్కెట్‌గా అవతరించింది. మన దేశ మార్కెట్ పరిమాణం రీత్యా వినోద రంగం పెనువేగంతో విస్తరిస్తుందని నిపుణుల అంచనా.

ఆరెంజ్ ఎకానమీపై కేంద్రం దృష్టిపెట్టడానికి ప్రధాన కారణం ఉద్యోగ - ఉపాధి కల్పన. ఇందుకోసం విజువల్ ఎఫెక్ట్, గేమింగ్, కామిక్స్ రంగాలకు ఊతమిస్తే అవి ఉద్యోగ కల్పనా కేంద్రాలుగా విలసిల్లుతాయని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో 2030 నాటికి ఆరెంజ్ ఎకానమీ ద్వారా 20 లక్షల కొత్త ఉద్యోగాలు అవతరిస్తాయని నమ్మకంతో ఉన్నారు.

ఎవరికి ఉపయోగం?

ఉద్యోగ, ఉపాధి కల్పన రీత్యా భవిష్యత్తులో విరాజిల్లే రంగాలు తొలినాళ్లలో నివురు గప్పిన నిప్పులాగానే ఉంటాయి. సెల్‌ఫోన్లు వచ్చిన కొత్తలో మొబైల్ ఉత్పత్తి దారుల నుంచీ మొదలై.. అవి మొరాయిస్తే మరమ్మతులు చేసే టెక్నీషియన్లు, రక్షణ, భద్రత కోసం స్క్రీన్ గార్డులు, పౌచ్‌లు అమ్మే వారి వరకూ ఇలా లక్షల మందికి ఉపాధి కల్పించే రంగంగా అవతరిస్తుందని ఊహించలేదు. ఆ తర్వాత యాప్స్ వచ్చిన కొత్తలో అవి ప్రభంజనం సృష్టించి, ఉపాధికి నెలవుగా మారుతాయంటే నమ్మశక్యం కాలేదు. ప్రస్తుతం ఆరెంజ్ ఎకానమీ బాల్య దశలో ఉంది. భవిష్యత్తులో వచ్చే అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ఇప్పుడే మేల్కోవాలి. కేంద్రమే ఇందుకు ముందడుగు వేస్తోంది. ఆరెంజ్ ఎకానమీ సృష్టించే రంగాలకు కావాల్సిన నైపుణ్యాలు ఉన్న యువతను తయారు చేసేందుకు 15 వేల హైస్కూళ్లు, 500 కళాశాలల్లో యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్, గేమింగ్, కామిక్స్ (ఏవీజీసీ), కంటెంట్ క్రియేటర్ ల్యాబ్‌లను నెలకొల్పనుంది. చదువుకుంటూనే అవసరమైన నైపుణ్యాలను వీటి ద్వారా నేర్చుకోవచ్చు. అలాగే ఈ తరహా సంస్థలను ప్రారంభించేందుకు ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకూ సిద్ధమవుతోంది. ఇప్పటికే ఈ రంగంలో ఉన్న సంస్థలకు చేయూత నిస్తోంది.

కొత్త పుంతలు తొక్కే రంగాలను గుర్తించడం ఒక ఎత్తయితే, సానుకూల దృక్పథంతో ఆ రంగంలో ఉన్నత స్థానానికి చేరుకోవడానికి నేటి నుంచే సిద్ధం కావడం భవిష్యత్తు విజేతల లక్షణం.



- యస్.వి. సురేష్
సంపాదకుడు, ఉద్యోగ సోపానం

జర్మనీలో పీహెచ్‌డీ చేయాలంటే?

ఎమ్మెస్సీ మైక్రో బయాలజీ పూర్తయింది. ఏడాదిగా బోధన రంగంలో ఉన్నాను. జర్మనీలో పీహెచ్‌డీ చేయాలనుంది. ఇందుకోసం టోఫెల్, జీఆర్ఈ లాంటి పరీక్షలు రాయాలా? ఇవేమీ లేకుండా సీటు దొరుకుతుందా? అక్కడ చదువులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఆర్థిక సహకారం, రుణ సౌకర్యం ఏమైనా లభిస్తుందా?

- శ్రీస్రవంతి

■ జీవ విజ్ఞానశాస్త్రాల్లో ఎమ్మెస్సీ మైక్రో బయాలజీ అత్యంత ప్రాధాన్యం ఉన్న పీజీ ప్రోగ్రాం. సూక్ష్మజీవులు (బ్యాక్టీరియా, వైరస్‌లు, ఫంగస్, ఆల్గే) మానవ జీవితం, ఆరోగ్యం, పరిశ్రమలు, పర్యావరణం, వ్యవసాయం లాంటి అనేక రంగాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయి. అందువల్ల ఈ కోర్సు చేసిన వారికి దేశీయంగానే కాకుండా విదేశాల్లో కూడా వివిధ ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

- జర్మనీలో మైక్రో బయాలజీలో పీహెచ్‌డీ చేయడం ఒక మంచి అవకాశం. ప్రపంచ స్థాయిలో పరిశోధనకు అనుకూలమైన వాతావరణం, ఆధునిక ప్రయోగశాలలు, అంతర్జాతీయ ప్రమాణాల మార్గదర్శకత్వం అక్కడ లభిస్తాయి. అక్కడ పీహెచ్‌డీ చేయాలంటే ముందుగా విద్యార్హతలు, పరీక్షలు, ఆర్థిక వనరుల గురించి స్పష్టమైన అవగాహన అవసరం.
- మనదేశంలో ఉన్నట్లుగా ఒకే ప్రవేశ పరీక్షతో జర్మనీలో పీహెచ్‌డీ సీటు లభించదు. మైక్రో బయాలజీ, బయోటెక్నాలజీ, లైఫ్ సైన్సెస్ లాంటి విభాగాల్లో మాస్టర్స్ డిగ్రీ ఉండాలి. మంచి అకడమిక్ రికార్డ్, ప్రాజెక్ట్ వర్క్, పరిశోధనలపై ఆసక్తి కీలకం. పీహెచ్‌డీ అడ్మిషన్ ఎక్కువగా రిసెర్చ్ సూపర్‌వైజర్ (ప్రొఫెసర్) అంగీకారంపై ఆధారపడి ఉంటుంది.
- టోఫెల్, ఐఈఎల్‌టీఎస్ లాంటి ఇంగ్లిష్ భాషా ప్రావీణ్య పరీక్షల్లో మంచి స్కోరు పొందాలి. చాలా జర్మన్ యూనివర్సిటీల్లో పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు ఇంగ్లిష్‌లోనే ఉంటాయి. జర్మనీలో పీహెచ్‌డీ కోసం జీఆర్ఈ తప్పనిసరి కాదు. అయితే కొన్నిసార్లు అదనపు అర్హతగా ఉపయోగపడుతుంది. జర్మనీ వెళ్లాలంటే జర్మన్ భాషా పరీక్షలు రాయాల్సిన అవసరం లేదు. అక్కడి స్థానికులతో మెలగడానికి, రోజువారీ అవసరాల నిమిత్తం జర్మన్ భాష నేర్చుకుంటే మంచిది.



- జర్మనీలో పీహెచ్‌డీ చేసే చాలా మంది విద్యార్థులు ఫెలోషిప్/ స్టైపెండ్ మీదే ఆధారపడతారు. పరిశోధనల కోసం జర్మన్ ప్రభుత్వం అందించే డాడ్ స్కాలర్‌షిప్పు బాగా ప్రసిద్ధి చెందింది. దీని ద్వారా నెలవారీ స్టైపెండ్‌తో పాటు, ప్రారంభంలో విమాన ప్రయాణ ఖర్చులకు ట్రావెల్ అలవెన్స్, ఆరోగ్య బీమా లాంటి సదుపాయాలు లభిస్తాయి. చాలా సందర్భాల్లో వసతి ఖర్చులకూ ఈ స్టైపెండ్ ఉపయోగపడుతుంది.
- భారత కేంద్ర ప్రభుత్వానికి చెందిన నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్పు ద్వారా విదేశాల్లో పీహెచ్‌డీ చేస్తోన్న అర్హులైన విద్యార్థులకు సహాయం అందుతుంది. ఈ పథకం కింద ఎంపికైతే, చదువు ఖర్చులతో పాటు విమాన ప్రయాణానికి టికెట్ లాంటి సదుపాయాలూ అందుతాయి. ఇలాంటి పథకాల ప్రకటన వెలువడినప్పుడు దరఖాస్తు చేసుకోవాలి.
- ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు విదేశీ విద్యకు ప్రత్యేక స్కాలర్‌షిప్ పథకాలను అమలు చేస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వం నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్పులు అందిస్తోంది. ఎంపికైన వారికి చదువు ఖర్చులతో పాటు ఒకవైపు విమాన ప్రయాణ ఖర్చులు, వీసా చార్జీలు లాంటి సహాయాలు అందిస్తోంది. అదే విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఓవర్సీస్ ఎడ్యుకేషన్ స్కీమ్ ద్వారా పీహెచ్‌డీలో చేరిన వారికి ఆర్థిక సాయం చేస్తోంది. ఈ పథకాలు కాలానుగుణంగా మార్పు చెందుతాయి. కాబట్టి అధికారిక నోటిఫికేషన్‌ను తప్పనిసరిగా పరిశీలించాలి.

జర్మనీలో మైక్రో బయాలజీలో పీహెచ్‌డీ చేయాలంటే పరీక్ష కంటే పరిశోధనా సామర్థ్యం, సూపర్‌వైజర్ అంగీకారం, ఆంగ్ల ప్రావీణ్యం చాలా ముఖ్యం. సరైన ప్రణాళికతో ముందుకు వెళ్తే జర్మనీలో పీహెచ్‌డీ ప్రపంచ స్థాయి పరిశోధనా కెరియర్‌కు మంచి పునాది అవుతుంది.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు

ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఈసీఐఎల్), హైదరాబాద్.. ఒప్పంద ప్రాతిపదికన ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

- ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్: 18 పోస్టులు

అర్హత: సంబంధిత విభాగంలో బీటెక్, పీజీతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 35 ఏళ్లు మించరాదు.
వేతన శ్రేణి: నెలకు రూ.40,000 - 55,000.
ఎంపిక: ఇంటర్వ్యూతో. **ఇంటర్వ్యూ తేదీ:** ఫిబ్రవరి 20.
వెబ్‌సైట్: https://www.ecil.co.in/jobs.html

ఐఐటీ గువాహటిలో

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ), గువాహటి.. ఒప్పంద ప్రాతిపదికన పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- జూనియర్ రిసెర్చ్ ఫెలో: 03
- బిజినెస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్: 01
- అసోసియేట్ ప్రాజెక్ట్ ఇంజినీర్: 01
- టెక్నికల్ అసిస్టెంట్: 02
- ఆఫీస్ అసిస్టెంట్ (గ్రాఫిక్ డిజైన్): 02

అర్హత: సంబంధిత విభాగంలో ఇంటర్/ డిప్లొమా/ బీటెక్/ ఎంబీఏ/ ఎంసీఏ/ ఎమ్మెస్సీ/ సీఏ/ సీఎస్‌తో పాటు నెట్/ గేట్‌లో అర్హత సాధించాలి.
వేతనం: నెలకు రూ.13,050 - 44,910.
దరఖాస్తు: ఈమెయిల్ ద్వారా nest@iitg.ac.in కు పంపాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 16.02.2026.
ఎంపిక: ఇంటర్వ్యూతో.
వెబ్‌సైట్: https://www.iitg.ac.in/index

చదువు

కెరియర్, ఉన్నతవిద్యలకు సంబంధించి మీకు ఏ సందేహాలున్నా వాటిని మాకు పంపండి. నిపుణులు సమాధానాలు ఇస్తారు.

మా చిరునామా:
చదువు, ఈనాడు కార్యాలయం,
అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మం.,
రామోజీ ఫిల్మ్‌సిటీ – 501 512
edc@eenadu.in

అసోసియేట్ ప్రాజెక్ట్ ఇంజినీర్లు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ), గువాహటి.. ఒప్పంద ప్రాతిపదికన 9 అసోసియేట్ ప్రాజెక్ట్ ఇంజినీర్ ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలను నిర్వహిస్తోంది.

అర్హత: సంబంధిత విభాగంలో డిగ్రీ/ పీజీతో పాటు ఉద్యోగానుభవం.
వేతనం: నెలకు రూ.40,000. **ఎంపిక:** ఇంటర్వ్యూతో
ఇంటర్వ్యూ తేదీ: 25.02.2026.
వేదిక: ఈఈఈ కాన్ఫరెన్స్ రూమ్, ఐఐటీ గువాహటి.
వెబ్‌సైట్: https://www.iitg.ac.in/iitg_reqr?ct=RzNJNURKa005enFYa3RJWWtvM2cvQT09

యంగ్ ప్రొఫెషనల్

ఇండియన్ అగ్రికల్చర్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఐఏఆర్ఐ) తాత్కాలిక ప్రాతిపదికన యంగ్ ప్రొఫెషనల్ పోస్టు భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

- యంగ్ ప్రొఫెషనల్-2: 01

అర్హత: సంబంధిత విభాగంలో డిగ్రీతో పాటు పని అనుభవం ఉండాలి.
వేతనం: నెలకు రూ.42,000. **ఎంపిక:** ఇంటర్వ్యూతో.
ఇంటర్వ్యూ తేదీ: 02.03.2026
వెబ్‌సైట్: https://www.iari.res.in/bms/announcements/jobs.php

జూనియర్ రిసెర్చ్ ఫెలో

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇమ్యునాలజీ (ఎన్ఐఐ), న్యూదిల్లీ ఒప్పంద ప్రాతిపదికన జూనియర్ రిసెర్చ్ ఫెలో భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- జూనియర్ రిసెర్చ్ ఫెలో: 01

అర్హత: సంబంధిత విభాగంలో ఎమ్మెస్సీ, ఎంఫార్మసీతో పాటు పని అనుభవం ఉండాలి. **వేతనం:** నెలకు రూ.37,000.
ఎంపిక: ఇంటర్వ్యూతో. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 24.02.2026.
వెబ్‌సైట్: https://www.nii.res.in/en/announcements

ల్యాబ్ ఇన్‌స్ట్రక్టర్లు


బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్(బిట్స్).. రెగ్యులర్ ప్రాతిపదికన ల్యాబ్ ఇన్‌స్ట్రక్టర్ (అటానమస్ వెహికల్) ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులను కోరుతోంది.

- ల్యాబ్ ఇన్‌స్ట్రక్టర్ - అటానమస్ వెహికల్: 03 పోస్టులు

అర్హత: సంబంధిత విభాగాల్లో బీటెక్/ఎంటెక్.
ఎంపిక: ఇంటర్వ్యూతో.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 27.02.2026.
వెబ్‌సైట్: https://www.bits-pilani.ac.in/careers/non-academic/

ఇలా నేర్చుకుందాం!

చాలామంది విద్యార్థులు తక్కువ వ్యవధిలోనే విజయం పొందాలనుకుంటారు. కొద్ది సన్నద్ధతతోనే ఎక్కువ మార్కులు, ఉద్యోగం దక్కాలని కలలు కంటారు. కానీ నిజమైన విజయం స్వల్ప ప్రయత్నంతో దక్కదు. అందుకోసం ఓర్పు, నిరంతర శ్రమ తప్పనిసరి. దీన్నే 'స్లో బర్న్ యాంబిషన్' అని నిపుణులు అంటున్నారు.



విద్యార్థులు రోజులో కొంత సమయాన్ని చదివింది అర్థం చేసుకోవడం, నేర్చుకోవడం లాంటి వాటికి కేటాయించాలి. ఈ అలవాట్లు వారిని మరింత మెరుగ్గా తీర్చిదిద్దుతాయి. ఇలాంటి అలవాట్లు ఉన్నవారు పరీక్షల్లో మంచి ఫలితాలతో రాణిస్తారు. ఈ క్రమంలో ఒక్కోసారి ఆశించిన ఫలితాలు దక్కకపోవచ్చు. అయినా నిరాశ చెందకుండా ఓర్పుతో ప్రయత్నిస్తూనే ఉండాలి. ఇలాంటి వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

- ఒకవేళ పరీక్షల్లో మార్కులు తక్కువ వచ్చినా.. దాన్ని ఒక పాఠంగా తీసుకుని తర్వాత పరీక్షకు మరింత మెరుగ్గా సిద్ధమవ్వాలి. కొన్ని రోజులు ఇలా పాటిస్తే అనుకున్న విజయం సాధించగలుగుతారు. ఉదాహరణకు ఒక విద్యార్థి ఇంజినీర్ అవ్వాలనుకుంటే ఒక్క పరీక్షపై మాత్రమే దృష్టి పెట్టకుండా దానికి సంబంధించిన ప్రాథమిక విషయాలు నేర్చుకోవడం, రోజూ సాధన చేయడం, సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం, ఆరోగ్యకరమైన జీవనశైలి పాటించడం లాంటి అలవాట్లు పెంచుకోవాలి.

నేర్చుకునే పద్ధతి

ప్రస్తుతం సాంకేతికత అభివృద్ధి చెందడంతో విద్యార్థులు.. పాఠశాలలు, కళాశాలలకే పరిమితం కాకుండా కొత్తగా ఆలోచిస్తున్నారు. గతంలో మంచి మార్కులు, ర్యాంకులు రావాలనే ఆలోచన ఎక్కువగా ఉండేది. కానీ ఇప్పుడు చాలా మంది విద్యార్థులు నేర్చుకోవడంపై ఆసక్తి చూపిస్తున్నారు. కొత్త కోర్సులు, నైపుణ్యాలు పెంచుకుంటున్నారు. ఉదాహరణకు కంప్యూటర్ కోర్సులు, డిజైనింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, మార్కెటింగ్, బిజినెస్ మేనేజ్‌మెంట్.. ఇలా ఆసక్తి ఉన్నవాటిలో చేరుతున్నారు.

- ఇంటర్నెట్, మొబైల్, ఆన్‌లైన్ క్లాసులతో నేర్చుకోవడం ఇంకా సులభంగా మారింది. ఎప్పుడూ కళాశాలలు, కోచింగ్ కేంద్రాల్లో మాత్రమే నేర్చుకోకుండా ఇంటి దగ్గరా సాధన చేయవచ్చు. దీంతో సొంతంగా నేర్చుకునే విధానమూ అలవాటవుతుంది. ఇలా నేర్చుకున్నది ఎక్కువ కాలం గుర్తుంటుంది. భవిష్యత్తులో ఉద్యోగాలకూ ఎంతో ఉపయోగపడుతుంది.
- కొంతమంది విద్యార్థులు ఎప్పుడూ ఒంటరిగా చదువుతుంటారు. ఎవరితోనూ సరిగా మాట్లాడరు. ఎప్పుడూ గదికే పరిమితం అవుతారు. దీంతో మానసిక స్థితి దెబ్బతింటుంది. పరీక్షల్లో విజయం సాధించగలనా, లేదా? అనే ఆలోచనలు వారిలో కలుగుతుంటాయి. అలాంటప్పుడు ఎన్ని గంటలు చదివినా కొద్దిసేపు విశ్రాంతి తీసుకోవాలి. చదువుతో పాటు స్నేహితులు, కుటుంబ సభ్యులతో సమయం గడపాలి. ఎందుకంటే కొన్ని పరిస్థితుల్లో వారిచ్చే ధైర్యం ఎంతో భరోసానిస్తుంది.

'స్లో బర్న్ యాంబిషన్' అనేది విద్యార్థులకు సహనం, క్రమశిక్షణ, దీర్ఘకాల ఆలోచనలను నేర్పుతుంది. కాబట్టి దాన్ని లక్ష్య సాధనగా మార్చుకోవాలి. ఇలా చేస్తే చదువుతో పాటు జీవితంలోనూ మంచి ఫలితాలు సాధించగలుగుతారు.

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్

ఫ్యాషన్ రిసెర్చ్
సంస్థ: మూడ్‌బోర్డ్ అనలిటిక్స్ నైపుణ్యం: ఫ్యాషన్ డిజైన్ స్టైపెండ్: రూ.5,000
దరఖాస్తు గడువు: మార్చి 5
☛ https://url-shortener.me/AUCA

మ్యాథమెటిక్స్ టీచింగ్
సంస్థ: బడ్డింగ్ మారినర్స్
నైపుణ్యాలు: కేన్వా, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఇంటర్‌పర్సనల్ స్కిల్స్, మేనేజ్‌మెంట్, మెటీరియల్ మేనేజ్‌మెంట్, మెటీరియల్ సోర్సింగ్, మ్యాథమెటిక్స్, మైక్రోసాఫ్ట్ 365, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-ఆఫీస్, ఎంఎస్-పవర్‌పాయింట్, సబ్జెక్ట్ మేటర్ ఎక్స్‌పర్ట్, టీచింగ్, టైమ్ మేనేజ్‌మెంట్
స్టైపెండ్: రూ.1,500-3,000
దరఖాస్తు గడువు: మార్చి 6
☛ https://shorturl.at/q8YKP

బీ2బీ సేల్స్
సంస్థ: మేక్ ఇంక్ నైపుణ్యాలు: బిజినెస్ డెవలప్‌మెంట్, కోల్డ్ కాలింగ్, సేల్స్
స్టైపెండ్: రూ.5,000-20,000
దరఖాస్తు గడువు: మార్చి 5
☛ https://url-shortener.me/AUD8

సేల్స్
సంస్థ: వీసా క్రేవ్ నైపుణ్యాలు: బిజినెస్ డెవలప్‌మెంట్, ఆపరేషన్స్, సేల్స్
స్టైపెండ్: రూ.5,000
దరఖాస్తు గడువు: మార్చి 4
☛ https://url-shortener.me/AUDA

హైదరాబాద్‌లో

ప్రొడక్ట్ మార్కెటింగ్
సంస్థ: ఇన్వెస్ట్ వాల్యూ ఫిన్‌టెక్ ప్రై.లి.
నైపుణ్యం: ప్రొడక్ట్ మార్కెటింగ్
స్టైపెండ్: రూ.5,000-10,000
దరఖాస్తు గడువు: మార్చి 5
☛ https://url-shortener.me/AUEJ

లీగల్
సంస్థ: మార్పు ఫౌండేషన్ నైపుణ్యాలు: లీగల్ రిసెర్చ్, లీగల్ డ్రాఫ్టింగ్, లీగల్ రైటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-ఆఫీస్
స్టైపెండ్: రూ.6,000
దరఖాస్తు గడువు: మార్చి 5
☛ https://url-shortener.me/AUFU

ఇంటీరియర్ డిజైన్
సంస్థ: డిజైన్ బీహెచ్‌కే
నైపుణ్యాలు: ఆటోడెస్క్ 3డీస్ మ్యాక్స్, గూగుల్ స్కెచప్
స్టైపెండ్: రూ.8,000
దరఖాస్తు గడువు: మార్చి 5
☛ https://url-shortener.me/AUL8

సామాజిక మాధ్యమాల వినియోగంపై వయోపరిమితి విధించాలి



కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న శ్రీకృష్ణదేవరాయలు

ఈనాడు, దిల్లీ: పిల్లలు, యువత భద్రత దృష్ట్యా సామాజిక మాధ్యమాల వినియోగంలో వయోపరిమితి విధించాలని తెదేపా పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీకృష్ణదేవరాయలు కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్‌శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం పార్లమెంట్ భవనంలో కేంద్ర మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. 'పిల్లల భద్రత దృష్ట్యా సామాజిక మాధ్యమ వినియోగంలో వయోపరిమితిపై నియంత్రణ విధించేలా సమగ్ర విధానం, చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. దీనిపై అధ్యయనం కోసం ప్రత్యేక నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేయాలి' అని కోరారు.

విద్యార్థులకు ప్రతి నెలా ఆరోగ్య పరీక్షలు

మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆదేశాలు

ఈనాడు, అమరావతి: వసతి గృహాలు, గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో ఉండే విద్యార్థులకు ప్రతి నెలా తప్పనిసరిగా ఆరోగ్య పరీక్షలు చేయించాలని గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అధికారులను ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని సూచించారు. దుప్పట్లు, పళ్లేలు, పుస్తకాలు, ఇతర మౌలిక సదుపాయాల్లో ఎలాంటి లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు. ఆమె మంగళవారం వార్డెన్లు, ప్రధానోపాధ్యాయులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 'కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని వసతి గృహాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తోంది. ఆర్వో ప్లాంట్లు, మరుగుదొడ్లు నిర్మిస్తోంది. ఎక్కడైనా ఆర్వో ప్లాంట్లు పనిచేయకపోతే వెంటనే బాగు చేయించాలి. కొత్తగా ఏర్పాటు చేయాల్సిన అవసరముంటే వెంటనే ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలి. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా నిర్దిష్ట ప్రణాళిక అనుసరించాలి' అని సూచించారు.

వేసవిలో అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలి: సీఎస్

ఈనాడు, అమరావతి: వేసవిలో విద్యుత్ సరఫరాకు ఇబ్బంది లేకుండా అన్ని చర్యలూ తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ విద్యుత్ సంస్థలను ఆదేశించారు. సచివాలయంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. 'ఈ నెల 9న విద్యుత్ డిమాండ్ 236.91 మిలియన్ యూనిట్లు ఉంటే.. జెన్‌కో, పునరుత్పాదక విద్యుత్ యూనిట్లు, స్వల్పకాలిక కొనుగోళ్ల ద్వారా సరఫరా చేశాం. రబీలో మార్చిలో రోజువారీ డిమాండ్ 260 ఎంయూలకు చేరే అవకాశం ఉంది. అందుకు అనుగుణంగా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలి. థర్మల్ యూనిట్లకు అవసరమైన బొగ్గు అందుబాటులో ఉండాలి. థర్మల్ ప్లాంట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం పెరగాలి. ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలి. 960 మెగావాట్ల పోలవరం జల విద్యుత్ ప్రాజెక్టు పనులు వేగవంతం చేసి.. 2027 నాటికి పూర్తి చేయాలి. 12 యూనిట్లలో కనీసం 7 యూనిట్లు వచ్చే ఏడాది జులై నాటికి పూర్తి కావాలి. మిగిలినవి 2028 డిసెంబరు నాటికి అందుబాటులోకి తేవాలి' అని సీఎస్ పేర్కొన్నారు.

పంచాయతీరాజ్‌లో కారుణ్య నియామకాలు చేపట్టాలి: ఏపీటీఎఫ్

ఈనాడు, అమరావతి: పంచాయతీరాజ్ శాఖలో కారుణ్య నియామకాలు చేపట్టాలని ఏపీ ఉపాధ్యాయ సమాఖ్య (ఏపీటీఎఫ్) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హృదయరాజు, చిరంజీవి కోరారు. అన్ని శాఖల్లో ఆరేళ్ల సవరణలు చేసి, కారుణ్య నియామకాలను చేపట్టిన ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖలో వెయ్యి మంది ఉన్నా నియామకాలు చేపట్టడం లేదని పేర్కొన్నారు. 'పూర్వపు ఉత్తర్వుల ప్రకారం వన్‌టైమ్ సెటిల్‌మెంట్ విధానంలోనైనా కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు. జిల్లా పరిషత్తు యాజమాన్యంలోని ఉపాధ్యాయులు, ఉద్యోగులు చనిపోయిన తర్వాత కారుణ్య నియామకాలు చేపట్టకపోవడంతో అర్హులైన వారు ఆందోళన, ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. కొంతమంది ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, తాజాగా మంగళవారం శ్రీకాకుళం జిల్లాలో గుండెపోటుతో వల్లభ వివేక్ అనే అభ్యర్థి మృతి చెందారని వెల్లడించారు.

భూసేకరణపై అంజుమన్ కమిటీతో చర్చించిన తర్వాతే ముందుకు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన 13వ పాలకమండలి సమావేశం మంగళవారం విజయవాడలోని కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా పలు సంస్థలకు మేనేజ్‌మెంట్ కమిటీలు, ముతవల్లీలను నియమించారు. గుంటూరు జిల్లా దినకరాలలోని అంజుమన్ ఏ ఇస్లామియా వక్ఫ్ సంస్థకు చెందిన భూమిని సేకరణ విషయంలో ఆ సంస్థ కమిటీ సభ్యులతో చర్చించిన తర్వాతే ముందుకు వెళ్లాలని పాలకమండలి నిర్ణయించింది.

ఆయుష్ కార్యాలయం ఆటోనగర్‌కు

ఈనాడు, అమరావతి: విజయవాడలోని గొల్లపూడి ప్రాంతంలో ఉన్న ఆయుష్‌శాఖ రాష్ట్ర ప్రధాన కార్యాలయాన్ని ఆటోనగర్‌లోకి మారుస్తున్నట్లు ఆయుష్ కమిషనర్ దినేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆటోనగర్‌లోని ఏపీఐఐసీ భవనంలోని మూడో అంతస్తులో (బ్లాక్-4, ఫ్లాట్ నంబర్ 17) గురువారం నుంచి కార్యకలాపాలు సాగుతాయని వెల్లడించారు.

బడుల్లో క్రీడలకు ప్రోత్సాహం

ఈనాడు, అమరావతి: పాఠశాలల్లో క్రీడా సంస్కృతిని ప్రోత్సహించాలనే లక్ష్యంతో ప్రభుత్వం క్రీడా పోటీలు నిర్వహిస్తోందని సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు నిర్వహించిన రాష్ట్రస్థాయి టీ20 క్రికెట్ టోర్నమెంట్ ముగింపు సభలో ఆయన మాట్లాడారు. "విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గించేందుకు క్రీడలు దోహదం చేస్తాయి. ఇప్పటికే 255 మంది కోచ్‌లను నియమించాం. త్వరలో మరో 400 మందిని నియమించనున్నాం" అని తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో శ్రీసత్యసాయి జిల్లా మొదటి స్థానంలో నిలవగా అనకాపల్లి జిల్లాకు ద్వితీయ బహుమతి లభించింది. మూడు, నాలుగు స్థానాల్లో పార్వతీపురం మన్యం, కర్నూలు జిల్లాల జట్లు నిలిచాయి. విజేతలకు ట్రోఫీలు ప్రదానం చేశారు.

సంస్కరణలు కొలిక్కి వస్తే సాస్కీలో రూ.3,300 కోట్లు

- చర్యలు చేపడుతున్న రాష్ట్ర ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: కేంద్రం సూచించిన విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఐదు ప్రభుత్వశాఖల్లో సంస్కరణలు చేపట్టేందుకు సిద్ధమయింది. ఇవి పూర్తయితే సాస్కీ కింద మరో రూ.3,300 కోట్ల సాయం రాష్ట్రానికి లభిస్తుంది. రాష్ట్రాల్లో పెట్టుబడి వ్యయం కోసం కేంద్ర ప్రభుత్వం 50 ఏళ్ల పాటు వడ్డీ లేని రుణాలు సమకూరుస్తోంది. సాస్కీ కింద ఈ రుణం అందిస్తోంది. ఇందులో భాగంగా ఆ శాఖలకు సంబంధించి కొన్ని సంస్కరణలు చేపట్టాలని కేంద్రం సూచించింది. గనులు, రవాణా, రోడ్డు భద్రత, గ్రామీణ, అర్బన్ ప్రాంత భూ సంస్కరణలు, పంట సర్వే డిజిటలీకరణ, పట్టణ పాలనలో సంస్కరణలు పూర్తి చేసే సాస్కీ కింద నిధులు అందుతాయి. 2025-26 ఆర్థిక సంవత్సరంలోనే ఈ నిధులు తెచ్చుకునే అవకాశం ఉంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వశాఖలతో రాష్ట్రం సంప్రదింపులు జరుపుతోంది.

◆ గనులశాఖలో సంస్కరణలు అమలు చేస్తే రూ.400 కోట్లు రాష్ట్రానికి వస్తాయి. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వానికి సమర్పించారు. ఇంతవరకు రూ.100 కోట్లు మంజూరయ్యాయి. మిగిలిన నిధుల కోసం ఎదురుచూస్తున్నారు. కేంద్ర గనులశాఖ సూచించిన 7 సంస్కరణల్లో కనీసం 4 పూర్తి చేయాల్సి ఉంది. మైనర్ మినరల్ బ్లాకులు కూడా వేలంలో కేటాయించడం, రాష్ట్రాల ఆదాయం పెంచే చర్యలు తీసుకోవడం వంటివి ఇందులో ఉన్నాయి.

◆ రోడ్డు భద్రతకు సంబంధించి కూడా కొన్ని సంస్కరణలు చేపట్టాలి. పాత వాహనాల స్క్రాపింగ్ కింద రూ.200 కోట్లు రాబట్టుకునే ఆస్కారం ఉంది. జాతీయ వాహన స్క్రాపింగ్ విధానానికి అనుగుణంగా రాష్ట్ర స్థాయిలోనూ విధానం రూపొందించాలి. 15 ఏళ్లు దాటిన బస్సులు, అంబులెన్సులు, అధికారిక కార్లను స్క్రాప్‌గా మార్చాలి. ఇలాంటి అనేక సంస్కరణలు ఇందులో ఉన్నాయి.

◆ రోడ్డు భద్రతా సంస్కరణల్లో భాగంగా సీసీటీవీ కెమెరాల ఏర్పాటు, స్పీడ్ గన్‌లు, ఆటోమేటెడ్ చలానా వ్యవస్థ ఏర్పాటు వంటి సంస్కరణలు అమలు చేయాలి. ఇలాంటి సంస్కరణలు పూర్తయితే రూ.350 కోట్లు సాస్కీ కింద రాష్ట్రానికి దక్కుతాయి.

◆ గ్రామాల్లో భూసంస్కరణలు చేపట్టాలి. రికార్డులను డిజిటలైజ్ చేయడంతోపాటు స్థానిక భాషలో ఉండేలా చూసుకోవాలి. భూ వివాదాలు తగ్గించాలి. ఇలాంటివి పూర్తి చేస్తే రూ.300 కోట్లు లభిస్తాయి. కేంద్రం ఇప్పటికే రూ.33 కోట్లు ఇచ్చింది.

◆ రాష్ట్రాల్లో పంట సమాచారాన్ని ఇ-పంటలో నమోదు చేయాలి. మొబైల్ యాప్‌లు, శాటిలైట్ ఇమేజ్‌ల సాయంతో పంటల డేటా సేకరించాలి. ఇలా కేంద్రం సూచించిన సంస్కరణలు పూర్తి చేస్తే రూ.350 కోట్లు వస్తాయి.

◆ అర్బన్ ప్రాంతాల్లో భూ సంస్కరణలకు సంబంధించి రూ.250 కోట్లు అందుబాటులో ఉన్నాయి. ఇప్పటికే ఆ మొత్తం మంజూరైనా సంస్కరణలు అమలు చేసి మరిన్ని నిధులు తెచ్చుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.

◆ పట్టణ పాలనలోనూ సంస్కరణలు అమలు చేయాల్సి ఉంది. సమగ్ర ఆస్తి పన్ను పోర్టల్ ఏర్పాటు, భవన నిర్మాణ నిబంధనలు నవీకరించడం వంటి అంశాలు ఇందులో ఉన్నాయి. ఇవన్నీ సమగ్రంగా పూర్తి చేస్తే రూ.1,500 కోట్లు పొందే వెసులుబాటు ఉంది.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఉత్తరాఖండ్‌లో అధ్యయనం

ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామీతో చర్చించిన లంకా దినకర్

ఈనాడు, అమరావతి: కేంద్ర ప్రాయోజిత పథకాలు, భారత ప్రభుత్వ ప్రధాన కార్యక్రమాలు, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన అమలుపై అధ్యయనానికి 20 సూత్రాల కార్యక్రమం అమలు ఛైర్మన్ లంకా దినకర్ ఉత్తరాఖండ్ రాష్ట్రానికి వెళ్లారు. దెహ్రాదూన్‌లోని సచివాలయంలో ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామీని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఉత్తరాఖండ్ 20 సూత్రాల కార్యక్రమాల అమలు వైస్ ఛైర్మన్ జ్యోతి ప్రసాద్ గైరోలా, జేడీ తిలోక్, ఆర్థిక-గణాంక శాఖ సంచాలకులు(డీఈఎస్) సుశీల్‌కుమార్, ప్రణాళిక విభాగం సంచాలకులు మనోజ్‌పంత్, జేడీలు దినేష్ బడోని, చిత్ర తదితరులతో సమావేశమయ్యారు. ఆ రాష్ట్రంలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాలపై చర్చించారు. లఖ్‌పతి దీదీ, పీఎంఏవై, జల్‌జీవన్ మిషన్, అమృత్, ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన, పీఎం గ్రామ సడక్ యోజన, పర్యాటకం, జాతీయ ఆరోగ్య మిషన్ తదితర కార్యక్రమాల అమలు తీరుపై ఆరా తీశారు. అక్కడి రాష్ట్ర ప్రభుత్వం అమలు



లంకా దినకర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామీ

చేస్తున్న కొండ ప్రాంతాల్లో సమగ్రాభివృద్ధి, సామాజిక సంక్షేమం, ఉద్యానవనాలు, పర్యాటకంతో ఉపాధి పెంపు, ఆరోగ్యం, విద్య, వైద్యానికి ప్రాధాన్యం ఇచ్చేలా ప్రవేశపెట్టిన పథకాలతోపాటు ఉత్తరాఖండ్ విజన్-2047ను అధికారులు వివరించారు. ఈ పర్యటన ఎంతో ఉపయోగపడిందని, ఉత్తరాఖండ్‌లో గుర్తించిన ఉత్తమ విధానాలు ఏపీలో అమలుకు ఉపకరిస్తాయని లంకా దినకర్ పేర్కొన్నారు. తొలిరోజు పర్యటనలో ఫారెస్ట్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్ఆర్ఐ), రిషికేశ్‌లోని త్రివేణి ఘాట్ వద్ద గంగా హారతిని సందర్శించినట్లు వెల్లడించారు.

ఉగాది పురస్కారాల ఎంపికకు కమిటీ

ఈనాడు, అమరావతి: ఉగాది పురస్కారాల ఎంపిక కోసం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఛైర్మన్‌గా ప్రభుత్వం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసింది. దీనికి రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి ముఖ్య కార్యనిర్వాహక అధికారి సభ్య కన్వీనర్‌గా ఉంటారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతికశాఖ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్, మండలి వెంకట కృష్ణారావు అధికార భాషా సంఘం ఛైర్మన్ పి.త్రివిక్రమరావు, సృజనాత్మకత, సంస్కృతి సమితి ఛైర్‌పర్సన్ పి.తేజస్వి, నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, రాష్ట్ర సైన్స్, టెక్నాలజీ అకాడమీ ఛైర్మన్ ఎం.రవికుమార్, రాష్ట్ర జానపద కళలు, సృజనాత్మకత అకాడమీ ఛైర్మన్ వి.గంగులయ్య, డి.సుమతి రామ్మోహనరావు (మృదంగ విద్వాంసులు), భాగవతుల వెంకట రామశర్మ(కూచిపూడి), బాబుజి(బుర్రకథ) కమిటీలో సభ్యులుగా ఉంటారు. ఉగాది సందర్భంగా వచ్చే నెల 19న నిర్వహించే కార్యక్రమంలో ప్రభుత్వం తరఫున పురస్కార గ్రహీతలను సత్కరించనున్నారు.

అప్పుల్లోనే రాష్ట్రం అగ్రస్థానం

మాజీ ముఖ్యమంత్రి జగన్

ఈనాడు, అమరావతి: 'రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతోందని, జీఎస్‌డీపీ వృద్ధిలో మూడోస్థానంలో ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన లెక్కల్లో వాస్తవం లేదు' అని మాజీ సీఎం జగన్ మంగళవారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. 'ఈ జీఎస్‌డీపీ లెక్కలన్నీ చంద్రబాబు కార్యాలయం చేసినవే తప్ప.. మరే ఇతర స్వతంత్ర సంస్థలు రూపొందించినవి కావు. చంద్రబాబు ప్రకటించినట్లుగా జీఎస్‌డీపీ వృద్ధి 11.09% ఉంటే.. మరి కాగ్ నివేదిక ప్రకారం ఈ 9 నెలల్లో రాష్ట్ర పన్ను ఆదాయాలు 1.97 శాతమే ఎందుకున్నాయి? పన్ను ఆదాయాలూ జీఎస్‌డీపీ స్థాయిలో పెరగాలి కదా' అని ప్రశ్నించారు. 'చంద్రబాబు నాయకత్వంలో అప్పులు, అవినీతి, కక్ష సాధింపు రాజకీయాలు, తప్పుడు ప్రచారంలో మాత్రమే ఏపీ మొదటి స్థానంలో ఉంది' అని ఆరోపించారు.

పీఎంశ్రీ స్కూళ్ల పరిశీలనకు కేంద్ర నోడల్ అధికారుల నియామకం

ఈనాడు, దిల్లీ: రాష్ట్రాల్లో అమలవుతున్న పీఎంశ్రీ స్కూళ్ల విధానం అమలును క్షేత్రస్థాయిలో పరిశీలించడానికి కేంద్ర ప్రభుత్వం సంయుక్త కార్యదర్శి స్థాయి అధికారులతో ప్రత్యేక నోడల్ అధికారులను నియమించింది. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి వైఎస్సార్ కడప జిల్లాకు సిద్ధార్థజైన్, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాకు చిత్తరంజన్‌దాస్, విజయనగరం జిల్లాకు నీరజ్‌కుమార్ గాయగి, పశ్చిమగోదావరి జిల్లాకు హేమా జైశ్వాల్, విశాఖపట్నం జిల్లాకు రాఘవ్ లంగర్, ప్రకాశం జిల్లాకు ఫయాజుద్దీన్ అహ్మద్, చిత్తూరు జిల్లాకు అన్షు మనీష్ ఖల్కో, అనంతపురం జిల్లాకు సచ్చిదానంద ప్రసాద్, కర్నూలు జిల్లాకు ఇషితా గంగులి త్రిపాఠి, తూర్పుగోదావరి జిల్లాకు దీపాంకర్ అరోన్‌లను నియమిస్తూ కేంద్ర సిబ్బంది వ్యవహారాలశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీలో మొత్తం 935 స్కూళ్లను పీఎంశ్రీ పథకం కింద ఎంపిక చేశారు. ఇందులో 35 ప్రాథమిక, 26 ఎలిమెంటరీ, 577 మాధ్యమిక, 297 ఉన్నత పాఠశాలలున్నాయి. డిసెంబర్ 31న ఈ పథకం అమలుతీరుపై ప్రగతి సమావేశంలో సమీక్షించిన ప్రధాని మోదీ కేంద్రంలోని వివిధ మంత్రిత్వ శాఖల్లో సంయుక్త కార్యదర్శి హోదాలో పనిచేస్తున్న ఐఏఎస్ అధికారులను నోడల్ అధికారులుగా నియమించి క్షేత్రస్థాయిలో ఈ పాఠశాలలను పరిశీలించాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం దేశంలోని వివిధ రాష్ట్రాల్లోని జిల్లాలకు 137 మంది నోడల్ అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

అలైడ్ హెల్త్‌కేర్ కౌన్సిల్‌కు సభ్యుల నియామకం

ఈనాడు, అమరావతి: రాష్ట్ర అలైడ్ అండ్ హెల్త్‌కేర్ కౌన్సిల్‌కు నలుగురు కొత్త సభ్యులను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఫిజియోథెరపీ కేటగిరిలో డాక్టర్ పి.అప్పారావు, కె.మునిశేఖర్, మెడికల్ ల్యాబొరేటరీ అండ్ లైఫ్ సైన్సెస్ కేటగిరిలో డి.సుబ్బారావు, ఆప్తాల్మిక్ సైన్సెస్ విభాగంలో ఎస్.వసంతరావులను సభ్యులుగా నియమించింది.

ప్రపంచ మానవాళికి ఉపయోగపడేలా అంతరిక్ష ప్రాజెక్టుల సేవలు

ఇస్రో ఛైర్మన్ నారాయణన్

ఈనాడు, బెంగళూరు : అంతరిక్ష ప్రాజెక్టులు ఏ ఒక్క దేశానికో పరిమితం కాకుండా ప్రపంచంలోని ప్రతి వ్యక్తి అవసరాలూ తీర్చేవిగా ఉండాలని ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ పిలుపునిచ్చారు. ఆయన మంగళవారం బెంగళూరులో యూఎస్ కాన్సులేట్ జనరల్, యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ భాగస్వామ్య సంస్థ సంయుక్తంగా నిర్వహించిన సదస్సులో పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం ఇస్రో చేపట్టే ప్రాజెక్టులు కేవలం భారతీయులకే కాకుండా ప్రపంచ అవసరాలు తీర్చేందుకు ఉపయోగపడుతున్నాయన్నారు. అంతరిక్ష రంగంలో అమెరికా, భారత్ మధ్య దశాబ్దాలుగా సమన్వయం కొనసాగుతోందన్నారు. చంద్రయాన్-1 నుంచి తాజాగా నైసార్ వరకు నాసా సహకారం భారతీయ అంతరిక్ష రంగ ప్రగతికి దోహదపడిందన్నారు. అమెరికా నుంచి 14 వ్యాపార భాగస్వామ్య ఒప్పందాలు కుదిరేందుకు ఈ సమాఖ్య సహకరించినట్లు గుర్తు చేశారు. 2020లో అంతరిక్ష రంగ సంస్కరణలు ప్రైవేటు సంస్థల భాగస్వామ్యానికి మార్గం చూపగా ప్రస్తుతం ఈ రంగంలో 400కుపైగా అంకురాలున్నాయని వివరించారు. స్వదేశీ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌లతో ఉపగ్రహాల వ్యయం భారీగా తగ్గటంతో ప్రతి ప్రాజెక్టులో 75శాతం వ్యయం దేశీయ సంస్థలే వినియోగించుకుంటున్నాయన్నారు. భారతీయ అంతరిక్ష రంగంలో ఆవిష్కరించే ఆధునిక సాంకేతికత సగటు వ్యక్తికి సేవలందించేందుకే తప్ప దేశాల మధ్య పోటీ కోసం కాదని నారాయణన్ తెలిపారు. 2035 నాటికి భారతీయ అంతరిక్ష స్టేషన్, 2040లో చంద్రుడిపైకి మానవసహిత యాత్రను చేపట్టడం ఇస్రో లక్ష్యమన్నారు. యూఎస్ ఆఫీస్ ఆఫ్ స్పేస్ కామర్స్ డిప్యూటీ డైరెక్టర్ జనిస్ స్టార్జిక్ మాట్లాడుతూ భారత్‌తో ఒప్పందం కేవలం సాంకేతికత కోసమే కాకుండా ఇరు దేశాల మార్కెట్‌లను విస్తరించేందుకు ఉపయోగపడుతోందన్నారు. నాసా ఇండస్ట్రీ అఫైర్స్ అసోసియేట్ అడ్మినిస్ట్రేటర్ జోయెల్ గ్రాహం, అంతరిక్ష శాఖ జాయింట్ సెక్రటరీ ఎస్.ఆర్.రాజశేఖర్ తదితరులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

రాజధానిలో తెలుగు, సంస్కృత అకాడమీకి రెండెకరాలు కేటాయించండి: ఛైర్మన్



మంత్రి లోకేశ్‌తో డీఆర్ విల్సన్

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలో తెలుగు, సంస్కృత అకాడమీకి రెండు ఎకరాలు కేటాయించాలని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్‌ను అకాడమీ ఛైర్మన్ ఆర్‌డీ విల్సన్ కోరారు. భూమి కేటాయిస్తే అకాడమీ సొంత నిధులతో భవనం నిర్మించుకుంటామని విన్నవించారు. క్యాంపు కార్యాలయంలో మంగళవారం మంత్రితో పలు అంశాలపై చర్చలు జరిపారు. భూమి కేటాయింపుపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ.. సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తానని హామీ ఇచ్చారు. తెలుగు భాష వ్యాప్తి కోసం తమిళనాడు తరహాలో తెలుగు నేర్పించేందుకు వర్చువల్ అకాడమీ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని ఆర్‌డీ విల్సన్ కోరారు. ఈ అకాడమీ ఏర్పాటుకు రూ.100 కోట్లు కోరుతూ ముఖ్యమంత్రికి లేఖ రాసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ స్పందిస్తూ.. తెలుగు వర్చువల్ అకాడమీ ఏర్పాటుకు ప్రాజెక్టు రిపోర్టు తయారు చేయాలని సూచించారు.

నూతన అసెంబ్లీ నిర్మాణంలో తెలుగు సంస్కృతి ప్రతిబింబించాలి

- భవన సముదాయ డిజైన్‌ను పరిశీలించిన సభాపతి, ఉపసభాపతి

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలో నూతన అసెంబ్లీ భవన సముదాయ నిర్మాణ డిజైన్లను సభాపతి అయ్యన్నపాత్రుడు మంగళవారం పరిశీలించారు. అసెంబ్లీ సమావేశ మందిరంలో సీఆర్‌డీఏ అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు నమూనాలను స్పీకర్‌కు చూపించారు. నిర్మాణాలు ఎలా చేపడుతున్నది పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. నూతన అసెంబ్లీ భవన సముదాయం లోపలివైపు ఎలా ఉంటుంది.. అక్కడ ఎలాంటి అలంకరణలు చేయనున్నారు? అత్యాధునిక సౌకర్యాలు ఏమేమి ఉంటాయి వంటివన్నీ వివరించారు. ఈ నిర్మాణాల్లో తెలుగు సంస్కృతి ప్రతిబింబించేలా చూడాలని సభాపతి అయ్యన్నపాత్రుడు, ఉపసభాపతి రఘురామకృష్ణ రాజు సూచించారు. కార్యక్రమంలో అసెంబ్లీ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

శాసనసభకు రాకపోవడం ప్రజలిచ్చిన పదవులను అవమానించడమే

ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

ఈనాడు, అమరావతి: వైకాపా ఎమ్మెల్యేలు శాసనసభకు రాకపోవడమంటే ప్రజలిచ్చిన పదవులను అవమానించినట్లేనని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. గవర్నర్ ప్రసంగం రోజు మొక్కుబడిగా సభకు రావడం, పేపర్లు చించివేయడం, సభ నుంచి వెళ్లిపోవడం ఇదే ఆ పార్టీ ఎమ్మెల్యేల తీరుగా మారిందని మండిపడ్డారు. మంగళగిరిలోని తెదేపా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. '19 నెలలుగా చట్ట సభల సభ్యులుగా చేపట్టాల్సిన ప్రాథమిక బాధ్యతను నిర్వర్తించారా? అలా వ్యవహరించని వారికి ఎమ్మెల్యేలుగా కొనసాగే అర్హత ఉందా? బడ్జెట్ సమావేశాలు చాలా కీలకమైనవి. నిరంకుశ ఆలోచనలతో సభకు రాకుండా ఉండటం ప్రజల్లో అసహనాన్ని కలిగిస్తోంది. సభ పట్ల గౌరవం ఉంటే, శాసన వ్యవస్థపై నమ్మకం ఉంటే ఇప్పటికైనా సభకు వచ్చి నిర్మాణాత్మక చర్చల్లో పాల్గొనాలి' అని కాలవ శ్రీనివాసులు సూచించారు.

నేడు మంత్రివర్గ సమావేశం

ఈనాడు, అమరావతి: రాష్ట్ర మంత్రివర్గం బుధవారం మధ్యాహ్నం 2:30 గంటలకు సచివాలయంలో సమావేశం కానుంది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో కొన్ని కీలక బిల్లులపై ఇందులో చర్చించి ఆమోదం తెలపనున్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న 4 ఆర్డినెన్సుల స్థానంలో బిల్లులను ఈ అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. ఆ బిల్లులపైనా కేబినెట్ చర్చించనుంది. వీటితో పాటు కాలం చెల్లిన చట్టాల్లో కొన్ని సవరణలు తీసుకురావాలని మంత్రులు, కార్యదర్శుల సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఆయా చట్టాలపైనా చర్చించే అవకాశం ఉంది.

ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశం నేడు

ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశం బుధవారం నిర్వహించనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ హాజరుకానున్న ఈ సమావేశంలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహం, ఏయే ప్రాధాన్య అంశాలపై ఎలా స్పందించాలి అనే అంశాలపై చర్చించనున్నారు.

వైద్య మిత్రలు, ఇతర ఉద్యోగులను కొనసాగించాలి

యూనివర్సల్ హెల్త్ పాలసీ బిడ్డర్లకు వైద్యారోగ్యశాఖ స్పష్టీకరణ

ఈనాడు, అమరావతి: ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న వైద్య మిత్రలు, ఇతర ఉద్యోగుల సేవలను యథావిధిగా కొనసాగించాలని బిడ్డర్లకు వైద్యారోగ్యశాఖ స్పష్టం చేసింది. ప్రస్తుతం ట్రస్ట్ ద్వారా చెల్లిస్తున్నట్లుగానే జీతభత్యాలు ఉండాలని తెలిపింది. మంగళగిరిలోని ఆంధ్రప్రదేశ్ వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఏపీఎంఎస్ఐడీసీ) కార్యాలయంలో చివరి ప్రీబిడ్ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ వీరపాండియన్, ఎన్టీఆర్ వైద్య సేవ సీఈవో దినేష్‌కుమార్‌లు ప్రభుత్వ విధానాన్ని వివరించారు. ఈహెచ్ఎస్, వర్కింగ్ జర్నలిస్టులకు ప్రత్యేక పథకాలు అమలవుతున్నందున..రాష్ట్రంలోని మిగిలిన అందరికీ యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా ఆరోగ్య సేవలు అందించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు. రాష్ట్రంలో 1.62 కోట్ల కుటుంబాలకు బీమా సౌకర్యాన్ని అందుబాటులోకి తేనున్నట్లు వివరించారు. ప్రస్తుతం ప్రజలకు అందుబాటులో ఉన్న 3,257 ప్రొసీజర్ల ద్వారా వైద్య సేవలు కొనసాగించాల్సి ఉంటుందని బీమా కంపెనీల ప్రతినిధులకు తెలిపారు. యూనివర్సల్ హెల్త్ పాలసీ అమలులో భాగంగా గతేడాది డిసెంబర్ 8న ప్రభుత్వం టెండర్లు పిలిచింది. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలు, ప్రైవేటు బీమా కంపెనీలు కోరిన అదనపు సమాచారాన్ని ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు ఈ సమావేశంలో అందజేశారు.

సభ్యుల ప్రశ్నలకు వారంరోజుల్లో సమాధానాలు పంపాలి

- బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో అధికారులకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్పష్టీకరణ
- వచ్చే సమావేశాలను డిజిటల్ విధానంలో చేపట్టనున్నట్లు వెల్లడి

ఈనాడు, అమరావతి: అసెంబ్లీలో సభ్యులు అడిగే ప్రశ్నలకు నిబంధనల ప్రకారం వారం రోజుల్లోపు సంబంధిత శాఖల నుంచి సమాధానాలు పంపాలని శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదేశించారు. నెల రోజులైనా సమాధానాలు పంపడం లేదని, ఇకపై ఇలాంటివి పునరావృతం కారాదని ఆయా శాఖల కార్యదర్శులకు స్పష్టంచేశారు. వర్షాకాల సమావేశాల నుంచి ఈ-విధాన్ కింద డిజిటల్ విధానంలో సభను నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ఏర్పాట్లు, భద్రత, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు క్రీడా పోటీల నిర్వహణపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో ఉపసభాపతి రఘు రామకృష్ణరాజు, అసెంబ్లీ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్నకుమార్‌తో కలిసి సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు అసెంబ్లీలో మంగళవారం వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. సభ్యుల ప్రశ్నలకు సమాధానాల పెండింగ్‌పై సమీక్షించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ స్పీకర్‌కు వివరణ ఇస్తూ.. శాసనసభకు సంబంధించి 283, శాసనమండలికి సంబంధించి 562 ప్రశ్నలకు వివిధ శాఖల నుంచి సమాధానాలు పంపాల్సి ఉందని తెలిపారు. సభలో సభ్యులు అడిగే ప్రశ్నలను మానిటర్ చేసేందుకు వీలుగా జీఏడీలో ప్రత్యేకంగా ఒక పోర్టల్‌ను సిద్ధం చేశామని తెలిపారు. అందులో చూసుకుని ఎప్పటికప్పుడు సమాధానాలు పంపేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో అసెంబ్లీ సమావేశాలు కొనసాగేలా పటిష్ఠ బందోబస్తు చేపట్టాలని డీజీపీ, ఇతర పోలీసు ఉన్నతాధికారులను స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశించారు.



అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, అసెంబ్లీ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్నకుమార్‌లతో భేటీ అయిన సభాపతి అయ్యన్న, ఉప సభాపతి రఘురామకృష్ణరాజు

ఉల్లాసభరితంగా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు

ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు మార్చి 5 నుంచి 7 వరకు క్రీడా పోటీలను నిర్వహించాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అధికారులను ఆదేశించారు. క్రీడల ముగింపు సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. క్రీడాపోటీలను, సాంస్కృతిక కార్యక్రమాలను ఉల్లాసభరిత వాతావరణంలో నిర్వహించాలన్నారు. వీటి నిర్వహణకు శాసనసభ, శాసనమండలిలో ప్రభుత్వ విప్‌లతో ఒక కమిటీని వేయాలని ఆదేశించారు. సాంస్కృతిక కార్యక్రమాలకు ఈసారి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమ కుటుంబసభ్యులతో హాజరవ్వాలని విజ్ఞప్తి చేస్తామని స్పీకర్ తెలిపారు. ◆ పరుగు పందెం, క్యారమ్స్, చెస్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, టెన్నికాయిట్, క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, త్రోబాల్, టగ్ ఆఫ్ వార్, పికిల్ బాల్ వంటి పోటీలు నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించారు.

ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతుల ప్రక్రియ వేగంగా పూర్తిచేయాలి

- 7,673 ఖాళీల భర్తీకి ప్రభుత్వానికి ప్రతిపాదన
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ఈనాడు, అమరావతి: ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతుల ప్రక్రియ వేగంగా పూర్తిచేయాలని, అర్హులైన 7,514 మందికి త్వరగా పదోన్నతులు కల్పించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆయన సచివాలయంలో రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబుతో కలిసి ఆర్టీసీ, రవాణా శాఖలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. 2025-26 డీపీసీ కింద అర్హులైన ఉద్యోగుల ఎంప్యానల్‌ను ఈ నెల 20 నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆర్టీసీ అధికారులు మంత్రికి వివరించారు. ఆర్టీసీలో ప్రస్తుతం 44,131 మంది ఉద్యోగులే ఉన్నారని, మూడేళ్లలో 6,891 మంది పదవీ విరమణ చేయనున్నట్లు అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో 7,673 ఖాళీల నియామకాలకు సంబంధించి ప్రభుత్వానికి పంపేందుకు ప్రతిపాదన సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. మెడికల్ అన్‌ఫిట్ అయిన 682 మంది ఉద్యోగుల్లో 36 మందికి ప్రత్యామ్నాయ ఉద్యోగాలు, 646 మందికి ఆర్థిక పరిహారం చెల్లించాల్సి ఉందని అధికారులు తెలిపారు.

ట్రావెల్స్ బస్సుల పన్ను సమీక్షపై త్వరలో సమావేశం

ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకుని, ఏపీలో తిరిగే బస్సులకు సంబంధించి అఖిలభారత టూరిస్ట్ పర్మిట్ పన్నులపై.. సంబంధిత ట్రావెల్స్ బస్సుల సంఘాలతో సమావేశం నిర్వహించి, నిర్ణయం తీసుకుందామని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ పన్ను తగ్గిస్తే ఏపీలోనే ఆయా బస్సులు రిజిస్ట్రేషన్ అవుతాయని రవాణా అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. డ్రైవింగ్ లైసెన్సులు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ల కోసం జారీ చేసే స్మార్ట్‌కార్డుల టెండరుకు నిబంధనలు త్వరగా ఖరారు చేయాలని మంత్రి ఆదేశించారు. రవాణా వాహనాలకు వెహికల్ లొకేషన్ ట్రాకింగ్ డివైజ్ ఉంటేనే రిజిస్ట్రేషన్ చేయాలనే కేంద్ర ప్రభుత్వ నిబంధన నేపథ్యంలో అందుకు సంబంధించిన ఆర్ఎఫ్‌పీ సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో రవాణా కమిషనర్ మనీష్‌కుమార్ సిన్హా, ఆర్టీసీ ఈడీలు బ్రహ్మానందరెడ్డి, రవివర్మ తదితరులు పాల్గొన్నారు.

పసుపు-కుంకుమ కింద ఇచ్చిన భూమిని వైకాపా నాయకులు ఆక్రమించారు

తెదేపా గ్రీవెన్స్‌లో బాధితురాలి ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: పసుపు-కుంకుమ కింద తనకు సంక్రమించిన 9.88 ఎకరాల భూమిని మండల రెవెన్యూ అధికారులు వైకాపా నేత ఉడుముల శ్రీనివాసరెడ్డి తండ్రి పుల్లారెడ్డి పేరు మీదకు అక్రమంగా బదలాయించారని మార్కాపురానికి చెందిన నందూరి రాజేశ్వరి వాపోయారు. ఎన్నిసార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, ఏపీ బొందిలి సంక్షేమ, అభివృద్ధి సంస్థ ఛైర్మన్ విక్రమ్ సింగ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు.

◆ 16 ఏళ్లుగా ఉంటున్న సొంత ఇంటిని వైకాపా నాయకుడు ఆక్రమించుకుని తమను కట్టుబట్టలతో బయటకు గెంటేశారని కాకినాడ జిల్లా పెదపూడి మండలం కరకుదురు గ్రామానికి చెందిన దుర్గ ఫిర్యాదు చేశారు. పంచాయతీ బిల్ కలెక్టర్ ముప్పిడి అప్పలరాజుతో కుమ్మక్కై రికార్డులన్నీ అక్రమంగా తారుమారు చేశారని పేర్కొన్నారు. వైకాపా నాయకుడి ఒత్తిడి వల్ల పోలీసులు, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు.

అనిశా వలలో మాదాపూర్ ఎస్సై

ఓ కేసులో నిందితుడి నుంచి రూ.50 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు



పట్టుబడ్డ నగదుతో ఎస్సై వినయ్


మాదాపూర్, న్యూస్‌టుడే: కోర్టు ఉత్తర్వుల ప్రకారం నోటీసులు ఇచ్చి నిందితుడిని విచారించాల్సిన హైదరాబాద్‌లోని మాదాపూర్ ఠాణా ఎస్సై.. అదే నిందితుడి నుంచి లంచం తీసుకుంటూ మంగళవారం అవినీతి నిరోధక శాఖ(అనిశా)కు దొరికిపోయాడు. అనిశా డీఎస్పీ ఆనంద్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మాదాపూర్‌లోని ఓ ఐటీ కంపెనీ నిర్వాహకుడు.. యూసఫ్‌గూడకు చెందిన, ఓ కన్సెల్టెన్సీ నిర్వహిస్తున్న మహిళకు నగదు ఇవ్వాలి. డబ్బు ఇవ్వకపోగా వేధిస్తుండటంతో ఆమె ఇటీవల మాదాపూర్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఎస్సై గంద్ర వినయ్ కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో నిందితుడు కోర్టును ఆశ్రయించాడు. నిందితుడికి నోటీసులు ఇచ్చి విచారణ చేపట్టాలని న్యాయస్థానం ఉత్తర్వులిచ్చింది. విచారణ క్రమంలో ఎస్సై రూ.లక్ష లంచం డిమాండ్ చేయగా, రెండు విడతలుగా నగదు ఇచ్చేలా నిందితుడికి, ఎస్సైకి మధ్య ఒప్పందం కుదిరింది. 'ఒప్పందం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో మొదటి విడత సొమ్ము రూ.50 వేలు.. మాదాపూర్ ఠాణా సమీపంలోని నీరూస్ జంక్షన్ వద్ద నిందితుడు. ఎస్సై వినయ్‌కి ఇస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నాం. ఎస్సైని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాం' అని అనిశా డీఎస్పీ వెల్లడించారు.

పాటలపై సాంకేతిక పాఠాలు!

- ఐఐటీ మద్రాస్‌లో ఇళయరాజా ఆధ్వర్యంలో మ్యూజిక్ లెర్నింగ్ అండ్ రీసెర్చ్ కేంద్రం ఏర్పాటు
- బాణీల్లోని గణితం, సైన్స్ అంశాలపై పరిశోధనలు
- త్వరలో అందుబాటులోకి ప్రత్యేక కోర్సులు



ఇళయరాజా



ఐఐటీఎంలో ఇళయరాజా కేంద్రం డిజైన్ నమూనా

ఈనాడు, చెన్నై: సంగీత మాంత్రికుడు ఇళయరాజాతో కలిసి ఐఐటీ మద్రాస్ భవిష్యత్తు తరాలు పులకించిపోయేలా సంగీత పాఠాలు సిద్ధం చేస్తోంది. ఒకప్పుడు ఉర్రూతలూగించిన రాగాలలోని శాస్త్రీయ, సాంకేతిక విషయాలు వెలికి తీసి.. నేటి తరం ఔపోసన పట్టేలా తరగతులు రూపొందిస్తోంది. భవిష్యత్తు తరాలు మెచ్చే సరికొత్త బాణీలు సృష్టించేందుకు ఐఐటీ మద్రాస్‌లో 'మాస్ట్రో ఇళయరాజా సెంటర్ ఫర్ మ్యూజిక్ లెర్నింగ్ అండ్ రీసెర్చ్' ఏర్పాటు చేసింది. ప్రత్యేక కోర్సులు, పరిశోధన ప్రాధాన్యంగా కార్యక్రమాలు డిజైన్ చేస్తోంది. వైవిధ్యమైన కోర్సులు 2026-27 విద్యా సంవత్సరంలో అందుబాటులోకి రానున్నాయి.



వెదురుతో నిర్మిస్తున్న కేంద్రం లోపలి భాగం

లక్ష్యం మేటిగా..

మ్యూజిక్ లెర్నింగ్ అండ్ రీసెర్చ్ కోసం ఇప్పటికే ఐఐటీ మద్రాస్ నిపుణులు, ఇళయరాజా మధ్య ఒప్పందం కుదిరింది. వారి ఆధ్వర్యంలో ప్రముఖ సంగీత కళాకారులతో పాటు గణిత పరిజ్ఞానం ఉన్నవారు, ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులు పనిచేయనున్నారు. సంగీతానికి శాస్త్రీయ కార్యాచరణ ఇవ్వడంతో పాటు అందులో ఆధునికతను తీసుకురావడంలో ప్రముఖ పాత్ర పోషించనున్నారు. దీంతో విద్యార్థులకు ప్రత్యేక కోర్సుల్ని పరిచయం చేసి, వారిని ఆధునిక సంగీతంలో మేటి పరిశోధకులుగా మార్చాలనేది వీరి ధ్యేయం. కోర్సుల్ని విడతల వారీగా పరిచయం చేయనున్నారు.

బాణీలు డీకోడ్ చేస్తూ..

సంగీతంలో అంతర్లీనంగా సైన్స్ దాగి ఉందని అంటున్నారు.. ఐఐటీ మద్రాస్ నిపుణులు. 'మెలోడీ, రిథమ్, స్వరాల్లో గణితం ఉంది. వాటిని డీకోడ్ చేసి నేర్చుకుంటే కొత్త పుంతలు తొక్కే సరికొత్త బాణీల్ని సృష్టించొచ్చు. ప్రస్తుతం డిజిటల్ మ్యూజిక్ పుంజుకుంటుండగా, మరోవైపు ఏఐ ప్రభావం చూపిస్తోంది. ఈ తరుణంలో సంగీతాన్ని శాస్త్రీయంగా అర్థం చేసుకునేందుకు ప్రత్యేక కోర్సుల్ని తెస్తున్నాం. సంగీతంలోని సైన్స్‌ని విశ్లేషించి వాటిని డిజైన్ చేస్తున్నాం' అని తెలిపారు.

ఇదీ లాభం

- తరగతుల కోసం ఐఐటీ మద్రాస్ ప్రాంగణంలో ఇళయరాజా పర్యవేక్షణలో వెదురు బొంగులతో ఓ ఆడిటోరియం నిర్మిస్తున్నారు. పూర్తి పర్యావరణహితమైన ఈ కేంద్రంలో మైకులు, స్పీకర్లు ఉండవు.
- ఇక్కడ జరిగే నిత్య పరిశోధనలతో కొత్త వాద్యాల డిజైనింగ్, డిజిటల్ మాధ్యమంలో కొత్త ఆవిష్కరణలు చేసే సాంకేతికతలు అభివృద్ధి చేయనున్నారు.
- విద్యార్థులు ప్రపంచస్థాయి మ్యూజిక్ కాన్సర్ట్‌లు నిర్వహించేలా సిద్ధమవుతారు.
- ఇళయరాజా వంటి మేటి సంగీత మాంత్రికుల్ని ఈ కేంద్రం పరిచయం చేయనుంది.

ఏపీ టెక్నాలజీ ఎండీగా సూర్యతేజ.. అనకాపల్లి జేసీగా సూర్యమన్ పటేల్

ఐఏఎస్ అధికారుల బదిలీలు, పోస్టింగుల్లో మార్పులు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ఇద్దరు ఐఏఎస్ అధికారుల బదిలీలు, పోస్టింగుల్లో మార్పులు చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. జనవరి 12న జారీ చేసిన ఉత్తర్వుల్లో ఈ మార్పులు చేసినట్లు పేర్కొంది. ఎం.సూర్యతేజను ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్ పదవిలోనే కొనసాగించాలని నిర్ణయించింది. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ శాఖ ఎండీ, ఆర్టీజీఎస్ అదనపు సీఈవో సూర్య మన్ పటేల్‌ను అనకాపల్లి జిల్లా జేసీగా నియమించింది. ఏపీ డ్రోన్ కార్పొరేషన్ ఎండీ, ఆర్టీజీఎస్ అదనపు సీఈవో పోస్టుకు తాత్కాలిక ఇన్‌ఛార్జులను ఏర్పాటు చేయాలని ఆయా విభాగాల ఉన్నతాధికారులను ప్రభుత్వం ఆదేశించింది.

హైదరాబాద్‌లో స్వల్ప భూ ప్రకంపనలు

భూకంప లేఖినిపై 1.5 తీవ్రత నమోదు

ఈనాడు, హైదరాబాద్, షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో మంగళవారం ఉదయం స్వల్ప భూ ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. కుత్బుల్లాపూర్ పరిధిలోని మెట్టుకానిగూడ, ఆదర్శనగర్ ప్రాంతాల్లో కొన్ని సెకన్ల పాటు భూమి స్వల్పంగా కంపించింది. భారీ శబ్దంతోపాటు ఇళ్లు కదులుతున్నట్లు అనిపించడంతో ప్రజలు బయటికి పరుగులు తీశారు. భూ ప్రకంపనలను జాతీయ భూభౌతిక పరిశోధన సంస్థ(ఎన్‌జీఆర్ఐ) శాస్త్రవేత్తలు ధ్రువీకరించారు. హబ్సిగూడలోని ఎన్‌జీఆర్ఐ భూకంప కేంద్రంలో ఇవి రికార్డయ్యాయని.. తీవ్రత 1.5గా నమోదైందని శాస్త్రవేత్త డాక్టర్ డి.శశిధర్ 'ఈనాడు'కు తెలిపారు. ఉదయం 10.17 గంటలకు భూ ప్రకంపనలు వచ్చాయని వెల్లడించారు. భూకంప కేంద్రం కొంపల్లి, గాజులరామారం ప్రాంతంలో కేంద్రీకృతమై ఉందని చెప్పారు.

యాదగిరిగుట్ట హుండీ ఆదాయం రూ.4.03 కోట్లు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీలను మంగళవారం లెక్కించినట్లు దేవస్థానం ఈవో భవానీ శంకర్ తెలిపారు. 49 రోజులుగా భక్తులు హుండీలలో సమర్పించిన నగదు, కానుకలను లెక్కించగా నగదు రూ.4,03,02,821, బంగారం 136 గ్రాములు, వెండి 3,600 గ్రాములు సమకూరాయని ఈవో వివరించారు. లెక్కింపును ఈవోతో పాటు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త నరసింహమూర్తి పర్యవేక్షించారు.

పిచ్చికుక్క దాడి.. చికిత్స పొందుతూ చిన్నారి మృతి



నక్షత్ర

షాబాద్, న్యూస్‌టుడే: పిచ్చికుక్క కాటుకు గురై చికిత్స పొందుతూ చిన్నారి మృతిచెందిన ఘటన తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు..షాబాద్ మండలం చర్లగూడకు చెందిన సిద్దులూరు కుమార్ కుమార్తె నక్షత్ర (5) పది రోజుల క్రితం ఇంటి వద్ద ఆడుకుంటోంది. ఈ క్రమంలో గ్రామంలోని పిచ్చికుక్క చిన్నారిని కరిచింది. తీవ్ర గాయాలపాలైన చిన్నారిని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ చిన్నారి మంగళవారం ఉదయం మృతి చెందింది.

బాన్సువాడలో ఉద్రిక్తత

- కాంగ్రెస్ మాజీ సర్పంచి, ఆగ్రోస్ ఛైర్మన్ పరస్పర ఫిర్యాదులు

బాన్సువాడ, రుద్రూర్, న్యూస్‌టుడే: తెలంగాణలోని కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలో సోమవారం అర్ధరాత్రి ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి. కొందరు వ్యక్తులు ఓటర్లకు నగదు పంచుతున్నారనే సమాచారంతో రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మన్ కాసుల బాలరాజు తన భార్య పోటీ చేస్తున్న ఐదో వార్డువైపు వెళ్లారు. ఆ సమయంలో ఆయన వాహనానికి మరో వాహనం ఎదురైంది. అందులో నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మాజీ సర్పంచి, కాంగ్రెస్ నాయకుడు చంద్రశేఖర్‌తోపాటు మరో వ్యక్తి ఉండటంతో బాలరాజు ఆగ్రహం వ్యక్తం చేస్తూ 'బాన్సువాడలో నీకేం పని, భారాస నాయకులతో కలిసి ఏం చేస్తున్నావు?' అంటూ చంద్రశేఖర్ చొక్కా పట్టుకొని దుర్భాషలాడారు. అనంతరం చంద్రశేఖర్ వద్ద నగదు ఉందని పోలీసులకు తెలియజేశారు. వాహనంలో రూ.50వేల డబ్బు ఉందని ఫ్లయింగ్ స్క్వాడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చంద్రశేఖర్‌పై కేసు నమోదు చేసినట్లు బాన్సువాడ సీఐ శ్రీధర్ తెలిపారు. అయితే ఆ డబ్బు తనది కాదని, బాలరాజు వర్గీయులే పెట్టి తనపై కేసు బనాయిస్తున్నారని చంద్రశేఖర్ ఆరోపిస్తూ తనపై దాడి చేశారంటూ ప్రతి ఫిర్యాదు చేశారు. మరోవైపు స్థానిక భారాస నాయకుడితో కలిసి చంద్రశేఖర్ తాడ్కోల్‌లోని ఒక నాయకుడి ఇంట్లోకి వెళ్లివచ్చిన సీసీ కెమెరా దృశ్యాలు చర్చనీయాంశమయ్యాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌కే చెందిన ఇరువర్గాల నాయకులు అధిష్ఠానానికి ఫిర్యాదులు చేసుకున్నట్లు తెలిసింది. మంగళవారం కాంగ్రెస్ నాయకులు రుద్రూర్ బస్టాండ్ ఆవరణలో మంగళవారం బైఠాయించి నిరసన తెలిపారు.

బావిలో పడి అన్నదమ్ముల మృతి

మానసిక స్థితి సరిగాలేని తమ్ముడిని కాపాడేందుకు సోదరుడి విఫలయత్నం



ఆత్రం జంగు ఆత్రం లేతు

ఉట్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మానసిక స్థితి సరిగాలేని తమ్ముడు బావిలో దూకగా.. అతడిని కాపాడేందుకు అన్న కూడా దూకాడు. ప్రాణభయంతో తమ్ముడు అన్నను గట్టిగా పట్టుకోవడంతో ఇద్దరూ మృతిచెందిన విషాదకర ఘటన తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండలంలో చోటు చేసుకుంది. ఉట్నూరు ఎస్సై గుంపుల విజయ్ వివరాల ప్రకారం.. ఉమ్రి పంచాయతీ పరిధి కొలాంగూడకు చెందిన ఆత్రం సోనేరావుకు కుమారులు ఆత్రం జంగు(29), ఆత్రం లేతు(27) ఉన్నారు. వీరు వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఆత్రం లేతుకు మానసిక స్థితి సరిగా లేదు. మంగళవారం అన్నదమ్ములిద్దరూ శ్యాంపూర్ గ్రామంలోని బుడుందేవ్ జాతరకు వెళ్లారు. దర్శనం అనంతరం తిరిగి వెళ్తున్న క్రమంలో మద్యం మత్తులో ఉన్న లేతు పరుగెత్తుకెళ్లి బావిలో దూకాడు. తమ్ముడిని కాపాడేందుకు జంగు కూడా వెంటనే దూకాడు. ఈ క్రమంలో బురదలో చిక్కుకొని ఉన్న లేతు.. అన్నను గట్టిగా పట్టుకోవడంతో బయటకు రాలేక ఇద్దరూ నీట మునిగి మృతిచెందారు. ఆత్రం జంగు భార్య గతంలో మృతిచెందగా.. లేతుకు భార్య, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

క్యాబ్ బుకింగ్ తరహాలో రైతులకు డ్రోన్ సేవలు


వ్యవసాయశాఖ సంచాలకులు మనజీర్ జిలానీ

ఈనాడు, అమరావతి: కిసాన్ డ్రోన్ సేవలను రాష్ట్ర ప్రభుత్వం అద్దె ప్రాతిపదికన రైతులకు సమకూరుస్తోందని వ్యవసాయశాఖ సంచాలకులు మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు. యాప్‌లో క్యాబ్, వాహనాల సేవలు అందుకున్నట్లే కిసాన్ డ్రోన్ ఊబరైజేషన్ మొబైల్ యాప్ ద్వారా డ్రోన్ పిచికారీ సేవలు పొందవచ్చునని వెల్లడించారు. ఈ యాప్ గూగుల్ ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉంటుందని, క్యూఆర్ కోడ్ సాయంతోనూ డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ యాప్ పురోగతిపై ఆయన మంగళవారం జిల్లాల వ్యవసాయాధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. 'ప్రారంభమైన రెండు వారాల్లో 10,342 మంది రైతులు ఈ యాప్‌లో నమోదు చేసుకున్నారు. 2,654 మంది డ్రోన్ పిచికారీ సేవల కోసం అభ్యర్థనలు పంపారు. ఇప్పటి వరకు 356 ఎకరాల్లో 155 మంది రైతులు డ్రోన్ సేవలను వినియోగించుకున్నారు' అని సంచాలకులు వివరించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: అప్పుల బాధతో రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తెలంగాణలోని జయశంకర్ జిల్లా భూపాలపల్లి మండలంలో చోటుచేసుకుంది. గొర్లవీడు గ్రామానికి చెందిన మామిడి అశోక్(40) తనకున్న అర ఎకరా భూమితోపాటు మరో రెండెకరాలు కౌలుకు తీసుకుని ఐదేళ్లుగా పత్తి సాగు చేస్తున్నారు. ఆశించిన స్థాయిలో దిగుబడులు రాకపోవడంతో పెట్టుబడులు, ఇతర ఖర్చులకు చేసిన అప్పులు పెరుగుతూ వచ్చాయి. ఈ క్రమంలో దాదాపు రూ.7 లక్షల వరకు అప్పులు పెరిగాయి. దీంతో మనస్తాపం చెందిన అశోక్ ఆదివారం ఇంటివద్ద పురుగుల మందు తాగారు. వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు.

భక్తే బంగారమాయెనే..



- సంపద నిలయాలుగా మన ఆలయాలు
- పసిడి 550 కిలోలు.. వెండి 29,582 కిలోలకు పైమాటే
- ధరలు పెరిగే కొద్దీ విలువ వృద్ధి
- బ్యాంకుల్లో గోల్డ్ బాండ్లతో ఆదాయం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలోని దేవాలయాల్లో ఉన్న బంగారం, వెండి విలువ రూ.వందల కోట్లుగా పెరుగుతోంది. ఒకవైపు గర్భగుడిలో దేవుళ్ల, దేవతలకు ఆభరణాలుగా మెరిసే బంగారం.. ఇంకోవైపు గోపురాలపై తాపడంగా స్వర్ణ కాంతులు... కానుకలిచ్చిన భక్తుల ఆకాంక్షలకు అద్దం పడుతున్నాయి. మరోవైపు బ్యాంకుల్లో బాండ్ల రూపంలో దాచిన బంగారంతో ఆలయాలకు ఆదాయం కూడా వస్తోంది. స్వర్ణానికి వెండి తోడై.. దేవస్థానాలకు ఆర్థిక పరిపుష్టినిస్తున్నాయి. రాష్ట్రంలోని ఆలయాల్లో ఉన్న బంగారం, వెండి విలువ సుమారు రూ.1600 కోట్లు దాటుతోంది.

రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆలయాల్లో కలిపి 550 కిలోల బంగారం, 29,582 కిలోల వెండి ఉన్నట్లు దేవాదాయశాఖ తాజాగా గుర్తించింది. తాము తయారు చేయించిన కిరీటాలు, ఉంగరాలు, కంఠాభరణాల వంటివి కొందరు సమర్పిస్తుంటే.. మరికొందరు బంగారు బిస్కెట్లు, చిన్నపాటి నాణేలు, ముక్కలను హుండీలో వేస్తున్నారు. ఇంకొందరు కుటుంబ వారసత్వంగా వచ్చిన ఆభరణాలనే దేవుడికి అర్పిస్తున్నారు. బంగారం, వెండి ధరలు పైపైకి పరుగులు పెడుతుండడంతో ఆలయాల సంపద విలువ కూడా వృద్ధి చెందుతోంది. ప్రస్తుతం బంగారం కిలో ధర దాదాపు రూ.1.50 కోట్లు పలుకుతోంది. ఈ లెక్కన 550 కిలోల బంగారం విలువ రూ.800 కోట్లపైనే ఉంటుంది. ఇదేకోవలో 29,582 కిలోల వెండి విలువ కూడా సుమారు రూ.843 కోట్లుగా ఉంది. ఈ రెండూ కలిపితే మొత్తం సంపద విలువ దాదాపు రూ.1,650 కోట్లకు చేరుతుంది.

కిరీటాల నుంచి కంఠాభరణాల వరకు...

గోపురాలపై స్వర్ణ కాంతులు

ఆలయాల బంగారంలో కొంత భాగాన్ని దేవీదేవతల ఆభరణాలుగా వినియోగిస్తున్నారు. పెద్ద ఆలయాల్లో గోపురాలకు స్వర్ణ తాపడం చేయించడానికి కొంత ఉపయోగిస్తున్నారు. యాదగిరిగుట్ట ఆలయ విమాన గోపురం తాపడంలో ఉపయోగించిన బంగారం ఏకంగా 65 కిలోలు. కొన్ని దేవాలయాలు కొంత బంగారాన్ని బ్యాంకుల్లో డిపాజిట్ చేసి.. గోల్డ్ బాండ్లు తీసుకుంటున్నాయి. వాటిపై వచ్చే వడ్డీ ఆదాయాన్ని అన్నదానం, విద్యాదానం, ఇతర సేవా కార్యక్రమాలకు వినియోగిస్తున్నారు.

ప్రముఖ ఆలయాల్లో ఇలా..

బాసర సరస్వతి క్షేత్రం

అమ్మవారికి 15 కిలోల బంగారం, 821 కిలోల వెండి ఉన్నాయి. ఇందులో 12.34 కిలోల బంగారాన్ని జాతీయ బ్యాంకులో గోల్డ్ డిపాజిట్‌గా ఉంచారు.

భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయం

రాములవారి ఆలయంలో 67.14 కిలోల బంగారం, 1,025.44 కిలోల వెండి ఉన్నాయి. ఇందులో 9 కిలోల బంగారాన్ని గోల్డ్ బాండ్ రూపంలో ఉంచారు.

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం

మొత్తం 112 కిలోల బంగారం ఉంది. 65 కిలోలు విమాన గోపురానికి వాడగా.. ఇంకా 37 కిలోల బంగారం నిల్వలున్నాయి. మరో 9.768 కిలోలు గోల్డ్ బాండ్ల రూపంలో ఉంది. విమాన గోపురానికి 65 కిలోల వెండి ఉపయోగించారు. ఇంకా 1,742 కిలోల వెండి ఆలయంలో ఉంది.

పెండింగ్ బకాయిలు చెల్లించండి

సీఎస్‌కు విన్నవించిన బొప్పరాజు

ఈనాడు, అమరావతి: ఉద్యోగులు, పెన్షనర్లకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏపీ ఐకాస అమరావతి ఛైర్మన్ బొప్పరాజు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌కు సమర్పించారు. ఈ సందర్భంగా బొప్పరాజు మాట్లాడుతూ.. వైకాపా ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన రూ.25వేల కోట్లతో కలిపి ప్రస్తుతం బకాయిలు రూ.40 వేల కోట్లకు చేరాయని తెలిపారు. ''పెన్షనర్లు, చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలి. సర్వీసులో ఉన్న ఉద్యోగులకు ఎంత మేర బకాయి ఉందో తెలియజేసేలా.. ఆయా ఉద్యోగుల జీతాల స్లిప్పుల్లో నమోదు చేయాలి. 12వ పీఆర్సీ నియమించి, మధ్యంతర భృతి చెల్లించాలి. పొరుగుసేవల ఉద్యోగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలి'' అని బొప్పరాజు కోరారు. సీఎస్‌ను కలిసిన వారిలో నాయకులు ఫణిపేర్రాజు, తిమ్మసర్తి నాగేశ్వరరావు, జనుకుల శ్రీనివాసరావు తదితరులున్నారు.

12వ తేదీ సమ్మెకు ఆర్టీసీ సంఘాల మద్దతు

ఈనాడు-అమరావతి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా కేంద్ర కార్మిక సంఘాలు ఈ నెల 12న చేపట్టిన దేశవ్యాప్త సమ్మెకు మద్దతు ఇస్తున్నట్లు ఏపీఎస్‌ఆర్టీసీ ఉద్యోగ సంఘాలు తెలిపాయి. ఆరోజు ఎర్రబ్యాడ్జీలతో విధులకు హాజరై నిరసన తెలపనున్నట్లు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్(ఎన్ఎంయూఏ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.శ్రీనివాసరావు, పీవీ రమణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. సమ్మెకు మద్దతుగా 129 డిపోల వద్ద గేట్ మీటింగ్స్ నిర్వహిస్తామని, ఎర్ర బ్యాడ్జీలతో విధులకు హాజరవుతామని ఎంప్లాయిస్ యూనియన్(ఈయూ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్యలు పేర్కొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సీఐడీ విభాగాధిపతి రవిశంకర్ అయ్యన్నార్

ఆర్థిక నేరాల కట్టడికి ఆర్‌బీఐతో సమన్వయం

సీఐడీ విభాగాధిపతి రవిశంకర్ అయ్యన్నార్

ఈనాడు, అమరావతి: సమాజంలో ఆర్థిక నేరాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు, ప్రజాప్రయోజనాలను కాపాడేందుకు చట్ట అమలు సంస్థలు, ఆర్‌బీఐ మధ్య సమన్వయం అవసరమని రాష్ట్ర సీఐడీ విభాగాధిపతి రవిశంకర్ అయ్యన్నార్ తెలిపారు. ఆర్థిక మోసాలు, సైబర్ భద్రత సమస్యలు, సామాజిక మాధ్యమ సంబంధిత నేరాలు, అక్రమ డిపాజిట్ల స్వీకరణ వంటి ఆర్థిక నేర కార్యకలాపాలు పెరుగుతున్నాయని, వీటిని అరికట్టేందుకు దర్యాప్తు సామర్థ్యాలను పెంచుకోవాల్సిన అవసరముందని పేర్కొన్నారు. విజయవాడలో ఆర్‌బీఐ, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సామాజిక మాధ్యమ నేరాల దర్యాప్తు, ఆర్థిక మోసాలు, సైబర్ భద్రతపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వీటి కట్టడికి ఆర్‌బీఐ చేపడుతున్న చర్యలు, పర్యవేక్షణ బాధ్యతలను బ్యాంకు అధికారులు వివరించారు. డిప్యూటీ లీగల్ అడ్వైజర్ అమిత్ టాంక్సాలి మాట్లాడుతూ నమోదు కాని సంస్థలు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు అక్రమంగా డిపాజిట్లు స్వీకరించడాన్ని నిషేధించే నిబంధనలను వివరించారు.

డాక్టర్ బ్రూస్ లెవిన్‌కు జీనోమ్ వ్యాలీ ఎక్సలెన్స్ పురస్కారం

- ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం
- బయో ఆసియా-2026 వేదికపై ప్రదానం
- క్యాన్సర్ చికిత్సలో కార్-టి సెల్ ఆవిష్కరణలకు అంతర్జాతీయ గుర్తింపు



ఈనాడు బిజినెస్ బ్యూరో: ప్రతిష్ఠాత్మక 'జీనోమ్ వ్యాలీ ఎక్సలెన్స్-2026' పురస్కారం, ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ బ్రూస్ లెవిన్‌ను వరించింది. ఈ నెల 17, 18 తేదీల్లో హైదరాబాద్ వేదికగా 'టెక్ బయో అన్‌షీల్డ్: ఏఐ ఆటోమేషన్-బయాలజీ రివల్యూషన్' అనే థీమ్‌తో 'బయో ఆసియా సదస్సు-2026' నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. అందులో భాగంగా పురస్కార విజేతను మంగళవారం ప్రభుత్వం ప్రకటించింది. సదస్సులోనే ఆయనకు పురస్కారాన్ని ప్రదానం చేయనుంది. యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియా, పెరల్మన్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ క్యాన్సర్ జీన్ థెరపీ విభాగంలో ప్రొఫెసర్‌గా ఉన్న లెవిన్.. కణ, జన్యు చికిత్స (సెల్, జీన్ థెరపీ), ఇంజినీర్డ్ టి-కణాల ఆవిష్కరణలు, క్యాన్సర్ ఇమ్యునోథెరపీ చికిత్సలపై పరిశోధనలకుగాను ఈ గౌరవాన్ని దక్కించుకున్నారు.

కణ, జన్యు చికిత్సల రంగంలో సరికొత్త అధ్యాయం

డాక్టర్ బ్రూస్ లెవిన్ పరిశోధనలు.. కణ, జన్యు చికిత్సల రంగంలో సరికొత్త అధ్యాయాన్ని సృష్టించాయి. శాస్త్రీయ ఆలోచనలను, ప్రాణాలు కాపాడే చికిత్సా విధానాలుగా మలచడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. మానవ కణాలను సురక్షితంగా, సమర్థంగా జన్యు మార్పిడి చేయగలగడం ద్వారా.. వ్యక్తిగత వైద్య విధానాలకు పునాది వేశారు. ముఖ్యంగా ఇంజినీర్డ్ టీ-సెల్, కార్ టీ-సెల్ చికిత్సల్లో ఆయన చేసిన కృషి ఫలితంగానే, క్యాన్సర్‌కు సంబంధించి అమెరికా ఔషధ నియంత్రణ సంస్థ యూఎస్ఎఫ్‌డీఏ ఆమోదించిన తొలి జీన్ థెరపీలు అందుబాటులోకి వచ్చాయి. ఈ సందర్భంగా ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బ్రూస్ లెవిన్‌ను అభినందిస్తూ.. 'కార్ టీ-సెల్ థెరపీ, జీన్ ఎడిటింగ్ రంగాల్లో లెవిన్ చేసిన కృషి, ఇమ్యునోథెరపీలో ఆయన ఆవిష్కరణలు కొత్త ప్రమాణాలను నెలకొల్పాయి. ఇలాంటి గొప్ప సేవలను గుర్తించడంలో తెలంగాణ ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుంది' అని పేర్కొన్నారు. వాణిజ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, లైఫ్ సైన్సెస్ డైరెక్టర్ శక్తి ఎం.నాగప్పన్ లెవిన్‌కు అభినందనలు తెలిపారు.

సచివాలయం, అసెంబ్లీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి: అప్సా

ఈనాడు, అమరావతి: రాష్ట్ర సచివాలయం, అసెంబ్లీ ఉద్యోగులకు రాజధాని అమరావతిలో ఇళ్ల స్థలాలు కేటాయించాలని మంత్రి నారా లోకేశ్‌ను ఏపీ సచివాలయ సంఘం (అప్సా) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామకృష్ణ, నాపా ప్రసాద్ కోరారు. గతంలో తెదేపా ప్రభుత్వం ఇచ్చిన జీఓల ప్రకారం ఇళ్ల స్థలాల కేటాయింపునకు చర్యలు తీసుకోవాలని విన్నవించారు. మంత్రి లోకేశ్‌ను మంగళవారం క్యాంపు కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన సచివాలయ సంఘం పాలకవర్గ సభ్యులు కలిశారు. ఉద్యోగుల ఆర్థిక, ఆర్థికేతర సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. ఉద్యోగులందరూ కలిసికట్టుగా ప్రభుత్వ కార్యక్రమాల అమలులో కష్టపడి పని చేయాలని మంత్రి సూచించారు.

నెడ్‌క్యాప్ ఎండీ పదవీ కాలం పొడిగింపు

ఈనాడు, అమరావతి: నెడ్‌క్యాప్ వీసీ, ఎండీగా కమలాకర్‌బాబు పదవీ కాలాన్ని మరో ఏడాది పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రం తరపున పునరుత్పాదక ప్రాజెక్టుల అమలుకు కేంద్రం, సెకితో సమన్వయం చేయడానికి ఆయన అవసరం ఉందని, నెడ్ క్యాప్ అమలు చేస్తున్న పీఎం కుసుమ్, పీఎం సూర్యఘర్ పథకాల పర్యవేక్షణ కోసం ఆయన పదవీ కాలాన్ని మరో ఏడాది పొడిగించాలని నిర్ణయించినట్లు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఎక్కువ స్వచ్ఛ సర్వేక్షణ అవార్డులు సాధించాలి: పట్టాభిరామ్

ఈనాడు, అమరావతి: రాష్ట్రానికి జాతీయ స్థాయి స్వచ్ఛ సర్వేక్షణ అవార్డులు అత్యధికంగా రావాలని స్వచ్ఛాంధ్ర సంస్థ ఛైర్మన్ పట్టాభిరామ్ అన్నారు. అమరావతిలోని స్వచ్ఛాంధ్ర సంస్థ కార్యాలయం నుంచి ఆయన విశాఖపట్నం, రాజమహేంద్రవరం రీజియన్‌లోని మున్సిపల్ అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. కార్యక్రమాల నిర్వహణపై సిబ్బంది, కార్మికులకు అవగాహన కల్పించడం ద్వారా లక్ష్యాలు సాధించవచ్చని పట్టాభిరామ్ అభిప్రాయపడ్డారు.

ఏ శాఖకు ఎంత స్థలం అవసరం?

సచివాలయం, హెచ్‌ఓడీ టవర్లపై మంత్రుల కమిటీ

ఈనాడు, అమరావతి: రాజధానిలోని పరిపాలన నగరం(ఏజీసీ)లో నిర్మిస్తున్న సచివాలయం, హెచ్‌ఓడీ టవర్లలో వివిధ ప్రభుత్వ శాఖలు, విభాగాలకు ఎంత స్థలం అవసరమో మదింపు చేసేందుకు ప్రభుత్వం మంత్రుల కమిటీని నియమించింది. పురపాలక, ఆర్థిక, రోడ్లు, భవనాలు, వైద్య, ఆరోగ్యం, పౌరసరఫరాలు, పర్యాటకశాఖల మంత్రుల్ని కమిటీలో సభ్యులుగా నియమించింది. పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి కమిటీకి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు.

సమస్యాత్మక పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు

ఈనాడు, అమరావతి: పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో ఏవైనా సమస్యాత్మకంగా ఉంటే వాటిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ప్రతి జిల్లాలోనూ 8 కేంద్రాల చొప్పున సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పేర్కొంది. ఆ కేంద్రాల వివరాలను ఈనెల 12లోపు ప్రభుత్వ పరీక్షల విభాగానికి పంపించాలని సూచించింది. రెగ్యులర్, సార్వత్రిక విద్యాపీఠం పరీక్షల నిర్వహణకు ప్రతి జిల్లాకు ఒక పరిశీలకుడిని నియమించింది.

సీసా మూతే.. పాప ప్రాణం తీసింది

భూదాన్‌పోచంపల్లి, న్యూస్‌టుడే: శీతలపానీయం సీసామూత గొంతులో ఇరుక్కొని ఊపిరాడక చిన్నారి మృతి చెందిన సంఘటన తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండల పరిధిలోని ఇంద్రియాల గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... బందారపు శ్రీకాంత్, నాగరాణి దంపతుల కుమార్తె భవ్యశ్రీ (18 నెలలు) ఇంట్లో ఆడుకుంటూ.. పొరపాటున బాటిల్ మూతను నోట్లో పెట్టుకుంది. అది గొంతులో ఇరుక్కొని ఊపిరాడక అపస్మారక స్థితిలోకి వెళ్లింది. కాసేపయ్యాక గమనించిన తల్లి చిన్నారిని లేపేందుకు ప్రయత్నించగా చలనం లేకపోవడంతో హుటాహుటిన బీబీనగర్ ఎయిమ్స్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే పాప మృతి చెందినట్లు తెలిపారు.